భారతి

సాహిత్య మాసపత్రిక

★

సంపాదకుడు :

శివలెంక శంభుప్రసాద్

నవంబరు 1954

సంపుటము 31 : : సంచిక 11

విడిపత్రిక వెల ఒక్కరూపాయి

విషయానుక్రమణిక

—:o:—

నవంబరు 1954


త్వరగా నురగను తెచ్చు సన్‌లైట్ బాద కుండ
తెల్లగాను మరియు ప్రకాశవంతముగాను ఉతుకును
మీ బట్టలను సన్‌లైట్‌తో ఉతికినచో మలినము ఎంత సులభముగా తొలగిపోవునో మీరే చూడండి. కొద్ది నిమిషములలో మీ తెల్లని బట్టలన్నియు (రుమాలునుండి దుప్పట్లు వరకు) క్రొత్తవాటికంటె తెల్లగా నగును ! మరియు సన్‌లైట్‌తో ఉతుకుట వలన మీ బట్టలు చాలకాలము నిలబడును."
"దీనిని బాగా జ్ఞాపకముంచుకొనండి— సన్‌లైట్ సబ్బు రంగు బట్టలను తళతళమని మెరసేటంత ప్రకాశవంతముగా ఉతికేటట్లు మరేదియు ఉతుకదు. సన్‌లైట్ సబ్బునుండి త్వరగావచ్చు నురగ బట్టలను బాదకుండగనే వాటిలోని మలినమును తరిమివేసి వాటి అసలు రంగును తిరిగి తెచ్చుటను మీరే చూడండి."
SUNLIGHT SOAP
సన్‌లైట్ సబ్బు
బట్టలను కాపాడును · శ్రమను తగ్గించును · ఖర్చును తగ్గించును



జయ
కార్తికము

భారతి

సంపుటము 31
సంచిక 11

* జాగృతి ప్రతిజ్ఞ *

శ్రీ సాళ్వ కృష్ణమూర్తి

రఘుకులస్వామి పారావారధీశక్తి శయ్యా సుహృద్వృత్తి సాగి యొరసి
శ్రీ ధరిత్రీజాత స్నిగ్ధపాదాంభోజ లాక్షాస్ఫురద్రక్తి రంగరించి
శ్రీ సుమిత్రాదేవి స్మితసమున్మేష మా సేవావచఃప్రౌఢి సేకరించి
ఉత్సృష్ట సౌఖ్యాబ్ధి ఊర్మిళాహృదయార్తరేఖా సమాశ్లిష్ట ఋషిపథమ్ము

నధివసించిన నాహృదయాబ్జసీమ
పరమ వైరాగ్యభావసంపన్నమగుచు
జడలు దాల్చిన మత్తపస్సాధనోగ్ర
సాధు సేవా ప్రతిజ్ఞ ఆశ్రయము గనుత!

ధరణీధ్ర సాను దుస్తరపథోద్వృత్తి పై యరుగుచో శాతబంధురపు శిలల
ఉరుదరీ నిర్ఝరీపరిషిక్త సముపాంత వృక్షాగ్రపాత వార్బిందు తతిని
అగ్నిమణ్యానుభగ్న భుగ్నార్చిరాకీర్ణ సానుభ్రమద్వాయు శాణరేఖ
శితికంఠ కంఠాహి హుతభుక్శిఖారేఖ నెగచిన విషధూమ గగనవీథి

ముక్త కూర్పాస జాగ్రదాభోగశక్తి
శీర్షమణికోటి చిత్రితాశీవిషాగ్ని
ఉద్గమితమైన మన్మహోద్యద్గుణాంక
సాధుసేవా ప్రతిజ్ఞ ఆశ్రయము గనుత!

మృదువాయు చలిత పుష్పిత లతావృతాళి పరిణద్ధ మాధవోద్భాసి కాంతి
జ్వలదగ్ని దీర్ఘవాసర నభోమణి చండిమోత్పాటితమ్ము గ్రీష్మర్వరాత్రి
జలధరానేక కజ్జలగిరిన్యస్త వర్షాలతాతన్విభూషాస్రజమ్ము
శారదాకాశ విస్ఫారితాయత గరుద్రాజహంసాభ చంద్రాంశుసరసి

వన్యపథ హిమభిత్తి శర్వరికి హర్త్రి
కళుకుమని రాలు పలిత వృక్షచ్ఛదముల
నన్మదాత్మీయమూర్తి నానాయత్తశక్తి
సాధుసేవాప్రతిజ్ఞ ఆశ్రయము గనుత!

ఆకృష్ట సకలపుణ్యావర్తమోహనోద్ధురగతి భావబంధురత తోచి
ఉద్రిక్త వాయుసముత్కీర్ణగతి నేవో మొగలిపూవాసన లెగచి తాకి
కనుమూసి వినినంత వనవీధి నినదించు కీచకోత్కారమరుద్గీతి విన్పి
అచ్ఛమై యొండు ఊహాసుప్తి విడివడ్డ నేనుగా నాకు గాన్పించి నిలిచి

ఆత్మలోన చక్షుశ్శ్రీవ ఆప్తిగనిన
నిరవధికభక్తి ధృతజగద్భరణశక్తి
సాధుసేవాప్రతిజ్ఞ ఆశ్రయముగనుత
ధరణిజా వపుర్వల్లి గందంపుమ్రాను.

* నరబలి *

శ్రీమతి నర్గీస్ దలాల్

★ ★ న్యూయార్క్ హెరాల్డ్ ట్రిబ్యూన్ పత్రిక అధ్వర్యాన జరుగుతున్న ప్రపంచ కథానికల రెండవపోటీ సందర్భంలో హిందుస్థాన్ టైమ్సుపత్రిక నిర్వహించిన అఖిలభారత పోటీలో ఇది ప్రథమ బహుమతినందిన కథ. భారతదేశంనుంచి ప్రపంచపోటీకి పంపబడిన నాల్గు కథలలో మొదటిది. ఈకథకు హిందూస్థాన్ టైమ్సుపత్రిక రు. 1500 లు బహుమాన మిచ్చింది. శ్రీమతి నర్గీస్‌దలాల్ ఈకథను ఆంగ్లభాషలో రచించి పోటీలో పాల్గొన్నారు.

శ్రీమతి నర్గీస్‌దలాల్ జననం 1923 సం॥ జూన్ 13 వ తేదీ. భారతదేశపు అసిస్టెంట్ సర్వేయర్ జనరల్ శ్రీ జె. ఎ. ఎఫ్. దలాల్ గారిసతి. ఇరువురు కుమార్తెలూ ఒక కుమారుడూ వీరి సంతానం. గృహనిర్వహణలో అత్యంత శ్రద్ధగల నిరాడంబర జీవి. ఆంగ్లభాషలో, తఱచు, కథలూ వ్యాసాలూ వ్రాస్తూ వుంటారు. ★ ★

ఆ గతుకుల బాటవెంట కారు నెమ్మదిగా సాగిపోతోంది. తళతళలాడుతూవుండే దాని పార్శ్వభాగాలు దుమ్ముగొట్టుకుని బూడిదపులిమినట్టు కావురిసిపోయినై. చుట్టూ చూపుమేర దూరం, పర్వతశ్రేణి వరకూ, ఎండుగొట్టిపోయిన ఒకే ఒక బట్టబంజరు. దూరాన కొండలమీద మాత్రం నీలవర్ణపు పొగతెరలా మృగతృష్ణ.

ట్రెమూనా ఏదో దాహంతో వున్నవాడులా కారులోనుంచి బయటకి తొంగిచూచాడు. భారతదేశాన్ని అవగతం చేసుకోవాలనే ఉద్దేశంతో ట్రెమూనా యిలా యీ దేశానికి అరుదెంచారు. ఈ దేశాన్ని గురించి ఏ అణుమాత్రమూ మిగలకుండా సమగ్రంగా తెలుసుకుపోవాలని ఆయన పరమదీక్షతో వున్నాడు. కన్నులపండువుగా మిసమిసలాడే పచ్చికబయళ్లను చూచాడు; సీతారామకోరుతున్న కొండకోనల సౌందర్యాన్ని తిలకించాడు. సిరులు తులతూగే టీ తోటలను చూచాడు; ప్రాచీన శిల్పసంపదలనూ, దేవాలయాల గోపురాదులనూ వీక్షించాడు. క్రొత్తగా నిర్మించుతున్న ఆనకట్టలను కూడా చూచాడు. కాని ఆయనకు తృప్తి కలుగలేదు. షామ ప్రాంతాలను చూడాలి—అదీ ఆయన ఆవేశం. ఆకలిపిశాచి అటమటింపజేస్తుంటే కంకాళాలుగా మారి పాలెండి వడలి చివికిపోయిన స్తనాలతో అల్లాడుతున్న అభాగినుల చిత్రాలు సంపాదించాలి; ఉబ్బిపోయిన పొట్టలతో ఊద కాళ్లతో ఊగిసలాడిపోతున్న పసిపాపల ఫోటోలు సంపాదించాలి. తాను స్వదేశానికి తిరిగి వెళ్లాక వాటిని తన పత్రికలో ప్రకటించుతాడు. ఈ ఛాయాచిత్రాలన్నిటినీ ఒకటోరకంగా వుండేలాగు తీయాలని ఆయన ప్రయత్నం. కారులో వున్న తదితరులకు యింత ఉబలాటం వున్నట్టు కనుపించదు. వారి నిస్పృహను లెక్కచేయకుండా ట్రెమూనామాత్రం పరమ ఔత్సుక్యంతో వున్నాడు. గ్లాసు తలుపులు మూసివున్నా వడగాలి లోపలికి దంచేస్తూనే వుంది. గాలితోపాటు ధూళికూడా లోపలికి చొరవ చేసుకుని, లోపలున్న మెత్తలూ దిండ్లూ సర్వం నానా కచాటీ అవుతున్నయ్.

ఆ యిద్దరు ఆడవాళ్లలో, చిన్నవిడ ముఖం గుడ్డతో తుడుచుకుని, తలప్రాణం తోకకువచ్చినట్టు వెనక్కు జాలిగిలబడ్డది. ఆవిడవయసు ఇరవై దాదాపు

వుంటుంది; ఆరోగ్యంతో మిసమిసలాడుతున్న చక్కని ముఖం; నల్లని వెంట్రుకలు, గోధుమరంగు లేతకళ్లు. ఇంకా కొంచెం వయసు గల ఆ రెండో ఆవిడ ట్రెయానా సోదరి. దిళ్లకూ పరుపులకూ ఎలా దూగరపట్టివుందో ఆవిడ దుస్తులమీందాకూడా అలాగే సన్నటి పొరగా దూగరపట్టి వుంది—దుస్తులే కాదు, శరీరమంతా కూడా. ముఖంమీదినుంచి కనుబొమల మీదికి మడ్డి ఓడుతోంది. ఈ గిజాటంతా తెలియనట్టు నోరు తెరచి, కళ్లు మూసుకుని మాగన్నుగా కునుకు తీస్తోంది.

ఈ వడగాలి లెక్కలేనట్టు కనుపించుతున్నవాడు డ్రైవరొక్కడే. అతను ఈ దేశంవాడు; యువకుడు; చలాకీ అయిన ముంజేతులు; కారు నడుపుతున్నాడన్నమాటే గాని అప్రయత్నంగా చేతులు వాటంతటవే కదిలి పనిచేస్తున్నట్టు కనుపించుతోంది. అతను లోగడ సైన్యంలో పనిచేశాడు. ట్రెయానాకు ఆయా ప్రదేశాలు చూపించటానికి అతన్ని ఆదేశించారు. అతను చాలా మితభాషి, ఏదైనా ప్రత్యేకంగా చెప్పదగిన విషయముంటే తప్ప నోరు మెదపడు.

ట్రెయానా ముందుకు వంగి, అతన్ని పలకరించాడు:

'ఇదుగో ప్రీతమ్‌సింగ్—ఇటు చూడు—ఫలహారం చేద్దాం—దగ్గర్లో, కొంచెంసేపు విశ్రాంతి తీసుకోటానికి తగిన ప్రదేశమేదేనా వుంటే అక్కడికి పోనీ—'

ప్రీతమ్‌సింగ్ సమాధానం చెప్పలేదు గాని, సరేనన్నట్టు తలవూపాడు.

ట్రెయానా రుసరుసలాడాడు. అసలు యీ దేశం వాళ్ళంటేనే అతనికి చిరాకు; అందులో యిలా మౌనంగా వుండే రకాన్ని చూస్తే మరీ మంట.

ట్రెయానా వసవోసిన పిట్ట; అస్తమానం ఏదో ఒకటి మాట్లాడుతూ వుంటేగాని అతనికి తోచదు. కొంచెం కురచమనిషన్నమాటేగాని పుష్టిగల శరీరం. తాను ఆంగ్లజాతికి చెందినవాణ్ణని చెప్పుకుంటాడు. చెప్పుకోటమే గాదు—దీన్ని ఋజువు చేసుకోవటానికి బ్రిటిష్ పౌరుడుగా అతని చేతిలో పాస్‌పోర్టు కూడా వుంది. కాని యిది కొంత అనుమానించదగ్గ విషయంగా కనుపించుతుంది. ఎంచేతనంటే దేహచ్ఛాయ విషయంలో ప్రీతమ్‌సింగ్ కంటే అతను మరేమంత తెలుపు కాదు. నల్లటి ఆ కళ్లూ, నూనె రాచుకున్నట్టు నిగనిగలాడుతూ ఆ నల్లటిజుట్టూ పట్టిస్తున్నట్టుగా వున్నయ్. అతను, తన దేశాన్ని, గురించీ, తన జాతినిగురించి ఎప్పటికప్పుడు ఎడాతెరిపి లేకుండా తెగపొగడుకుంటూ వుంటాడు. ఇతర దేశాలనూ, ఇతర జాతులనూ పురుగుల్క్రింద తీసేసి దులపరించుతూ వుంటాడు. తన రక్తంలో సాంకర్యమేదో వున్నదని అనుమానంవుండే ప్రతిఒక్కడూ ఇలానే ప్రవర్తించుతూ వుంటాడు. నల్లచర్మం వున్న యావన్మందికీ అతను 'నిగ్గర్' అనే పదం వాడి, చీదరించుకుంటూ మాట్లాడతాడు. వాళ్లకి సంబంధించిన మంచినీ చెడునీ కూడా త్రోసిరాజుక్రింద కొట్టి పారేస్తాడు. ఇప్పుడు చుట్టూవున్న పంటపొలాలన్నీ అలా ఊసరక్షేత్రాలుగా మారి కంటబడుతుంటే, ఏదో తన లోపలున్న అక్కసంతా తీరి తృప్తిపడుతున్నట్టు కనుపించుతున్నాడు. 'శోకం కుదరాలిసిందే' అన్నట్టు సర్దాగా చేతులు నలుపుకుని ముచ్చటపడుతున్నాడు. ఇంగ్లీషువాణ్ణని చెప్పుకుంటే, తన దేహచ్ఛాయా, కాటుక కండ్లూ కూడా మారిపోతాయని ట్రెయానా విశ్వసించుతున్నట్లున్నాడు.

ప్రీతమ్‌సింగ్ సాయుధదళాల్లో ఆఫీసరుగా పని చేసివున్న కారణంగా దేశదేశాలూ చూచాడు. ట్రెయానాను చూసి వీడు ఏ దేశంలో పుట్టివుంటాడని, అపహాస్యంగా లోలోపల నవ్వుకుంటున్నాడు. బహుశా యీ దేశానికంటే ఉష్ణాధిక్యతగల ప్రదేశంలోనే పుట్టివుండాలనుకున్నాడు. కాని, ప్రీతమ్‌సింగ్ మర్యాద మన్ననలు తెలిసినవాడు, అందుచేత లోపలనుంచి ఒక చెంప నవ్వు వస్తున్నా, అణుకుని మామూలుగా ప్రవర్తించుతున్నాడు.

కారు ప్రక్కకు తిరిగి రోడ్డుమీదినుంచి ప్రక్కనున్న పుంతలోకి దిగింది. కట్టెదుట శిథిల శిథిలమై పాడుబడివున్న ఒక పాతకోట. ఎండవేడిమి నుంచి ముహూర్తకాలం తలదాచుకోవటానికి కాస్త చల్లటి ఆశ్రయం.

అందరూ కారు దిగారు. కుదులు పట్టిపోయిన కాళ్లు విదలించుకుని అమ్మా అనుకున్నారు. ఆ జవ్వని రెండు చేతులూ మెడనొక్కుకుని పిల్లికూనలా పెద్దగా ఆవులించింది.

ట్రెయానా ఆవిడవంక చూసి దిబ్బచెక్కల్లా వున్న తన పెదవుల్ని నాలికతో నాక్కున్నాడు. పోయి ఆవిడ చెయ్యి పట్టుకుని:

'హెలెన్ - పదపద - అలా నీడలోకి పద. నీవిక్కడ వడగొట్టి చదికిలబడి పోవటం పొసగదు'—అంటూ, అనాచ్ఛాదితమైన ఆవిడ ముంజేతిని చలాకీగా నొక్కాడు.

ఆపిల్ల నెమ్మదిగా వదిలించుకుంది. ఆ రెండో ఆవిడవెంట కాళ్ళీడ్చుకుంటూ లోపలికి వెళ్ళింది. ఆ అమ్మాయికి ట్రెయానా అంటే తగని చిరాకు; అతని సోదరి జార్డన్‌సతికి స్నేహితురాలైన కారణంగా యీ జంజాటాన్నంతా భరించవలసి వచ్చింది. ఇదొక్కటే గాదు. తన కిష్టంలేని ఇలాంటి అనేక చికాకులు భరించవలసి వచ్చినై. కాని యిప్పుడు ఆవిడ వాటన్నిటినిగురించీ విచారించి లాభంలేదు.

వెనకనుంచి సామానులు మోసుకొస్తున్న వాన్ కూడా అక్కడికివచ్చి ఆగింది. నౌకర్లు గబగబా క్రిందికిదిగి ఫలహారాలబుట్టలూ రగ్గులూ క్రిందికి దించారు. క్షణాలమీద కావలసిన యేర్పాట్లన్నీ పూర్తిచేశారు. అప్పటిదాకా పల్లెత్తుమాటైనా పలకకుండా కిమనాస్తిగాకూర్చున్న జార్డన్‌సతి ఆకలి మొహం పెట్టి ఆ ఫలహారాలవంక ఆప్యాయంగా చూసింది. దుమ్ము గొట్టుకున్న ఆ మురికి చేతులతోనే, ఆదరా బాదరా, 'సాండ్‌విచన్' తీసి ఒకదాని తరువాత ఒకటి నోట్లో కుక్కుకుంటోంది.

హెలెన్ కొంత జాలిగానూ కొంచెం ఏహ్యభావంతోనూ ఆవిడ చర్యను గమనించుతోంది. ఆమెప గుండీలేని, నీలవర్ణపు కమీజూ, యే విషయాన్నీ అంతగా ఖాతర్ చెయ్యని ఆ నిర్లిప్తత, ప్రీతమ్‌సింగ్ వాళ్లకు సుదూరంలో ప్రశాంతంగా నిల్చున్నాడు. వాళ్లకూ అతనికి మధ్య, అధిగమించరాని అఖాతమేదో వున్నట్టు కనుపించుతోంది.

కారులో ప్రయాణం చేస్తున్నంతసేపూ, ట్రెయానా, భారతీయులను గురించి యిష్టంవచ్చినట్టు మాట్లాడుతూనే వున్నాడు. వాళ్ల మర్యాద మన్ననలనూ, వాళ్ళ సంప్రదాయ విశ్వాసాలనూ, పరిహసించుతూ, యకయకలాడుతూనే వున్నాడు. ఇదంతా వింటూకూడా ప్రీతమ్‌సింగ్ యీషణ్మాత్రం కూడా చలించకుండా నిబ్బరంగా కూర్చున్నాడు. అతి మర్యాదగా ప్రవర్తించుకున్నాడు. అతని ప్రవర్తనచూస్తే హెలెన్‌కు ఆశ్చర్యం వేసింది. నిజంగా ఇదంతా అతనికేమీ పట్టదా? లేక కావాలని వహించుకున్న మౌనమా? దుర్భేద్యమైన అతని మహామౌనం ట్రెయానాను మరింత రెచ్చగొట్టి యింకా అనంతంగా పేలించుతోంది.

'ఆహాహా! — ఏవిఁ దేశం! — నిజానికి స్వాతంత్ర్యం పొందాలిసిన పోతుగడ్డ! — విదేశీయ జోక్యమనేది లేకుండా, ఆకలితోమాడి ఇక హాయిగా మరణించవచ్చు మీరంతా.'

ప్రీతమ్‌సింగ్ నోరుమెదపలేదు — ట్రెయానాకు మరింత రేచిక్క పుట్టుకొచ్చింది. ఎలాగన్నా అతన్ని మాటాడించాలి. అవమానంతో అతని ముఖం కందగడ్డయేలాగు చెయ్యాలి. క్రోధంతో అతని కళ్లు చింత నిప్పులయ్యేలా రెచ్చగొట్టాలి. బారలు చాచి, ఎండి నెరియలు కొట్టి ఊసరక్షేత్రమై చుట్టూ పడి వున్న భూభాగంవంక చూపుతూ మళ్ళీ మొదలు పెట్టాడు.

'వరదలు, క్షామాలు, అవినీతి, అలివిమాలిన స్వార్థం, అన్నిటినీ తలతన్ని చెడ చెరిగిపోయిన ఈ జనాభా — ఇంకా యింతకంటే ఏం కావాలి మహాప్రభూ! — మేవుఁ ఇక్కడినుంచి అలా కాలుతీసి అవతల పెట్టామో లేదో, క్రమశిక్షణ అనేది సాంతం కరారావుడైపోయింది. తలకెక్కిన అధికారగర్వంతో రాజకీయనాయకులు పేలుతూవుండే అవాకులూ చవాకులూ తిప్ప యిక్కడ వుండేడిసిం దేమిఁటి? ఇలాటి మురికికూపంలో మగ్గుతూన్న మీరు భద్రతా మండలిలో కూర్చుని, ఏ ముఖం పెట్టుకుని 'ఇలా చెయ్యండి అలా చెయ్యండి' అంటూ ప్రపంచానికి ధర్మోపదేశాలు చెయ్యటానికి పూనుకుంటున్నారో నాకు ఆశ్చర్యంగా వుంది. ఇలాటి స్థితిలోవున్న మీరు ఇతరులకు తగుదునమ్మా అంటూ సలహాలివ్వబూనటం హాస్యాస్పదమైన అవకతవక పని; సహించరాని అధిక ప్రసంగం గాని మరొకటి కాదు."

నిజానికి ఆ ఉద్రేకంలో ప్రీతమ్‌సింగ్ ఒక్క పెట్టున ట్రెయానామీద విరుచుకుపడి అమాంతం పీక నులిమి వెయ్యాలిసింది — కాని క్షణంలో మళ్ళా తమాయించుకున్నాడు. బిగించిన పిడికిళ్లు విచ్చులు కున్నాయి: నిర్దుష్టమైన ఆంగ్లభాషలో అతి శాంతంగా: 'ప్రొద్దుగూకేలోగా రహదారి బంగళాకు చేరాలంటే మనం వెంటనే బయలుదేరాలనుకుంటాను' అన్నాడు.

ఇందతా వింటూంటే జార్డన్‌సతికి లోలోపల ఆందోళన బయలుదేరింది. కంగారుగా యిద్దరివంకా చూసింది. ముఖం గొరెముఖంలా తెలివితక్కువగా పెట్టి అతన్ని శాంతపరచాలనే ఆందోళనతో 'మిస్టర్ ప్రీతమ్' యీ కోటనుగురించి తెలుసుకోవలసిన విషయమేమీ లేదా' అని అడిగింది.

ప్రీతమ్ తలెత్తి ఆవిడవంక చూసి చిరునవ్వు నవ్వాడు. 'ఆఁ యేముంది — ఏదో పాతకోట' అన్నాడు. 'కాని ఈ పరిసరాలలో వున్న గ్రామాలను గురించిమాత్రం తెలుసుకోదగ్గ విషయాలు కొన్ని వున్నయ్ — ఏమిఁటంటే — పూర్వం యీ ప్రాంతా

లలో వర్షాధిదేవత వరుణదేవుడికి నరబలులు అర్పించేవారు. ఇప్పుడు కొత్త శాసనాలు వచ్చాక అలాటివేవీ జరగటానికి వీల్లేదనుకోండి;—కాని యిప్పటికీ కూడా యిక్కడి జనంలో చాలామందికి అదే విశ్వాసం; ఒక్క ప్రాణం గనుక బలి యిచ్చివుంటే ఇలాంటి క్షామంయెప్పుడూ తటస్థించేదిగాదని వాళ్లకు గట్టి నమ్మకం.

ఈ మాటవిని జార్డన్‌సతి హడిలిపోయింది: 'అయ్యో బాబోయ్!' అని గుండె కొట్టుకుంది:

'ఏమిటీ? నిజంగా వాళ్లు మనుషుల్ని బలిస్తారంటావా!'

'ఎంత అఘాయిత్యం' అంది హెలెన్.

ప్రీతమ్‌సింగ్, భుజాలు కొద్దిగా ఎగరేసి కారులోకి యెక్కి స్టీరింగ్ పుచ్చుకున్నాడు:

"చూడండి! ఏ విషయమైనా ఆలోచించే వ్యక్తుల దృక్పథంమీద ఆధారపడి వుంటుంది. వందలాది ప్రాణాలను కాపాడటానికి ఒక ప్రాణాన్ని త్యాగంచేస్తే తప్పులేదని వాళ్ళ అభిప్రాయం కావచ్చు; ఎక్కడో విదేశాలలో బ్రతుకుతూవుండే ముక్కూ మొహం ఎరగని అమాయక ప్రజల్ని హత్య చెయ్యటానికి ఇక్కడినుంచి మనుష్యుల్ని పంపడం—ఇది అడవిమనుషులు చెయ్యాల్సిన అకృత్యమని యిక్కడివాళ్ల అభిప్రాయం. అయినా యీ నరబలుల విషయం ఇప్పటి సంగతి కాదులెండి—ఎప్పుడో పెద్దలనాటి సంగతులు.

ట్రియానా అగ్గిరాముడైపోయాడు: 'ఏమిటీ అక్షరజ్ఞానశూన్యులైన యీ అడవిజాతి వాళ్ళ కిరాతాచారాలకీ, విజ్ఞానవేత్తల సారథ్యంలో నడిచే ఆధునాతన యుద్ధతంత్రానికీ సామ్యం తెచ్చావా?'

'సరే యిక బయలుదేరదాం' అని గొణుక్కున్నాడు ప్రీతమ్‌సింగ్, తనలో తను. కారు మెల్లగా సాగింది. తక్కిన విషయాలన్నీ ఎలా వున్నా కారు మాత్రం చాలా సొగసుగా వుంది. అలాటి ముచ్చటైన కారును నడిపే సావకాశం తనకు జీవితంలో మరో మారు లభ్యం కావటం దుర్లభమే. దిబ్బసకుక్కలా బలిసి కారులో కూర్చున్న ఆ మనిషి తన పత్రికలలో ఏమేమి వ్రాయబోతాడో అని ఆశ్చర్యపోతూ, తదేక దృష్టిగా రోడ్డువంక చూస్తూ కారు పోనిస్తున్నాడు.

ఆ ప్రాంతంలో ఎక్కడా పచ్చని పరక కంట బడటంలేదు. ఎక్కడో ఒకచోట మోడువారిపోయిన మహావృక్షం మేదో ఒకటి సుదీర్ఘములైన శాఖలను నిరామయాకాశంలోకి ఎత్తుకుని అతి దైన్యావస్థలో నిల్చుని వుంది. ఒకొక్కచోట పాడుబడిపోయిన గుడిసెలు కనుపించుతున్నయ్. ప్రాణి సంచలనం మాత్రం ఎక్కడా లేదు. అసలు ప్రాణి అనేది ఆ ప్రాంతంలో ఎప్పుడూ మెసలనే లేదేమోననే భ్రమ కలుగుతోంది.

కారు రహదారి బంగళాకు చేరుకుంది. నిద్రమత్తులోవున్నట్టు కనుపించుతున్న ఒకముసలాడు వరండాలోకివచ్చి, అంత పెద్దకారునీ, అందులో వున్న మనుషుల్నీ చూసి ఆశ్చర్యపోయాడు. అది మామూలు నాటురకం రహదారిబంగళా. ఓటిబల్లలూ, కుంటికుర్చీలూ, స్ప్రింగులు విరిగిపోయి సాగిసలాడుతున్న మంచాలూ దుమ్ముకొట్టుకుని, సాలిగూళ్ళుపట్టి నానాభీభత్సంగా వున్నయ్. అవన్నీ ఏ ఇక్ష్వాకుల నాటివో! ఇంతలోనే సామానులవాన్ వచ్చి చేరుకుంది; నౌకర్లు 'క్యాంపుకాట్సు', దలువ చేసిన దుప్పట్లు వగైరా అన్నీ బయటికితీసి క్షణాలమీద కావలసిన యేర్పాట్లన్నీ చకచకా పూర్తిచేశాడు. భోజన మజ్జనాదులకు కావలసిన సన్నాహాలకు ఉపక్రమించారు.

కళ్లు మిరుమిట్లుగొలిపే ఆ కారు లైట్లూ, అహంగా అదంతా చూసి కాబోలు ఆ గ్రామస్థులు కొంతమంది బంగళా చుట్టూ మూగారు. జీబుతలలూ, చింపిరిగుడ్డలూ, బొమికెలు పొడుచుకువచ్చి అస్థిపంజరాల్లా వున్న దేహాలూ — భూతాలులా కనుపించుతున్నారు. హెలెన్ వాళ్లనిచూసి కంగారుగా కేక పెట్టింది. ఆ కేకతో ఇంకా అవతలగావున్న వాళ్ళుకూడా లోపలికి మూగారు. వాళ్లల్లో కొంతమంది చిన్నపిల్లలుకూడా వున్నారు.—హృదయవిదారకమైన దృశ్యం-కాళ్లూ చేతులూ పుడకలై పొట్టలు ఈలావున వాచివున్నయ్; నిర్జీవాలైన కళ్లతో తెల్లబోయి చూస్తున్నారు. పీస చలుగట్టి ముడుచుకుపోయిన మొహాల్లో ఆ కళ్లు ఇంతింతలుగా కనుపించుతున్నయ్.

వాళ్లనుచూస్తుంటే హెలెన్‌కు జాలివేసింది, 'అయ్యో పాపం!' అన్నది.

ట్రియానా ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బులై, భుజాలు ఎగరవేశాడు 'హుర్రా! రేపు ఫస్టుక్లాసైన ఫొటోలు తీస్తాను చూడండి!'

ప్రీతమ్‌వంక తిరిగి: 'ఇదిగో ఏమోయ్! రేపు వీళ్లందర్నీ రమ్మను ఫొటోలు తీస్తాను. ఇంతకంటే, పీలులైన ఆడవాళ్ళు, ఆకలితో డొక్కలెండుకుపోయిన వాళ్ళు వుంటే వాళ్లని తప్పకుండా తీసుకు రమ్మను—ఆ రకం పసిపిల్లల్నికూడా తీసుకురమ్మను; బక్షీస్ ఇస్తానని చెప్పు.'

ప్రీతమ్‌సింగ్ వాళ్ళలో వున్న వృద్ధుణ్ణి ఒకణ్ణి పిల్చి, టూకీగా ఒకటి రెండు మాటల్లో ఏదో

చెప్పాడు. ఆ ముసలాడు ట్రియానావంక అదో రకంగా తేరిపారజూచాడు. ఆ మాపుకు తట్టుకోలేక ట్రియానా గిజాటుగా ఇటూ అటూ మెసిలాడు:

'ఏమిటి దయ్యం మొహం వేసుకుని అలా చూస్తున్నాడు! ఇంతకీ యితను చెప్పిం దేమిటో వాడికి అర్థమై యేడుస్తోందా?'—

ఆ ముసలాడు ప్రీతమ్‌సింగ్ వంక చూసి, నెమ్మదిగా ఒకటి రెండు మాటలు ఏకో గొణిగాడు. ప్రీతమ్ ట్రియానావైపు తిరిగి: 'రేపు ప్రొద్దు పొడిచాక మిమ్మల్నీ వాళ్లీ గుడిసెలదగ్గరికి రమ్మంటున్నాడు. మీకు కావలసిందంతా చూపెవచ్చు నంటున్నాడు. ఇంకా మీరు మాపెనలిచిం దేమన్నా వుందా అని అడుగుతున్నాడు'—అన్నాడు.

ట్రియానా హుషారుగా: 'లేకేం, వుంది—నరబలి చూడా లనుకుంటున్నానని వాడితో చెప్పు' అంటూ పెద్దపెట్టున పకపకా నవ్వాడు.

ప్రీతమ్‌సింగ్ ట్రియానావంక మౌనగంభీరంగా ఒకమాపు చూచాడు. ట్రియానా అట్టహాసం అతని గొంతులోనే మటుమాయమైంది. ఆ జనం ఒక్కొక్కళ్ళే ఎక్కడివాళ్ళక్కడే అదృశ్యమైపోయారు.

అంతా భోజనానికి కూర్చున్నారు. టిన్నుల్లో అమూరా చేసి తెచ్చుకున్న రుచ్యాతిరుచ్యాలైన మధుర పదార్థాలు, అనంతరం కాఫీ, క్రీమూ పుష్కలంగా.

హెలెన్‌కు ఏమీ తినబుద్ధి పెయ్యటం లేదు. ఇదికాస్తా అదికాస్తా మునిపంట కొరుకుతోంది. తల పైకెత్తిచూస్తే ప్రీతమ్‌సింగ్ ఆ వటవకూడా లేడు, కాఫీమాత్రమే కలుపుతున్నాడు. జార్డన్ ఏతి కంగారుగా చుట్టూ ఆవరించివున్న అంధకారంలోకి బిత్తరబిత్తరపోయి చూస్తోంది—ఆ కంకాళ మూర్తుల ముఖాలూ ఆ నిర్జీవ నేత్రాలూ అంధకారంలోనుంచి మళ్ళా ఎక్కడ పొటమరించుతాయో నని నేగాబరాతో కాబోలు! ట్రియానామాత్రం తాపీగా కూర్చుని పుష్టుగా పట్టించుకున్నాడు: మధ్యమధ్య తెల్లటి జేబురుమాలుతో పెదవులు తుడుచుకుంటూ ఇంకా యింకా కూరుకుంటున్నాడు.

మర్నాడు కరకరలాడుతు ప్రొద్దు పొడిగించింది. ఆ బంగళాకు కుడిప్రక్కగా అల్లంతదూరంలో వట్టిపోయిన ఒక బావిచుట్టూ కొన్ని చెట్లు కనుపించుతున్నయ్. ఆ భూభాగానికంతా ఆ కాస్తే పచ్చగా కనుపించుతున్న ప్రదేశం. పదేపదే అటే చూడబుద్ధి వేస్తోంది. ట్రియానా తన కెమెరాను అమూరా చేసుకుని మెళ్లో తగిలించుకున్నాడు.

'బయలుదేరు ప్రీతమ్! పోదాంపద!' అన్నాడు.

'నేను రావటంలేదు'—ప్రీతమ్‌సింగ్ తాపీగా సమాధానం చెప్పాడు.

ట్రియానా, అగ్గిరాముడై అతనివంక ఉరిమి చూచాడు: 'డబ్బు పుచ్చుకున్నావ్—ఎవడికోసం వస్తావ్'—

ఆ భారతీయ యువకుడు అతి ప్రశాంతంగా సమాధానం చెప్పాడు: 'ఈ ప్రదేశాలు చూపించటానికి నేను డబ్బు తీసుకున్నాను—ఇతరత్రా నాకేమీ ప్రమేయం లేదు.

ట్రియానా కోరు అప్పాలపంకులా తెరిచి అతనివంక చూచాడు. ఉద్రేకంతో అతని ముఖం జేవురుముద్దయింది. ఆ ఆవేశాన్ని అణచుకోవటానికి అతను చేస్తున్న ప్రయత్నం ఇంతా అంతా కాదు. మారుమాట లేకుండా టోపీ నెత్తిన తగిలించుకుని, విసురుగా ద్వారం తెరుచుకుని గబగబా బయటికి వెళ్ళిపోయాడు. అప్పటికే తీక్ష్ణరూపం ధరించుతున్న సూర్యుడు కిరణాలతో అతన్ని ముఖంలో బాదుతున్నాడు. అతనున్న ఆవేశంలో అది లెక్క చేయలేదు—అతని హృదయంలో క్రోధ ద్వేషాలు జ్వాలలు లేపుతున్నయ్. ఆ నదీగర్భం ఏనాడో ఎండిపోయి ఇసుకపర్రగా మారింది. ఆ యిసుక పర్రకు అడ్డంబడి నడుస్తూ ఒకటి రెండుసార్లు తూలిపడి తనలో తను తిట్టుకున్నాడు.

అతను వేసుకున్న సూటు పలుచటిదే అయినా ఆ వేడిప్రదేశంలో తొడుక్కోవటానికి తగినంత అనువైంది కాదు. చెమటలు క్రమ్మి కోటు మరకలు పడుతోంది. జేబులోనుంచి లవండర్ చిలకరించి వున్న రుమాలు తీసి పదేపదే ముఖం తుడుచుకుంటూ, ఆ గుడిసెల దగ్గిరికి చేరుకున్నాడు.

గుడిసెల ముందూ ద్వారబంధాలమీదా మగవాళ్లూ ఆడవాళ్లూ భూమిమీద కొరిగి పడున్నారు. వాళ్ళని చూస్తే, ఇందులో వీళ్లు పడుచువాళ్లు, వీళ్లు ముసలివాళ్లు అని తేల్చటం కష్టం. అందరి ముఖాలూ ఒకేలాగు ముడుచుకుపోయివున్నాయి. ట్రియానా గుడిసెలదగ్గిరికి వచ్చినా వాళ్లెవళ్లూ లేచి రాలేదు. కళ్ళు మాత్రం తెరుచుకుని అతని చర్యలు గమనించుతున్నారు.

ట్రియానా మాత్రం బహుసర్దాగా వున్నాడు. ఇదంతా చక్కగా కుదిరింది. ఒకటోరకం ఫొటోలు! వహ్వా! ఒక గుడిసె ముందు అర్ధనగ్నంగా ఒక స్త్రీ బోర్లబొక్కలుగా పడివుంది. రొమ్ములదగ్గిరగా ఒక పసిబిడ్డ; ఆ ఆడమనిషి మీదుగా వొంగి క్రిందికి తొంగి చూశాడు పరిశీలనగా. ఆ బిడ్డ చచ్చిపోయివుంది. అల

భ్యాలైన పాలముక్కలకు అంగలార్చుతున్నట్టు నోరు ఇంకా తెరచుకు చేవుంది. బొమికెల పోగుగావున్న ఆ స్త్రీ భుజంమీద చేయి వేసి గుడిసె నీడలోనుంచి యివతలికి జరపాలని అతని ప్రయత్నం. కాని యింతలో వాయు గర్భంలో ఏదో జరుగుతున్నట్టు అతనికి ఏదో స్ఫురణ కలిగింది. కంగారుగా వెనక్కి తిరిగి చూచాడు. గుడిసెల ముందూ గడపల్లోనూ గుడిసెల్లోనూ నిర్జీవుల్లా పడున్న ఆడవాళ్లూ మగవాళ్లూ భూతాల్లా లేచి నిల్చుని నిశ్శబ్దంగా ముందుకు సాగివస్తున్నారు. దీర్ఘ చతురస్రంగావుంది ఆ స్థలం: మూడువైపులా గుడిసెలున్నయ్. నాలుగోవైపుకు కూడా కొందరు వచ్చేశారు. వందలాది కళ్ళు అతనిమీదికి నిశితమైన దృక్కులను ప్రసరించుతున్నయ్. నిర్దాక్షిణ్యంగా ఏదో చేసివేసే సంకల్పం ఆ కళ్ళల్లో తీవ్రరూపం దాల్చి కనుపించుతోంది. నలువైపులనుంచీ అతన్ని ఆక్రమించుకున్నారు. క్షణక్షణం వలయంగా దగ్గిర దగ్గిరకి వచ్చేస్తున్నారు.

ట్రెయినావాకు హడలెత్తిపోయింది. అతని నర నరాల్లోకి చలిగుబుల్లా భయభ్రాంతి ప్రవహించిపోయింది. తన్ను తాను రక్షించుకోవటానికి యావన్మాత్రమైనా ప్రయత్నం చెయ్యలేకపోయాడు. ఏమి చెయ్యటానికీ తోచక పైన తొడుక్కున్న గౌను బ్రరున చించేసి లోపల జేబులోనుంచి నోట్లకట్టలు తీశాడు.

'ఈగో! ఇవి తీసుకోండి...ఇవి తీసుకోండి' అంటూ అంగలార్చాడు.

నోట్లు అతని చేతుల్లోనుంచి జారి క్రిందపడి చెల్లాచెదరైనై—వాటిని అజబట్టినవారే లేరు. ఆ నోట్ల మీదుగా పాదాలు నడిచివచ్చి చుట్టు ముట్టాయి.

'రక్షించండి!' అని అరిచాడు. అతని అరుపు అతనికే నిర్జీవంగానూ అస్పష్టంగానూ వినిపించింది. 'రక్షించండి! రక్షించండి!'—

కళ్లూ ముఖాలూ దగ్గిరికి వచ్చేశినై. కత్తులు తళతళలాడినై — ఒకేఒక ఆక్రందన — అనంతరం నిశ్శబ్దం. పైన రాబందులు వలయాలు తిరుగుతూ క్రిందిక్రిందికి దిగివస్తున్నయ్:

భోజనసమయానికి ట్రెయినావా రహదారి బంగళాకు తిరిగిరాలేదు. కాని అక్కడవున్న వాళ్లు యిందుకు అంతగా ఆందోళన పడలేదు. కాని ఉన్నట్టుండి దూరాన డోళ్ల మోత వినిపించటంతో ఉలిక్కిపడ్డారు.

ఆదిలో నిమ్మదినిమ్మదిగా వినుపించుతున్న ఆ భేరీనినదాలు రానురాను ఘనంగానూ ముమ్మరంగానూ వినిపించసాగినై. ఆ భేరీకానినాదాల భీభత్స రావాలతో వాయుగర్భం దద్దరిల్లిపోతోంది. ఆ భీభత్స రావాలతో కలసి ఏవో మంత్రోచ్చాటనలు కూడా వినిపిస్తున్నయ్; ఆ భేరీనినదాలతో బంగళా మార్మ్రోగిపోతోంది.

వాళ్లు ట్రెయినావా వెదకటానికి బయలుదేరారు. చుట్టూ ఎక్కడ చూసినా డోళ్లే అమితోత్సాహంతో ఆవేశంగా బాది పారేస్తున్నారు. కాని ట్రెయినావా భోగట్టా యిచ్చేవాడు ఒక్కడూ లేడు. ఆ ప్రశ్న అడిగగానే, అర్థంకానట్టు శూన్యముఖాలు వేసి తలలు ఎగరేసుకుంటూ ఎవడి దోవను వాడు వెళ్ళిపోతున్నాడు.

దూరాన ఒకచోట రాబందులు గుంపుగా మూగి వుండటం గుర్తించి, అక్కడికి చేరుకున్నారు. అప్పటికే ఆ కళేబరం పోల్చటానికి వీలులేని స్థితిలో వుంది. ఆ కళేబరాన్ని ఒక తెల్లటి దుప్పటిలో చుట్టి సామాన్ల వానులో పెట్టారు. దిగులు దిగులుగా ఏడుస్తూ జార్డన్ సతి కారులోకి ఎక్కింది. హెలెన్ ముఖం తెల్లగా పాలిపోయింది. ప్రీతమ్‌సింగ్ వంక మౌనంగా చూస్తోంది. అతన్ని యేదో అడగాలనుకుంటోందిగాని గుండెచాల్లేదు. మామూలు మౌనగంభీరధోరణిలో ప్రయాణ సన్నాహాలన్నీ పూర్తి చేసుకుని ప్రీతమ్‌సింగ్ కార్లోకి ఎక్కాడు. కారు బయలుదేరేసరికి వర్షం ప్రారంభమైంది.

చినుకులు చినుకులుగా ప్రారంభమైన జల్లు ఇట్టే కుంభవృష్టిగా మారిపోయింది. వర్షం ఎడాపెడా దంచుతుంటే కారు టాపూ చట్రం మోతెత్తిపోతోంది.

కారులోవున్న ముగ్గురూ ఒకరి ముఖంవంక ఒకరు మౌనంగా చూసుకున్నారు. అంత కుంభవృష్టిలోనూ విజయావేశంతో భేరీకానినాదాలు దూరాన్నుంచి యింకా వినిపిస్తూనే వున్నయ్. ఆకలిగావున్న ఆ భూగర్భం, ప్రాణప్రదమైన జలసేచనంతో తిరిగి చైతన్యతను పొంది దిగ్దిగంతాలూ మార్మ్రోగేలాగు అంకెలు వేస్తోంది!

* జర్మనీ పునర్జన్మ *

శ్రీ పి. శ్రీరాములు

కొన్నేళ్ల క్రితం ఒక విదేశీ యాత్రికుడు జర్మనీలో పర్యటన చేస్తూ ఒక హోటలులో బస చేస్తున్నాడట. ఆ రోజంతా మబ్బుగావుండి చలి గాలి వీస్తున్న కారణంచేత, ఆయన బసలోనే వుండిపోయాడట. ఒక జర్మన్ కుర్రవాడు తానున్న గది వద్దకు రాగా, "ఇవ్వాళ వాతావరణం ఎంత అసహ్యంగావుందో చూడు!" అని ఆ యాత్రికుడు ఆ కుర్రవాణ్ణి పలకరించాడట. "ఈ అసహ్యపు గాలి ఫ్రాన్సు దిక్కునుంచే వీస్తున్నది. ఆ పాపిష్టి దేశం మూలనుంచి ఇంతకంటె మంచిగాలి ఎలా వీస్తుంది?" అని ఆ 15 ఏళ్ళ కుర్రవాడు తడుముకోకుండా బదులు చెప్పాడట. జర్మనీ ఫ్రాన్సులమధ్య తరతరాలుగా వస్తున్న శత్రుత్వం ఎంత ప్రబలమైనదో ఈ చిన్న సంఘటనను బట్టి ఊహించవచ్చు.

అంతర్జాతీయ రాజకీయాలలో—ముఖ్యంగా యూరప్‌ఖండ వ్యవహారాలలో—జర్మనీ ఫ్రాన్సుల బద్ధశత్రుత్వానికి విశేష ప్రాధాన్యం వున్నది. ఇది ఈనాడు కొత్తగా ఏర్పడిన వైరంకాదు. కొన్ని శతాబ్దాలనుంచీ వరుసగా వస్తున్నది. అతి క్లిష్టమైన అనేక ప్రపంచ సమస్యల పరిష్కారానికి ఫ్రాన్సు జర్మనీల శత్రుత్వం ఇదివరలో ప్రబలమైన అంతరాయంగా పరిణమించింది. ఇకమీదకూడా పరిణమిస్తూనే వుంటుందేమో ననుకోవలసి వస్తున్నది. యూరప్ ఖండంలో భవిష్యదశాంతినీ, సంఘర్షణలనూ నివారించాలంటే ఫ్రాన్సు జర్మనీల చిరకాల శత్రుత్వం పూర్తిగా సమసిపోయేట్లు చేసి, ఉభయ రాజ్యాలమధ్యా సంపూర్ణ సామరస్యం ఏర్పడేట్లు చేయడం అతి ప్రధానం.

చరిత్రకారులు 1914 లో సంభవించిన ప్రథమ ప్రపంచయుద్ధానికి ముఖ్య కారణాలు మూడని వ్యక్తీకరిస్తారు. (1) సంప్రదాయసిద్ధంగా వస్తున్న ఫ్రాన్సు జర్మనీల శత్రుత్వం. (2) బ్రిటన్ జర్మనీల వైరభావం (3) రష్యా ఆస్ట్రియాల స్పర్థ. ఆ యుద్ధంలో జర్మనీ పూర్తిగా పరాభూతమై, దాని సామ్రాజ్య భూభాగాలను ఎక్కడివాటిని అక్కడ ఉత్తరించివేసినప్పటికీ, దాని నౌకాబలాన్ని పూర్తిగా హతమార్చివేసినప్పటికీ, ఫ్రాన్సు జర్మనీల శత్రుత్వం మాత్రం సమసిపోలేదు. దాదాపు 90 సంవత్సరాల క్రితం జర్మనీ ఏకీకరణకర్త, బిస్మార్క్ మహాశయుడు ఆల్సేస్, లారెయిన్ అనే రెండు ఫ్రెంచి రాష్ట్రాలనూ జర్మనీలో కలిపివేసుకోవడంతో ఈ రెండు దేశాల శత్రుత్వం ప్రారంభమైందంటారు. ఆల్సేస్ లారెయిన్‌లు తిరిగి ఫ్రాన్సుకు సంక్రమించినపిమ్మట కూడా ఈ వైరం మరీ ఎక్కువైంది గాని, తగ్గలేదు.

ఐతే, ఫ్రాన్సు జర్మనీలమధ్య ఈ ప్రబల శత్రుత్వానికి కారణ మేమిటి? ఫ్రాన్సుపట్ల జర్మనీ వైఖరీ, జర్మనీపట్ల ఫ్రాన్సు వైఖరి శత్రుత్వ రూపంలో ఏవిధంగా మరీ మరీ ఘనీభవిస్తూ వచ్చిందనే విషయాలను పరిశీలిద్దాము. ఫ్రెంచి, జర్మన్ ప్రజల మనోగత భావాలలోనే, మానసిక ప్రవృత్తులలోనే జీవిత దృక్పథాలలోనే కొన్ని ప్రధానమైన వ్యత్యాసాలు కొట్టవచ్చినట్లు కనబడుతవి.

యూరప్ ఖండంలోని ఇతర రాజ్యాల మాదిరిగా ఈ ఉభయదేశాల ప్రజలు కూడా క్రిస్టియన్ మతానికి చెందినవారే. జర్మన్ ప్రజలలో అధిక భాగం ప్రొటెస్టెంట్ శాఖవారు; ఫ్రెంచి ప్రజలు కాథలిక్కులు. ఐతే తా మవలంబించే మతంలో శాఖాభేదం వున్నంత మాత్రాన రెండు జాతులమధ్య బద్ధవైరం పెంపొందవలసిందేనా? ఇంతే కాదు, ఫ్రెంచి జర్మన్ ప్రజల జాతీయ లక్షణాలలో కూడా కొన్ని వ్యత్యాసాలు గోచరిస్తవి.

ప్రతి జర్మన్ పౌరుడూ ఒక మహాయంత్రంలో తానొక భాగమనే భావంతో క్రమశిక్షణతో పని చేయడంలో ఘటికుడని ప్రతీతి. పైనుంచి వచ్చే ఆదేశాలు స్వీకరించడంలో, వాటిని శిరసావహించడంలో అతడికి అతడే సాటి. అవిసంగా ఆదేశాలను శిరసావహించడంలో జర్మన్ పౌరుడు విపరీతమైన ఆనందాన్ని అనుభవిస్తాడు. ఈ విషయంలో ఫ్రెంచి జర్మన్ ప్రజలమధ్య ఉత్తర దక్షిణ ధ్రువాలకున్నంత

స్వాతంత్ర్యం వున్నది. ప్రతి ఫ్రెంచిపౌరుడికీ వ్యక్తిత్వ ప్రతిభ హెచ్చు. జర్మన్ ప్రజలు సహజంగా ఆదర్శవాదులు; అవసరమైతే అఖండ కార్యశూరులు; ఫ్రెంచివారిలో కార్యశూరత్వం అంతగా లేక పోయినా, అద్భుతమైన ఇంగితజ్ఞానం గోచరిస్తుంది; ఏవిషయాన్నైనా ఫ్రెంచివారు ఆచరణలో సాధ్యాసాధ్యాలను బహుజాగ్రతగా పరిశీలిస్తారు.

జాతీయ భావోద్రిక్తుడైనప్పటికీ, అన్ని ఇతర దేశాల మనుష్యులతో జర్మన్ పౌరుడు కలసి మెలసి సంచరించగలడు. దేశపర్యటనలన్నా, ఇతరులను కలుసుకొని ముచ్చటించడమన్నా జర్మన్లకు మహా సరదా. తాము తప్పుచేయడమంటూ జరగదనీ, తమ సమస్తవ్యవహారాలు దైవప్రేరితాలై సర్వదా సవ్యమైనమార్గాన నడుస్తాంటవని ఫ్రెంచివారి విశ్వాసం.

తమ జాతిఒక్కటే మహోత్కృష్టమైనదనీ, ఇతరజాతులన్నీ తమముందు బలాదూరనీ జర్మన్లు ప్రదర్శించే దురహంకారం ఫ్రెంచివారిలో మందుకైనా కానరాని మాట వాస్తవం. తమ విజ్ఞానాన్నీ, విశిష్టసంప్రదాయాన్నీ చూసుకుని గర్వపడినప్పటికీ ఇతర నాగరికతలలో ఉత్కృష్టమైనదని తోచే దాన్నికూడా జీర్ణించుకోగల శక్తి జర్మన్ పౌరుడికి వున్నది. ఫ్రెంచివారి ధోరణి అలాంటిదికాదు. మహోత్కృష్టమైన మానవ నాగరికత అంతా తమ దేశంలోనే—ముఖ్యంగా పారిస్ మహానగరంలోనే—నిస్సందేహంగా మూర్తీభవించిందనీ, మహోన్నతమైన స్థాయిని అందుకున్నదనీ ఫ్రెంచిజాతి విశ్వాసం.

అగ్నిపర్వతాన్ని సైతం బద్దలుచేసి వేసేటంత అశాంతి లోలోపల వున్నప్పటికీ, అత్యద్భుతమైన మనోనిబ్బరాన్ని ప్రదర్శించగల నిండుకుండ జర్మన్ పౌరుడు. తొణకడు; బెణకడు: ఎంత ప్రధానమైన విషయంమీదనైనా మౌనాన్ని పాటించగలడు. ఫ్రెంచి పౌరుడిలో సహృదయత, సంఘ జీవితాభిలాష ఎక్కువ. ఎంత క్లిష్టసమస్యనైనా అతి తూర్ణంగా అవగాహన చేసుకోడానికి ప్రయత్నిస్తాడు జర్మన్ పౌరుడు. ఫ్రెంచి పౌరుడు అలాకాదు; ఏ విషయాన్నైనా అతి చులకనగా తీసుకుంటాడు. లోతుకు పోక పైపైనే పరిశీలిస్తాడు. ఏ విషయాన్ని అర్థంచేసుకోవలసి వచ్చినప్పటికీ జర్మన్ పౌరుడికి విధిగా కొంత వ్యవధి పడుతుంది. ఫ్రెంచి పౌరుడు సూక్ష్మవిషయాన్ని కూడా చిటికెలో గ్రహించినట్లు కనబడుతాడు.

జర్మన్ ప్రజలు వస్తు దాచుకోరు; కష్టపడి పని చేస్తారు; ఫ్రెంచి ప్రజలకు తెలివితేటలు ఎక్కువ. జర్మన్ ప్రజలు వేళాకోళాన్నీ, చమత్కారాన్నీ సహించలేరు; ఫ్రెంచివారికి చమత్కారం ఉగ్గుపాలతో అబ్బిన విద్య. ఎంత అల్పమైన విషయాన్నైనా జర్మన్ దేశీయుడు విసుగుపుట్టేలా వర్ణిస్తాడు; ఫ్రెంచివారు భాషాకోవిదులనీ, వారి సారస్వత శైలి నిరుపమానమైనట్టిదనీ సమస్త సభ్యతా ప్రపంచానికీ తెలిసిన విషయమే.

ఈవిధంగా జర్మన్, ఫ్రెంచిజాతుల విలక్షణలను గురించి ఎంతైనా చెప్పవచ్చు. ప్రపంచంలో భిన్నమనస్తత్వాలు, విభిన్న జాతీయ లక్షణాలు, జీవిత దృక్పథాలుగల జాతులు అనేకం వున్నవి. ఇంత మాత్రంచేత ఒక జాతి మరొక జాతిపై శాశ్వతంగా కత్తికట్టవలసిన పనిలేదు. కాని జర్మనీ ఫ్రాన్సుల వ్యవహారాలు మాత్రం శత్రుత్వసంబంధాలలోనే సాగుతున్నవి. ఫ్రాన్సు అంటే జర్మనీకి భయం; జర్మనీ అంటే ఫ్రాన్సుకు హడల్. ఈ రెండుదేశాలు పరస్పర శత్రుత్వాన్ని చిరకాలంగా విషవృక్షంలా పెంచి పోషించుకుంటూ వస్తున్నవి.

తరతరాలుగా జర్మనీ సైనికంగా విజృంభిస్తూ వచ్చినమాట నిజమే. జర్మన్ వేదాంతులు, తాత్వికులు యుద్ధాన్ని ప్రస్తుతించి, కీర్తించారు. ఒక జాతి మహోజ్వల ప్రతిభ సాధారణ శాంతిసమయంలో బయటపడదనీ, యుద్ధసమయంలో గాని అది మహోన్నత స్థాయిని అందుకోదనీ హెగల్ మహాశయుడు నిర్వచించాడు. అందుచేత ప్రజలు అనుక్షణం ప్రశాంత మనస్కుల మాదిరిగా కాకుండా ప్రచండోద్వేగుల మాదిరిగా, ప్రమాద ధూయిష్ఠుల మాదిరిగా జీవించడం నేర్చుకోవాలని వారు ప్రబోధించారు. 1939 మొదలు 1945 వరకూ సాగిన ద్వితీయ ప్రపంచసంగ్రామానికి కారణభూతుడైన నాజీనియంత హిట్లర్ సరిగా ఈ నిర్వచనాలనే ఆచరణలో పెట్టి అశేషప్రజానీకానికి ఘోర రక్తపాతాన్ని తెచ్చిపెట్టాడు.

ఐతే, ఒకవిషయం ప్రాంకో—జర్మన్ వ్యవహారాలలో ప్రతిసారీ దండయాత్ర సాగించింది జర్మనీయేననీ, ఫ్రాన్సు నంగనాచి అనీ అభిప్రాయ పడకూడదు. యూరప్‌ఖండంలో ఫ్రాన్సుకూడా ఒక బలీయమైన సైనికరాజ్యమేననీ, ఇతర యూరపియన్ రాజ్యాలకంటే ఎక్కువగానే దండయాత్రలు సాగించిందనీ మరచిపోకూడదు. యూరప్‌లోని ఇతర

రాజ్యాలపై సాగించిన యుద్ధాలమాట అటుంచి ఇప్పటికీ, ఒక్క జర్మనీపైనే ఫ్రాన్సు గత మూడుశతాబ్దాలలో అనేకసార్లు — కొన్ని పర్యాయాలు నిష్కారణంగా కూడా — దురాక్రమణలకు దిగింది. తన భూభాగాలపై ఫ్రాన్సు లెక్కగా ఇరవైసార్లు ముట్టడులు సాగించి యుద్ధానికి దిగిందని బిస్మార్క్ మహాశయుడు తన ప్రసంగాలలో పదేపదే అంటుండేవాడని చరిత్రకారులు చెబుతారు.

ఐక్య జర్మనీ ఏర్పడకుండా దాన్ని ముక్కలు ముక్కలుగా, చెక్కలు చెక్కలుగా వుంచడం మొదటి నుంచీ ఫ్రాన్సు ఏకైకలక్ష్యం. యూరప్‌ఖండ భౌగోళిక వ్యవహారాలు, జాతీయపరిస్థితులు మూడు శతాబ్దాల క్రితం చెల్లాచెదురుగా, చిందరవందరగావున్న రోజులలో ప్రప్రథమంగా ఒకవిధమైన ఐక్యతను, సుస్థిరత్వాన్నీ సాధించిన మొదటిరాజ్యం ఫ్రాన్సు. తన ఐక్యతను భద్రపరుచుకోడానికీ, యూరప్‌ఖండంలో తన మాట చెలామణీని, శక్తిసామర్థ్యాలతో కాపాడుకోడానికి తనతో ఇంచుమించు సరిసమానంగా వర్ధిల్లగల జర్మనీని అనైక్యంగా వుంచడం ఫ్రాన్సుకు అవసరమైంది. 17 వశతాబ్దం పూర్వార్ధంనుంచీకూడా (రిష్లూ హయాంనుంచి) ఫ్రాన్సు జర్మనీపట్ల ఇదేఆట ఆడుతూ వచ్చింది.

ఐతే, ఇక్కడ ఒక విషయాన్ని చెప్పక తప్పదు. జర్మనీని అనైక్యంగా వుంచాలని ఫ్రెంచి రాజకీయవేత్తలు చేసిన ప్రయత్నాలన్నిటిలో, వేసిన పథకాలన్నిటిలో వారు ఆశించిన ఫలితాలకు పూర్తిగా వ్యతిరేకమైన ఫలితాలు ఏర్పడినవన్నదే ఈ విషయం. ఫ్రెంచివారు తరుచూ సాగిస్తూవచ్చిన దండయాత్రల ఫలితంగానే ఐక్య జర్మన్‌జాతి ఆవిర్భవించడం జరిగిందని చెప్పినా చెప్పవచ్చు. అందుచేత జర్మన్ జాతికి ఎవరైనా పితృసమానుడు వుంటే అతడు మొదటి నెపోలియన్ చక్రవర్తేనని చెప్పడం కూడా చరిత్రలో పరిపాటి అయింది. 1813 లో లీప్జిగ్ నగరంలో ఫ్రెంచివారి పరాజయం, జర్మన్ల విజయం జర్మన్‌జాతి విజృంభణకు బీజప్రాయమైంది.

పాతచరిత్రను వదలివేసి గత నలభైఏళ్ళ చరిత్రను చూసినప్పటికీ జర్మను వ్యవహారాలలో ఫ్రాన్సు వైఖరి ఒకేవిధంగా కనిపిస్తుంది. పశ్చిమ జర్మనీ ఆయుధ పునర్ధారణ విషయంలోనూ, దానికి సర్వ స్వతంత్ర ప్రజాస్వామ్య ప్రతిపత్తిని ప్రసాదించడం లోనూ ఇటీవల జరిగిన అంతర్జాతీయ సమావేశాలలో ఫ్రెంచినాయకులు బిడాల్, ప్లెవెన్, మెండెస్ ఫ్రాన్సు ప్రభృతులు ఎంత మొండిపట్టుదలను చూపారో ప్రథమ ప్రపంచ యుద్ధానంతరం అప్పటి ఫ్రెంచి అగ్రనాయకుడు మస్యూర్ క్లెమెన్సో, పాయింకేర్, మార్షల్ ఫాక్ ప్రభృతులు కూడా అంతే పట్టుదలను, మొండిధోరణ్నీ ప్రదర్శించారు. అప్పటి అమెరికా అధ్యక్షుడు కీర్తిశేషుడు విల్సన్ మహాశయుడు ప్రవచించిన పధ్నాలుగు సూత్రాలపై శాంతిస్థాపన జరిగే షరతులమీద యుద్ధవిరమణకు జర్మనీ సమ్మతించింది. ఆచరణలో ఆ సూత్రాలకు క్రమక్రమంగా నీళ్ళు వదలడం జరిగింది. పధ్నాలుగు సూత్రాలపై జర్మనీతో యుద్ధవిరమణ ఒప్పందం చేసుకోవడం ఫ్రెంచి నాయకుడు క్లెమెన్సోకు ఎంతో హాస్యాస్పదంగా కనిపించిందట. "ఏసుప్రభువులాంటివాడు పది సూత్రాలతో తృప్తిపడ్డాడు. జర్మనీతో యుద్ధవిరమణకు పధ్నాలుగు సూత్రాలేమిటి?" అని ఆయన అవహేళన చేశాడని అంటారు.

ఒకవిధంగా చూస్తే జర్మనీని చూస్తే ఫ్రాన్సు ఇంత భయపడడం సహజమే నేమో అనిపిస్తుంది. గత నలభైసంవత్సరాలలో సంభవించిన రెండు ప్రపంచయుద్ధాలలోనూ చివరకు జర్మనీ ఓడిపోవడం సంభవించినప్పటికీ, జర్మనీ ఓటమిని ఒక్క ఫ్రాన్సు మాత్రమే సాధించలేదు. మిగతా ప్రపంచమంతా ఏకమై జర్మనీని ఓడించడం జరిగింది. మరొకసారి జర్మనీ సైనికంగా తనపై విజృంభిస్తే, ఇతరరాజ్యాలన్నీ ఏకమై తనపక్షాన జర్మనీని ప్రతిఘటిస్తవనే నమ్మకం ఏమున్నదని మొదటి ప్రపంచయుద్ధానంతరం ఫ్రాన్సు విపరీతంగా భయపడ్డది. దాదాపు ఐదుసంవత్సరాల పాటుసాగిన తొలి ప్రపంచయుద్ధమంతా అమెరికన్ భూభాగంమీదగాని, బ్రిటిష్ భూభాగంమీదగాని గాక, ఫ్రెంచి భూభాగంమీదే ఎక్కువగా సాగింది. అందుచేత మిగతా రాజ్యాలకంటే ఫ్రాన్సుకు సంభవించిన నష్టం అపారం. జర్మనీ శక్తిహీనంగా వుండాలని ఫ్రాన్సు కోరిందంటే ఆశ్చర్యంలేదు.

చరిత్రకు పునరావృత్తిదోషం వున్నదంటారు పెద్దలు. ద్వితీయ ప్రపంచసంగ్రామం సమాప్తమై

తొమ్మిదిసంవత్సరాలు నిండి పదోసంవత్సరం జరుగుతున్నది. యుద్ధసమాప్తదశలో ఏర్పడిన ప్రత్యేక పరిస్థితులఫలితంగా పశ్చిమజర్మనీని బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికాలు, తూర్పు జర్మనీని సోవియెట్ రష్యా ఆక్రమించడం జరిగింది. అభాగ్య జర్మనీ, ఆక్రమణాధికారంవహిస్తున్న అగ్రరాజ్యాల అహమహమిక క్రింద పదేళ్లనుంచీ నలిగిపోతూ వచ్చింది. మొత్తం జర్మనీలో మూడింట రెండువంతులభూభాగం పశ్చిమ రాజ్యాలక్రింద, ఒకవంతు రష్యాక్రింద వుండిపోయినవి. పశ్చిమ జర్మనీ జనాభా దాదాపు 5 కోట్లువుంటే, తూర్పు జర్మనీ జనాభా రెండుకోట్లవరకూ వున్నది. తన అధీనంలోవున్న తూర్పు జర్మన్లకు రష్యా కమ్యూనిస్టు సిద్ధాంతాలను నూరిపోసింది. ఆరు, 36 సంవత్సరాలమధ్య వయస్సుగల పిల్లలను, యువకులను అందరినీ స్వతంత్రి యువజనోద్యమంలో సభ్యులుగా చేర్పించింది. అర్ధసైనికాధికారంతో వ్యవహరించే ప్రజా పోలీసుదళాలను సైతం రష్యా నిర్మించింది. మాజీనాజీ అధికారులయాజమాన్యన 'జాగృతి సంఘాలను' స్థాపించింది.

పశ్చిమ యూరప్‌లో కమ్యూనిజం వ్యాప్తిని ఎదుర్కోడానికి పశ్చిమ అగ్రరాజ్యాలు ఇతర యూరపియన్ రాజ్యాల సహకారంతో సమిష్టి రక్షణ వ్యవస్థాస్థాపనకు పూనుకొని పనిచేసినవి. దానిఫలితమే ఉత్తర అట్లాంటిక్ రక్షణవ్యవస్థ. ఈ వ్యవస్థలో పశ్చిమ జర్మనీకికూడా స్థానమిచ్చి దానిద్వారా 12 జర్మన్ సైనికదళాలను చేర్చాలని బ్రిటన్ అమెరికాలపథకం. ఈ పథకాన్ని ఆచరణలో పెట్టాలంటే అడుగడుగునా ఫ్రెంచి ప్రాతికూల్యాన్ని నిన్న మొన్నటివరకూ ఎదుర్కోనవలసి వచ్చింది.

సరిగా నాల్గు సంవత్సరాల క్రితం 1950 అక్టోబరులో అప్పటి ఫ్రెంచి ప్రధాని ప్లీవెన్ తన పార్లమెంటులో యూరపియన్ రక్షణ వ్యవస్థ నిర్మాణానికి ఒక పథకాన్ని ప్రవేశపెట్టాడు. తర్వాత ఐదు నెలలకు 1951 ఫిబ్రవరిలో బెల్జియం, హాలెండు, లక్సెంబర్గ్, ఫ్రాన్సు పశ్చిమ జర్మనీల ప్రతినిధులు పారిస్‌లో సమావేశమై ఆ పథకం మంచి చెడ్డలను పరిశీలించారు. ఆ పిమ్మట 1952 మే 27. న యూరపియన్ రక్షణ వ్యవస (ఇదే ఇ. డి. సి.—యూరపియన్ డిఫెన్స కమ్యూనిటీ) ఒప్పందంపై ఆ ఆరు రాజ్యాల విదేశాంగ మంత్రులు సంతకాలు చేసుకున్నారు. ఈ ఆరు రాజ్యాలలో ఏ ఒకదానిపై దండయాత్ర జరిగినా ఆరు రాజ్యాలమీద జరిగినట్లే భావించాలన్నది ఆ ఒప్పందంలోని ప్రధానాంశం. ఫ్రాన్సుఒప్పందంపై సంతకమైతే చేసిందిగాని, జర్మనీ అంటే తమకున్న భయాందోళనల కారణంచేత, అతి తరుచుగా మనస్సు మార్చుకొని మాటతప్పడం ప్రారంభించింది. బొగ్గు, ఇనుము పుష్కలంగా లభ్యమయే సార్ మండలం భవిష్యత్తును జర్మనీతో ముందు తేల్చుకోవాలని ఫ్రాన్సు పట్టుపట్టింది. సార్ మండలం తమదే నని ఫ్రాన్సు, కాదు తమదని జర్మనీ కీచులాడుకోవడం మొదలుపెట్టినవి. సార్ సంగతి తేలిస్తేనేగాని యూరప్ రక్షణ వ్యవస్థను తాము ధృవపరిచేదిలేదని అప్పటి ఫ్రెంచి విదేశాంగ మంత్రి జార్జిబిడాల్ట్ ఫ్రెంచి ఎగువ సభలో ఖండితంగా ప్రకటించివేశాడు. ఫ్రాన్సు జర్మనీలు తమ స్పర్థలుమాని సామరస్యంతో భాగస్వాముల వలె మెలగాలని బ్రిటిష్ ప్రధాని చర్చిల్ ఎంత లాలన చేసినా, అమెరికన్ సహాయం బంద్ అవుతుందని అమెరికా విదేశాంగమంత్రి జాన్ ఫాస్టర్ డల్లెస్ ఎంత తీవ్రమైన హెచ్చరిక చేసినా చివరకు మొన్న ఆగస్టు నెలలో యూరప్‌రక్షణవ్యవస్థపై ఫ్రాన్సు అనుకున్నంత పనీ చేసింది. ఆ వ్యవస్థ ఒప్పందాన్ని ధృవపరచడానికి ఫ్రెంచి పార్లమెంటు దిగువసభ నిరాకరించింది. యూరప్ రక్షణ వ్యవస్థ మృతప్రాయం కావడంతో ఫ్రెంచి ప్రధాని మెండెస్‌పని అస్తవ్యస్తంగా మారింది. యూరప్ రక్షణకు బ్రిటన్ అమెరికా, కెనడాలు వేసిన పథకం తారుమారైపోయింది. ఉత్తర అట్లాంటిక్ రక్షణ శ్రేణిలో పెద్ద గండి కొట్టినట్లయింది. పశ్చిమ జర్మనీ సప్లయిచేసే 12 సైనికదళాలు లేకపోతే, కమ్యూనిజంపై ధ్వజమెత్తడానికి సాగిస్తున్న వ్యూహరచనలో పశ్చిమ అగ్రరాజ్యాల ఆట కట్టినట్లే.

ఈ ప్రమాదాన్ని గమనించే ఫ్రాన్సును లొంగదీయడానికీ, యూరప్ రక్షణవ్యవస్థ స్థానే ప్రత్యామ్నాయ వ్యవస్థను అన్వేషించడానికి మొన్న అక్టోబరు నెల ప్రారంభంలో బ్రిటిష్ విదేశాంగమంత్రి

ఆంథోనీ ఈడెన్ తొమ్మిదిరాజ్యాల సమావేశాన్ని ఏర్పాటుచేశాడు. ఆంథోనీఈడెనే ఆ సభకు అధ్యక్షత వహించి కార్యక్రమాన్ని జయప్రదంగా నిర్వహించాడు. పశ్చిమ జర్మనీని సైనికంగా పునరుద్ధరించడానికీ, దానిపై మూడు అగ్రరాజ్యాల ఆక్రమణాధికారాలను రద్దుచేయడానికీ ఈ సభలో ఒప్పందం కుదిరింది. పశ్చిమ యూరప్ సమాఖ్యలోనూ, తద్వారా ఉత్తర అట్లాంటిక్ వ్యవస్థలోనూ పశ్చిమ జర్మనీకీ, దానితోపాటు ఇటలీకీ కూడా సభ్యత్వం లభ్యమైంది. యూరపియన్ స్వతంత్రరాజ్య శ్రేణిలో పశ్చిమజర్మనీకి తిరిగి పదేళ్లకు పిలవుగా ఈనాటికి సర్వస్వతంత్ర ప్రజాస్వామ్య ప్రతిపత్తి ఏర్పడుతున్నదన్నమాట. చివరవరకూ పేచీలు పెడుతూ వచ్చిన ఫ్రాన్సుకూడా లొంగివచ్చి ఈ ఒప్పందాలకు సమ్మతించింది. ప్రధాని మెండెస్ ఫ్రాన్సుపై తన విశ్వాసాన్ని ప్రకటించడంద్వారా ఫ్రెంచి పార్లమెంటుకూడా వీటిని ధృవపరిచింది. యూరప్ రక్షణవిషయంలో లోగడ జరిగిన బ్రస్సెల్స్ ఒప్పందం అమలులోవుండే 50 ఏళ్లపర్యంతం (మితిమీరిన ఇతర అవసరాలేవీ రాకపోతే) యూరప్ ఖండంలో నాల్గు సైనికదళాలను, కొంత విమాన బలాన్ని వుంచడానికి బ్రిటన్ హామీ ఇచ్చింది. ఈ బ్రస్సెల్స్ ఒప్పందం 1998 వరకూ అమలులో వుంటుంది. బ్రిటిష్ ప్రభుత్వం ఇచ్చిన ఈ హామీ ఫ్రాన్సుతో సహా మిగతా అన్ని యూరపియన్ రాజ్యాలకు విశేష సంతృప్తినీ, ధైర్యాన్నీ కలిగించింది.

ఈవిధంగా సైనికంగా పునర్జన్మ ఎత్తుతున్న జర్మనీ తూర్పు పశ్చిమజర్మనీలుగా విభక్తమయ్యే వుంటుందో లేక ఏకమవుతుందో చూడాలి. జర్మనీ ఏకీకరణవిషయంలో రష్యాతో అవసరమైన సంప్రదింపులు జరపడానికీ పశ్చిమ బెర్లిన్‌పైమాత్రం పశ్చిమ అగ్రరాజ్యాలే ఆధ్వర్యం వహించాలనే షరతుకు కూడా లండన్, పారిస్ సమావేశాలలో ఒప్పందం కుదిరింది. సమితిలో భారతప్రతినిధి శ్రీ వి. కె. కృష్ణమీనన్ సూచనప్రకారం తూర్పు పశ్చిమ జర్మనుల మధ్య ముఖాముఖి చర్చలు జరిగితే, అచిరకాలంలో నే జర్మనీ ఏకీకరణసైతం సాధ్యపడవచ్చు.

* పులిసిద్దప్ప భార్య *

శ్రీ కె. ఎ. ఎస్. రావు

★ ★ అఖిల భారత పోటీలో తృతీయ బహుమతి నందిన కథ; శ్రీ కె. ఎ. ఎస్. రావుగారు ఈ కథను కన్నడభాషలో రచించి పోటీలో పాల్గొన్నారు. కన్నడభాష పోటీలో ఈ కథకు ప్రథమ బహుమతి (రు. 175 లు) వచ్చింది. అఖిల భారతపోటీలో లభించిన బహుమతి రు. 750 లు.

రావుగారి వయస్సు 42 సం॥ లు; కాశీ హిందూ విశ్వవిద్యాలయంలో, ఎంజినీరింగ్ శాఖలో రీడరుగా పనిచేస్తున్నారు. వీరు కన్నడ సాహిత్యంలో 12 సంవత్సరాలుగా నిర్విరామంగా కృషిచేస్తున్నారు. ఇంతవరకు మూడు నవలలు, మూడు నాటకాలూ, ఆరు ఏకాంకికలు, 70 కథలూ, 8 హాస్య రచనలు, అనేక ఖండకావ్యాలూ, ఒక ప్రబంధం రచించారు. అనేక పోటీలలో పాల్గొని బహుమతులు పొందారు. క్రిందటితూరి జరిగిన ప్రపంచ కథానికల పోటీలోకూడా కన్నడభాషలో 'గంగు' అనే వీరి కథకు ప్రథమ బహుమతి వచ్చింది. కాని నిర్ణీతసమయానికి ముందుగానే ఆ కథ ప్రచురింపబడటంచేత జాతీయ పోటీకి అంగీకరింపబడలేదు. ★ ★

గజదొంగ పులిసిద్దప్ప హోస్‌దుర్గ్ తాలూకాలో నేగాక చిత్రదుర్గ్ జిల్లాజిల్లా పేరు మోగాడు. ఒకసారి హోస్‌దుర్గ్ కొండల మధ్య నుంచి పోతుండగా ఒక పెద్దపులి అతనికి తారసిల్లింది. సిద్దప్ప అమాంతం దానిమీద విరుచుకుపడి దాన్ని గొంతుపిసికి చంపేశాడు. అప్పటినుంచీ అతన్ని పులిసిద్దప్ప అనటం మామూలైంది. ఆ ప్రాంతంలో ప్రతి ప్రాణికీ అతని పేరువింటే సింహస్వప్నం. గుసగుసలాడుకోవలసిందే తప్ప ఎవ్వరూ అతన్నిగురించి మాట్లాడుకోరు. మనం చిన్నపిల్లల్ని భయపెట్టాలంటే అదుగో బూచాడొస్తున్నాడు పడుకోమంటాం. అక్కడి తల్లులు అదుగో పులిసిద్దప్ప వచ్చేస్తున్నాడని భయపెడతారు. వాడు చెయ్యని దుండగాలు లేవు; గ్రామాలకు గ్రామాలు తగలబెట్టాడు; ఎందరో స్త్రీలను మానభంగం చేశాడు; ఎన్ని దోపిడీలు చేశాడో, ఎన్ని హత్యలు చేశాడో లెక్కలేదు. అతని కంటబడ్డ తరవాత బ్రతికి బయటబడ్డవాడొక్కడూ లేదు. రహస్యంగానైనా సరే వాణ్ని గురించి పల్లెత్తుమాట రెవడేనా నోరుజారాడంటే వాడు వచ్చాడన్నమాటే. ఇంత చేస్తున్నా వాణ్ణి పట్టుకున్నవాడెవడూ లేడు. వాడంటే అలాంటి హడలనుకుందామా? లేక పోలీసుల్ని కట్టుకున్నాడేమో ననుకుందామా?

ఉన్నట్టుండి ఒక ప్రభుత్వోద్యోగిని హత్య చేశాడు. అధికారులంతా కూర్చుని ఆలోచించారు. సబ్‌ఇన్‌స్పెక్టర్ భీమారావును హోస్‌దుర్గ్‌కు పంపించారు. భీమారావు చాలా దురుకైనవాడు, నిప్పులాంటి మనిషి. ఇంతేగాదు: సిద్దప్పని పట్టితెచ్చిన వారికిగాని పట్టుకోటానికి తగిన ఆచూకీ యిచ్చిన

వారికి గాని ఇరవై వేల రూపాయల బహుమతి నిస్తామని ప్రభుత్వంవారు ప్రకటించారు.


సిద్దప్పను పట్టుకోవటానికి రెండు సంవత్సరాల పాటు, భీమారావు నానా తిప్పలూ పడ్డాడు. లాభం లేకపోయింది. డబ్బుమీది ఆశతో, సిద్దప్పను పట్టి యిచ్చే ప్రయత్నంలో యిద్దరు అభాగ్యులు ఇప్పటికే హతమారిపోయారు. ఇక ఆ బహుమతికోసం ప్రయత్నించినవాడు మరొకడెవడూ లేడు. భీమారావుకు కూడా క్రమేపీ నరాలు సడలిపోతున్నయ్; ఆత్మవిశ్వాసం సన్నగిలిపోతోంది. ఏ ప్రయత్నాని కుపక్రమించినా దగాపడి అష్టకష్టాల్లో చిక్కుకోవడం మినహా లవలేశమైనా ప్రయోజనం కనుపించటం లేదు. ప్రజలకు అంతకుముందే హడలు, అతని కేపాటి సహాయం చేసినా కొంప మునిగిపోతుందనే ఉద్దేశం; పిలిచినా పలకరు. సానుభూతి లేకపోగా పరాభవ పరంపరలతో అపహాస్యపాత్రుడౌతున్నాడు. వీటన్నిటినీ తలదన్ని, అతన్ని బదిలీ చేసి వేస్తారని కూడా పుకారు బయలుదేరింది.

ఈవార్త ఆదిలో అతనికి కొంత నిరుత్సాహాన్ని కలిగించినా, అతనిలోని పౌరుషాన్ని రెచ్చగొట్టి కార్యదీక్షను యినుమడింపజేసింది. ట్రాన్సుఫర్ ఆర్డర్ వచ్చేలోగా ఎలాగైనాసరే సిద్దణ్ణి పట్టితీరాలని కంకణం కట్టుకున్నాడు. ప్రాణానికి తెగించైనా పోరాడాలనుకున్నాడు.

ఇలాటి దాడులు లోగడ ఎన్నో చేశాడు. సిద్దప్ప యేదో ఒక యింట్లోకో పొలంలోకో మరో సంకేత స్థలంలోకో వస్తున్నాడని అనుమానించటం, తీరా పరివారంతో పోయి ఆ ప్రదేశాన్ని ముట్టడించితే, వాడు ఏ కాపలామనిషిగానో, ఏ మామూలు సన్న రకం దొంగగానో తేలటం—ఇదీ తంతు.

ఇలా ఉండగా ఒకనాటి ఉదయం, ఉన్నట్టుండి అతనికి ఒక కబురొచ్చింది.

ఆ క్రితంరాత్రి సిద్దడు, రామగిరిపట్నం పొలిమేరలో వున్న ఒక సారా దుకాణంలోకి వచ్చినట్టు తెలిసింది. సిద్దడులోపలికివచ్చేసరికి దుకాణదారుభార్య ఒకర్తేవుంది; సిద్దణ్ణి గుర్తుబట్టి హడిలి మూర్ఛపోయింది. సిద్దడు బుడ్డిమీద బుడ్డి ఇష్టం వచ్చినట్టు తాగేస్తున్నాడు. ఇంతలో దుకాణదారు ఎక్కణ్ణుంచో లోపలికొచ్చాడు. సిద్దడు ఆ వచ్చినవాణ్ణి అమాంతం నోట్లో గుడ్డలు కుక్కి కాళ్ళూ చేతులూ కట్టిపడేశాడు. ఒక సారా సీసా ఎత్తి మూర్ఛపడున్న దాని ముఖాన గుమ్మరించాడు. దానికి కాస్త తెలివొచ్చి



రచయిత

కన్ను విప్పింది.—గల్లాపెట్టె దంకనెట్టుకుని సిద్దడు గడపదాటుతున్నాడు. పోతూ పోతూ వెనక్కి తిరిగి 'ఇదిగో! నేను వచ్చెళ్లినట్టు ఎక్కడన్నా నోరు మెదిపావో చచ్చావన్నమాటే! ఈలంటే రేపే మళ్ళీ వస్తాను' అని దబాయించి మరీ పోయాడు.

నిజంగా ఇదంతా బయటికి పొక్కేదే గాదు. కర్మంచాలక ఒకతె నెవరో లోపలికి వచ్చి దుకాణదారు కట్టిపడేసివుండటం చూసి గల్లంతు చేశాడు. ఆ వూరి హెడ్ కానిస్టేబులు హనుమంతు కొంచెం ధైర్యం చేసి, తనకు నమ్మకమున్న కానిస్టేబుల్ కు ఒకడికి బిచ్చగాడివేషం వేసి భీమారావుదగ్గిరికి పంపాడు. భీమారావు తన దళాన్ని తీసుకుని మధ్యాహ్నానికల్లా ఆ ప్రాంతానికి వెళ్లాడు. పొద్దుగూకేదాకా కొండల్లో దాక్కున్నాడు. చీకటిబడ్డాక సారాదుకాణం దగ్గిరికి చేరి చాటునుండి తెల్లవార్లూ కాపలా గాశాడు. ఝల్లున తెల్లారిపోయింది. సిద్దడు మాత్రం ఎక్కడా పత్తా లేడు. ఇల్లాంటి 'టొంకి'లు భీమారావు లోగడ ఎన్నోసార్లు తిన్నాడు. కాళ్ళీడ్చుకుంటూ ఇంటికి తిరిగివచ్చాడు.

ఆ మర్నాడు మధ్యాహ్నం మరో చిత్రం జరిగింది. ఒక బండివాడు భీమారావు దగ్గిరికొచ్చాడు. అప్పుడే యేదో భూతాన్ని చూసివచ్చినవాడిలావుంది

వాడి వాలకం. కాళ్ళింకా గజగజా ఒణుకుతూనే వున్నయ్. రెండురోజుల క్రితం వాడు వేరుశెనక్కాయబండి తోలుకొని ధావనగిరికి వెళ్ళి రాత్రి వేళ యింటికి తిరిగొస్తున్నాడు. మధ్య దోవలో సిద్దడు బండిని అటకాయించి ఆపివేశాడు. బండిలో ఎక్కి కూర్చుని, మళ్ళీ వెనక్కు తిప్పి ధావనగిరికి తోలమన్నాడు. అఘమేఘాలమీద పోవాలన్నాడు. ఎద్దులు రొమ్ములు గరిసెలు పడేటట్టు తెల్లవార్లూ పరుగెత్తుతూనే వున్నయ్. బండి తోలుతున్నంతసేపూ సిద్దడి బాకు బండివాడి వెన్నుమీదే వుంది. తూరుపు తెలతెలవారుతూన్న దనగా బండి తూలహాంసి ప్రాంతాన్ని చేరుకుంది. సిద్దడు బండి ఆపమన్నాడు. బండివాడి బొడ్లో వున్న డబ్బా దస్కం యావత్తూ దబాయించి లాక్కున్నాడు; పక్కనున్న చేలోకి అదృశ్యమైపోయాడు.

మళ్ళా పక్షంరోజులు భీమారావు సిద్దడికోసం నలుముఖాలా గాలించి నిరాశ చేసుకుని యింటికి తిరిగొచ్చాడు. ఇంటి కొచ్చేసరికి ట్రాన్సుఫర్ ఆర్డర్ వచ్చి సిద్ధంగా వుంది. నెలాఖరుకు చార్జీ ఒప్పగించివెయ్యాలి. ఇక తనకున్న గడువల్లా రెండు వారాలు. 'అవును ఇక గత్యంతరం లేదు'—భీమారావుకు రెండు రోజులు కంటి మీద కునుకుబట్టలేదు. మూడోనాడు మళ్ళీ ఒక కొత్తవార్త! సిద్దడు తన ముఠాను వెంటేసుకొచ్చి హోస్‌దుర్గ్ రైలుస్టేషను ప్రాంతంలో బళ్లను అటకాయించాడు. తుపాకులు పేల్చి జనాన్ని హడల గొట్టాడు. బళ్లల్లో వున్న వాళ్ళందర్నీ చావా చితకామోది, వల్లపూసలు మిగలకుండా దోచుకుపోయాడు. అప్పటికే హతాశుడై ధైర్యసాహసాలు కోల్పోయి వున్న భీమారావు, ఆ విషయం విచారించటానికి తన క్రింది ఉద్యోగిని పంపి చార్జీ ఒప్పగింత చేయటానికి కాయితాలు సిద్ధం చేసుకుంటున్నాడు.

2

కల్లోడ్ దేవాలయ తిరునాళ్ల సంత ప్రారంభమై అప్పటికి రెండురోజులైంది. కల్లోడ్ క్షేత్రం, వేదవతి వొడ్డున హోస్‌దుర్గ్‌కు అనతిదూరంలో వుంది. తిరుణాళ్ళలో అక్కడ బ్రహ్మాండమైన సంత జరుగుతుంది. తొగుడూ, జూదం అనంతంగా సాగిపోతూ వుంటుంది. కొట్లాట లేవీ జరక్కుండా చూడటానికీ, లైసెన్సులేని జూదశాలలు నడిపేవాళ్లను అరెస్టు చేయటానికీ పోలీసులు అక్కడికి వెళ్లే మామూలు. భీమారావు తన సిబ్బందితో అక్కడికి వెళ్ళాడు.

భీమారావు ఆ సంతలో పలుమారులా కలియ తిరుగుతున్నాడు. మొదటిరోజు మామూలుగా నే గడచిపోయింది. రెండోనాడు తన డేరాలో కూర్చుని తన పరాజయాన్ని తలుచుకుని మననగా ఆలోచిస్తున్నాడు. హఠాత్తుగా తలయెత్తి చూచేసరికి సుపరిచితమైన ముఖం ఒకటి కంటబడ్డది.

భీమారావు డేరాకు యెదురుగుండా ఒక బటల దుకాణం వుంది. ఆ దుకాణందగ్గిర గుడ్డలు బేరం చేస్తూ చిన్ని కనపించింది. చిన్ని పులిసిద్దప్ప భార్య. భీమారావు అదివరకు దాన్ని చాలాసార్లు చూచాడు గాని, ఇంత పరీక్షగా దాన్ని యెప్పుడూ అజబట్ట లేదు. చిన్ని చూపరి — అందగత్తె అనే చెప్పాలి. ఇరవై సంవత్సరాలవయస్సులో మంచి హుమ్మస్సులో వుంది; సొంకంగా బలమైనమనిషి. చామనచాయ గాని స్ఫురద్రూపి. నిగనిగలాడుతూ చారడేసికళ్లు; లేడిలా చకచకా యిటూ అటూ చూస్తూ వుంటుంది. నల్లటి జుట్టు నున్నగా దువ్వి ముద్పటముడి వేసుకుంది. రకరకం ఆభరణాలేవో వొంటినిండా వున్నయ్. సిద్దప్పకు అదంటే ఎంతకంత ప్రాణమో భీమారావుకు అర్థమైంది. అవకాశం దొరికినప్పుడల్లా సిద్దప్ప భార్యదగ్గరికి వచ్చిపోతూ వుంటాడు. ఇక చిన్ని సంగతి చెప్పనే అక్కర్లేదు వాడంటే పంచప్రాణాలూ విడిచేస్తుంది. వాళ్ళిద్దరికీ ఆదిలో బళ్లాల సముద్రమే. సిద్దప్ప పులిని గొంతుపిసికి చంపాడని విన్నవాటినుంచీ దానికి వాడంటే మోజుపుట్టింది. డబ్బున్న కుటుంబాల యువకులే చాలా మంది చిన్నిని పెళ్ళిచేసుకుంటామని వచ్చారు. చిన్ని ససేమిరా వొప్పుకోలేదు. సిద్దప్పని తప్ప మరొకణ్ని వర్ణీ చేసుకోనని భీష్మించుకు కూర్చుంది. అప్పటికే సిద్దప్ప ఒకటిరెండు చిన్నచిన్న నేరాలు చేసినట్టు పుకారు వుంది. కాని చిన్ని దీన్ని లెక్కచెయ్యలేదు. తల్లి దండ్రులు బలవంతాన మరొకడికిచ్చి పెళ్ళిచెయ్యటానికి ప్రయత్నించారు. చిన్ని అమాంతం సిద్దప్పతో లేచిపోయింది. అప్పటినుంచీ వాళ్ళిద్దరూ కాళ్కేరీలో వుంటూవచ్చారు. తరువాత తరువాత, సిద్దడిమీద పోలీసునిఘా హెచ్చైనతరువాత, ఒంటరి బ్రతుకే బ్రతకాలిసి వచ్చింది. కాని సిద్దడు ఎప్పటికప్పుడు దాని యోగక్షేమాలు కనుక్కుంటూ, దానికి కావలసిన యేర్పాట్లన్నీ చేస్తూ వెళుతుంటాడు. దాన్ని గురించి మాట్లాడినప్పుడల్లా సిద్దడు 'నా రాణీ'

అంటూ వుంటాడు. దానికి ఏ విషయం లోనూ ఏ కొరతా లేదు—నగలూ నాణాలూ, గుడ్డా గుడుసు ఏది కావలసివస్తే అది తెచ్చి పారేస్తూ వుంటాడు. వాడిది నిలకడలేని మనసు గనుక యిక్కడా అక్కడా పైతిరుగుళ్లు తిరిగినా, చిన్నమ్మ మాత్రం వాడికి హృదయాధిదేవత. చిన్న వాడికి ఎప్పటికప్పుడు ఆమాకీలిస్తూ సాయపడుతూ వుంటుందనికూడా అంటారు. వాణ్ణిగురించి ఎక్కడా గొప్పలు చెప్పుకోవటం కూడా మానేసింది.

ఎక్కడన్నా ఒక దోపిడీ జరిగిందంటే, అనంతరం ఒకటె రెండు రోజుల్లో ఏ ప్రమాదమూ లేదని తోస్తే సిద్ధడు దానింటికి వస్తాడని భీమారావుకు తెలుసు.

భీమారావు మళ్ళా తలెత్తి చిన్నవంక చూశాడు. అది బేరం పూర్తిచేసుకుని బయలుదేరి పోతోంది. భీమారావు మఫ్టీలో వున్న ఒక కనిస్టేబుల్‌ను పిలిచాడు "అదుగో సిద్దప్ప పెళ్ళాం, చిన్నమ్మ. నేను దాంతో ఒకమాట మాట్లాడాలను కుంటున్నానని చెప్పి తీసుకురా. దేవాలయం వెనక వున్న చింతచెట్టుక్రింద వుంటాను" అని చెప్పి పంపించాడు.

చిన్నమ్మ, మొత్తానికి కొంత జంకుతూనే అక్కడికి వచ్చింది.

భీమారావు చింతచెట్టు మొదట్లో వేరుమీద కూర్చున్నాడు. చిన్నమ్మనుకూడా తన కెదురుగా అలా గడ్డిమీద కూర్చోమన్నాడు. 'చిన్నమ్మా! నేను లోగడ నిన్ను చాలాసార్లు చూశానుగాని ఎప్పుడూ ఎక్కువగా మాట్లాడలేదు. ఇప్పుడు ఎలాగూ నేను ట్రాన్స్‌ఫరై వెళ్ళిపోతున్నాను గనక కొంచెం నీతో మాట్లాడాలనుకున్నాను' అన్నాడు.

'ఏంటి దొరా?'—

ఎలా ఉపక్రమించాలో భీమారావుకు పాలు పోలేదు. దాని ముఖంలోకి చూడటం మానేసి, తల వంచుకుని, ఆ సంతనిగురించీ దాన్నిగురించీ యీ పిచ్చి మాటా ఆ పిచ్చిమాటా కొంచెంసేపు మాట్లాడాడు. ఒకక్షణానికి విషయం మార్చి దాని గత చరిత్రను గురించిన భోగట్టా అడిగి చెప్పించాడు. క్రమంగా ప్రసంగం దాని వర్తమాన జీవితందాకా వచ్చింది. 'చిన్నమ్మా! ఇటు చూడు!' అని అందుకు న్నాడు, 'నే నొకమాట చెబుతాను, నన్ను అపార్థం చేసుకోబోకు. నువ్వు వాడి భార్యవు—నీకు తెలియం దేమీ లేదు—ఈ పది పన్నెండేళ్ళలోనూ వాడు ఎంతమందిని హింసలు పెట్టాడో నీకు తెలుసు—ఇది ధర్మమేనా—నువ్వు చెప్పు?'

'అయ్యన్నీ నాకేం తెలుసు దొరా?'

'నీకు తెలీదనబోకు—ఇందులో నీకు తెలియం దేముంది?-సిద్దప్ప ఏమేమి ఘోరకృత్యాలు చేశాడో యీప్రాంతంలో కళ్లు తెరవని పసిపిల్లలకు కూడా తెలుసు. అలా నాకేమీ తెలియదనబోకు చిట్టితల్లీ! ఇందులో నీకు తెలియం దేమిటి?—మొన్నను ఆ గ్రామం గ్రామం అలా తగుల బెట్టిపారేశాడే—నీకు తెలియదా?' భీమారావు అతిజాగ్రత్తగా సిద్దప్ప కిరాత కృత్యాల నన్నిటినీ ఒకటొకటే ఏకరువు పెడుతు న్నాడు. వింటున్నది గాని ఎక్కడా చలనంలేదు—స్తబ్దులా కూర్చుని వింటున్నది.

'ఇంతే కాదు ఇంకా అనేకం చేశాడు. ఎలాంటి ఘోర కృత్యాలు! అవన్నీ వింటే నీ గుండెలు తరు క్కుపోతాయి. పసికందులను బాకులతో పొడి చాడు—హత్యచేశాడు. ఎందరో ఆడవాళ్లని మాన భంగం చేశాడు—తీరా సాదా అనే విచక్షణ కూడా లేకుండా ఉన్నవాళ్లనీ లేనివాళ్లనీ అందర్నీ దోచాడు. ఎంతమంది ఉసూరున ఏడిచారు—ఆ ఉసురంతా తగల కుండా వుంటుందా—ఈ దురాగతమంతా దేనికి? ఈ ఘోరకృత్యాలన్నీ దేనికి. ఈ..."

చిన్నమ్మ మౌనంగా కూర్చుని వింటోంది. ఇదంతా నాకేం తెలుసునని ఈ పర్యాయం మళ్ళీ అనలేదు.

'నువ్వే ఆలోచించు—అల్లాంటివాణ్ని సరిదిద్ది మార్గాన పెట్టడం తప్పా? పిల్లా జల్లను ఈ హింసా కాండలోనుంచి బయట పడెయ్యకూడదా?'

'అవును దొరా! అందుకోసం చెయ్యాలిసిం దంతా మీరూ సేసేరు—లోగ దుండెల్లిన దొరలూ కానాకానా సేసేరు' అంది.

ఈ మాటలు భీమారావు గుండెల్లో బాకుల్లా పొడుచుకున్నయ్. అది తన్ను హేళన చేస్తోందా? ఏదీ నిర్ణయంగా తెలుసుకోలేకపోయాడు. కాని ఆమాటల్ని లెక్క చేయలేదు.

'నువ్వన్నట్టు మేవు కొంత ప్రయత్నం చేశాం—మేమంటే ప్రభుత్వం కొంత ప్రయత్నం చేసింది. కాని నేను నీయెదుట మర్మం విడిచి చెప్పేస్తున్నాను విను—మేము ఏమీ చెయ్యలేకపోయాం — నేను

ఓడిపోయావని ఒప్పేసుకుంటున్నాను. కాని ప్రతి పనీ ప్రభుత్వమే చెయ్యాలంటే సాధ్యంకాదు. ప్రజల సాయం లేకపోతే ప్రభుత్వం దమ్మిడీకి కొరగాదు— ఆ ప్రజల్లో నువ్వుకూడా ఒకదానివి — నువ్వుకూడా...'

'నా మొహం, నేం జేసేదేవిటి సామీ — ఆడదాన్ని!—అడు నామాటింటాడా?'

'ఎందుకు వినడు! — నువ్వు వాడిభార్యవి — నువ్వు చెపితే వినకేం జేస్తాడు.'

'ఎందుకొచ్చిన మాటలే దొరా!—ఏ మొగాడు ఏ ఆడదానిమాటింటావుండాడు!'—

అది నిజమే మాట్టాడుతోందో, తన్ను వేళాకోళమే ఆడుతోందో, లేక బుకాయించుతున్నదో భీమారావుకు అంతుచిక్కలేదు. మళ్లా మెత్తదిగా ఆరంభించాడు. 'అలా అనబోకు తల్లీ! ఒకసారి మంచేదో చెడేదో నీకు తెలిసినతరువాత, నువ్వు చెయ్యగల ప్రయత్నమంతా చేసి న్యాయం జరిగేలా చూడాలి'—

'దొరా!—నాకు తెలీక అడుగుతావుండా గానండీ—మడిసిని మడిసే పీక్కుతిని బతికే ఈ లోకంలో న్యాయం అన్యాయం చెప్పే వాడు దెవుడు బాబూ!'

'అబ్బెబ్బే! అలా...అలా ఆలోచించకూడదు తల్లీ! అపకారము నేటి యెవరికి జరిగినా అది నేరమే, అలాంటివాటిని అరికట్టడానికే, ఈ సంఘమర్యాదలూ, ఈ న్యాయస్థానాలూ, ఈ ప్రభుత్వాలూ, యివన్నీ వున్నయ్.'

'అసుమంటి మాటలు నాకెందుకు చెబుతావు తెగుండి—అయన్నీ బలం లేనోళ్ళు బలంగలోళ్ళని, వల్లో యేసుకు చెందుకు పన్నిన పన్నాగాలు'—

దానిమాటలువింటుంటే భీమారావుకు కచ్చికక్క పుట్టుకొస్తోంది. కాని తమాయించుకు మాట్టాడుతున్నాడు:

'నువ్వు పొరపాటు పడుతున్నావ్ చిన్నమ్మా! మనవంతా మనుషులం; అందరూ చల్లగా బతకాలిసిందే. అవతలవాడికికూడా బతకాలనే ఆశా బాగుపడాలనే ఆశా వుంటుందిగదా మన కున్నట్టుగానే.'

'అవునుగానీ - ఒక్కమాటడుగుతాను చెప్పండి —బతికటానికి దమ్ముల్లేని రొండవలు—బతక్కపోతే యేవీ? అంటా'—

'ఆసి నీ యిల్లు బంగారంగానూ!—ఇట్లాంటి మాటలు నీ కెవరు నేర్పారు! నువ్వనుకుంటున్నమాదిరిగానే జరిగితే ఈ భూమిమీద మానవజాతి అనేది మిగులుతుందా? ఇది మానవసంఘమా అడవి మృగాల అరణ్యమా?'—

'అడివి గాక అద్దాన్నం! ఇదేవిటుండీ! రీదా బిక్కీని పీక్కు తిని డబ్బున్న గొప్పోళ్ళబొజ్జలు బోరాల్లా పెరుగుతుండయ్. ఆళ్లకి డబ్బు బలం వుంటే నా మగాడికి కండబలం వుంది. ఆసుమాత్రం ఆట్టా ఎందుకు పీక్కు తినగూడదూ అంట? ఏంటో ఆడది, మానం గీనం అంటా పెద్ద పెద్ద మాటలు సెబతా వుండారే, మీ పట్నాలనిండా ఆ కడిసేటి కూడేల మాటేంది బాబూ! ఆళ్ల యిళ్లకిపోయే వోళ్ళవుస్సా? ఆళ్లని పోషించుతావుండే వోళ్లంతా రొంపుళ్లా—మీ మర్యాదస్తులేగందా — మీ గొప్పోళ్లేగందా? — అట్టాగే నా మగాడూ చేత్తావుండాడు, అదేపని. ఆళ్లు ఆళ్ల యిాలు పెకారం చేత్తావుంటే, ఈడు యీడీలు పెకారం జేత్తావుండాడు—ఆళ్ళది డబ్బు మదమైతే, యీడిది ఒళ్లుమదం—అంతే తేడా? ఎనక రాజులూ, రానోళ్లా వుండేవోళ్ళు: ఆళ్ళని మానీ అడిలి సత్తా జనం దోంగొంగి పలావులు జేసేవోళ్లు— ఇప్పుడు డబ్బునోళ్ళకి అదికారులకీ జేత్తుండమాదిరి గానే. ఆళ్ళకిమల్లేనే నా మగాడూ యీరుడు— ఆళ్లకి మల్లేనే యీడూ ఇద్దాలు జేత్తాడు — మా రాజులా బతుకుతాడు—ఆ రోజుల్లో ఈడుగనా వుంటే, ఈడుకోడా ఓ కోట గట్టి కొలువుండే వోడు'!—

'ఉమ్!'—భీమారావు వచ్చిన అక్కసునంతా మింగుకున్నాడు. 'నువ్వు చెప్పిందంతా నిజమే— కాదనటంలేదు—వస్తుంది, ఆ రోజూ వస్తుంది—ఆ దుర్మార్గుల్ని కూడా—ఆ గొప్పవాళ్లని కూడా— అణచివేసే రోజు—ప్రజానీకానికి బలం చిక్కినప్పుడు ఆరోజు వస్తుంది.'

'సరే బాగా నేవుంపది. పిద్దప్పా అంటేగందా!- ఇంకేం మీకు బలం, ధైర్యం వుంటే అట్టే అణిచెయ్యొచ్చు—. అడేం వొద్దంటంలేదే.'

'అదుగో ఆ ధోరణే వద్దన్నాను. జనాన్ని పీక్కుతిని పెద్ద పెద్దవాళ్లున్నారనుకో-అందుకని చిన్న చిన్నవాళ్లుకూడా చెలరేగుతారా? ఆ గొప్పవాళ్లని అణచటానికి యిప్పటికింకా న్యాయశాసనా లేమీ లేకపోయినా, పిద్దప్పలాంటి సన్నరకాల్ని అణచివేయటానికి వున్నయ్—అదీ తేడా. అయినా ఒకటి

ఒప్పుకుంటున్నాను. నేను యీ ప్రయత్నంలో సంపూర్ణంగా ఓడిపోయాను. అందుకే నీకు కబురు పెట్టాను.

'ఎందుకూ—నే నెందుకూ—మీరు సెపుతా వుండ దేవిటో నాకు తెలీడం లేదు'—

'మరేమీ భయపడకు—నిన్ను నే నేమీ చెయ్యమని బలవంతం చెయ్యబోవటం లేదు. నువ్వు జాగ్రత్తగా నీ మంతటికి నువ్వు యిదంతా ఆలోచించి, సిద్దప్ప నువ్వు యిందాక చెప్పిన దుర్మార్గులలాంటి వాడేనని తోస్తే—వాడు పిల్లా జల్లని అలా హింస పెట్టడం సహించరానిదని తోస్తే—నీ యంతటికి నీకు కనికరం కలిగి ఇలాంటి ఘోరకృత్యాలన్నిటినీ ఎలాగైనా ఆపాలని జాలికలిగితే—మరి—ఇంకా—నీ యంతటికి నీకు సాయపడాలనే ఉద్దేశం కలిగితే...'

'తవుఁరు...తవుఁరు అనే దేవిఁటి—నన్నాడితో చెప్పమంటారా?'—

'చెప్పినా వినడని మొదటే చెప్పావుగా'

'అవుఁను మరి...అవుతే ఇహ మీరు నన్ను జేయమంటావుండ దేవిఁటో'—కంటగింపుకుంటున్నట్టు అప్పుడే దానిగొంతు కంచు గీసినట్టు మోగింది.

'ఏవిఁ చేస్తే బాగుంటుందో నువ్వే ఆలోచించు—మాకు సంబంధించినంతవరకూ—జైలనేది అక్కడి ఒకటుంది.'

'అంటే, నేను అణ్ణి మీకు పట్టియ్యాలంటారు—మీరు చెప్పేదేందో యిప్పుడు తెలుస్తావుండది. అది మాత్రం నావల్లగాదు. మీరు మంచీ చెడూ తెలిచిన మారాజులు గనక యేది బడితే అది మాట్లాడొచ్చుగానీండి—కావాలని కట్టుకున్న అనది మొగాణ్ణి అట్టా ఎట్టా చేసుద్ది—మీరు ఏ మొగం బెట్టుకు నన్నీ మాట అడుగుతావుండారు సామీఁ!'

'ఇక నే నేమీ చెప్పదలచలేదు—ఇక నువ్వే ఆలోచించు. వాడి చేతుల్లో అల్లాడి తల్లడిపడిపోతున్న నిర్భాగ్యులపట్ల నీకేమైనా జాలి కలిగితే, నీకు ఏది యుక్తమని తోస్తే అలా చెయ్యి. నేను చెప్పదలచిందింతే. పైన దైవమున్నాడు.'

'అదిమాత్రం నావల్ల గాదు సామీఁ! నమ్మినోణ్ణి అట్టా గొంతు కొయ్యలేను'—చిన్నమ్మ లేచి నిల్చుంది. భీమారావు కూడా లేచాడు. చిన్నమ్మ మళ్ళీ సంతవేపు మళ్ళింది. భీమారావు కాళ్ళీడ్చుకుంటూ తన డేరాదగ్గిరికి చేరుకున్నాడు.

చిన్నమ్మ 'కాదు' అని చెప్పటమైతే చెప్పింది గాని, దాని మనస్సులో కొంత ఆవేదన బయలు దేరింది. గుడిచుట్టూ తిరిగి ముఖద్వారందగ్గిరికి వచ్చింది. ఇరుపార్శ్వాలా బిచ్చగాళ్లున్నారు. వాళ్ళలో కళ్లు పోయిన కబోధి కెంచి కనుపించింది. దాని వొంటి మీద వుండీ లేనట్టుగా చినిగి వాలికలైన ఒక పాతగుడ్డ ముక్క మాత్రమే వుంది. దుమ్ము కొట్టుకున్న చింపిరి జుట్టు; చేతిలో పగిలిపోయిన ఒక కుండబుచ్చె—ఇదీ కెంచి అవతారం. దానిప్రక్క నే దిసమొలతో అయిదేళ్ల దాని కొడుకు. సిద్దప్ప దాని మొగుణ్ణి హత్య చేసి, దాని యింటికి నిప్పు పెట్టాడు. ఆ కారణంగా దాని కాస్థితి పట్టింది. చిన్నమ్మ ఆ వరుసనే చూస్తోంది. తిమ్మయ్య కంటబడ్డాడు. వాడి పక్కటెముకలు బయటికి పొడుచుకొచ్చాయి. ముఖంలో అనంతమైన వేదన—దీనంగా, మొండాలైపోయిన మోచేతులు రెండూ ముందుకు చాచాడు. తిమ్మయ్య పోలీసువాళ్ళకి ఆచూకీ యిచ్చాడనే, కోపంతో సిద్దప్ప వాణ్ణి ఆవిధంగా శిక్షించాడు. చిన్నమ్మ వాళ్ళని, ఆప్రదేశంలోనే, చాలాసార్లు చూసింది. వాళ్ళ చరిత్రంతా కూడా దానికి తెలుసు. కాని ఎప్పుడూ వాళ్లఅజేవుం డేదిగాదు. ఇప్పుడు వాళ్లముఖాల్లోకి జాలిగా చూస్తోంది. చీరకొంగునున్న ముడి విప్పి యిద్దరికీ చెరో అర్ధరూపాయీ యిచ్చింది. తిమ్మడు చిన్నమ్మకళ్లలోకి తేరిపారజూచాడు. కంచికొడుకు 'అమ్మోయ్—అర్ధరూపాయేప్!' అని ఉత్కంఠతో అరిచాడు...'హాఁ!' అంటూ ఆనంద పరవశములైన చేతులతో ఆ నాణాన్ని తడివిచూసుకుంది: 'నీ కడుపు చల్లగా వెయ్యేళ్ళు వర్దిల్లమ్మా!' అని దీవించింది. ఆశ్చర్యచకితులైన ఆ బిచ్చగాళ్లందరి కళ్లూ ఒక్కసారి చిన్నిమీదికి ముసిరినై. వాళ్లని తప్పించుకుని చిన్నమ్మ గబగబా గుళ్లోకి వెళ్లిపోయింది.

గుడిపూజారి దేవుడికిహారతిస్తున్నాడు. ఇప్పుడు గుళ్ళో వున్నది కంచు విగ్రహం. పూర్వం వెండి విగ్రహం వుండేది. ఒకసారి చిన్ని తనకు వెండిమురుగులు కావాలని సిద్దడితో చెప్పింది. ఆమర్నాడే సిద్దడు గుళ్లోనుంచి ఆ వెండి విగ్రహాన్ని యెత్తుకొచ్చాడు. మూడోనాటికల్లా చిన్ని ముంజేతులమీద వెండిమురుగులు మెరిసినై. అనంతరం చిన్ని చాలాసార్లు గుళ్లోకి వచ్చింది. ఈ వేళ దాని దృష్టి ఆ విగ్రహం ప్రసరించిది. తన చేతులమన్న గాజులవంక చూసుకుంది. పూజ పూర్తిఅయేదాకానైనా ఆగకుండా వున్నపళంగా బయటికి వచ్చేసింది.

మైదానంమీదికి వచ్చేసరికి గంగ కనుపించింది. గంగ యిప్పుడు హోస్‌దుర్గ్‌లో పడుపువృత్తితో బ్రతుకుతోంది. గంగ మొదట్లో చాలా పరువుగల కుటుంబానికి చెందిన మనిషే. సిద్ధడు దాన్ని ఎత్తుకొచ్చాడు. మళ్ళీ దాన్ని వాళ్ళవాళ్లు చేరనీక వెలివేశారు. పొట్టపోసుకోవటానికి మరో మార్గం లేక ఒళ్లమ్ముకు బ్రతుకుతోంది. మామూలుగా అది కనుపించినప్పుడల్లా చిన్ని దాన్ని పలకరించి ఆ మాటా యీ మాటా మాట్లాడేది. ఈ వేళ అది కనుపించగానే ముఖం తిప్పేసుకుని పట్నం వెళ్లిపోవడానికి బయలుదేరింది. సంతిలోనుంచి యివతలకు వస్తుండగా నంజుండయ్యసెట్టి కనుపించాడు— బీడీ లమ్ముతున్నాడు. సిద్ధడు అతనిపాలబడక పూర్వం, నంజుండయ్య నూలు వ్యాపారం చేస్తూ మహారాజులా బ్రతుకుతూవుండేవాడు.

'ఏం కర్మ! యివ్వాళ అంతా యీ మొదనోవ పోళ్లే యెదురౌతుండారేం!' అని విసుక్కుంటూ తొందర తొందరగా నడిచిపోతోంది. ఏటిఒడ్డుకు చేరేసరికి, ఒక వ్యక్తి చిన్నమ్మను కలుసుకున్నాడు. 'నీకోసవేఁ బయలుదేరాను. నయం, నువ్వే యీడ కనుపించినా. రేపు నీకాడ కొస్తానని చెప్పమన్నాడు. ఆ ఇనస్పెక్టరు నాయాలకు బదిలీ అయింది. రేపో యెల్లుండో పోతావుండాడు—పీడా యిరగడౌద్ది.'

తన ఆలోచనలలో తను మునిగి తేలుతున్న చిన్నమ్మ తలెత్తి చూచింది. చిక్కడు! చిక్కడు సిద్ధడికి నమ్మినబంటు. సిద్ధప్ప వస్తానన్నమాట; తను మౌనంగా వెళ్లిపోవాలి. నడుతూ నడుతూ ఒక్కసారి తల పైకెత్తి ఆ సంతవంకా, సంతలో వున్న డేరావంకా చూసింది. మళ్లా తల వంచేసుకుని చకచకా బయలుదేరింది.

ఇంటికి తిరిగివచ్చింది. ఒక కొత్తచీర బయటికి తీసింది; కాని కట్టుకోలేదు. చేతులకున్న గాజుల వంక చూసుకుంది. వాటిని మెలిదిప్పేసింది. మెళ్లో వున్న గొలుసులు లాగి అవతల పారేసింది. గదికిటికీ దగ్గిరికి పోయి ఆంకాశవగా బయటికి చూస్తోంది. అలా ఎంతోసేపు నిల్చునిపోయింది. చీకటిబడిపోయింది. దీపం వెలిగించింది. కూడు ఉడకేసుకుందామని పొయ్యి దగ్గిరికిపోయింది; పొయ్యి రాజెయ్య బుద్ధి కాలేదు. పొద్దున మిగిలిన దద్దిమెతుకులే రెండు ముద్దలు నోట్లో వేసుకుని నీళ్లు తాగింది. దీపం ఆరిపేసి, మంచాన చేరబడ్డది. నిద్రబట్టక అర్ధరాత్రిదాకా ఇటూ అటూ మెసులుతూనే వుంది.

అక్కడ హోస్‌దుర్గ్‌లో భీమారావు సామానూ జట్రా సర్దేసుకుంటున్నాడు. అతని ఆత్మవిశ్వాసమంతా ఛిన్నాభిన్నమైపోయింది.

3

ఆమర్నాటి సాయంత్రం, భీమారావు సన్నాహాలన్నీ ముగించుకుని ప్రయాణానికి సిద్ధంగావుండగా నౌకరు లోపలికి వచ్చి 'మీరు రమ్మన్నారట— చిన్నమ్మ మీకోసం వచ్చింది' అన్నాడు భీమారావుకు గుండె ఆగిపోయినంత పనైంది. కాని అదేమీ బయటికి కనుపించకుండా తిన్నగా తాను కూడదీసుకుని గబగబా బయటి వరండాలోకి వచ్చాడు. చిన్నమ్మని చూసేటప్పటికి భీమారావుకు ఎంతో ఆశ్చర్యమేసింది. నిజంగా నిన్న చూసిన ఆ ముఖమేనా అనుకున్నాడు. ఆ ముఖంమీద హతాశారేఖలు అయోమయంగా తాండవించుతున్నయ్.

నౌకరును అవతలకు పంపించి 'ఏం? చిట్టితల్లీ! ఇలా వచ్చావ్?' అని అడిగాడు, భీమారావు, మంద్రస్థాయిలో. చిన్నమ్మ మాట్లాడలేదు. బొటనవేలు నేలరాస్తూ నేలవంక చూస్తోంది. ఆ పైని ఏమి మాట్లాడాలో ఏం చెయ్యాలో భీమారావుకు తోచలేదు. మామూలు ధోరణిలో. 'ఈ వేళ రాత్రి ఇక్కడి పట్నంలోవున్న మీ అన్నయ్యగారింటికాడ వుండిపోదామని వచ్చావు గావల్ను' అన్నాడు. చిన్ని చేతిలో వున్న ప్యాకెట్ చూపించింది—ఏవో సామానులు కొనటానికి వచ్చానని సూచనగా.

సమాధానం యేమీ రాకపోవటంతో, భీమారావు చిన్న పొడిదగ్గు దగ్గి 'నీకు వావల్ల యేమైనా సాయం కావాలా' అన్నాడు. అడిగాడే గాని అది వట్టి అర్థంలేని వాక్యమని భీమారావుకు తెలుసు. చిన్నమ్మ లేదన్నట్టు తల పంకించింది.

'మరి?—' భీమారావు కంగారుగా అడిగాడు.

'రేపు... రాత్రి... అడొస్తావుండాడు....' క్షోభిల్లిపోతున్న చిన్నమ్మ గుండెల్లోనించి ఆ రెండు మాటలూ ఎంతో బాధగా బయటికి పెగుల్చుకు వచ్చినై.

'ఆఁ!—ఏమిటీ—రేపా?—రాత్రి!'— అంటూ విభ్రాంతుడైనాడు. ఇలాటిది జరగాలని చిరకాలంగా ఆశించుతున్నా యిప్పుడు తన చెవులను తాను నమ్మలేకపోయాడు. చిన్నమ్మ వెళ్ళిపోవడానికి వెనక్కు తిరిగి కదిలేదాకా అతనికి స్పృహ రాలేదు. 'చిట్టితల్లీ! నువ్వు ఎంతో మహాతల్లివి!

ఎంతో మహత్కార్యం చేశావు—ఎంతో దుర్ఘటమైన త్యాగం—భగవంతుడు నిన్ను రక్షించుతాడు.' భీమారావు మాట్లాడుతూనే వున్నాడు కాని చిన్ని వెనక్కు తిరిగైనా చూడలేదు. చిన్నిని సాగనంపుతూ: 'ప్రైలే—నీకు సమ్మతమైతే—ఏదైనా ఒక గుర్తు—చీకటికదూ—ఆ కిటికీలో లాంతరుంచితే చాలు—మేముఁ చేనువలో నే వుంటాం, ఆదగ్గిరలో నే ఎక్కడో—తలుపు కూడా కొంచెం—అవునవును తుపాకి సంగతొకటి—ఎలాగైనా నువ్వు అన్నివిధాలా సాయపడాలి — నమస్కారం — మహాతల్లివి — ఎంతో మహత్కార్యం—నీ ఉపకారం జన్మజన్మాలా మరిచిపోను.'

చిన్నమ్మ ఆ రాత్రి పట్నంలో అన్నగారింట్లోనే వుండిపోయింది. హృదయం ఎంతో ఆందోళన పడుతోంది. అవతలవాళ్లు గుచ్చిగుచ్చి అడిగితే గాని యే సమాధానమూ చెప్పటంలేదు. ఆ హృదయం సాక్షాత్తూ ఒక అగ్నిపర్వతంలా వుంది.

4

మర్నాటి ఉదయమే లేచి చిన్నమ్మ కాలేక్కరీకి వెళ్ళిపోయింది. ఇంటికి వెళ్ళగానే, యిల్లంతా పరిశుభ్రంగా ఊడ్చి నీళ్ళు చల్లి రంగురంగులుగా రంగవల్లులు తీర్చింది. పొయ్యిదగ్గిర ఎంతోసేపు కూర్చుని నానారకాల భోజనపదార్థాలూ తయారుచేసింది. కాని భోజనం చెయ్యలేదు. కొంచెంసేపు విశ్రాంతిగా పడుకుని లేచింది. పరిశుభ్రంగా స్నానంచేసి, సంతలో కొనుక్కొచ్చిన మబ్బురంగు శిల్కుచీర కట్టుకుని ఎర్రరంగుచీనీలు కుట్టిన జాకెట్ తొడుక్కుంది. కురులు నున్నగా దువ్వి ముడి వేసుకుంది. ముఖాన కొట్టవచ్చినట్టు ఇంత వెడల్పైన కుంకుమబొట్టు పెట్టుకుంది. ఉన్న నగలన్నీ తీసి, అద్దంముందు కూర్చుని ఒళ్లంతా అలంకరించుకుంది. ఈ కైసేత పూర్తి అయేసరికి అప్పుడే కనుచీకటిపడ్డది.

అత్యంత శోభాయమానంగా అలంకరించుకుంది, కాని ఆముఖాన నిలువునా వాతబెట్టినట్టు విషాదరేఖ.

బాగా చీకటి పడగానే లాంతరు వెలిగించింది. ఎప్పుడూ లేనంత శ్రద్ధగా పక్క పరిచి, మెత్తగా వుందో లేదో తడివిచూచింది. బుగ్గను వేలు వేసుకుని నిరీక్షిస్తూ కూర్చుంది.

ఒక చిన్న గులకరాయి కిటికీలోనుంచి పక్కమీద పడ్డది. ఆదరాబాదరా లేచి వెళ్లి తలుపుతీసింది. తుపాకి చేతబుచ్చుకుని, ఆజానుబాహుడు పులిసిద్దడు, గుమ్మం తలకు తాకకుండా ముందుకు వంగి లోపల ప్రవేశించాడు. చిన్ని తలుపు వేసి లోపల గడియ బిగించింది.

'ఓహోహో! ఏమిఁ ఘుమాయింపు—యిల్లు యిల్లంతా గుబాళిస్తావుందే!—ఎంత సోగ్గా అలంకారం జేశావ్!' సిద్దప్ప చిరునవ్వు నవ్వుతూ అన్నాడు. లోపలికి వెళ్లి లాంతరు వెలుగులో దాని ముఖంవంక చూసి పట్టరాని ఆనందంతో ఉప్పొంగిపోతూ 'శహో్వ! రంబలాగుండావ్! రెయ్యి కళ్లు సాలవ్ సొగసు సూసేందుకు.' అన్నాడు. చిన్ని ముఖంలో ఒక వెన్నెలరేఖ మెలకెత్తింది. కాని ఆ వెలుగురేఖ మరుగున అనంతమైన వేదన.

'ఇయ్యాళనించీ రోజూ వత్తావుంటాలే—రేపటితో ఆ భీమారావు పీడాయిరగడై పోతావుండాదు; బదిలీ అయిందంట. ఆ రొండవ నన్ను పట్టుకోవాలని పెద్దమొగాపిల్లే ఈసికొచ్చిండు. హో! హో! హో!—ఊ సరే—ఆకలేత్తా వుంది!' సిద్దప్ప తుపాకీ పడకగదిలో మూలబెట్టి, బయటికి పోయి చేతులూ కాళ్ళూ కడుక్కొచ్చాడు. భోజనంముందు కూర్చున్నంతసేపూ వాడి ముఖం ఆనందంతో మిడిసిపడిపోతోంది: 'శహో్వ ఏమిఁ మజాగా వండావ్! రాపోళ్లయిందులాగుంది. ఇయ్యాల నా పుట్టినరోజా పండగనుకుండావా యేంది—యిందు జేత్తావుండావ్—అది సరే నువ్వు భోజనానికి కూకోలేదేంది?' చిన్నమ్మ మౌనంగా కూర్చోటం చూసి ఈమాట అడిగాడు. 'మధ్యానం యేళదప్పి తిన్నాలే — తిన బుద్దెయ్యడంలేదు' అంది. భోజనం చేసినంతసేపూ వాడు అలా నవ్వుతూ ఈ మాటా ఆ మాటా మాటాడించుకూ చేవున్నాడు. కాని చిన్నమ్మ మాత్రం ఎక్కడి కక్కడ ముక్తసరిగా సమాధానాలు చెబుతోంది. 'ఏం దట్టా మూగనోమట్టె ముంగిలా కూకుండావ్—ఒంట్లో బాగా లేదా యేంది' అని నిగ్గదీశాడు. 'కుసెంత తల నొప్పుతావుండదిలే' అని సమాధానం చెప్పింది. 'నే నొచ్చాగా ఇక పోద్దిలే' అని నవ్వుతూ భోజనం ముందునుంచి లేచి చెయ్యి కడుక్కునేందుకు బయటికి వెళ్లాడు. చిన్నమ్మకూడా లేచింది, ప్రాణంలేని యంత్రంలా నడుస్తూ మెల్లిగా గదిలోకి వెళ్లింది. మూలనున్న తుపాకిలోనుంచి తోటాలు తీసేసి మళ్లా యథాస్థానంలో పెట్టేసింది.

సిద్దప్ప మాంచిహుషారుగా వున్నాడు—వక్కాకు నములుతూ పక్కమీద కూర్చున్నాడు. తళతళలాడుతున్న వాడి కళ్లల్లో అంతులేని కోరికలు. ఆ సర్దాలో చిన్నమ్మ పాలు పంచుకోలేకపోతోంది. దాని

హృదయం ఒక క్షణం సిద్దడివేపూ మరుక్షణం మరోవైపూ కొట్టుకులాడుతోంది. 'ఓహో! రాణి గారికి కోపం వొచ్చినట్టుందారి—డబ్బు తెచ్చేను గానని—యిాగో తీసుకో'అంటూ రెండు పచ్చ నోట్లు తీసి అందించాడు. 'మరి—ఇహ నవ్వు—ఏదీ సిరునవ్వు—ఒక్కటి.' మిలమిలా మెరుపు మెరిసినట్టు ఒక చిరునవ్వు దానిముఖాన మెరిసిపోయింది. మళ్ళీ క్షణంలో విషాదమేఘాల్లో అదృశ్యమైపోయింది. కానిఆ మేఘాలను సిద్దప్ప గుర్తించలేకపోయాడు. ఆ నోట్లు హౌస్‌దుర్గ్ దోపిడిబాపతని చిన్నమ్మకి తెలుసు. ఆ పాపిష్టి డబ్బు తనచేత్తో ఎలా పట్టుకుంటో దానికే తెలీదు. 'సరే! ఇక పడుకుందాం' అని పక్కమీద ఒరిగి ఇటూ అటూ దొర్లాడు.

వాడికి మాగన్నుగా నిద్రబట్టింది. చిన్నమ్మ వాడిపక్కనే పడుకుని దిగులుగా యింటి పైకప్పు వంక చూస్తోంది. ఒక క్షణానికి లేచి కూర్చుంది. రెండు కళ్ళూ ఇంతింతలుగా చేసుకుని తదేకదృష్టిగా వాడివంక చూస్తోంది. చెయ్యి చాచి వాడిమీద వెయ్యబోయింది—మళ్ళా దిగులుగా వెనక్కుతీసుకుంది. లేచి నిల్చుంది. కాళ్ళల్లో సత్తువ చచ్చి గుడ్డపీలికలైపోయినట్లనిపించింది. హృదయం లోలోపల ముక్కచెక్కలైపోతోంది. మెల్లిగా ముందుకు వంగి గజగజా ఒణికిపోతున్న చేతులతో లాంతరు అందుకుంది--కిటికీలో పెట్టింది. లాంతరు కిటికీకి కొట్టుకుని చిన్న శబ్దమైంది. సిద్దడు కళ్లు తెరిచి 'ఏటదీ!' అన్నాడు. చిన్నమ్మకు నరనరాలూ కంపించిపోయినై. మెల్లిగా సంబాళించుకుని 'లాంతరు తగ్గించాలె' అని సమాధానం చెప్పివచ్చి వాడిపక్కనే కుప్పగా కూలింది.

సాయంత్రం నుంచీ భీమారావు ఇంత వరిగడ్డిమీద గప్పుకుని చేరువలో వున్న ఒక కందకంలో, కంట్లో వత్తివేసుకొని కనిపెట్టుకు కూర్చున్నాడు. కూర్చుని కూర్చుని అతనికి ప్రాణం విసికిపోయింది. క్షణక్షణం రేడియండయల్ వున్న తన చేతిగడియారం వంక చూసుకుని నీళ్లు గారుతున్నాడు. 'చివరికి యిదంతా వట్టి మోసమేనా యేమిటి?' అనుకుంటున్నాడు. ఆ చీకట్లో సిద్దడువచ్చిన అలజడేమీ కనుపించలేదు. అర్థరాత్రి దాటింది. 'పాండూ! ఇక లాభంలేదు; పోయి తలుపు పగలగొట్టి ఇంట్లో జొరబడదాం పదండి!'.—ఈ మాటలు ఇంకా పొంతం అతని నోట్లో నుంచి బయటికి రానేలేదు—ఇంతలోనే కిటికీలో దీపం. భీమారావుకు ఎక్కడలేని బలమూ వచ్చేసింది. తన పరివారాన్నంతా వెంటబెట్టుకుని ఒక్క ఉదుటున ముందుకు ఉరికాడు.

సిద్దప్పకు ఇంకా బాగా నిద్రపట్టలేదు. గయ్యిమని కుక్కలు మొరిగేసరికి చివాల్న పక్కలో లేచికూర్చున్నాడు. చిన్నమ్మకూడా కంగారుగా లేచింది.

'ఇంటుండావా అహోతి!' అంటూనే చివాల్న పక్కలోనుంచి క్రిందికి దూకి మూలనున్న తుపాకి అందిపుచ్చుకున్నాడు. ఇంతలోనే 'ధభ్లి'న తలుపు తెరుచుకుంది.: 'ఓరి యెదవా నువ్వా!' అంటూ గర్జించి తుపాకిఎత్తి తలుపువేపు గురిచూసి మీట నొక్కాడు. క్లిక్‌మని కోరుకుంది—అంతే.

'అసి లుచ్ఛాయుండా!'అని భీభత్సంగాగర్జించి-తుపాకి రెండుచేతులాఎత్తి, చిన్ని నెత్తిన ఒక దెబ్బ పెట్టాడు. చిన్ని నోటివెంట మాటలేకుండా కింద బడిపోయింది. సిద్దడు తుపాకితో పాదవంచేస్తూ వాళ్లని ఎదుర్కున్నాడు. ఎటు మెసలటానికీ వీలులేని చిన్నగది. సిబ్బంది అందరూ లోపలికి రావటానికి వీలులేకపోయింది ఒకరిద్దరికి దెబ్బలు తగిలాయి ఒక తను దెబ్బతిని కిందపడ్డాడు. ముందు పీటీని పోరాడుతున్నాడు భీమారావు—అతనికికూడా దెబ్బతగిలింది. భీమారావు ఇక ఉపేక్షించి లాభం లేదనుకున్నాడు. రివాల్వరుతీసి, సిద్దప్పతొడమీద గురిచూసి రెండు షాట్లు పేల్చాడు. ఆ దెబ్బలు తినికూడా సిద్దడు అతని మీద దూకి కలబడ్డాడు. కాని, నిల్చోలేక కుదబడిపోయాడు. పలుపురుమనుషులు అనూంతరం వాడిమీద పడి కాళ్లకీ చేతులకీ బేడీలు తగిలించారు. అనంతరం నెత్తురుకారకుండా వాడితొడకు కట్టుకట్టారు.

భీమారావు చిన్నమ్మ పడున్నవేపు పరుగెత్తాడు. బ్రతికేవుంది. నెత్తిమీద బలంగా దెబ్బ తగలటంచేత స్పృహతప్పి పడిపోయింది. భీమారావు ఒకతన్ని పిలిచి చిన్నమ్మ తలమీద గాయం కడగటానికి నీళ్లు తెమన్నాడు. సిద్దప్ప దాన్ని నానా బూతులూ తిడుతున్నాడు. భీమారావు వాణ్ణి బయటికి తీసుకుపొమ్మన్నాడు. చిన్నమ్మ మెల్లిగా కళ్లు తెరిచింది. ఒక్క క్షణంసేపు భీమారావు కళ్లలోకి వెర్రి చూపుచూచింది. మళ్ళీమరుక్షణంలో రెండు అరచేతులోనూ కళ్లు రెండూ మూసేసుకుని, గుబులు గుబులుగా ఏడిచేస్తోంది. రెండు కళ్లవెంటా సంతత ధారలుగా కన్నీరు కారిపోతోంది.

'చిట్టితల్లీ నీవు చేసిన త్యాగానికి తగిన ప్రత్యుపకారం ఎన్నటికీ చెయ్యలేము. కాని నిన్నుమాత్రం మరిచిపోము. నువ్వు మరేమీ భయపడక్కర్లేదు.

ఎన్నటికీ కూడా..." ఎలా అభయమివ్వాలో భీమారావుకు తోచలేదు. కాని చిన్నమ్మ యీమాటలేవీ వినిపించుకోవటం లేదు. ఇలాంటి ప్రతివాగ్దానాలేవో చేస్తూ, రేపువచ్చి కలుసుకుంటానని చెప్పి, బయటికి వచ్చాడు.

ఈలోగా, కుక్కలు మొరగటం, రివాల్వరు కాల్పులు వినిపించటం కారణంగా ఇంటిచుట్టూ జనం మూగారు. సిద్దడిముఠా వాళ్ళకి ఈవార్త తెలిసేలోగా భీమారావు ఇక్కడనుంచి హోస్‌దుర్గ్‌కు చేరిపోవాలి. గబగబా నాలుగుబళ్లు మాట్లాడుకుని బయలుదేరాడు. ఒకబండిలో సిద్దణ్ణి ఎక్కించుకుని తను కూర్చున్నాడు. మిగతా మూడుబళ్ళల్లోనూ సిబ్బందీ కూర్చున్నారు.

సిద్దణ్ణి లాకప్‌లో వుంచారు. సిద్దణ్ణి పట్టుకున్న కథనంతా వివరిస్తూ భీమారావు పెద్ద రిపోర్టు తయారుచేస్తున్నాడు. ఇందులో చిన్నమ్మ చేసిన సహాయాన్నీ, అదిపడ్డ మానసికమైనబాధనూ సుదీర్ఘంగా అభివర్ణించి ప్రభుత్వంవారు ప్రకటించిన బహుమతిని దానికి యిప్పించవలసిందిగా సిఫారసు చేశాడు. ఖైదీని మరొక ఉద్యోగికి వప్పగింతచేసి తాను ఇంటికి వెళ్ళాడు. అతను సంకల్పించిన కార్యం సఫలమైంది. హాయిగా పడుకుని నిద్రపోయాడు.

అతను నిద్రలేచేసరికి ఎనిమిది గంటలైంది. అతన్ని లేపిన నౌకరు: 'ఎవరో ఆడమనిషి చెర్లోబడి చచ్చిపోయిందిటండీ—దాని పేరు చిన్నమ్మటా' అన్నాడు.

'ఏమిటేమి? చిన్నమ్మ! ఏ చిన్నమ్మ? సిద్దడి భార్య కాదుగదా?—' భీమారావు కంగారుగా అడిగాడు.

'అవునండీ అదే!'—

భీమారావు చెరువు దగ్గిరికి పరుగెత్తేసరికి అక్కడో పెద్ద గుంపు మూగివున్నారు. గుంపుకు మధ్యగా చిన్నమ్మ పడున్నది—కళేబరం! ఒక డాక్టరు పరీక్షచేసి నీటిలో మునిగి చనిపోయిందని అన్నాడు. భీమారావుకు తరవాత తెలిసింది: తాను వచ్చేసిన వెంటనే చిన్నమ్మ యిరుగుపొరుగు వాళ్లందర్నీ ఇళ్లకి పంపేసి, యింట్లోకి వెళ్ళి గొళ్లెం పెట్టుకు పడుకుందని. ఊళ్లోవాళ్ళందర్నీ నిద్రపోనిచ్చి నెమ్మదిగా లేచొచ్చి ఈ అఘాయిత్యం చేసి వుంటుందని ఊహించుకున్నాడు.

అనంతవర్మ చోడగంగదేవుడు

అదపాక తామ్రశాసనము

శ్రీ మండ నరసింహము

ఈ శాసనము అదపాక గ్రామమున ఒక రైతు, గ్రామ సమీపమందలి మెట్టభూమిని దున్నుచుండగ లభించినది. ఇది రాజముద్రికతో సంధింపబడిన కడియనులో గ్రుచ్చబడి యైదు రేకులు గలిగియున్నది. రేకులన్నిటి పైనను, లిపి కలదు. ముద్రికపై ఉబ్బెత్తుగా పోతపోయబడిన నందియు చామరము, నాగలి, సూర్యచంద్రవిగ్రహములు గలవు. ఇవి సాధారణముగ తర్వాతి గంగవంశపు రాజశాసనము లన్నింటియందు గూడ చిన్నవిగనో పెద్దవిగనో కన్పట్టుచున్నవి. మొదటిరేకు లోపలివైపునను చివరిరేకు చివరివైపునను లిపి లేదు. రేకులు దళసరిగా చేయబడి లిపి లోతుగా చెక్కబడుటచేత, బహుకాలము శాసనపురేకులు భూగర్భమునను్నను, లిపి యేమాత్రమును చెడక సుస్పష్టముగా నున్నది.

ఒకకుండ కంఠభాగమున నున్న రంధ్రములకుండ నుంచబడిన ఒక యినుపకడ్డీకి వ్రేలాడదీయబడి దిగువ కుండలో ఊకపోసి అందులో నీ శాసనపురేకులుంచి పైనిగూడ వేరొకకుండ బోర్లించి రెండుకుండలును పైని జెప్పబడిన యినపకడ్డీవలన సంధింపబడినవి. పైకుండ పగులగొట్టినగాని శాసనములు బయటకు తీయ వీలుపడుటలేదు. కుండలు భద్రముగ పదిలపరచబడి యున్నవి. ఆ గ్రామమందలి ప్రాథమికపాఠశాలలోని ప్రధానోపాధ్యాయు డీ శాసనమును నాకు దయతో నొసంగి ప్రచురింపుమని నన్ను గోరిరి.

శాసనమంతయు పురాతన నాగరలిపిలో లిఖింపబడినది. లేఖక దోషములరుదు. 'న' అను వర్ణము రెండువిధముల — నాగర, తెలుగులిపుల—వ్రాయబడినది. 'ప' 'య' అను అక్షరముల కంతగా భేదము గానరాదు. ఏత్వఐత్వములు సందర్భమువలననే దెలిసికొనవలెనుగాని లిపిలో భేదమువలన తెలిసికొన వీలులేదు. 'వ', 'బ' అక్షరములకు భేదములేదు. గ్రంథమంతయు సంస్కృతభాషలో రచింపబడినది. ఇది పద్యగద్యాత్మకముగా నున్నది. అనంతవర్మ చోడగంగుని తాత యగు మూడవ వజ్రహస్తుని శాసనమందలి గద్యపద్యములే గాక, తరువాతవచ్చిన రాజరాజును గూర్చిన వివరములు మరి రెండు మూడు శ్లోకములలో చెప్పబడినది. ఈ శ్లోకరచన నిర్దుష్టమై సరళమై కావ్యశైలి నలంకారములతో గూడి హృద్యమై యున్నది. కళింగరాజ్యమందు చక్కని సంస్కృతి కవిత్వము ఆకాలమున చెప్పగలుగు కవులు గలరని రుజువగుచున్నది.

ఈ శాసనపురేకులు అదపాక అను గ్రామమున దొరకినవి. ఈ చిన్నగ్రామము శ్రీకాకుళం జిల్లాలోని చీపురుపల్లి తాలూకాలోనిది. ఇది శ్రీకాకుళమునకు దరిదాపు పదిమైళ్ళ దూరమునగలదు. ప్రసిద్ధాంధ్రకవి అడిదము సూరకవి ఈప్రాంతమువాడే. అదపాకనుగూర్చి ఈ కవి చెప్పిన కొన్ని పద్యములు ఈ ప్రాంతమందలి జనులు చదువుచుందురు.

“అదపాకా? అత్తవారు, ఔనే! పిల్లా?” “అదపాక మావిడాకులు పోదుపుగ...” ఇట్టి పద్యములు పామరరంజకత్వమును పొందుచున్నవి. దీని వలన అదపాక పండితుల కావాసమని తెలియుచున్నది.

ఈ రాజశాసనము సూర్యగ్రహణ కాలమున చేయబడిన భూదానాదికములను వివరించుచున్నది. అనంతవర్మ చోడగంగదేవుడు “మాతా పిత్రోరాత్మనశ్చ పుణ్య యశోభివృద్ధి” కొరకు బ్రాహ్మణులకు దానముచేసినట్లు చెప్పబడినది. ఇతర రాజశాసనముల వలె గాక నిందులో నొక ప్రత్యేకత కనబడుచున్నది. దీనిలో సంధివిగ్రహి అనుజ్ఞ కానరాదు. శాసనము చెక్కినవాని పేరు గానరాదు. వ్యాసగీతములు లేవు. కావ్యకర్త పేరు గానరాదు. దాతయగు చోడగంగు తన పట్టాభిషేక కాలమున దానముచేసిన సూర్యగ్రహణ కాలమునుమాత్రము తెలియజేసెను. గుణమహార్ణవ మహారాజు ఈ తరువాతి గంగవంశపు రాజులకు మూలపురుషుడు. వీనినుండి ఈ శాసన కర్త

యను చోడగంగవరకు వంశము సమగ్రముగ నీయబడినది. ప్రతియొక్క రాజు పేరును, అతడు రాజ్యమేలిన కాలపరిమితియు వివరింపబడినది. వీరిలో కొందరు రాజుల భార్యల నామములు వారివారి వంశములనువిశదీకరింపబడినవి. అందు కొందరి పట్టాభిషేక కాలముగూడ తిథి వార నక్షత్రలగ్నముల సహితముగవివరింపబడినది. శాసనమున చెప్పబడిన విధమున వారి వంశవృక్షము ఈక్రింద పొందుపరుపబడినది.

గుణమహార్ణవ మహారాజు

మూలపురుషుడు

|

వజ్రహస్తదేవ - 44 సం॥ రాజ్యమేలెను

|

గుండమరాజు - 3 సం॥ | కామార్ణవదేవ - 25 సం॥ | వినయాదిత్య - 3 సం॥

|

(అనియంకభీమ అనంతవర్మ) వజ్రహస్తదేవ - 35 సం॥

|

కామార్ణవ - ½ సం॥ | గుండమరాజు - 3 సం॥ | మధుకామార్ణవదేవ - 19 సం॥

వైదుంబాన్వయ వినయమహాదేవి

|

వజ్రహస్తదేవ - 33 సం॥

|

రాజరాజు - 8 సం॥

చోళరాజేంద్రుని కూతురు - రాజ్యసుందరి

|

అనంతవర్మ చోడగంగదేవ—శాసనకర్త - శాలివాహనశకము 999 లో పట్టాభిషేకమందెను.

ఇది 999 + 78 = 1077 క్రీస్తుశకమునకు సమానము.

శాసన దానకాలము శాలివాహనశకము. 1018 అవగా క్రీస్తుశకము 1096 అగును. గంగవంశమునకు పూర్వము కళింగదేశ మేలినవారు 'గాంగ' వంశమని చెప్పకొనుచుండిరి. వీరి మూలపురుషు డెవరో తెలియబడదుకాని, ఈ వంశపురాజులు తమ దానాదికముల చెప్పటలో శాలివాహన శకమును చెప్పక 'ప్రవర్ధమాన విజయరాజ్య సంవత్సరము'లని చెప్పచుండిరి. బహుశా వీరు సముద్రగుప్తుని దక్షిణ దిగ్విజయ యాత్రారంభమునుండి తమ రాజ్య సంవత్సరములను లెక్కించుకొనుచుండిరేమో. ఈ గాంగవంశమునకు పూర్వము వాసిష్ఠీవంశపు రాజులు పాలించుచుండిరి. వీరి శాసనములు రెండుమాత్రమే యింతవరకు లభ్యమయ్యెను. ఆరెండు శాసనల నొకటి 'భారతి'యందును మరియొకటి ఆంధ్రభాషా పత్రికయందు దాంగ్లమునను ప్రకటితము లైనవి. అంతకు పూర్వము చేదివంశమునకు చెందిన ఖారవేల, లేక భారవేల అనువాడు కళింగ మేలుచుండెను. ఈ ఖారవేలుడు విష్ణుపురాణము అగ్నిపురాణము శ్రీమద్భాగవత పురాణములలో చెప్పబడెను. ఈతని శిలాశాసనము ప్రాకృతభాషను భువనేశ్వరమునకు సమీపమందలి ఖండగిరియందు 'హాతిగుంఫ' యను చోట నొక పెద్దరాతిపై చెక్కించబడియున్నది. ఈతడు జైనమతస్థుడు. ఈతడు క్రీస్తుకు పూర్వము రెండవ శతాబ్దమున నున్నట్లును మగధరాజ్యమును జయించినట్లును ఈ శాసనమున గలదు.

శాసన దానకర్తయగు అనంతవర్మ చోడగంగదేవుడు చిన్నవయసుననే పట్టాభిషిక్తుడై దరిదాపు 70 సం॥ రాజ్యమేలినట్లు శాసనములు చెప్పచున్నవి. ఈతడే ఉత్కళదేశమును గూడ జయించి మహానదీ తీరమందలి కటకమును రాజధానిగా చేసికొని పాలించెను.

ఈ చోడగంగదేవుని కాలమున కళింగము మహోచ్ఛదశ నందినది. మహానదిమొదలు గోదావరివరకు

దీనిరాజ్యము వ్యాపించి యుండెను. ఈతఁడే కళింగ నగరమని పేరొందిన ముఖలింగమునుండి తన రాజధానిని కటకమునకు మార్చివేసెను. వీనిసంతతి వారీ కటకమునుండి బహుకాలము పాలించిరి. ఈ వంశపు వాఁడే యగు ప్రతాపరుద్ర గజపతిదేవ మహారాజు విజయనగరసంస్థానాధీశు డగు శ్రీ కృష్ణరాయలచే నోడింపబడి తరువాత వానితో సంధిచేసికొని కటకమున పాలించుచుండెను. ఈ రాజ్యము, తరువాత మహమ్మదీయులపాలనము ఆ తర్వాత మహారాష్ట్రుల పాలనమునుపొంది తుదకు ఇంగ్లీషువారికి 1760 ప్రాంతమున వశమయ్యెను. గంగవంశముగూడ నాటితో నంతరించెను. వారి సంతతివారు తరువాత జమీందారులైరి.

అనంతవర్మ చోడగంగునిగూర్చి యొక వినోదకరమగు గాథ కలదు. అందలి సత్యాసత్యములగూర్చి నిర్ణయించుటకు తగిన యాధారములు విశేషముగ లేవు. కాని వేములవాడ భీమకవికృతములని చెప్పబడు రెండుపద్యములు బహుకాలమునుండియు నాంధ్రదేశమున వ్యాపించి యున్నవి. ఈ రెండుపద్యములలో భీమకవి పేరుండుటచేతను, ఈ భీమకవి శంభువరప్రసాదుడును శాపానుగ్రహ శక్తుడునగుటచేతను కేవలము తిరస్కరించుట కవకాశము లేదు.

వేములవాడ భీమకవి గోదావరీమండలము. బ్రాహ్మణుడు. శంభువరప్రసాదలబ్ధకవి. శాపానుగ్రహసమర్థుడు. ఒకసా రీతడు కళింగరాజ్యమునకు వచ్చి రాజగు అనంతవర్మ చోడగంగదేవుని దర్శనార్థము ద్వారపాలకునిచే వార్త బంపెను. రాజప్పుడు మిక్కిలి తొందరపనులలో నుండుటవలన "సందడి దీరిన రమ్ము పొమ్ము" అని ప్రత్యుత్తరమంపెను. దర్శన మీయకయే దన్ను పొమ్మనుటకు, గినిసి భీమకవి:

"వేములవాడ భీమకవి
వేగమె చూచి కళింగగంగు తా
సామముమాని కోపమున
సందడిదీరిన రమ్ము పొమ్మనెన్
మోమునుజూడ దోసమిక
ముప్పదిరెండుదినంబు లావలన్
జామునకర్థమందతని
సంపదశత్రులపాలుగావుతన్"

అని శపించెను. ఈ శాపఫలమో యన ఉత్కల దేశాధీశు డను నొక 'రాయలు' గొప్ప సైన్యముతో కళింగముపై దండెత్తివచ్చి చోడగంగునోడించి కళింగ మాక్రమించెను. యుద్ధమందు రాజును తన భార్యాపుత్రాదులు చెల్లాచెదరైపోయిరి. విధిలేక, నిలువ నీడలేక రాజు దేశమునుండి వెడలిపోయి మాధుకరవృత్తిని జీవయాత్ర గడుపుచుండెను. ఈ సంచారములో నొకప్పుడీరాజు వేములవాడ అగ్రహారమును జేరుకొని ఆనాటిరాత్రి బ్రాహ్మణవీధిని మాధుకరము పెట్టుమని యరచుచు నొక బ్రాహ్మణగృహస్థుని యింటియుంగిట కాలుజారుటచేత నచ్చటనున్న యొక గోతిలో బడెను.

"ఎంత బ్రతుకు బ్రతికితిని. నేటి యీ చీకటిలో కాలు దివ్వటియు లేకపోయెనే! గోతిలో పడితిని. ఎప్పటి కెయ్యది ప్రాప్తమగునో చెప్పలేముకదా!" అని అప్రయత్నముగ వాని నోటినుండి ఈ మాటలు వెడలినవి. ఆ సమయముననే ఆ యింటి యజమానుడు భోజనమునకు వెడలుటకుముందు పాదప్రక్షాళనార్థము బైటకువచ్చుట తటస్థించెను. వెంటనే ఒకడు గోతిలో కాలుజారి పడుటయు, వాని నోటినుండి వెడలిన మాటలు, కనుటయు, వినుటయు తటస్థించెను. ఆపదలో నున్నవానికి చేయూత నిచ్చి గోతినుండి వెలుపలికి దీసి యరుగుపై గూర్చుండబెట్టి వాని వృత్తాంతమంతయు చెప్పుమని యా బ్రాహ్మణుడు కోరెను. తాను పూర్వము కళింగ సామ్రాజ్యమేలు చక్రవర్తిననియు ఒకానొక సమయమున వేములవాడ భీమకవికి అపకృతి చేయుటవలన వాని శాపమునంది తానొక జోగినైతిననియు విశదపరచెను. అంతట నా బ్రాహ్మణుడు వీనికి ఆ రాత్రి నాతిథ్యమిచ్చి సేదదీర్చి పంపుటకు నిశ్చయించుకొనెను. జోగియైన యా రాజును, భోజనమునకు సిద్ధపరచి, నాటికి లభించిన యాహారాదికముల నొక పాత్ర సిద్ధపరచి భుజింపుమని వానిగోరెను. రాజు సంశయించి వానికి నాతిథ్యమిచ్చువాడు బ్రహ్మక్షత్రియకులుడైనగాని యన్యకులజుల యిండ్ల భుజింప నొల్లకుండెను. అప్పుడా గృహస్థుడు తా బ్రాహ్మణుడనియు తన పేరు వేములవాడ భీమకవి యనియు వివరింపగనే రా జపరిమితానంద విస్మయ భయభ్రాంతుడై భోజనపాత్రముందు కూర్చుని భుజింపక మిన్నకుండెను. ఎంత వేడినను తా భుజింపకుండుట కనిపెట్టి వాని కోర్కె యెట్టిదో వేడుమనియు దాని దా నీడేర్చెదననియు చెప్పెను. తన్ననుగ్రహించి తన దోసమును సైరించి, తిరిగి తన రాజ్యము తనకు వచ్చునట్లాశీర్వదించుమని యాతడు బ్రాహ్మణుని పాదముల బట్టి విడువకుండెను. భీమకవికి జాలిపుట్టి:

"వేయి గజంబులుండ బది
వేల తురంగములుండ నాజిలో
రాయల గెల్చి సజ్జ నగ
రంబున బట్టముగట్టుకో వడిన్
రాయ కళింగ గంగ! కవి
రాజ భయంకరమూర్తి జూడగా
బోయిన మీనమాసమున
బున్నమ వోయిన షష్ఠి నాటికిన్."

అని దీవించెను. రాజులుగూడ సంతోషించి భుజించి మరునాడుదయమున దన ప్రయాణము సాగించుచుండెను.

నూతన కళింగరాజత్యానందమున వినోదములతో రాజ్యపాలనము సాగించుచుండెను. నూతన పట్టాభిషేక మహోత్సవ కార్యకలాపములలో కూచిపూడి భాగవతుల కలాపమొకటి యేర్పాటు చేయబడెను. అందుకొరకై కూచిపూడినుండి భాగవతుల మేళమొకటి కళింగరాజ్యమునకు వచ్చుచుండెను. దారిలో మద్దెలలు మొదలగు సామగ్రిని మోయుటకు నియమితుడైన కావటి కూలివాడొకడు మరణించుట తటస్థించెను. మార్గమధ్యమున, కావడిమోయు కూలివానికై భాగవతులు ప్రయత్నించుచుండగా మాధుకరమెత్తుచున్నవాడు వీరికి గోచరించెను. ఈతడు భాగవతుల కావడి మోయుటకును వారు వీనికి అన్నము పెట్టుటకు నిర్ణయముజరిగెను. ఈవిధముగ భాగవతుల మేళముతో నీరాజు కావటివాడుగ వారితో వచ్చి కళింగరాజధానిని జేరెను. నూతనరాజులుగూడ కూచిపూడి భాగవతులకు తగినబస యేర్పాటుగావించి "కళింగరాజుపై తమ విజయగాథ"ను భాగవతముగ ప్రదర్శింపవలయునని యాజ్ఞాపించిరి. ప్రదర్శనమునకు కొలదికాలము గడువీయబడెను. ఈ గడువుకాలములో భాగవతులు నూతనకలాపమును రచించి వేషధారులచే వల్లింపజేసి ప్రదర్శనమునకు దాము సిద్ధముగ నుంటిమనియు తగినదిన యేర్పాట్లు చేయింపవలయుననియు రాజును ప్రార్థించిరి. రాజుగూడ నొకదినము నేర్పాటు గావించి ప్రదర్శనమునకు వలయు వస్తుసామగ్రిని గూడ వేషధారులకు సమకూర్చెను. అందు ప్రధాన వేషధారుడు చోడగంగుపాత్ర నభినయింపవలయును. అట్టి రాజపాత్రను ధరించుటకు రాజోచిత వస్త్రములు, కిరీటము, కత్తి, గుర్రము మొదలగు వస్తువులు కావలయును. భాగవతులు ఆలోచించి వారితో వచ్చిన కావటివాడే కళింగగంగుపాత్రకు తగినవాడని నిర్ణయించి వాడు వినికిడిచేయవలసిన పద్యములు, పాటలు, మాటలు మొదలగునవి జాగ్రతగా వల్లించునట్లు జేసిరి. ప్రదర్శనదినమున రాజపాత్రకు కావలసిన గుర్రమును వస్తుజాలమును నూతనరాజులే సమకూర్చిరి.

భాగవతము అతివినోదముగ ప్రదర్శింపబడుచుండెను. నూతనరాజు, మంత్రి పురోహిత సేనానులు సభయందుచితాసనముల నాసీనులై భాగవతకలాపము నత్యానందముతో వీక్షింపుచుండిరి. సభ్యులందరును ప్రధానపాత్రధారియగు కళింగ గంగుకొరకు నిరీక్షించుచుండిరి. అంత తెర యెత్తబడెను. దీపముల కాంతిలో కళింగగంగు గుర్రపుస్వారి చేయుచు కనుపట్టెను. ప్రజలందరును వాని నిజముగ కళింగ గంగే యని భావించుచుండిరి. రాజబృందముగూడ భాగవతుల వేషవైఖరిని మిక్కిలి కొనియాడిరి. ఇట్లుండ కళింగగంగుపాత్రధారి కత్తితో సాముచేయుచు గుర్రముపైనుండి యుద్ధధ్వానముసేయుచు, తనపాత్రమును ప్రదర్శించుచుండెను. అకస్మాత్తుగా నీపాత్రధారి నూతనరాజును సమీపించి కత్తితో వాని శిరమును ఖండించి తనవారగు పూర్వపు మంత్రివర్గమును బలుకరించి తానే నిజముగ చోడగంగదేవుడనని చెప్పికొని, సింహాసన మధిష్ఠించెను. ఇట్లు ఆటపాటల చేతనే రాజ్యమంతయు, తిరిగి వశమయ్యెను. రాజు చనిపోయినవెంటనే రాజానుచరులు పలాయనమైరి. కొలదికాలములో అనంతవర్మ చోడగంగదేవుడు తగిన ప్రయత్నములుజేసి శత్రురాజుల మూలస్థానమగు సజ్జనగరమును (జాజపూరు) ముట్టడించి శత్రువుల బూర్తిగనోడించి ఉత్కలరాజ్యమెల్ల జయించెను. కళింగరాజ్యములో నీయుత్కలరాజ్య మొక ప్రధాన భాగమయ్యెను. పరిపాలనము బాగుగసాగుటకై అనంతవర్మ తన రాజధానిని కటకమునకు మార్చివేసెను. నాటినుండియు కళింగమునకు కటకమే రాజధానిగ నుండెను. పై కథ నమ్మకపోవుటకు కారణమంతగా గానబడదు. కాని చారిత్రాధారములు గానరావు. అనంతవర్మ ఉత్కళమును జయించుటయు కటకమును నూతన రాజధానిగ మార్చుటయు నిశ్చయములు. ఈ జయము క్రీస్తుశకము 1132 న జరిగెను.

అనంతవర్మ చోడగంగదేవుడు 70 సం॥ పరిపాలనము చేసెను. ఈతడు 20 సం॥ ల ప్రాయమున రాజ్యాధిపత్యమును బడసి 90 సం॥ ల వరకు జీవించి యుండెనని యూహింపవచ్చును. వీనిని ప్రజలు

చోడగంగని పిలుచుచుండిరి. పట్టాభిషేక కాలమున అనంతవర్మ అను పేరుకూడ చేర్చుకొనెను. చోడ నామము తన తల్లివలన వచ్చినది. ఆమె పేరు రాజ్యసుందరి. ఈమె రాజేంద్రచోళుని కూతురు. 'రాజేంద్ర చోడుడు ప్రసిద్ధినందిన చోడదేశపు రాజరాజు కొడుకు. రాజ్యసుందరికి మరియొక సోదరిగలదు. ఆమెయే అమ్మంగదేవి. ఈమె చాలుక్య వంశప్రసిద్ధుడగు రాజరాజనరేంద్రుని భార్య. రాజరాజనరేంద్రుని తల్లియు చోళ రాజరాజు కూతురు. వాని తండ్రి విమలాదిత్యుడు. అందుచేత చాలుక్య రాజరాజనరేంద్రుడును కళింగ రాజరాజును తోటి అల్లుండ్రు. ఆ కాలమున చోళులతో సంబంధము ఘనకార్యముగ నెన్నబడుచుండెను. అందువలననే రాజ్యసుందరి కొడుకు చోడగంగని పిలువబడజొచ్చెను. గంగను పదము తన వంశమగు గంగవంశమును తెలుపుచున్నది. ఇక అనంతవర్మ యను పేరు ఈ వంశమువారందరును బిరుదునామముగ తలంచుచుండిరి. వాసిష్ఠకులజులు తొలుదొల్త నీకళింగము నేలిరని యింతకు ముందే చెప్పబడినది. వారిలో ప్రధానుడు అనంతవర్మ. దేవపురము రాజధానిగా నేలెను. వానినుండియు కళింగ మేలిన రాజులు అంటు ముఖ్యముగా తరువాతి గంగవంశపు రాజులు అనంతవర్మ నామమును బిరుదుగా వహించుచుండిరి.

కళింగరాజ్యము ఉత్తర, మధ్య, దక్షిణకళింగములుగ విభాగింపబడి త్రికలింగమున నొప్పుచుండెను. ఒకొక్క భాగము అనేక మండలములుగ విభజింపబడి ఒకొక్క మండలము మండలాధీశుల యాజమాన్యమున నుండెను. ప్రతిమండలమును అనేక విషయములుగ భాగింపబడెను. వరాహవర్తని, పంచాశోలవర్తని, కొంగోడు మొదలగునవి విషయములు. విషయాధీశుల పాలనమునందుండెను. కొన్ని గ్రామములు కలసి యొక విషయమగుచున్నది. పరిపాలనమునకు గ్రామము ప్రాతిపదిక. ప్రతిగ్రామమునకు ఖచితమైన సరిహద్దులున్నవి. ఈ సరిహద్దులు 'స్థాపిత శిల'లవలన నిరూపింపబడుచుండెను. భూములకు కట్టుబడి, నీటితీరువ మొదలగు పన్నులు విధింపబడుచుండెను.

ఈ శాసనము కళింగనగరమునుండి యొసగబడినది. ఈ కళింగనగరము నేటి ముఖలింగమని నిర్ధారణగ నిరూపింపబడినది. ఈ ముఖలింగము వంశధారా నదీతీరమున రమ్యమైన ప్రదేశమున నిర్మింపబడినది. ఇచ్చట అనేక దేవాలయములు కళింగాధీశులచే నిర్మింపబడినవి కలవు. ఇది రాజధాని నగరముగ నుండక పూర్వము 'గాంగ' 'గంగ' వంశపు రాజులకు దంతాపురము, సింహపురము రాజధానులుగ నుండెను. ఈ రాజులు పరమమాహేశ్వరు లనియు, పరమ భట్టారకు లనియు, మహారాజాధిరాజు లనియు, త్రికళింగాధిపతు లనియు చెప్పుకొనుటచేత, వీరి మతము శైవమనియు వీరు చక్రవర్తిపదవి ననుభవించుచుండిరనియు, త్రికళింగముల నేలుచుండిరనియు విశదమగుచున్నది.

అనంతవర్మ చోడగంగదేవుడు సమస్తామాత్యులను, ప్రముఖ జానపదులను, 'సంవా' విషయమందలి నందిగ్రామమున సమావేశపరచి ఆ సభ్యులకు నిట్లు విశదము చేసెను:—"సుమ్మిడి" గ్రామము, "మాందిలిప" గ్రామము అను వానిని గ్రాసముకొరకు సమస్తమైన పన్నులను తొలగించి సూర్యగ్రహణ కాలమున నాయొక్కయు నా తలిదండ్రులయొక్కయు పుణ్యయశోభివృద్ధికొరకు శ్రీవత్సగోత్ర మావిన బంధోపాధ్యాయుని పుత్రులు (1) ఆదిత్యభట్ట (2) ప్రయాపాఖ్య (3) దుర్గశర్మ (4) నారాయణ విష్ణుశర్మ (5) రుద్ర అను వారికిని, శాండిల్యగోత్ర (6) మావిపాఖ్యునకును ఇవ్వబడినది. ఈ యారుగురు బ్రాహ్మణులును అధీత వేదశాస్త్రపారంగతులు, సద్ధర్మ నిరతేభ్యులు. ఈ దానము శాకాబ్దములు గిరి, శశి, వియత్, చంద్ర, సంజ్ఞలచే తెలుపబడిన కాలమున (గిరి=8, శశి=1, వియత్=0, చంద్ర=1 అనగా అంకానాం వామతో గతిః అను సూత్రముచేత 1018 అగుచున్నది) ఉదకపూర్వకముగా నాచేత దానము చేయబడినది"

దానకాలము సూర్యగ్రహణ మగుటచేత శాలివాహనశకము 1018 సంవత్సరమున అనగా 1018 + 78 = 1093 క్రీ. శ. ఒసగబడినది.

ప్రతిగ్రహీతలు ఆంధ్రులుగా కనబడరు. వారు మావిన బంధోపాధ్యాయుని కొడుకులు. 'బంధోపాధ్యాయ' అను పేరు వంగదేశీయుడని స్ఫురించుచున్నది (వంగదేశీయులీ యాంధ్రదేశమున కెందుకు వచ్చిరి? ఎటుల రాజసన్మానమందిరి? ఎంతకాలము నుండి వారీ ప్రాంతమున నివసించుచుండిరి? అను ప్రశ్నలకు సమాధానము చెప్పుట కష్టము. బహుశా ప్రతిగ్రహీతలు ఉత్కళులయిన గావచ్చునేమో. మొదటి యైదుగురకు తండ్రి మావిన బంధోపాధ్యాయుడు. 'బంధోపాధ్యాయ' అను పదము ఇంటి పేరు గావచ్చును లేదా బిరుదునామము కావచ్చును. పేరు మాత్రము 'మావిన'. రెండవ పేరు 'మావిప'. ఈ రెండు నామములు తెలుగువారి పేరులేమో అని పదరూపమువలనను, పలుకుబడివలనను, ధ్వనివలనను సందేహము పొడముచున్నది. విదియు స్పష్టముగా

చెప్ప వీలుపడదు.) 'సంవా' విషయము మాత్రము ప్రస్తుత నరసన్నపేట తాలూకా యగుచున్నది. ఇది శ్రీకాకుళమునకు 12 మైళ్ళ దూరమున నున్నది.

శాసనపురేకులు చీపురుపల్లి తాలూకాలోని అవపాక గ్రామమున లభించినవి. దానమీయబడిన గ్రామములు నరసన్నపేట తాలూకాలోనివి. ప్రతిగ్రహీతలుగాని వారివంశీకులుగాని నరసన్నపేట తాలూకా విడిచి చీపురుపల్లి తాలూకాచేరి యచ్చట కొంత కాలము నివసించి ఏ కారణముననో ఆంధ్రదేశమును విడిచి వెడలునపుడీ శాసనముల కుండలలో భద్రము చేసి భూస్థాపితము చేసియుందురు. లేనియెడల భూస్థాపితము చేయు నవసర ముండదు.

శాసనగ్రంథమంతయు 40 పంక్తులలో నిమిడి యున్నది. ఈ గ్రంథ మయిదు పెళలపై లిఖింపబడినది కాని ఒక్క పంక్తికిమాత్రము స్థలము చాలకపోవుట చేత మరియొక రేకున శేషించిన పంక్తి చెక్కబడినది. ఈ పంక్తితో నాలుగురేకులైనవి. అయిదవ రేకున లిపి ఏమియు లేదు కాని 'సహీము' అను మూడక్షరములు మాత్రము చెక్కబడినవి.

క్రీ॥ శ॥ వాల్గవశతాబ్దమునుండి గుణమహార్ణవ మహారాజువరకు నేలిన రాజవంశము 'గాంగవంశ' మనియు తరువాతి రాజులు 'గంగ' వంశమనియు వాడుచుండిరి. 'గాంగ', 'గంగ' శబ్దములలో భేద మంతగా కానరాదు. ఉభయవంశములకు మహేంద్రగిరిపై ప్రతిష్ఠింపబడిన గోకర్ణస్వామియే ప్రధాన దైవతము. ఉభయవంశములవారును ఈ దైవతమువలన నే "సమాపాదితైక శంఖ, భేరీ, పంచమహాశబ్ద, ధవళచ్ఛత్ర, హేమచామర, వరవృషభలాంఛన సముజ్జ్వల సమస్త సామ్రాజ్యమహిమను" పొందినట్లు చెప్పుకొనుచుండిరి. కాబట్టి ఈ రెండువంశము లొక్కటే యని పొడగట్టుచున్నది.

ఈ వంశములు వేర్వేరని చెప్పుటకుకూడ నాధారములు లేకపోలేదు. మొదటివంశమువారు వంశావళిని చెప్పుటలో తండ్రిపేరుగాని ఒకొక్కప్పుడు తండ్రి తాతలగాని చెప్పుచుండిరే గాని మూలపురుషునినుండి వర్ణన కనబడదు. వారు గద్యనే గాని తరువాతివారివలె శ్లోకములచే వంశావళిని వర్ణించుటలేదు. దానకాలమును వివరించుటలో పూర్వపువారు "ప్రవర్ధమాన విజయరాజ్యసంవత్సరముల నే వాడుచుండిరి గాని శాలివాహనశకము వాడరైరి. తరువాతివంశమువారికి మూలపురుషుడు గుణవర్మ యని చెప్పుకొనుచుండ, తొలివంశమువారికి మూలపురుషు డెవడో తెలియదు. కళింగరాజ్యమున గాంగవంశస్థాపకు డెవడో వారు చెప్పుకొనకపోయినను, కాలగణనమునుమాత్రము ఆ రాజ్యస్థాపనకాలమునుండి చేయుచుండిరి. దీని నే కళింగప్రవర్ధమానలేక గాంగేయప్రవర్ధమాన విజయ రాజ్యసంవత్సరము లనుచుండిరి. ఈ గాంగశకము బహుశా వాల్గవశతాబ్దాంతమున స్థాపితమై యుండవచ్చును.

అనంతవర్మ చోడగంగదేవుడు కళింగనగరమున నేలినరాజులలో ఆఖరివాడును ఉత్కలమందలి కటకమున నేలినరాజులలో మొదటివాడునై యున్నాడు. ఈతనివంశమువారు క్రమక్రమముగ నుత్కలులై నేటి ఉత్కలమందలి రాజులకు మూలపురుషులగుచున్నారు. గంగవంశపుపరిపాలనము 1761 లో అంతమందినది.

అనంతవర్మ చోడగంగుని శాసనము లనేకములు బయలువెడలినవి. అందులో శిలాశాసనములు హెచ్చుగా నున్నవి. ఈని పూర్వులిచ్చిన తామ్రశాసనములలో అనియంకభీముడను మారుపేరుగల వజ్రహస్తునకు కామార్ణవ గుండమరాజులు కొడుకులనియు వారలు క్రమముగా అర్ధసంవత్సరము, మూడు సంవత్సరములు రాజ్యమేలిరనియు, ఆ తరువాత కామార్ణవ వినయమహాదేవులకు జనించిన వజ్రహస్తుడు రాజ్యమునకు వచ్చెననియు చెప్పబడినది. కాని అనంతవర్మ చోడగంగదేవుని శాసనములలో కామార్ణవ గుండమరాజుల తర్వాత వజ్రహస్తుని సాపత్న్య పుత్రుడగు మధుకామార్ణవుడు 19 సంవత్సరములు రాజ్యమేలినట్లు చెప్పబడినది. అందుకు సంబంధించిన శాసనభాగ మిట్లున్నది:—

..."తత స్తదగ్రసూనుః కామార్ణవదేవోర్ధ సమామ్ । తత స్తదనుజో గుణ్డమహీపతి స్త్రీణివర్షాణి। తదను తస్య ద్వైమాతురో మధుకామార్ణవ ఏకోనవింశతి వర్షాణి తతః కామార్ణవాద్వైదుంబాన్వయ సముద్భవాయాః వినయమహాదేవ్యాం జాతః శ్రీవజ్రహస్తదేవో...సత్రయత్రింశత మబ్దకా నవని మపాలయత్"

ఇట్టి విరోధపాఠముల చారిత్రపారంగతులు విమర్శించి సత్యమును నిరూపింపవలసి యున్నది.

అనంతవర్మ చోడగంగదేవున కనేకమంది భార్యలున్నట్లు శాసనములు చెప్పుచున్నవి. ముఖలింగ దేవాలయమందలి శాసనములలోను, దాక్షారామ దేవాలయ కుడ్యములపై వ్రాతలలోను, ఈని భార్యల నామములు గానబడుచున్నవి. ఈ భార్యలు తమ భర్తతో రాజ్యమందు సంచరించుచుండు సమయమున ప్రసిద్ధదేవాలయముల జూచుటయు దేవునికి

సమర్పించిన ధనకనక వస్తువుల క్రమము శిలాశాసనములు అచ్చటచ్చట వ్రాయించుటయు జరుగుచుండెను. ఇంతవరకు సమకూరిన వారి నామము లీ క్రింద చూపబడినవి.

అనంతవర్మ చోడగంగదేవుని భార్యలు:—

1. కస్తూరికామోదిని—పట్టమహిషి.
2. ఇందిరాదేవి
3. చంద్రలేఖ
4. జయంగొండారు
5. వెన్నవదేవి
6. పల్లవమహాదేవి
7. యరకమ్మదేవి
8. లావణ్యవతీదేవి
9. శాజలదేవి
10. పద్మలదేవి
11. శ్రియాదేవి
12. కల్యాణదేవి
13. చెన్నమహాదేవి
14. మాదమదేవి
15. చోడమహాదేవి.

ఇంక మరెందరుండిరో తెలియరాకున్నది

అనంతవర్మ చోడగంగదేవునకు ప్రధానమంత్రి పిన్నయభిట్టు. అన్యదేశ వ్యవహారముల జూచు మంత్రి (*Minister for foreign affairs*) సంధివిగ్రహి పెరు సామ్మలకేవన. సేనాపతు లనేకులు గలరు. అల్లన, ఎఱదొర మొదలగువారు. సర్వసేనాని బణపతి. ఈతడు బ్రాహ్మణుడు. వీని భార్య పద్మావతి. ఈతడే ఉత్కల దేశమును జయించుటలో రాజునకు మిగుల తోడ్పడెను. వేములవాడ భీమకవి శాపమున నీ రాజు కలింగదేశమున ఉత్కలాధీశునిచే గోల్పోవుటయు ఆ కవి యనుగ్రహమువలన తన స్వంత రాజ్యమును తిరిగి స్వాధీనపరచుకొనుటయే గాక, కలింగమునకు మూడు రెట్లధికముగా రాబడిగల ఉత్కలదేశమును జయించుటయు జరుగుటచేత చోడగంగు తన రాజధానిని మహానదీతీరమందలి కటకము రాజధానిగా జేసికొని తన పుత్రుల గొందరి నీ కళింగ మేలుటకై రాజప్రతినిధులుగ బంపెను.

అనంతవర్మ చోడగంగదేవుడు రాజనీతి నిపుణుడే గాక వినోదప్రియుడు గూడ నైయున్నాడు. ఈతని రాజధాని వంశధారా నదీతీరమందలి ముఖలింగమను మారుపేరుగల కళింగనగరము. ఈ నది రాజధాని నుండి 25 మైళ్లు తూర్పుగా ప్రవహించి సముద్రములో కళింగపట్టణమను చోట కలియుచున్నది. సముద్రమునకు మూడు మైళ్ళ దూరమున వంశధారా నదీతీరమున 'వనిత మండెల'మను గ్రామము చేరికిని కలదు. రాజీ గ్రామ సమీపమున గొప్ప భవనముల నిర్మించెను. అందు తన రాణులకును, వారి చెలికత్తియలకును, రాజభవనముల గట్టించెను. నాట్యశాలల గూడ నిర్మించెను. నదికి ఆనకట్ట కట్టించి యా జలమును వనిత మండల గ్రామములోనికి దెప్పించి జలక్రీడలకు కృత్రిమ తటాకముల నిర్మించెను. వీనియందు రాజుతో గలసి రాణులును వారి చెలికత్తియలును జలక్రీడల సలుపుచుండిరి. నాట్యశాలలలో నాట్యము లాడుచుండిరి. ఈతడు సంగీతప్రియు డగుటచేత వనిత మండలము ఎల్ల పొద్దులు వాద్యగానాది కుతూహలములతో నెగడుచుండెను. నేడా నాట్యశాలలు, జలక్రీడా తటాకములు, రాణివాస భవనములు, గీత వాద్యశాలలు నశించి భూగర్భమున దాగియున్నవి. ఈ గ్రామమున కెదురుగ నది కావలియొడ్డున సాలిహుండమను గ్రామమును, దానికి చేరువను పురాతన బౌద్ధ సంఘారామములు, స్తూపములు, విహారములు గల పర్వతమున్నది. ఇప్పు డీ పర్వతమును పురాతత్వ శాఖవారు వెలకొలది ధనము వినియోగించి త్రవ్వించుచున్నారు. దీనితోబాటు వనితమండల గ్రామమున గూడ త్రవ్వించిన ఆ కాలపువాటి అనంతవర్మ చోడగంగదేవుని రాజ్యవైభవము వెల్లడి కాగలదు. సాలిహుండమున వెలువరించిన అమూల్యవస్తు సామగ్రితో బాటు వనితమండలమున గూడ మరెట్టి వింతలు బయల్పడునో చూడవలయును.

మూలము—రేకులనుండి యథాప్రకారము

1 వ రేకు - 2 వ పెడ

పంక్తులు.

1. ఓం॥ స్వస్తి శ్రీమతా మఖిల భువన వినుత నయవినయ దయా (దాన)1 దాక్షిణ్య
2. సత్య శౌచశౌర్య్య ధైర్య్యాది గుణరత్న పత్రికాణాం మాత్రేయగో
3. త్రాణాం విమల విచారాచార పుణ్యసలిల ప్రక్షాలిత కలికాలక
4. ల్మషమషీణాం మహామహేన్ద్రాచల శిఖరప్రతిష్ఠితస్య
5. సచరాచర (గు)రోః సకలభువన నిర్మాణైక సూత్రధారస్య
6. శశాఙ్క చూడామణే ర్భగవతో గోకర్ణస్వామినః ప్రసా
7. దా త్సమాపాదితైక శఙ్ఖభేరీ పఞ్చమహాశబ్ద ధవళచ్ఛత్ర
8. హేమచామర వరవృషభలాఞ్ఛన సముజ్జ్వల సమస్త సామ్రాజ్య

2 వ రేకు—1 వ పెడ

1. మహిమ్నా మనేక సమరసఙ్ఘట్టసముపలబ్ధ విజయలక్ష్మీ సమాలి
2. ఙ్గితోత్తుఙ్గ భుజదణ్డ మణ్డితానాం త్రికలిఙ్గమహీభుజాం గఙ్గా
3. నా మన్వయ మలఙ్కరిష్ణో రిన్ద్రోరివ విక్రమాక్రాన్తసరామణ్డలస్య
4. గుణమహార్ణవ మహారాజస్య పుత్రః॥ శ్రీవజ్రహస్తదేవ శ్చ
5. తుశ్చత్వారింశతి మబ్దకాన్ క్షితిమరక్షీత్ తత్
6. నయో గుణ్డమరాజా వర్షత్రయ మపాలయత్ ॥ తదను తదనుజః
7. కామార్ణవదేవః పఞ్చత్రింశద్వర్షాణి । తస్యానుజో వినయా

2 వ రేకు—2 వ పెడ

1. దిత్యః సమా స్తిస్రః॥ తతః కామార్ణవ తనయో వజ్రహస్తః యో మదగలి
2. తగణ్డాన్ గజాన్ సహస్రస మర్దితార్థ్యః సమదాత్ షట్త్రింశత మ
3. బ్దకాన్॥ తత స్తదగ్రతనూజః కామార్ణవదేవో ర్ధసమాః॥ తత స్తదనుజో
4. గుణ్డమహీపతి స్త్రీణివర్షాణి॥ తదను తస్య ద్వైమాతురో మధుకామార్ణవ ఏ
5. కోనవింశతి వర్షాణి । తతః కామార్ణవా ద్వైద్యమమ్మాన్వయా యము
6. ద్భవాయాః వినయమహాదేవ్యాం జాతః శ్రీవజ్రహస్తదేవో మేఘ దివ
7. ః పతి స్త మతిభీషణ మశనిం శస్త్రాభిజఘాన స త్రయస్త్రింశ
8. తమబ్దకా నవనీ మపాలయత్ ॥ తతస్తస్యాత్మజ ధ వారిమద్ది

3 వ రేకు—1 వ పెడ

1. న స్సరాజరాజ క్షితిపః క్షితిం సమాః అరక్షీ దష్టౌ వరుణాలయాం
2. బరాన్నిధి ప్రావారలనాన్ని ధేయావ సన్నిధిః॥ తతో రాజేన్ద్ర చోళస్య

3. తనయా రాజసున్దరీ రాజ్ఞ స్తస్యాగ్రమహిషీ పతీ సుతా మనూయ
4. తా॥ శాకాబ్దేషన్ద రన్ధ్రగ్రహ గణగణితే కుమ్భసంస్థే దినే
5. శే శుక్లే పక్షే త్రితీయాయుజి రవిజదినే శేవతీ భేవ్వయు
6. గ్నౌలగ్నే గఙ్గావ్వవాయాంబుజవనదినత్రి దివ్యోర్వివిశ్వంధిరాయా
7. శ్చక్రం పంరక్షితుం సద్గుణనిధిరధిప శ్చోడగఙ్గాభి షిక్త

3 వ రేకు - 2 వ పెడ

1. ॥ కలిఙ్గనగరా త్పరమమాహేశ్వర పరమభట్టారక మహారాజాధిరాజత్రిక
2. లిఙ్గాధిపతిః శ్రీమదన న్తవర్మ్మ చోడగఙ్గదేవః కుశలీ సమస్తామాత్యప్రము .
3. ఖజనపదా న్సమాహూయ సమాజ్ఞాపయతి విదితమస్తు భవతాః సంవా విషయే న
4. ద్ధిగ్రామో సుమ్నడివామగ్రామా యాణ్లీ లిప్తాం కోభ్యేగ్రామాగ్రాసికుతు
5. చతుస్సీమావచ్ఛిన్న పజలస్థలస్సర్వపీడావివర్జిత మ్మాసోమ్యాపరా
6. గో సత్మవాస్తాతాపిత్రోరాత్మనశ్చ పుణ్యయశోభివృద్ధయే శ్రీవత్స
7. గోత్రస్య మాదివర్థి 3 న్లోపాధ్యాయస్య పుత్రేభ్యః ఆదిత్యభాష్య ప్రయాపాఖ్య
8. దుర్గ్గాశర్మ నారాయణ విష్ణుశర్మ రుద్రేభ్యః శాన్డిల్య గోత్రాయమాన
9. పాఖ్యాయచ అక్షతవేదశా స్త్రిభ్యః పద్మనాభ్ర విర శేభ్యః శాకా

4 వ రేకు - 1 వ పెడ

1. భైమ గిరి శశివియద్వన్ద్రగణితే మాదికపూర్వకం సంప్రదత్తో స్మాభిరితి॥

N. B. ఈ రేకుపై ఒక్క పంక్తియే కలదు.


5 వ రేకు - 1 వ పెడను "నసీరూ" అను యూనకేరములు మాత్రమే కలవు.

---


(1) 'దాన' పదమును మొదట చెక్కుట మరచి తరువాతి రెండు పంక్తులకు నడుమ చెక్కెను

(2) 'గు' చెక్కుట మరచెను.


(3) భింజోపాధ్యాయ— కావచ్చును.




1 వ రేకు—2 వ పెడ




2 వ రేకు—1 వ పెడ




2 వ రేకు—2 వ పెడ



3 వ రేకు—**1** వ పెడ



3 వ రేకు—**2** వ పెడ



4 వ రేకు—**1** వ పెడ

* ముక్తమాల *

శ్రీ కొర్లపాటి శ్రీరామమూర్తి

—: విద్యానగరం—ఉద్యానవనం—సంధ్యాసమయం :—

ప్రకృతిసుందరి పాణిపల్లవాలతో పద్మరాగాలను నీరాజనమిస్తున్నట్టుగా సాంధ్యరాగాలు చివురాకు చివరల చిందులాడుతున్నాయి...

చిన్నాదేవి శశికాంత శిలావితర్ది పయి విలాససుఖాసీనయై మాలికారచన సాగిస్తున్నది.

సమీప సరోవర సంచలత్ తరంగమధుర సంగీత భంగీరవాలకు నికట తట వేణునికుంజవినిర్గతాలవుతూ శ్రుతులు కలిపే మధుమత్త గంధవహాలు ఆ సుకుమారి అలినీలాలకములకు అతిహేలాగతులు నవరిస్తున్నాయి...ఆమె అరవింద నయనాలలో అనుక్షణం ఉత్కంఠ తొంగిచూస్తూ పొంగిపోతూవుంది.

ప్రతిక్షణ పరిభ్రమణ సంభ్రమావిష్టభ్రమరగీతి, ప్రావేశకీ ధ్రువగా శ్రీకృష్ణదేవరాయల ఆగమనం—అతని గంభీర వదనంలో అలంతి హాసం—

శ్రీకృష్ణ : చిన్నా!

చిన్నా : (ఉలిక్కిపడి చూచింది. అనూంతం సిగ్గువెల్లువ ఆమెను ముంచెత్తింది. తల వంచుకుని అరకంట చూస్తూ ఆత్మానందం పొందుతూ పువ్వులు గుచ్చడాన్ని మాని పట్టె దారాన్నే గుచ్చసాగింది.)

కృష్ణ: (ఒక్కడుగు ముందుకు వేసి) చిన్నా!

చిన్నా: (లజ్జాసుకుమారంగా) ప్రభూ!

కృష్ణ: మాలికారచన మాని శూన్యాన్ని మాదిలో గ్రుచ్చుతున్నావ్!

చిన్నా: (చూడుకొని మరీ సిగ్గుపడ్డది)

కృష్ణ: సిగ్గుపడకు...(సమీపిస్తూ) చిన్నా!

చిన్నా: (తొలగి) ఈ మల్లెపూవులు ఎలా విరిసి, మురిసిపోతున్నయో! (అంటూ ముడివేస్తూ ముందుకు వస్తుంది)

కృష్ణ: ప్రణయామృతం కురిసి మరీ!

చిన్నా: (హారాన్ని వేస్తున్న భంగిమంలో) ఏలినవారికి, అందుకే ఏరినపూవులతో ఈ విరిదండ—(వేయబోతుండగా)

కృష్ణ: ప్రేమహారంగా వేస్తున్నావ్ రాయలవారికి!

చిన్నా : (హారం వేసి) సాహితీసమరాంగణ సార్వభౌములకు!

కృష్ణ: చిన్నా! నీ సుకుమార సుందరకరకమల సమలంకృతమయిన ఈ సుమనోమంజరివల్ల నా వక్షస్స్థలం రత్నస్ఫటికంలా మారి అనంతకోటి ప్రభల్ని ప్రతిబింబింపజేస్తోంది!

చిన్నా: (నిండుగా నవ్వి) అది నా అదృష్టం.

కృష్ణ: కాదు. అదృష్టం అనేది వట్టి అపభ్రమ!

చిన్నా: ఆఁ! (ముఖం విన్నదనం వహించింది)

కృష్ణ: అదేం చిన్నా! అకస్మాత్తుగా నీ అరవిందవదనంలో మంచుతెర ముసలినట్టయింది. నీ చకోర

నయనాలలో కాలజీమూతాలు కరాళనృత్యం సాగిస్తున్నట్టు తోస్తోంది!

చిన్నా: ప్రభూ!...అవేవో మెరుపుతీవలే నా కళ్లల్లో కదులుతున్నయ్. కాని—

కృష్ణ: కాని?

చిన్నా: కాంతిరేఖల నడుమ కాలతిమిరాంధకారం!

కృష్ణ: కారణం?

చిన్నా: ఏమో భయంగా—ఎందుకో హృదయాంతరాళంలో ఆందోళనగా వుంది ప్రభూ!

కృష్ణ: (భుజంతట్టి బుజ్జగింపుగా) అందుకే అబలలన్నారు ఆడువారిని!

చిన్నా: (పరిదేవనగా) పేదరాలిని ప్రభూ!

కృష్ణ: (వారణగా) చిన్నా!

చిన్నా: (పాదాలమీదికి వాలుతూ) హీనకుటుంబంలో జన్మించిన దాన్ని కూడా!

కృష్ణ: చిన్నా! (అంటూ లేవనెత్తాడు. క్షణం మౌనం. దిగవలోకనం) అలా చూడు చిన్నా!...ఆ ప్రకృతి సౌందర్యంలో అమృతం మనకి ఆస్వాద్యమానం. అవిగో! ఆ తుంగభద్ర తుంగ తరంగాలు కుప్పిగంతు లిడుతున్న కురంగాలు! మనోరథాన్ని లాగే మరుత్తురంగాలు!

చిన్నా: (క్రమంగా వికాసాన్ని పొంది ఆశాదృక్కులు ప్రసరిస్తూ) నిజంగా?

కృష్ణ: ఇటు మల్లీమాలతుల వల్లీ నికుంజాలు పంపుతున్న ప్రణయసందేశాన్ని, దూతగా కమ్మని పటీరం...

చిన్నా: తెస్తూ ఈ కుటీరం చూచి కుంచించుకుపోతున్నది.

కృష్ణ: అచ్చే. అభేదాన్ని, చిన్నా! ప్రయోగపూర్వకంగా చాటుతోంది. అందుకే, వింధ్యాచల శృంగాలు విరజిమ్ముతున్న సంధ్యారుణరంగాలకు రంగవల్లికలుతీర్చి, పల్లకీలుపట్టి, ప్రేమవల్లకీ తంత్రులు మీటే ఈ చిన్నాదేవికి వసంతోత్సవశ్రీ వెలయిస్తోంది!

చిన్నా: (ఆశ్చర్య సంభ్రమాలతో) దేవి!

కృష్ణ: అవును. స్థిరవిద్యుల్లతా కాంతిరేఖల్లో, అచలన్నిశీథిని రత్నకంకణ నీరాజనంతో, మన ప్రేమ పవిత్రమై, పరాకాష్ఠ చెంది, పురావైభవస్ఫురదైక చిరానందంతో నిన్ను ప్రభ్వీణిగా చేస్తుంది.

చిన్నా: ఏమంటున్నారు ప్రభూ!

కృష్ణ: అతిత్వరలో అనుభవపూర్వక మహావైభవ ప్రాభవ మహాతీశ్రుతులు సవరిస్తాం, నిర్మల నిక్వణ నిస్వనాలు వివరిస్తాం, అని!

చిన్నా: అంతటి సౌభాగ్యం నాకే!

కృష్ణ: నీకా?

చిన్నా: నాకు కాదూ?

కృష్ణ: కాదు. నా హృదయారాధ్య దేవతకు!

చిన్నా: ఎవరో ఆ అదృష్టవతి?

కృష్ణ: ఎంత ముగ్ధవ్! నా హృదయారాధ్య దేవత ఒక పేదరాలు! హీనకులజ!

చిన్నా: ఆఁ! (పరమానంద పారవశ్యం)

కృష్ణ: చిన్నా! (చేయి పట్టుకుంటాడు)

చిన్నా: ప్రభూ! (ఓరకంట చూస్తూ ఒయ్యారం ఒలికిస్తుంది)

కృష్ణ: (భుజాస్ఫాలన ప్రయత్నం)

[హఠాత్తుగా డుడుముల ఉగ్రధ్వనులు]

(ఉభయులూ తెల్లబోతారు. చిన్నాదేవి భయకంపితగాత్రియై దూరంగా జరుగుతుంది. ఆకాశం వంక భయంగా చూస్తుంది)

కృష్ణ: (సమీపిస్తూ) కవయిత్రిలా ఏమిటీ ప్రకృతి పరిశీలన?

చిన్నా: ఎవరి అదృశ్యహస్తం ఆ మాయదారి మబ్బు పింజల్ని విరజిమ్మిందో గానీ చూస్తుండగానే అవి పల్లిశిలా చుట్టు ముట్టాయి!

కృష్ణ: అయితే—(ఆలోచనగా ఆగి మెడలో హారాన్ని తీసి మీఁజేయిమీద వేసికొని) చిన్నా!

చిన్నా: ప్రభూ! (ఒకడుగు ముందుకు వేస్తుంది)

[బయటదూరంలో సింహగర్జనలా ఒక పురుషకంఠం. అమ్మాయ్!]

చిన్నా: (భయంగా) మా నాన్న!

కృష్ణ: (నిర్భయంగా) రానీయ్. భయపడతావేం? (హారాన్ని ఆమె మెడలో వేస్తాడు)

చిన్నా: (చిరునవ్వు చిందిస్తూ క్రీగంట చూస్తుంది)

కృష్ణ: (దరహాసంతో దగ్గిరగా రాబోతాడు)

[మళ్ళా బయట సమీపంలో అమ్మాయ్!]

చిన్నా: (భయపడిపోయి) అమ్మో! – మీరు –

కృష్ణ: మరేం భయంలేదు. ఈ చెంత మల్లె పొదలమాటున—(అంటూ అనుగు కదలిస్తాడు)

చిన్నా: (అటు భయం. ఇటు ఆనందం) అపర కృష్ణులై—

కృష్ణ: (ఆగి చిన్నాదేవిని చూచి నవ్వుతాడు)

చిన్నా: (మళ్లీ నవ్వుతుంది)

కృష్ణ: (వామభాగంలోకి నిష్క్రమిస్తాడు)

చిన్నా: (దక్షిణభాగం చివరంటా వెళ్లి, మళ్ళీ వామభాగంవయిపు కొంతదూరం సాగి, మధ్యగా ఆగి. అటూ ఇటూ ఆశగా ఆందోళనగా చూస్తుంటుంది)

["అమ్మాయ్!" అంటూ స్వామి వస్తాడు. ఆపిలుపుకి "నాన్నా!" అంటూ చిన్నాదేవి కుడివైపు తిరిగి భయాన్ని కప్పిపుచ్చుకోడానికి ప్రయత్నిస్తుంది.]

స్వామి: (వామభాగంలోకి తర్జని ప్రసారిస్తూ) అటు చూడమ్మాయ్!

చిన్నా: (భయంగా చూచి) ఏముంది అక్కడ నాన్నా?

స్వామి: ప్రకృతి!

చిన్నా: (ధైర్యం కలిగి) అవును.

స్వామి: అవును కాదు. అమ్మాయ్! ప్రకృతి విసుస్తోంది!

చిన్నా: ఎందుకూ?

స్వామి: మనవంటి దరిద్ర హీన దీన కులస్థుల ఆశాఆకాశసౌధాలు చూచి!

చిన్నా: (వారణగా) నాన్నా!

స్వామి: ఆకాశానికీ భూమికీ, అమ్మాయ్!, సంకెళ్లు వేస్తున్నావ్!

చిన్నా: (అయోమయంగా) ఏమిటి నాన్నా!

స్వామి: (ఉద్వేగంలో) పర్వతాలకు పసిడి పత్రాలు కడుతున్నావ్.

చిన్నా: (భయంగా) నాన్నా!

స్వామి: (ఉద్రేకంగా) అంతే కాదమ్మాయ్! పులివధూయిష్టమైన మణిని పుటం పెట్టక మానరు!

చిన్నా: (భయవిషాదాలతో) ఇదంతా ఏమిటి నాన్నా!

స్వామి: (ఖండితంగా) జరుగుతున్న చరిత్ర!

చిన్నా: (అమాయికంగా) ఏమయింది?

స్వామి: (తీవ్రంగా) జరుగుతున్న చరిత్ర గ్రంథంలో ఎగురుతున్న పుటలపై ఎర్రని శిలాక్షరాలు వ్రాయడానికి ఎవరో కుఠారమునే సంచెను రక్తమునే రంగులోనుంచి ఎదురుచూస్తున్నారు!

చిన్నా: మీ బాధ ఏమిటో నాకు బోధపడటం లేదు.

స్వామి: (తీవ్రంగానే) అమ్మాయ్! మన మెవరు?

చిన్నా: మనుష్యులం!

స్వామి: (వికటంగా నవ్వుతూ) అహ్హహ్హ మనుష్యులం!—పిచ్చిపిల్లా! మనుష్యుల దృష్టిలో మనుష్యులమయిన మనం మనుష్యులం కాము. (తీవ్రంగా) అమ్మాయ్! మీ అమ్మెవరో తెలుసా?

చిన్నా: (మెల్లగా) దేవదాసి అని విన్నాను.

స్వామి: వినడం కాదు నిజమే!

చిన్నా: (అమాయికంగా) మరి—

స్వామి: ఆదా నీ అనుమానం? మా యిద్దరి విలోమ వివాహాన్నీ నాటి సమాజం సమాధి చేసింది.

చిన్నా: కారణం?

స్వామి: పిచ్చిపిల్లా! ఆచార వ్యవహారాల అధిక బలీయమైన అధికారం!

చిన్నా: నాన్నా! ఇవాళ ఈ మాల అంతఃపురంలో ఇవ్వరా?

స్వామి: (హేళనగా) అంతఃపురంలో! విజయనగర సార్వభౌములవారి వినిర్మలాంతఃపురంలో!- హుం. గుడ్డినమ్మకం వున్నంతకాలం మన అమ్మకం సాగుతుంది.

చిన్నా: గుడ్డి నమ్మకమా?

స్వామి: కాదా? వేయికళ్లతో ప్రజల్ని పాలించడానికి పట్టాభిషిక్తుడైన ప్రభువు కృష్ణదేవరాయలు; రాజాంతఃపుర పుష్పమాలావిక్రేత ఇచ్చే వాడిన పూలదండను మన్నించడం మనమీది గుడ్డి నమ్మకంవల్ల కాదా?

చిన్నా: (ఆలోచనగా) వాడిన పూలదండనా!

స్వామి: అమ్మాయ్! ప్రభువులతో పరిహాసం కాలసర్పంతో చెలగాటం! ఇక ప్రణయమా? పులి గోళ్ళతో కురులు దువ్వుకోవడమే అవుతుంది.

చిన్నా: అలాగనవద్దు నాన్నా! (తన్మయ ముద్రలో) నేనంటే ప్రభువువారి కెంతో మనస్సు!

స్వామి: అవన్నీ అధరాలపైని అమృతధారలే! అమ్మాయ్! నేను కర్కశసమాజంతో కత్తి కలిపిన వాణ్ణి. కదనరంగంలో నాకు తాత్కాలిక విజయమే లభించింది. నీ తల్లి బలిఅయింది. నాకు వెలి అయింది!

అయినా జీవచ్ఛవంలా వున్నానంటే కారణం, నా, ఆ విజయం నీకు గృహిణీత్వం సిద్ధించగానే చరితార్థమవుతుందని! అదే నా ఆశ. నువ్వు గృహిణివి అవ్వాలి! అందుకే ఈ శేషజీవితంలో నా కంఠశోష. నా మాట విని ప్రభువుమీద ప్రణయదృష్టి మరల్చుకో!

[ఉరుముల ఉగ్రధ్వనులు]

చిన్నా : (వెర్రి కేకగా) నాన్నా!

స్వామి : ఆలస్యమయింది. అంతఃపురానికి వెళ్ళాలి. ఏదా మాలిక?

చిన్నా : (యాంత్రికంగా హారం తీసి అందిస్తుంది)

స్వామి : (వెళుతూ) నా మాట విని ప్రభువు మీద ప్రణయదృష్టి మరల్చుకో! (వెళ్ళిపోతాడు)

చిన్నా: (తెల్లబోయి చూస్తుంటుంది.)

[ఉరుముల ఉగ్రధ్వనులు]

(తెరలో స్వామికంఠం:—"నా మాట విని ప్రభువుమీద ప్రణయదృష్టి మరల్చుకో" అని)

చిన్నా: (భరించలేక) అమ్మా! (అని బావురుమంటుంది)

(గంభీరగమనంతో శ్రీకృష్ణదేవరాయల ఆగమనం)

కృష్ణ : చిన్నా!

చిన్నా: (చూచి, ఆశగా మోమెత్తి-నిష్పృహ పాపమై, చివాల్న మోము వాల్చుకొంటుంది)

కృష్ణ : చిన్నా! (ఆందోళనగా సమీపిస్తాడు)

చిన్నా: (దీనంగా నీరసంగా) ప్రభూ! (కళ్లెంబడి నీళ్లు స్రవిస్తాయి)

కృష్ణ : (చిన్నాదేవి చిబుకం పట్టి మోము నెత్తి ఆమె కపోలాలపై జారే కన్నీటికణాలు చూచి ఉద్విగ్నుడై చిన్నా! (చిబుకం వదిలేస్తాడు)

చిన్నా: (క్రమంగా ఆశగా చూచి) ప్రభూ!

కృష్ణ: (గంభీరంగా) ఎంత దురవస్థ!

చిన్నా : (జాలిగా) దురవస్థా?

కృష్ణ : కాదులే! (ప్రక్క మొహం పెడతాడు)

చిన్నా : (వికలంగా) ఏమిటది ప్రభూ? (సమీపించబోతుంది)

కృష్ణ : (దూరంగా సాగి) ఏమీ లేదు.

చిన్నా: (సమీపిస్తూ) చెప్పరూ బాబు?— దాపరికమా? (అతని భుజంమీద వాలిపోతుంది)

కృష్ణ: (తప్పిస్తూ) దాపరికమెందుకు? (అంటూ తిరిగి చిన్నాదేవిభుజాలు పట్టుకొని కళ్ళల్లోకి చూస్తూ) ఇవాళే మనం, చిన్నా! చేయకూడని రెండు అపచారాలు చేశాం.

చిన్నా: అపచారాలా?

కృష్ణ: అవును. ప్రభువునైన నేను ప్రణయభీరువునై మల్లెపొదలమాటున... శ్రీ కృష్ణదేవరాయల పట్టమహిషివి, హృదయదేవేరివి, కానున్న నీవు కాటుక రేకలు కరిగిపోయేలా కన్నీరు నిండడం అపచారాలు కావా?

చిన్నా: (జాలిగా) ప్రభూ!

కృష్ణ: విన్నావు చిన్నా! మీ నాన్నగారి మీమాంస! సముచితం కాదని గాని... సరే... చిన్నా! ఇవాళే మన వివాహానికి —

చిన్నా: (ఆనందాశ్చర్యాలతో) ఆఁ! ఏమిటీ!

కృష్ణ: (చిరునవ్వుతో) ఏర్పాట్లు! (చిన్నాదేవి చిబుకంమీద చిటిక వేసి) మరింక సెలవా?

చిన్నా: (సిగ్గుతో—ఆశగా) వెళతారా?

[ఉరుముల ఉగ్రధ్వనులు – తిమ్మరుసు ప్రవేశం]

కృష్ణ: (వీడక) చిన్నా!

చిన్నా: (తీపి ధోరణిలో) ప్రభూ!

(పరస్పరం సన్నిధికి వస్తుంటారు)

తిమ్మ: (దగ్గుతాడు)

కృష్ణ:
చిన్నా: } (వినరు)

తిమ్మ: (గట్టిగా మళ్ళీ దగ్గుతాడు)

కృష్ణ:
చిన్నా: } (విని - చూచి - తొట్రుపాటు)

కృష్ణ: (తిమ్మరసుని చూచి) అమాత్యశ్రీ!

తిమ్మ: ప్రభూ!

కృష్ణ: అభివందనాలు!

తిమ్మ: శుభావాప్తిరస్తు.

(వెనకవాటుగా చిన్నాదేవి వెళ్లిపోతుంది)

[అధికంగా ఉరుముల ఉగ్రధ్వనులు]

తిమ్మ: పరికిస్తున్నారా ప్రభూ! ప్రపంచాన్ని కబళించనున్న ప్రళయాన్ని క్షణం ప్రణయాన్ని మరచి!—నిన్న మొన్నటివరకూ అనావృష్టి! ఇక అతివృష్టి అని దైవజ్ఞుల హెచ్చరిక! అందుకు సాక్షీభూతంగా అప్పుడే కారుమబ్బులు కాండ్రు కాండ్రుమంటున్నాయి. పాపం, ప్రజలు—

కృష్ణ: అమాత్యశ్రీ! అనుమానించడ మెందుకు? అనుక్షణమే, మన అభిమతాన్ని ప్రజలకు ప్రకటించండి. ఎంతటి ప్రళయం సంభవించినా ప్రజల ఆవాస ఆహార సౌఖ్యాలనిమిత్తం ఏర్పాట్లు ఆలోచించండి. అవసరమయితే సుంకాలు తగ్గించడానికీ సుముఖులమే అవుదాం.

తిమ్మ: అబ్బ! ఏమి పరిపాలనాదక్షత! మాటాడితే పన్నులు తగ్గించివేద్దాం, ప్రజలకు వసతులు కల్పించేద్దాం అనేగాని ఇతరాలోచన ఏదీ అక్కర్లేదు!

కృష్ణ: అప్పాజీ!

తిమ్మ: అబ్బాయ్!

కృష్ణ: అలా ఆకాశంవంక చూడండి (చూస్తూ)

తిమ్మ: ఏం? (చూచి) అరాచకంగా ముసల్మాను ప్రభుత్వంలా వుంది.

కృష్ణ: కాదప్పాజీ! అదొక దివ్యసందేశాన్ని అందిస్తోంది నాకు.

తిమ్మ: సందేశమా?

కృష్ణ: సందేహ మేమీ లేదు. దివ్యసందేశమే! అటు చూడండి. నిర్మలావ్యక్తమధురభావ గంభీర మయిన సముద్రజలకణాల్ని మేఘమాలా రూపంలో విశాలవిశ్వానికి దివ్యాభరణంలా దిద్దితీర్చి, సూర్య రశ్మి, పునః, కృతజ్ఞతాపూర్వకంగా అవినాభావం గల ఆ సముద్రానికే భంగ్యంతరంలో సమర్పిస్తోంది! సత్కరిస్తోంది!

తిమ్మ: అది ప్రకృతిధర్మమే నాయనా!

కృష్ణ: ప్రకృతిపరంగా దివ్యత్వాన్ని ఆపాదిస్తాం.

తిమ్మ: ఆపాదించవచ్చు.

కృష్ణ: ప్రకృతికి మానవస్వభావం ప్రతిబింబం. సూర్యరశ్మికీ విశాలవిశ్వానికీ వున్న సంబంధం మానవులమధ్య సంభవమయితే—

తిమ్మ: (తేలికగా) అయితే?

కృష్ణ: కావ్యత్వాన్ని ఆపాదించాలని!

తిమ్మ: కాంక్షిస్తున్నావ్! ... అర్థమయింది నీ అన్యాపదేశం. అది అసంభవం.

కృష్ణ: (తొట్రుపడి) అసంభవమా?

తిమ్మ: విజయనగర సామ్రాజ్యాధీశ్వరులకు ఒక సామాన్యపుష్పమాలావిక్రేతపుత్రికతో పొత్తుపొసగదు.

కృష్ణ: అప్పాజీ!

తిమ్మ: (అధికారస్వరంతో) ప్రభూ!

కృష్ణ: అంటే అమాత్యశ్రీగారూడా అదేనా మీ అనుశాసనం?

తిమ్మ: హీనదీనకులసంపర్క సాంగత్యాలు ప్రభుమర్యాదకు భంగకరం!

కృష్ణ: మంత్రిపుంగవులు తిమ్మరుసయ్యకి పుత్రతుల్యులైన ఈ కృష్ణదేవరాయల మనవి. నా హృదయవసంతారామవిలసితములై వికసితములైన ప్రణయలతలు—

తిమ్మ: (నిరసనగా) ప్రణయం! (నవ్వి) వెర్రివాడా! ఆ ప్రణయతంత్రాలూ ప్రణవమంత్రాలూ సోమరిపోతులకూ సోమయాజులగార్లకూను!

కృష్ణ: పొరబడుతున్నారు అప్పాజీ!

తిమ్మ: నేను పొరబడవచ్చు. కాని చిరంజీవి శ్రీ కృష్ణదేవరాయలకు చిన్న హెచ్చరిక! శక్తిమంతములైన శాస్త్రవాక్యాలకూ, దీప్తిమంతములైన రాజమర్యాదలకూ నిబంధనపాటవం అనే ఉక్కుతొడుగు ఏనాట్నుంచో ఉండటంవల్ల పొరపాటు అనే చెదపురుగు వాటినేమీ చెయ్యలేదు.

కృష్ణ: ఒక సంగతి. మీరన్నట్టు చిన్నాదేవి, శరీరానికి కులభ్రష్టతా! దరిద్రతా!...ఆమెమనస్సుకవి లేవు. కాక, కర్మచండాలత గర్హణీయం కాని జాతిచండాలత గర్హణీయమని శాస్త్రాదేశం కానే కాదు.

తిమ్మ: ప్రతి ప్రియుడికీ మానసవిహాయస భ్రాంతివిహారమూ, అప్రముఖశాస్త్రవిషయబలవదను సంధానమూ నాందీ ప్రస్తావనలే!

కృష్ణ: మా ప్రేమ హృదయాల కోరికల విలువ నాణెపుముద్రల్లో చాటబడేది కాదు. మూగచూపులతో ముగ్ధమోహనమై, స్నిగ్ధసుందరమై, హృదయకావ్యానికి భాష్యం చెప్పగల ఏకైక వస్తువు! ఆ పువ్వు హృదయాలకే తెలుసు మా ప్రేమవిలువ! అందుచేతనే చిన్నాదేవికి పువ్వుమాలతో నన్నలంకరించడమే ప్రేమపూజ! — మా ప్రేమపూజలు, అమాత్యశ్రీ! కఠినశిలానిలయాల్లో కాదు. అప్పాజీ! మృదుమధుర మానసాలయాల్లో!

తిమ్మ: ప్రౌఢంగానే ప్రారంభమయిందీ ప్రథమాంకం!

కృష్ణ: కనుకనే, పూజార్థం వినియోగించినప్పటికీ ఆ మాలా ఈ మాలా చేర్చి చిన్నాదేవి అంతఃపురానికి పంపిస్తోంది! అది నేను గమనించే స్వీకరిస్తున్నా.

తిమ్మ: (తీవ్రంగా) ఏమిటీ?

కృష్ణ: చిన్నాదేవితండ్రి స్వామి ప్రతి నిత్యమూ అంతఃపురానికి పూవులు తేవడం అతని పూదోటలు అన్యాక్రాంతములయినప్పటికీ ఆచారంగా నిలిచిపోయింది. అతనికి ప్రస్తుతం ఉన్నది ఒక మల్లికావల్లి. మరొకమాలతీనికుంజం! అవి నిత్యమూ ఎన్ని మాలలని ప్రసాదించేను?

తిమ్మ: అందుకని ఉచ్ఛిష్టాన్ని ఉద్ధరిస్తున్నారా?

కృష్ణ: నన్నర్పించిన పూలదండను చిన్నాదేవి తండ్రికి అజ్ఞాతంగానే కొబ్బోలు లతమా సరాలతో కలిపి అందజేయిస్తోంది!

తిమ్మ: అంతటి సంగనాచి కనుకనే ఇంతటి ప్రభువును—

కృష్ణ: అప్పాజీ!

తిమ్మ: (ఉగ్రుడవుతూ) అది నీచకృత్యం కాదా? ఒక పుష్పలావిక ఆవిఘ్నంగా ఒకసారి ఉపయోగించిన దిరిసెండను అంతఃపురానికి పంపించడం అనేది ప్రభుత్వ జాగరూకతను కించపరచడమే! అది కఠిన శిక్షార్హమైన రాజద్రోహం!

కృష్ణ: (స్మితరేఖతో) స్వపక్ష సమర్థనకు శబరి చరిత్ర విస్మరించకండి.

తిమ్మ: అది భక్తి!

కృష్ణ: ఇది ప్రేమ!

తిమ్మ: సహస్రధా వ్యత్యస్తం! అంతే కాదు. అప్రశస్తం.

కృష్ణ: అయినా స్వయంసముజ్జ్వలములయిన సమున్నత హిమవన్నగ గౌరీశంకరశిఖరాలే అవి!

తిమ్మ: పరిపడని సాదృశ్యం.

కృష్ణ: ప్రత్యేకతగల ప్రేమా భక్తీ అద్వైత భావాన్ని అందుకొన్నవే! ప్రేమలో భక్తి! భక్తిలో ప్రేమ! అదే పరమార్థరహస్యం! అప్పుడే నివృత్తి!

తిమ్మ: బాగుంది అభినవమైన ఆమ్నాయం!

కృష్ణ: మా ప్రేమ వివాహానికి, అప్పాజీ! మీ అనుమతి అపేక్షా సుసాధ్యం!

తిమ్మ: అది కేవలం స్వప్న సందర్భం!

కృష్ణ: అప్పాజీ!

తిమ్మ: అసంభవం నా అంగీకారం!

కృష్ణ: నిశ్చితపూర్వమా?

తిమ్మ: ప్రభువులకు పరిచారికాకులతో వివాహప్రసక్తి కేం వినకూడదు. అలా జరగడానికి వీల్లేదు.

కృష్ణ: వీల్లేదా?

తిమ్మ: (నిష్కర్షగా) ముమ్మాటికీ!

కృష్ణ: అయితే చిన్నాదేవి పట్టపుదేవరి కానిదే నేను పరిపాలించడమూ నిరవకాశమే!

తిమ్మ: నిరవకాశమా?

కృష్ణ: మరోసారి లేదని చెప్పడాని విచారిస్తున్నా.

తిమ్మ: మంత్రిగా నేను మరోసారి మనవి చేస్తున్నా.

కృష్ణ: (తీవ్రంగా) ప్రభువుగా చెప్పేది అంతరంగికవిషయాల్లో అమాత్యశ్రీల అభినివేశం అతిక్రమణమే అవుతుందని.

తిమ్మ: అభిమానధనులకు అభివాదపరంపర!

(ఒక్కడుగు ముందుకు కదుపుతాడు)

కృష్ణ: (వ్యాకులప్రసారిత తర్జని ప్రకంపిస్తుంది)

తిమ్మ: (ఆగి) విజయనగరసామ్రాజ్య వీరపౌరుడిగా విజ్ఞప్తి. ప్రభూ! విశాల వినీల విహాయస వీధిలో విహారం చేసే విజయనగరసామ్రాజ్య మహాపతాకను రాత్రింబగల్లు రక్షించుకోవలసిన ప్రజలపక్షాన ప్రభుకార్యంపట్ల ఇదే అసమ్మతి ప్రకటన!

కృష్ణ: మంచిది. ప్రజావైముఖ్యాన్ని సహించని ఈ ప్రభువిక ప్రభుత్వాన్ని నిర్వహించడం తప్పక నిరవకాశమే!

తిమ్మ: కనుకనే చిన్నమ్మను రాణిని చెయ్యాలన్న భీష్మప్రతిజ్ఞ మానండి.

కృష్ణ: (నవ్వుతూ) భీష్మప్రతిజ్ఞాప్రతిమానంచేత సాఫల్య కృతార్థుడను!

తిమ్మ: విషయాంతరవిన్యాసంకల్పనా ఫలప్రుతి?—తమకు సర్వ్వాచరణీయం చిన్నాదేవిని విడిచిపెట్టడమే!

కృష్ణ: చిన్నాదేవినా? విడిచిపెట్టడమా? అసంభవం!

తిమ్మ: మరి గత్యంతరం?

కృష్ణ: పవిత్రప్రణయలతాలవిత్రమయిన పదవిని పరిత్యజించడమే! మధురమనోజ్ఞమంజులమైన సుందర ప్రకృతి సృజించడమే!

తిమ్మ: నిశ్చయమా?

కృష్ణ: దృఢనిశ్చయం!

తిమ్మ: సంతోషం! సెలవ్! (నిష్క్రమిస్తాడు)

కృష్ణ: (తీవ్రాలోచనలో పడి క్రమంగా వికాసాన్ని పొంది మందహాసం చేస్తుండగా—

(చిన్నాదేవి వస్తుంది)

చిన్నా: ప్రభూ!

కృష్ణ: చిన్నా! నీ ప్రేమబహుమానికి కావ్యత్వాన్ని కల్పించి చిరస్థాయిగా చిత్రించడానికి సంకల్పించాను.

చిన్నా: ఏమిటి ప్రభూ?

కృష్ణ: అపూర్వంగా!... కావ్యత్వంలోనే దివ్యత్వం! దివ్యత్వంలోనే కావ్యత్వం!

చిన్నా: అదెట్లాగండి?

కృష్ణ: చిన్నా! నీ సుకుమార పవిత్రహృదయ పూజాద్రవ్యమైన ముక్తమాల కావ్యత్వాన్నంది ఆముక్తమాల్యద అవుతుంది.

చిన్నా: (ఆశ్చర్యంగా) ఆముక్తమాల్యద!

కృష్ణ: (ధ్రువీకరణగా) ఆఁ! ... ప్రబంధరాజం! ... అందులో ఒక భక్తురాలు తన ప్రేమ హృదయాన్ని భగవంతుడికి అర్పించి తాదాత్మ్యం పొందుతుంది. ఆ మానవకన్యాభగవానుల తాదాత్మ్యమే దివ్యత్వం. నా హృదయంలోని చిన్నాదేవి నా హృదయగత మహాకావ్యంలో గోదాదేవి!

చిన్నా: (విస్మయానందాలతో) ఎంతమాట!

కృష్ణ: మేరు సదృశమేనా?

(తిమ్మరసు తిరిగి వస్తాడు)

చిన్నా: (మాటలేదు. తన ధోరణిలో తన్మయభావంతో) నేనంటే ఏలినవారికి ఎంత ప్రేమ! ఈ సృష్టిలో ఏ ప్రియుడూ ఏ ప్రేయసికీ ఇవ్వని మహత్తర శాశ్వత కవితాస్థానాన్ని నాకు సమకూరుస్తున్నారా?

కృష్ణ: అనిదంపూర్వంగా అంతర్వాహినిలో!

చిన్నా: (తాదాత్మ్యంతో) ధన్యురాలిని ప్రభూ! (ఆనందం పట్టలేక పోతూ) మరా మహాకావ్యంలో మీ పాత్ర?

తిమ్మ: భగవద్భక్తులు భగవత్స్వరూపులే గా!

చిన్నా, కృష్ణ: (చూస్తారు)

తిమ్మ: శ్రీకృష్ణదేవరాయలవారే విష్ణుస్వరూపులు!

చిన్నా: (సవినయంగా నిష్క్రమించబోతుంది)

తిమ్మ: అమ్మ సౌభాగ్యవతీ!

చిన్నా: (ఆగి) మహామంత్రులకు వతకేర్పనమస్కృతులు!

తిమ్మ: సుమంగళీభవ!

కృష్ణ: క్షమించండి అప్పాజీ!

తిమ్మ: ఎందుకు?

కృష్ణ: నా చిన్నాదేవి ప్రేమను పురస్కరించుకొని మీ నిర్ణయాన్ని తిరస్కరించినందుకు—

చిన్నా: ఏమిటి ప్రభూ! అమాత్యశేఖరుల ఆదేశానికి మీ తిరస్కారమా?

తిమ్మ: (చిన్నాదేవిని) ఉచితజ్ఞురాలివి!

కృష్ణ: చిన్నా!—

తిమ్మ: (అడ్డుకొని) సౌభాగ్యవతీ! నీమీది ప్రేమ వదులుకోలేక—

చిన్నా: (విషణ్ణయై) నామీది ప్రేమ వదులుకోడమా?

(స్వామి వస్తాడు)

కృష్ణ: అప్పాజీ!

తిమ్మ: (ఏమీకూడా అలక్ష్యంగా చిన్నాదేవితో) ప్రభుత్వమర్యాదలూ, మతసంప్రదాయాలూ మరీ కులాంతరవివాహాన్ని సమ్మతించవ్ కదూ సౌభాగ్యవతీ!

చిన్నా: నిజమేఁ!

స్వామి: అమ్మాయ్!

చిన్నా: నాన్నా!

స్వామి: ఏనాడో నేను చెప్పలేదూ?—మనుష్యుల దృష్టిలో మనుష్యులమైన మనం మనుష్యులం కామమ్మాయ్!

తిమ్మ: సౌభాగ్యవతీ! విజయనగర సామ్రాజ్య విభవశ్రీ స్మరించైనా నీవు దేవరవారిపై ప్రేమ మరలించుకోవాలి.

చిన్నా: (నిర్ఘాంతపోయి) ఆఁ!

కృష్ణ: (హెచ్చరికగా) అప్పాజీ!

తిమ్మ: (కర్కశంగా) అనుకుంటున్నది నిన్ను కాదబ్బాయ్! (మృదులంగా) ఏమంటావమ్మా?

చిన్నా: నా ప్రణయమూర్తిపై ఆశ మరలించుకోవాలా మంత్రిగారూ?

తిమ్మ: యావద్విజయనగరసామ్రాజ్యశాంతిభద్రతల దృష్ట్యా—అనేక మహామ్మదీయులు విజృంభిస్తున్నారు. ఇలాంటి విషమసంధిలో సుమమ పూజ

లతో కృష్ణదేవరాయలవంటి వీరుడు ప్రణయినీ ప్రసవ డోలికల్లో మైమరచిపుంటే సమరసన్నాహం సాగదు. సామ్రాజ్యసుస్థిరత అసాధ్యం! జయభేరీ నినాదాలు దిక్కులు పిక్కటిల్లడానికీ, శత్రు శిబిరాలు శ్మశాన స్థావరాలు కావడానికి, ప్రభుత్వరథాన్ని అధిష్ఠించ వలసిందీ ప్రభువే!

చిన్నా: అయితే నే నెందుకు—

స్వామి: విలోమవివాహవ్యవస్థని సమాజం సమాధి చేస్తుందమ్మాయ్!

చిన్నా: నాన్నగారూ!

తిమ్మ: సౌభాగ్యవతీ! సంప్రదాయం మీ సంబంధాన్ని సమ్మతించదు. తద్భిన్నంగా వ్యవహరిస్తే ప్రభుత్వముద్రలకు తిలోదకాలివ్వాలి. అందుకని నీమీది ప్రేమాతిశయంతో మా కృష్ణదేవరాయలు పదవీపరిత్యాగం చేశాడు.

చిన్నా: పదవీ పరిత్యాగమా?

తిమ్మ: నీవు కారణంగా!—ఇంతటి క్లిష్ట స్థితిలో ఎలాంటి పరిణామం సంభవిస్తుందో ఆలోచించు. విజయనగరసామ్రాజ్య విభవసంపత్తికి నాడే వినాశోన్ముఖత—అబ్బా!—అపశ్రుతి!

కృష్ణ: చిన్నా! ఇదంతా ఇంద్రజాలం! ఇంద్రధనుస్సులా ఈయన చిత్రవిచిత్రమైన రంగుల్ని ఏకముద్రవేసి గులాబీ ముళ్లతో కంచెకట్టి నిన్ను వివశను చేస్తున్నాడు. ఈయన మాటలు విశ్వసించకు.

చిన్నా: నిజమేనా ప్రభూ! మీ పదవీపరిత్యాగం?

కృష్ణ: నిజమే!

చిన్నా: అదేమిటి ప్రభూ! త్యాగమంత అల్పమైనది మరొకటి లేదు.

స్వామి: అమ్మాయ్!

కృష్ణ: కాదు చిన్నా! మహత్తరమైనది!

చిన్నా: అంత మహత్తరమా ప్రభూ?

కృష్ణ: అనంతవిభవోపేతం.

చిన్నా: అయితే ప్రభూ! ఈ ప్రియురాలు మీకు మానసికంగా అర్ధాంగి కదూ? మరలాంటి మహత్తర వస్తువులో అర్ధభాగాన్ని ప్రసాదించరూ?

కృష్ణ: ఏమిటి చిన్నా!

స్వామి: నువ్వు గృహిణివి అవ్వాలి. అదే నా ఆశ!

చిన్నా: నాన్నా!—(తలదిప్పి) ప్రభూ! మీవలె నేనూ త్యాగం చేస్తున్నాను. అసంఖ్యాక ప్రజల ఆత్మస్వాతంత్ర్యసౌష్ఠవార్థం నా స్వార్థ ప్రేమను—

స్వామి: అమ్మాయ్!

కృష్ణ: మతిభ్రమణమా ఇది చిన్నాదేవీ!

తిమ్మ: కాదు. త్యాగవీరుడు కృష్ణదేవరాయలకు తగిన సతి! త్యాగవతి!

కృష్ణ: మాటాడేది మంత్రిగారేనా?

తిమ్మ: (మందగంభీరహాసంతో) కాదు ప్రభూ! మీ అప్పాజీ!

స్వామి: అమ్మాయ్! నీకు మతిపోయింది. నా తుదికోరిక సర్వనాశనం చేశావ్. అమ్మాయ్! అమ్మాయ్!

చిన్నా: నాన్నా! ఇది భారతగృహిణీపరమ ధర్మం!

స్వామి: నా కర్మం!

కృష్ణ: అప్పాజీ! పెంచి, చదివించి, సింహాసన మెక్కించి, ఈనాడు కుమారుని మనశ్శాంతిపట్ల ఈ విధంగా ఇంత కర్కశత్వం ప్రకటించడం, (వ్యంగ్యంగా) నా పూర్వజన్మ సుకృతం కాబోలు!

చిన్నా: ప్రభూ!

కృష్ణ: ఏం చిన్నా! ఎంతలో ఎంత పిచ్చిదాని వైపోయేవ్!

స్వామి: మంత్రిగారి మహాప్రసాదం!

తిమ్మ: (మందస్మితం)

కృష్ణ: చిన్నా!

చిన్నా: తక్షణమే మీరు విజయనగర సింహాసనం అధిష్ఠించవలసినదిగా ఈ ప్రేమత్యాగిని ఆశయం. ఈసదూర్వ్యం భవదీయ చరణదాసి అంతిమ నివేదన.

తిమ్మ: ఆవేదన కూడా!

కృష్ణ: చిన్నా!—ఎంతపని చేశారు అప్పాజీ!—

స్వామి: సుడిగుండాల్లో నా సుకుమారత్వం?

కృష్ణ: ఎంత చాకచక్యంతో, ఏమి లాఘవంగా ఈ సమస్యావ్యూహాన్ని పన్నేరు!—నువ్వెంత జేలవ్ చిన్నా! ఇట్టే వీరిని చూచి భయపడిపోయేవ్! నీకోసం

నిత్యనూత్న వసంతాలు మనస్సీమలో సృష్టించుకొంటున్న వాళ్లో ఇక జరజన్మమూ లేనా? జరాభూతా లేనా?

తిమ్మ: అహ్హాహ్హా!

కృష్ణ: అప్పాజీ! నా అంతరంగంలో సముద్ర మథనం సాగించారు. ఏమి సాధించారు?

స్వామి: సనాతన మతిసారాన్ని!

కృష్ణ: అదిగో! ప్రచండజ్వాలికలు ప్రళయ జిహ్వికలపై విలిపి సహస్రఫణాలు విప్పిన శేషాహి! అదిగో! హాలాహల భుగభుగలు కూష్మాకాశంలోకి విరజిమ్ముతోంది!

తిమ్మ: అబ్బాయ్! హాలాహలం పుట్టింతర్వాత అమృతకలశమే గా ఆవిర్భవిస్తుంది.

చిన్నా: అవును. ఇక ప్రజలకు లభించేది స్వచ్ఛందామృతమే గా!

తిమ్మ: మరా ప్రజల్లో నువ్వూ ఒకదానివేగా! అంచేత నీకూ లభించాలి ఆ అమృతం.

స్వామి: మంత్రిమహోశయా! శిల మెత్తిన మీకు ఇంత విషం తాగినా ఇంకా దాహం తీరలేదటయ్యా! ఇంకా ఏం చేద్దామని మా అమ్మాయిని?

తిమ్మ: తొందరపడకయ్యా! ఈమె నీకు అమ్మాయిలా నే, ఈ ప్రభువు నాకు అబ్బాయి.

కృష్ణ: ఇదేనా మీ పితృహృదయం?

తిమ్మ: అంత తొందరెందుకోయ్?

స్వామి: అనుభవించక!

తిమ్మ: (నిర్మలంగా) ఆఁ—అబ్బాయ్!—సౌభాగ్యవతీ!—మీ ఆత్మ సంబంధమైన అనుబంధం నాకు ఆనందాన్ని కలిగించింది. ఇక మీరు స్వేచ్ఛగా?

కృష్ణ, చిన్నా: (ఒకేసారి) స్వేచ్ఛగా?

స్వామి: ప్రేమపత్నులై ఆకాశానికెగరమని, పాపం, మహామంత్రి గారు వరమిస్తారు.

తిమ్మ: (నవ్వి) ప్రేమస్వరూపిణి—కాదు—త్యాగస్వరూపిణి ఈ చిన్నాదేవి రాణి కావడానికి ఇదే నా సంపూర్ణాశీర్వాదం!

కృష్ణ, చిన్నా: (చకితులై పరస్పరవిలోకన.)

స్వామి: (తబ్బిబ్బవుతూ) మా అమ్మాయి రాణా? మహారాణా?

కృష్ణ: (దరస్మితప్రకటన)

చిన్నా: (లజ్జాసంక్రమిత నూతన తేజఃప్రఫుల్ల వదనశ్రీ పంచుకుంది)

తిమ్మ: ఇక చిన్నాదేవి రాయలవారికి రాజ్ఞీ శిరోమణియే!

స్వామి: (తెల్లబోయి) మరి మీ శాస్త్రాలో?

తిమ్మ: అవా? వియ్యంకుడుగారూ! శాస్త్రాలు మానవనిర్మితాలై మానవపద్ధతుల్ని నిర్వహిస్తున్న మాట నిజమే! కాని, శాస్త్రవిజ్ఞానంకంటె ఆత్మదీక్షమే ఉన్నతమైనది! ఉత్కృష్టమైనది! — ఆత్మదీక్ష పరీక్షకు త్యాగమొక్కటే నికషోపలం. చూడండి ప్రణయఫలం అవిసంగా పరిపక్వం కానిదే అమృతరసాన్ని చిందగలదంటారా?

స్వామి: (సంతోషంతో) శభాష్! మంత్రి వియ్యంకుడుగారూ! నిజంగా మీరు యుక్తికి యుగంధరులే! చాకచక్యానికి చాణక్యులే!

[కూతాత్మంధూరిత సహస్రసౌదామనీ కాంతిరేఖల్లో చిన్నాదేవీ శ్రీకృష్ణదేవరాయల దేహదీధితులు పెల్లివిరుస్తాయి. వల్లీవనజాస్యలు వెదజల్లిన పుష్ప హృదయాలు పులకరిస్తాయి...]

* సాతవాహనులెవరు *

శ్రీ చిమకుర్తి శేషగిరిరావు

ప్రాచీన భారతదేశమున, ఒక విశాలరాజ్యమును అతి దీర్ఘకాలము పరిపాలించిన రాజవంశములలో మౌర్యులతో పాటుగ పేర్కొనదగినది సాతవాహనవంశము. ఈ వంశమున జన్మించినవారు దాదాపు ముప్పదిమంది 428½ సంవత్సరముల కాలము పరిపాలించినట్లుల మత్స్యపురాణమువలన తెలియుచున్నది. కాని ఈ సాతవాహనులను గురించిన సమగ్రమగు చరిత్ర నేటివరకు లిఖింపబడలేదు. వీరాంధ్రులేనా? వీరు రాజ్యమునెచ్చట స్థాపించిరి? ఆంధ్రదేశ చరిత్రయందు వీరికిగల స్థానమెట్టిది? అను ప్రశ్నలకు పండితులు నేటికిని స్పష్టములగు సమాధానముల నీయజాలకున్నారు.

సాతవాహనుల కాలపు శాసనములును, నాణెములును కొన్ని మనకు లభించినవి. పండితులు కృషి చేసి, వానిని పరిశోధించి అందలి విషయముల వెలికి దీయగల్గిరి. కాని ఆ శాసనముల, నాణెముల సంఖ్య అత్యల్పము. ఉన్నవానియందైన వాని కాలమును సూచించు తేదీ లేవియు లేవు. పురాణములన్ననో, ఒక్కొకతీరుగ సాతవాహనుల పేరుల తెలియజేయుచున్నవి. అసమగ్రము, పరస్పర విభిన్నములగు నిట్టి ప్రమాణములపై యాధారపడి, ఒక్కొక్క పండితుడొక్కొక నిర్ణయమునకు వచ్చి, సమస్యను క్లిష్టతర మొనర్చిరి.

లిఖితచరిత్ర లేవియు లభించని ప్రాచీన దేశముల చరిత్రను కూర్చుటకు ప్రాచీనభవనములు, నాణెములు, శాసనములు యెక్కువగ తోడ్పడునను నిర్వివాదాంశము. ఇట్టి సాధనములవలననే ఈజిప్టు దేశ ప్రాచీన చరిత్రను ఐతిహాసికపరిశోధకులు సమకూర్చగలిగిరి. కాని ఈజిప్టుదేశమున దొరికినంత విరివిగ యీ ప్రాచీన సాధనములు భారతదేశమున లభించుటలేదు. అయినను ఈజిప్టుదేశమున లేని, వేరు విధమగు సాధనసామగ్రి భారతదేశమున కలదు.

ఈజిప్టు, మధ్యప్రాచ్యదేశముల చరిత్ర, భారతదేశపు చరిత్రవలె ప్రాచీనమైనదైనను, ఆ దేశముల నేడు నివసించు ప్రజలకా ప్రాచీన నాగరికతతో నెట్టి సంబంధమును లేదు. వెలుపలినుండి వచ్చిన చారిత్రికశక్తులు బలవత్తరములై, ఆ ప్రాచీననాగరికతల నిర్మూలించి, వాని స్థానమున నూతనవ్యవస్థల నేర్పరచినవి. భారతదేశమున పరిస్థితి యిందులకు కవ్పముగ విరుద్ధము. భారతదేశమున ప్రాచీనకాలమున నుండిన వ్యవస్థయే క్రమపరిణామమునొంది యీనాటి రూపమును పొందినది. వ్యవస్థయందు మార్పులు రాలేదని యిందుల కర్థముగాదు. కలిగిన మార్పులు క్రమానుగతముగ కలిగినవి. వెలుపలినుండి వచ్చిన సంస్కృతీ ప్రవాహములవలన నీ మహావృక్షము కూలిపోలేదు. ఆ వెల్లువల ఉద్ధృతము తగ్గి కుదుటబడినతరువాత వానిచే క్షేత్రమింకను సారవంతమై యీ భారత జాతీయ వ్యవస్థావృక్షము యింకను యేపుగ పెరిగినది.

నేటి భారతదేశమున నగుపడు కులములకు, భాషలకు, ఆచారములకు బీజము ప్రాచీన వ్యవస్థలోనే కలదు. వివిధఘట్టములలో, భారతదేశపు ఇతిహాసగతిలో, కలిగిన సంఘర్షణల, విపర్యయముల చిహ్నములీ యాచారములలో, భాషలలో, సాంఘిక వ్యవస్థలో, నెచ్చటనో యొకచోట ముద్రితములై యుండును. ఆ చిహ్నముల గుర్తించి, చరిత్ర రచనయం దుపయోగించుకొను అవకాశము భారత ఐతిహాసిక పరిశోధకునకు గలదు. ఈజిప్టువంటి దేశములయం దీ సాధనసంపద శూన్యము.

ఈవిధముగ భారత భాషా, సమాజ, సంస్కృతీ క్రమపరిణామమును శోధించి చరిత్రరచనలో నుపయోగించుకొనుటకు, ఐతిహాసికపరిశోధకు లెవరును పూనుకొనకుండుట శోచనీయము.

సాతవాహను లెవరు? అను నీ ప్రశ్నకు పండితు లెవరును సరియగు సమాధానము నీయకున్నారు. సాతవాహను లాంధ్రులుకారనియు, వీరు బళ్ళారి ప్రాంతమున నుండిన ఒక రాజవంశమువారని సుక్తంకరు పండితుండనెను. తక్కిన పండితులలో ననేకులు వీరాంధ్రులే యని తలంచిరి. కాని వీరుగాని, సుక్తంకరుపండితుడుగాని, వీరికి సాతవాహను లను పేరేల కలిగెనో వివరింపజాలకపోయిరి.

సాతవాహనులనుగురించిన, వివిధపండితుల అభిప్రాయములదర్శించి 1941 లో శ్రీ గోపాలాచారి గారు '*Early History of Andhra Country*' అను గ్రంథమును రచించిరి. అందు వారు:

"*Satavahana is a family or a dynastic name while Andhra is a tribal name*" (ఆంధ్ర యనునది వీరి జాతి పేరు, సాతవాహన అనునది వీరి కుటుంబము లేదా రాజవంశము పేరు.)

—*Page 21* పై గ్రంథమున

"*The meaning of Satavahana is as obscure as those of Chalukya, Pallava, and others*" (చాళుక్యులు, పల్లవులు, ఇత్యాదిపదముల యర్థములవలె నే 'సాతవాహన' అనుదానియర్థము కూడ దురవగాహముగ నున్నది.)

పే. 29 పై గ్రంథమే

ఈ యభిప్రాయమే నేడుసయితము పండితులలో ననేకుల కంగీకృతమైనది. 1949 సంవత్సరము ఏప్రిల్ మాసపు 'జర్నల్ ఆఫ్ ఇండియన్ హిస్టరీ'లో *The date of the foundation of Andhra dynasty by Simuka* (శిముకుడు ఆంధ్రరాజ వంశమును స్థాపించిన కాలము) అను తమ వ్యాసమున ప్రొఫెసరు కుర్తి వెంకటరావుగారు:

"*The dynasty which is known by its tribal name Andhra in the Puranas, and by its family name Satavahana in inscriptions*" (పురాణములలో ఆంధ్రయని జాతినామమునను, శాసనములందు 'సాతవాహన' అను వంశనామమునను వ్యవహరింపబడిన రాజవంశము) అని పేర్కొనిరి.

పైవారందరు యీ నిర్ణయమునకు వచ్చుటకు సాయపడిన శాసనములు రెండు కలవు. ఇందులో మొదటిది సాతవాహనవంశమున రెండవవాడగు కణ్హునికి సంబంధించినది. ఇందు 'సాతవాహనకులే కణ్హో' అని కలదు. రెండవది గౌతమీపుత్ర సాతకర్ణిని గురించిన ప్రశస్తిగల శాసనము. ఇందు 'సాతవాహన కుల యసపతిథాపన' అని కలదు.

ఈ రెండుశాసనములలోగల 'కుల' అను పదము నకు వంశమని యర్థముచెప్పుకొని యీ పండితులు సంతృప్తిచెందిరి. కాని 'కుల' అను పదము యీనాడు మనము వాడురీతిగనే వాడబడినదని నా అభిప్రాయము.

క్రీస్తుశకమునకు పూర్వము దక్షిణాపథమున వర్ణవిభజన జరిగియుండలేదనుట నిజమే. కాని వృత్తినిబట్టి కులము లంతకు చాలకాలము పూర్వముననే యేర్పడియుండినవి. తరువాత వర్ణవిభజన అమలులోనికి వచ్చినది. ఈనాడును మనము ఒకే వర్ణమున ననేక కులముల జూచుచున్నాము.

వృత్తిననుసరించి యేర్పడిన యిట్టి కులములలో పెక్కింటి పేరులు అమరావతీ, జగ్గయ్యపేట ప్రాంచీనస్తూపములయందలి శాసనములలో మనకు కనబడుచున్నవి. లూడర్సు సేకరించిన యీ శాసనావళిలో నెం 1138 నందు కులారిక (కుమ్మరి); నెం 1151 లో గోలిక, 1121 లో హాలకీయ (సేద్యం), నెం 1149 లో 'లేఖక' (వ్రాయసం), నెం 1138 లో కోలిక (నేతపని) అను కులముల పేరులు కనబడుచున్నవి. ఇట్టి కులములలోనే 'సార్థవాహ' అను కులమొకటి ఆనాడుండెనని లూడర్సు లిస్టులోని నెం 30 వ శాసనమువలన దెలియుచున్నది.

'సార్థవాహు'లనగా బిడారువర్తకము చేయువారు. దేశదేశాంతరములకు సామగ్రుల నెత్తికొని పోయి, విక్రయించి, అచ్చట దొరకు వస్తువులగొని తక్కిన దేశములలో నమ్ముచుండెడివారు. ఒక్కొక బిడారు కదలివచ్చెనా ఒక పట్టణము కదలినట్లుండెడిది. దుర్గమారణ్యములలోను, ఎడారులలోను, కొండలలోను, దారితప్పకుండ వీనిని సార్థవాహులు నడిపించెడివారు. ఇట్టి సార్థము (బిడారు) ను గురించిన ప్రసక్తి మహాభారతమున పెక్కు సందర్భముల గలదు.

"దమయంతి సార్థవాహంబు జూచి యిమ్మహాగహనంబున నిట్టి జనసంకులంబయిన సార్థంబు గానంబడియెడు నెట్టి పుణ్యంబొకో"—ఆంధ్రమహాభారతము. ఆరణ్యపర్వము. ద్వితీయాశ్వాసము.

ఈ సార్థవాహపదమే వికృతిజెంది 'సాతవాహ' అని యైనది. పాళీభాషయం దిట్టిపదములకు 'న' ప్రత్యయము చేరుట సర్వసాధారణము.

ఉదా:—'గాహపతినో'... (*Archaelogical Survey of Southern India. The Buddhist Stupas of Amaravati and Jaggayyapet by Burgess.* శాసనం నెం. 51 వ)

'సార్థ'మునకు వికృతియగు 'సాతో' అనుపదము తెలుగున 'సాతు' అని మారినది.

"సాతులోనికరిగి, జనముల నమ్మదిలీల చేలఁ జెట్టి"

—ఆంధ్రమహాభారతము. శాంతి. తృతీ. 471.

"శేషాహారంబు వెంట నొక్క సాతుంగూడి పర దేశంబున కరుగుచోట"

— హైదానియం కే. 480.

కావున ఆనాటి ఆంధ్రదేశమున 'సాతువ్యాపారులు' విరివిగా నుండి, 'సాతవాహన' కులమొకటి యుండెడిదని మన మూహింపవచ్చును. అంతియే కాదు.

పూర్వపు సమాజ పరిస్థితులనుగురించిన భోగట్టా చాలవరకు ఆనాటి సామెతలలో యిమిడియున్నది. కులమున కొకసామెతకు తక్కువ లేకుండ నుండెడిదని మనము చెప్పవచ్చును. వెక్కిరింపునకై గానిండు, పొగడ్తకై కానిండు, ఇట్టి సామెత లుద్భవించి ప్రచారములోనికి వచ్చుచుండెడివి. ఆనాటి సామెత లిప్పటికి చాలవరకు నశించినవి. ఆచారములయందును, పదముల వాడుకయందును, కలిగినమార్పులచే ఉన్న సామెతలలో కొన్ని యర్థముకుటలేదు. ప్రాతికాలపు సామెతలలో నధికభాగము పూర్వకవుల ప్రయోగముల వలనమాత్రమే నేడు నిలిచియున్నవి.

ప్రాచీనాంధ్రమున, ఒకప్పుడు పేరుప్రతిష్ఠల నార్జించిన, యీ 'సాతు' వ్యాపారులనుగురించియు, నానాడు కొన్ని సామెత లుద్భవించియుండును. సాతు వ్యాపారము నశించుటచే, ఈ సామెతల స్వరూపము గూడ మారియుండును. కాని తిక్కనామాత్యుని పుణ్యమా యని ఒక సామెతమాత్రము మనకు దక్కినది.

"అనుజులకు నష్టపడి యే
మిని, జేయఁగనీమి జూచి మెచ్చితిగా కీ
వును పాదు రేఁగె నేని
న్వను తిలపాలమునఁ గాని నిలువను సుమ్మీ"

—ఆంధ్ర మహాభారతం. ఉద్యో. ద్వి. 18

ఇందలి 'సాదు', 'సాతు'నకు రూపాంతరము. 'కత' అను శబ్దము 'కద' గా మారినటులనే యీమార్పు సంభవించినది.

కాని, 'సాదు' పదమున కర్థము క్రమముగ నాంధ్రుల స్మృతిపథమునుండి తప్పిపోవుటతో యీ పద్యమునందలి సామెత కర్థము దుర్గ్రాహ్యమైనది.

ఈ సామెతకు సరియగు నర్థము నాలోచింతము. 'సాదు' అనగా 'సాతు'. ఈసాతు బహుజనాకీర్ణము, వివిధములగు శకటములును, బరువులుమోయు జంతువులును యిందు పెక్కుండుట సహజము. ఇట్టి సార్థము నెచ్చటబట్టిన నచ్చట మకాము వేయుటకు వీలుండదు. వీ రాగుటకై, ఆనాటి ప్రభువు లీ వర్తకమును ప్రోత్సహించుటకై ఏర్పరచినవి కానిండు, లేదా ఇట్టి వర్తకసంఘములు యేర్పరచుకొనినవి కానిండు, కొన్ని మజిలీ లావాడుండెడివి. రైలుబండ్లకీనాడు స్టేషను లెట్టివో, బిడారులకు ఆ మజిలీ లట్టివి. ఈ మజిలీలు తృణకాష్ఠ జలసమృద్ధి గలిగి, వ్యాపారస్థలములకు సమీపమున నుండెడివి. ఇట్టి మజిలీనే తెలుగు వారు 'పాలము' అని ఆనాడు వ్యవహరించెడివారు. తలపాలము అనగా ప్రక్కభూమి, అవతలి ప్రదేశము అని అర్థము. ఇట్టి మజిలీలలో ఒక దానినుండి బయలుదేరిన 'సాతు' హుటాహుటి నడకలతో రెండవ మజిలీకి చేరువరకు నాగెడిది కాదు. అందువలన 'సాదు లేచినయెడల ప్రక్క మజిలీ చేరువరకు నాగదు' అను నర్థముగల పై సామెత ప్రచారములోనికి రాగల్గెను.

కాని 'సాదు' అరమును విస్మరించిన నిఘంటుకారుడు తిక్కనగారి పద్యమునగల పై సామెతకీ దిగువ అర్థమును వ్రాసెను.

"సాధువగు నెద్దు చెలరేఁగినచో ఊరి చివర భాగమునఁగాని యాగదు"—. (సూర్య రాయాంధ్ర నిఘంటువు) 'తిలపాలము' అను శీర్షిక క్రింద—ఈ యెద్దు ఊరి చివరభాగమున మాత్రమే ఎందు కాగవలెనో నిఘంటుకారుడు మనకు చెప్పలేదు!

ఈ దురవస్థ మన యీ నిఘంటుకారునికే కాదు. 16 వ శతాబ్దియందు పింగళి సూరన్నకుసైతము కల్గినది. ఆయనకీ సామెత యర్థము కాలేదు. తన కర్థము కాకపోవుట తిక్కనామాత్యుని తప్పుగనే భావించి, ఆ సామెతను సరిదిద్దే భారమును కొని తెచ్చుకొని మీదవైచుకొని, యీ విధముగా ప్రయోగించినాడు.

"సాదు రేఁగినఁ దలపాలాన నిలువదను మాట నిజమయ్యె నెడటంచు"

—కళాపూర్ణోదయం. తృతీ. 37.

తిక్కనామాత్యుని సామెత 'సాదు రేఁగిన తలపాలమున నే నిలుచును' అనుదానికి వ్యతిరేకముగ 'సాదు రేఁగిన తలపాలాన నిలువదు' అని సూరన్న సరిచేసెను!

ఇక నీ సూరన్న గారి సామెతకు నిఘంటుకారుడీ విధముగ నర్థ మొసంగెను.

'సాధువగు నెద్దు చెలరేఁగినచో ఊరి చివరభాగమునఁగూడ నిలువదు'. (సూ. రా. నిఘంటువు. 'తిలపాలము' అను శీర్షికక్రింద) దీని భావమేమో దేవుని కెఱుక!

ఈ అవకతవక యర్థములకు కారణము 'శాతవాహనుల'తో పాటుగ, 'సాదు'నుగూడ మనము మరచిపోవుటయే.

'సాతు' పదముతో బయలుదేరిన మనము భాషా ప్రపంచములోనికి చాలదూరము పోవలసి వచ్చినది. ఇది అనివార్యము. కొన్ని చారిత్రక పదములు ఎటుల తారుమారైనవో, అందువలన సత్యమెంత మఱుగుపడి పోయినదో తెలుసుకొనుట కిది యావశ్యకము.

ఇక, ఈ శాతవాహనకులము, ఆ రాజ్యముతో పాటుగనే నశించి, ఊరు పేరు లేకుండపోయినదా? అను విషయమును మన మాలోచించవలసియున్నది. ఆ కులమున, రాజ్యపరిపాలన జేసిన కుటుంబ మొకటి యుండి, రాజ్యనాశనముతో నావంశమును నశించి యుండిన యుండవచ్చును. కాని కులమంతయు నాశనమయి యుండ నేరదుగదా! అటులగాక, ఈకులము వారు క్రమముగ నింకొకకులమువారిలో కలిసిపోయి రనుటయును నమ్మదగు విషయము కాదు. మనజాతి యందు కులముల పట్టుదల యెక్కువ. అందులో చారిత్రకప్రశస్తినిగాంచిన 'శాతవాహను'ల కులము, సులభముగ నితరకులములతో కలిసిపోయి ఆత్మవిధ్వంసన మొనర్చుకొన్నదనుట అవిశ్వసనీయము. ఆంధ్రజాతియందు గల పెక్కు కులములలో నిదియు నీనాటికి యుండక తప్పదు. పరిశోధనాఫలితముగ ఆనాటి శాతవాహనులే నేటి సాదువాండ్లు, లేదా, సాదుసెట్లని తేలుచున్నది.

నామసామ్య మాత్రముననే నేనీ నిర్ణయమునకు రాలేదు... ఈ సాదువాండ్లు సాదుసెట్లను పేర ఉత్తర ఆర్కాటు, చెంగల్పట్టు జిల్లాలలోను, చెన్నపట్నమునను, మైసూరున కోలారు, బళ్ళారి జిల్లాలలోను కలరు. ఇంకొక శాఖవారు, సాదువాండ్లు, పెరికెరాజులు అను పేరులతో విశాఖపట్నం జిల్లాలో కలరు. తమిళదేశమున నుండనిండు, కర్ణాటదేశమున నుండనిండు; వీరికి తెలుగే మాతృభాష. వ్యాపారమే వీరి వృత్తి.

'సాదువాండ్లు' అనువారిని గురించి థర్‌స్టన్ తన '*Castes and Tribes of South India* (దక్షిణభారతమునందలి కులములు, జాతులు) అను తన గ్రంథమున నీ విధముగ వ్రాసియున్నాడు. "సాదువాండ్లు, వర్తకసమూహము లేక ప్రయాణీకులు అను నర్థమున 'జనపల' కొక పర్యాయపదముగ వాడబడుచున్నది."

సరియే, యీ 'జనప' లెవరు? 'దనుప' లేక 'దన్ప' అనునవి సాతునకు సమానార్థముగల దేశ్య పదములు

"దమయంతి...'యుండట' నొక్క దనుపంగని దాని జొచ్చునపు డెందలి జనంబులు."

—ఆంధ్రమహాభారతం. అర. ద్వి. 101

"ఇద్దన్పతోఁ జని యువ్వనక్లేశంబుఁ దలఁగుదు."

—పై గ్రంథమున. 118.

కావున 'సాదు' నకు పర్యాయపదములుగ 'దన్ప,' 'దనుప' లు కూడ వాడబడి, దనుపకు అర్థము మరుగుపడి పోయినతరువాత నది 'జనప' గా మారి సాదుసెట్లు జనపసెట్లైరి.

1951 వ సంవత్సరమున, చెన్నపురిలోని సాధుశెట్టి మహాజనసభవారు తమ కులచరిత్రను తెలియజేయుటకై 'సాధుసెట్లు' అను గ్రంథమును ప్రచురించిరి. అవగింజంత సత్యమును గుమ్మడికాయంత పుక్కిటి పురాణములో కప్పిపెట్టు భట్టాజుల కథల నాధారముగా గొని వీరు దీనిని రచించిరి. కాని రచయితకే యీ గ్రంథము సంతృప్తి నొసగలేదు. 'సాతు', 'దనుప' పదముల ప్రసక్తియే వీ రెత్తుకొనలేదు. సాధుప్రవర్తన గలవారగుటచే సాధుసెట్టులుగా నైతిమనియు, జనపనార గోతాల వ్యాపారము చేయుటచే 'జనప'ల మైతిమనియు సరిపుచ్చుకొని వీరు తమ ధ్వజముపై జనపచెట్టు, ఆకు, పువ్వులను చిత్రించుకొనిరి.

ఈవిధముగ సాదుసెట్టి, సాధుశెట్టి యగుటతో, 'దనుప' జనపగా మారి, పూవులు పూచి, కాయలు గాచి, జెండామీద ఎక్కి కూచున్నది.

ఈ సాదుసెట్లు తాము పృథ్వీశు డను రాజసంతతివారమనియు, శాపవశమున వ్యాపారవృత్తికి దిగితిమనియు చెప్పుకొందురు. విశాఖజిల్లాయందలి సాదువాండ్లు తాము సాతువ్యాపారులుగ నుండి, దమయంతీదేవిని కష్టదశలో ఆదుకొని రక్షించినందులకు ప్రతిఫలముగ నలమహారాజు తమ్మ కీ దేశమునకు దెచ్చెననియు, తాము రాజులుగ కొంతకాలముండి, పరశురాముని దండయాత్రకు భయపడి పరుగెత్తుటచే, పిరికిరాజులు, లేదా పెరికరాజులు, రాజపెరికలు అను పేరులను పొందితిమని చెప్పుకొందురు. ఈ విషయములన్నియు థర్‌స్టన్ గారి *Castes and Tribes of South India*' అను గ్రంథమున చూడవగును.

'శాతవాహనులు రాజరికము నెరపిన సంగతి యీ ఉదంతములం దెటుల గర్భితమైయున్నదో వివరించ నవసరములేదు.

అయినను, చారిత్రకపరిశోధకుడు వైజ్ఞానిక పరిశోధకున కెందును తీసిపోడు. సహేతుకత, సరి

యను ప్రామాణికత, స్పష్టముగ గన్పించదనిదే అది యేదియు నంగీకరింపజాలను. నామమాత్ర సామ్యమును, ఆ నామమునందలి పదములకు క్రమానుగతముగ వచ్చిన యర్థమును, ఆ కులమునకు సంబంధించిన పురాణగాథలను మాత్రమే యథార్థముగ గ్రహించి 'సాతవాహన' కులమీ 'సాదువాండ్ల' కులమేయని యంగీకరింపను. సాతవాహనులు సార్థవాహులే యనువారు సాతవాహన పదమున కిట్టి యర్థముకలదని యేకాలపు వారి వ్రాతలలో లేదేమి? అని యతను ప్రశ్నించక మానడు. దీనికి సమాధాన మాలోచింతము.

సార్థమనగా ప్రయాణికుల సంఘము లేదా వర్తకుల సంఘము అని నైఘంటికు లొసగు అర్థము. ఇట్టి జనసమూహమును, లేదా వర్తకసమూహమును దారితప్పకుండ సరిగా నడిపించువాడు సార్థవాహుడు. సాతవాహన పదమునకు కూడ ఇట్టి అర్థమే ఆనాడు ప్రచారమున నుండెడిది. ఆనాడే కాదు క్రీ. శ. 7వ శతాబ్దిలో కూడ యీ పదమున కీ యర్థము ప్రచారమున గలదని మనకు విస్పష్టముగ తెలియవచ్చుచున్నది.

క్రీ. శ. 7వ శతాబ్దిలో చైనీయ యాత్రికుడు హుయన్ చాంగ్ భారతదేశమున పర్యటించెను. ఇతడు సంస్కృత, పాళీభాషలందు పండితుడు. ఆ భాషలలోగల బౌద్ధమత గ్రంథముల నెన్నింటినో చైనాభాషలోని కనువదించెను. హిమాలయము మొదలుకొని కాంచీపట్టణమువరకు నతడు సంచారముజేసి తన యాత్రావివరముల గ్రంథస్థమొనరించెను. అందు దక్షిణకోసలమునందలి విశేషములదెల్పుచు నాతడీ క్రిందివిధముగ వ్రాసెను.

'Near to the south of the city (that is apparently, the Capital) was an old monastery, with an Asoka Tope, where Buddha had vanquished Thairthikas, by the exhibition of super-natural powers, and in which Nagarjuua Pusa had afterwards lodged. Contemporary with this Pusa, was the King styled Sha-to-pho-ho or 'Leading-right' (Yin-cheng), who treated Nagarjuna with ceremonious respect, and kept guard at his residence. (ముఖ్యపట్టణమే యని భావించబడదగు) నా పట్టణమునకు దక్షిణప్రాంతమున అశోకస్తూపము గల నొక ప్రాచీనవిహారము కలదు. తన దివ్యమహిమల ప్రదర్శించి బుద్ధదేవుడిచట తైర్థికుల నోడించెను. తరువాత నిట ఆచార్య నాగార్జునుడు వసించెను. ఆ ఆచార్యునికి సమకాలీనుడై, శా-తో-పో-హో, లేదా, 'సరిగా నడుపు వాడు' అను ఉపనామము గల రాజొకడుండెను. ఆ రాజీ ఆచార్యుని పూజ్యభావమున నాదరించి, అతని నివాసమువద్ద రక్షణ కేర్పాటులజేసెను.) *(From 'On Yuan-Chwang's Travels' by Thomas Watters. P. 200.)*

పై ఉల్లేఖమందలి శా.తో.పో.హో, సాతవాహనుడే యని పండితులెల్ల రంగీకరించిరి. కాని 'సాతవాహ' పదమునకు హుయన్-త్సాంగ్ యిచ్చిన 'సరిగ నడుపువాడు' అను అనువాదము మాత్రము తప్పని యనిరి.

పై గ్రంథము ప్రచురించిన 'వాటర్సు' ఆ గ్రంథమునందే 207వ పుటలో, పై ఉల్లేఖము పై వ్యాఖ్యానించుచు యిటుల వ్రాసియున్నాడు.


"The pilgrim's transcription apparently represents, as has been suggested, a form Satavaha, the translation being incorrect" (ఇతఃపూర్వమే సూచింపబడిన రీతిగ, నీ యాత్రికుని వ్రాత, 'సాతవాహ' అను పదరూపము చే తెలియజేయును. ఆ పదమున కిచ్చిన అనువాదము మాత్రము తప్పు)

వాటర్సు చెప్పినదానినే తక్కిన పండితు లనుసరించిరి. వీరందరు, చైనాయాత్రికుని అనువాదము తప్పని చెప్పిరేకాని తాముమాత్రము 'సాతవాహన' పదమునకు వేరర్థము చెప్పజాలకపోయిరి. ఇందుమూలమున, నీ విధముగ, యీ పండితుల దయవలన 'సాతవాహన' పదమునకు త్రిశంకుస్వర్గము లభించెను.

'సాతవాహనులు' సార్థవాహులే యని గ్రహించువారికి, హుయన్-త్సాంగు అనువాదమున తప్పేమియును కనబడదు. ప్రజాసంఘమును త్రోవన 'సరిగా నడిపించువాడే' గదా సార్థవాహుడు.

సాతవాహనులు సార్థవాహులే, అనగా సాదువాండ్లకులమువారే యని గ్రహించుటకు యింతకన్న బలవత్తరసాక్ష్యమేమి కావలెను?

దేశపాలకులగు సాతవాహను లాంధ్రులేనా? వర్తకులగు వీరు రాజ్యమెటుల స్థాపించిరి? సాతకర్ణి యన నర్థమేమి? ఆయా విషయములు ఇటుపైని విచారణీయములు.



విద్యున్మాలికలు

దసరా మహోత్సవాలలో మైసూరు రాజభవనం

ఫొటో: "గోపాల్"

❋ గడచిపోయిన గాథలు ❋

శ్రీ బలివాడ కాంతరావు

ఎదురుచూస్తున్న భర్త గుమ్మంలో కాలు పెట్టగానే ఆమె చెప్పాలనుకున్నది వెంటనే చెప్పింది. వెంకటేశ్వరరావు బట్టలు మార్చి సోఫామీద వార బడ్డాడు. ఈ చెప్పిన విషయంపట్ల తను ఊహించిన ఆసక్తితో ఆదుర్దాగానైనా, భర్త కనపరచకపోవటం, ప్రమీల కేమీ నచ్చలేదు. మళ్ళీ ఆ విషయమే ఎత్తింది.

"ఇందులో ఏముంది" అన్నాడు భర్త.

"లేదూ! వీధిలో నేకారు, ఊరంతా చెప్పుకుంటున్నారు!"

"నువ్వేమైనా విన్నావ్?" చిన్న నవ్వుతో అంటే...

"అబ్బా! ఆ అమ్మాయి చాలా అందకత్తె... చదువుకుంది"...

"అందచేత తనకు నచ్చిన మొగుడ్ని చూసుకొంది. ఇందులో గొప్పేం వుంది? తప్పేం వుంది?"

"అలా జాతీ, నీతీ లేకుండా లేచిపోవడమేనా!"

వెంకటేశ్వరరావు చిన్నగా నవ్వుతున్నాడు: బాత్ రూమ్‌కి వెళ్తుంటే ప్రమీల చిరాకుగా "మీ కెన్ని సార్లు చెప్పాలి, చెప్పల్స్ వేసుకువెళ్ళండీ!" ఈసారి దరహాసం చేసి చెప్పల్స్ వేసుకున్నాడు.

డైనింగు టేబిల్ దగ్గర కూర్చునే టప్పుడు కూడా ప్రమీల మళ్ళీ యీ విషయం యెత్తకుండా వుండలేకపోయింది. భర్త యిదొక మామూలు విషయంగా తీసుకోవటం ఆమెకేమీ నచ్చలేదు. లేచి పోయేముందు, "పోనీ వాడి అందంచూసైనా లేచి పోయిందంటే, అదికాదు—అట్టే బావుండడట!" అన్న భార్యవేపు చూసి మళ్ళీ చిన్నగా నవ్వాడు గాని వ్యాఖ్యానించలేదు.

మరునాటిరోజు పనిమనిషిద్వారా మరికొన్ని విషయాలు తెలుసుకుంది. ఈ పనిమనిషి లేచిపోయిన అమ్మాయి తండ్రి యింట్లో కూడా పనిచేస్తోంది. కబుర్లు, వ్యాఖ్యానాలతో సహా చెబున్నదయ్— "నాకేమమ్మా! మీ గాళ్ళని నమ్మకేం! ఆపదాని వంటి లోన రొక్కం టికెంపె అక్కడుంటే, నమిలి మింగేసి వట్టు సూస్తారు! నాకు యీడిలోంచి తిలెత్తుకోని రోజుల డానికే భయం," అన్నది.

ప్రమీలకు యీ మాటలు మోటుగా అనిపించినా పక్కున నవ్వింది. "ఏమమ్మా నవ్వుతున్నా వెందు?" పనిమనిషి. ఏమీ లేదులే అంటూ గదిలోనికి వచ్చి పకపకా నవ్వుతూన్న ప్రమీలను, భర్త, పని మనిషి వేసిన ప్రశ్నే వేశాడు. "మీరూ దాని లానే అడిగారా? మా పనిమనిషి వీధిలోనించి తిలెత్తుకు వెళ్ళటానికి భయమట—అందగాళ్ళంతా నమిలి నమిలి మింగేస్తారట!"

భర్త మాటాడకుండా పక్కగదిలోకి వెళ్ళిపోయాడు. ప్రమీలకేదీ నచ్చలేదు. ఈ పల్లెటి కొరిని జెయ్యంలా వున్న పనిమనిషి కోతలకి భర్త కూడా నవ్వితీరాలని పక్కగదిలోకి వెళ్ళి, భర్త ముఖంవేపు చూసి నవ్వుతోంది. వెంకటేశ్వరరావు ముఖం గంభీరంగావుంది. జరిగింది—దగ్గరగా జరిగింది. ముఖంలో ముఖం పెట్టి 'నవ్వరూ!' అంది.

నవ్వాడు. ఆమె కక్షే తృప్తి—మళ్ళీ పెరటికి వెళ్ళింది. వెళ్తుండగా ఆమెవేపు చూశాడు. ఆ నవ్వే మనసులో నవ్వుకున్నాడు.

భర్త మోటారు సైకిలుమీద ఆఫీసుకు వెళ్ళిపోయాడు. షేక్స్పియర్, డికెన్స్ యేనాడో పూర్తి చేసింది. హోం లైబ్రరీలో పుస్తకంకోసం వెతికి, ఒకటి తీసి మళ్ళీ యింకొకటి...చివరకు చదువుమీద మనసు పోలేదు. అద్దంముందు కాస్సేపు కూర్చోవా లనిపించింది. చిదిపితే రక్తం వస్తుంది...తిప్పను... గొంతుకమించి నీరు దిగితే కనిపిస్తుంది! సంస్కారం ప్రతీ అందమైన కణంలోనూ, నిండిపోయిందని పుబ్బి పోతూ, గిరగిరా తిరుగుతూ, దర్పణం నిల్చుని, భర్త గురించి రోజూ గర్వపడేటట్లే, పడుతూ; ఆవేళ

ఉదయం—పనిమనిషి...తను నవ్వకపోవటం...తనే నటించటం...అంతా తెలుసుకుని, ఆలోచించింది. "నవ్వను నేనసలూ, నవ్వారు కాదుకదూ? యీ వేళ సాయంత్రం కాసేపు యేడిపిస్తాను. ఏముంది యేడిపించటానికి? యేమన్నా చులకనగానే తీసుకుంటారే? సరైన ఉపాయం ఆలోచించాలి?"

ఆలోచించింది. సాయంత్రం మొగురుమూసున్న భర్త వచ్చాడు. "మీ సంగతి తెలిసిందిలెండి?" అంది. భర్త ఒకసారిచూసి మళ్ళీ ముఖం త్రిప్పేశాడే గాని, జవాబీయలేదు. నాలుగైదు సార్లు నవ్వుతూ పదేపదే రెట్టిస్తే రెట్టిస్తే "కాపరానికి వచ్చి సంవత్సరమైనా, నా సంగతి యీ వేళకా తెలుసుకున్నా" వన్నాడు. దీనికి వెంటనే జవాబు దొరక్క గింజుకుని, ఆ మరుసటిరోజు ఆఫీసుకు వెళ్లేముందు మాట వరసకి "మీ సంగతి పూర్తిగా తెలిసిందంది."

"ఆ సంగతేదో చెప్పాలనివుంటే చెప్పు" అన్నాడు.

"ఏమీ లేదూ..."

"ఏమీ లేకుండా యింత గొడవ చేస్తావెందుకు?"

"ఉంది...మీకూ .."

"ఊ! చెప్పు! సగంలో ఆపటం దేనికి?"

"మీకూ ... పనిమనిషికీ ... " అంటూనే ఫక్కున నవ్వేసింది.

వెంకటేశ్వరరావు ముఖం త్రిప్పేశాడు. నవ్వండి అంది. నవ్వలేదు. "నవ్వుతారా లేదా?" రెట్టించింది. బట్టలు వేసుకున్న భర్త వెళ్లిపోతూంటే— "నిజం చెప్పేనా? కనుకున్నాలెండి!" ఈసారైనా నవ్వుతూ "నీకేం మతిపోయిందా" అని భర్త అంటాడని అనుకుంది. ఆగినభర్త యేమాటా అనలేదు. నవ్వకుండా ప్రమీల "మాటండీ! నాదగ్గర దాపరికం చేస్తారా? నిజం చెప్తారా లేదా?"

భర్త వెళ్ళిపోతూ "నిజం" అన్నాడు.

గదిలో కూర్చుని మొనటిరాత్రి జరిగిన సంఘటన జ్ఞప్తికి తెచ్చుకుంది. భర్తగురించి తెలుసుకున్న పుడల్లా, మిగతా మగవాళ్లు యేదో లోటున్న వాళ్ళగానే కనిపిస్తారు. "ముప్పయ్యేళ్ళవరకూ పెళ్ళి చేసుకోకండా, పవిత్రంగా ఉండే మొగాళ్ళీరోజుల్లో యేరీ? ఇంత అందగాడిమీద బలేకథ సృష్టించానే— యీ కాకి వీధివెంబడినత్తే మొగాళ్ళి నమిలి మింగేస్తారా? — చెప్పుకోడానికైనా సిగ్గు పడిందికాదే? ఏ ఆఫ్రికా అడివిలోనో తిరగవలసిన మనిషి—పోనీ అందం లేదూ అంటే, ముఖానికి పౌడరేనా రాస్తుందా? నగలు గానీ ఒక మంచిబట్ట గానీ వుందా?— సంస్కారం యేకోశానా లేని యీ అకిరిముగంమీద కథ బాగా అల్లానే—! ఆయన నిజం అని చెప్పకోవటంకూడా బాగానే వుంది. బలే అబద్ధాలుఆడి నన్ను యేడిపించాలని చూస్తున్నారు. ఇంత చదువూ చదివి, యీమాత్రం తెలుసుకోలేనా? తినకంటె హెచ్చు శాంతం చూపించగలను."

సాయంత్రం భర్త కొస్త ఆలస్యంగా వచ్చాడు. డైనింగు టేబిల్ దగ్గర "ఉదయం వెళిపోయేటప్పుడూ ఏమన్నారండి" అంది.

"నిజం అన్నాను."

"మీ అబద్ధం నిజం చేసేయగలను"

"నే అబద్ధంఆడే అవసరం ఏముంది?"

"అయితే దానికి మీకు నిజంగా ఉందంటారా?"

"అవసరంగా నీదగ్గర ఎందుకు అబద్ధం ఆడాలి? నువ్వడిగావు...నిజం చెప్పటం నా విధి!"

ప్రమీల భర్తవైపు ఒక్కసారిచూసి ముఖం దించుతూ "మీరు నిజం చెప్పకపోతే......" వెంకటేశ్వరరావు సగంలో అడ్డుతూ "నిజం, నిజం... ముమ్మాటికి నిజం!..."

ఉద్వేగంతో ప్రమీల కస్సుమంది..."అబద్ధం... అబద్ధం! భర్త మాటాడలేదు. చలించనూ లేదు. చప్పున లేచి నిల్చుని, "నిజం చెప్తారా లేదా?" భర్త మాటాడలేదు. దగ్గరగావచ్చి భర్తను కుదుపుతూ "నన్నేడిపించకండి! నిజం చెప్పండి!"

"నిన్నేడిపించకండానే నిజం చెప్పానుకదూ? ఆమెకూ నాకు వుండేది అదీ ఒక్కసారే!" ప్రమీల కళ్ళలో గిరగిరా నీరు తిరిగింది. చప్పున కుర్చీమీద కూర్చుంటూ, డైనింగు టేబిల్ మీద తల ఆన్చి, వెక్కి వెక్కి యేడుస్తోంది. భర్త అలా మీదికి చూస్తున్నాడు. ఒక పావుగంటవరకు మాటాడని మొగుడు, "యింకా భార్య యేడవటంచూసి" చదువుకున్నావేమో? యీమాత్రం ఎదుటివాళ్ల హృదయాన్ని అర్థంచేసుకోలేవా?" అన్నాడు. తలెత్తింది కాని భర్త వేపు చూడలేదు.

"అవునా, అర్థం చేసుకోటానికి ప్రయత్నమైనా చెయ్యనా?" అని ప్రశ్నించాడు.

ప్రమీల చెయ్యిచాచింది. "నా చేతిలో చెయ్యివేసి యిదంతా నిజం అని చెప్పండి" అంది.

"నేను నిజమే చెప్పాను. దీనివల్ల నీకు పూర్తి నమ్మకం కలుగుతుందంటే చేస్తాను. లేదా అంటే అనవసరం!"

ఆమె తలవూపింది. "ఇదంతా నిజం" అంటూ ఆమె చెయ్యిమీద చెయ్యి వేశాడు—ఇంకా ఆ చేతిని అలా వుంచాడు. ఆమె తన చేతిని చప్పున విదిలించి, పక్కగదిలోకి పరుగెత్తింది.

తెల్లవారింది. ముఖం పాలిపోయినా, చూపు తీక్ష్ణంగా వుంది ఆ గది కదల్లేదు. భర్త మామూలుగా లేచాడు. కాఫీకి హోటలుకి వెళ్ళాడు. ఫ్లాస్కులో కాఫీ తెచ్చి భార్యయెదురుగా పెట్టి టూత్ బ్రష్, పేస్టు అందివ్వబోయాడు. ప్రమీల ముఖం యెత్తలేదు. తీసుకోమంటే, అక్కడినుంచి లేచి వెళ్ళిపోయింది. ఆవేళ ఆఫీసుకి వెళ్లటం ఆలస్యంఅయింది. తను హోటల్లో భోంచేశాక, కేరియర్ మోసుక వచ్చి, యింట్లో పెట్టి, చెప్పి మరీ వెళ్ళాడు. ప్రమీల పెరటినుంచి గదిలోకి వచ్చేసరికి బీరువా తలుపులు బారుగా తెరచివున్నాయి. అందులో పుస్తకాలు తనవేపు చూస్తున్నట్లనిపించింది. ఇంచుమించు ఆ పుస్తకాలన్నిటితోను తనకు పరిచయంవుంది. కొన్ని పుస్తకాలు రెండు మూడుసార్లుకూడా చదివింది. భర్త యెందుకిలా తలుపు తెరిచాడో వూహించుకుంది. ఇందులో ఏగమేనా చదివితేనా తను, ఆమెను యెత్తిపొడవటానికి? ఆకలేస్తున్నా కాఫీ తాగలేదు.—కూర్చో బుద్ధిపుట్టలేదు.—ఒక్కక్షణం అంతా తల్చుకుని యేడవాలనిపించింది. మరోక్షణం కన్నవారింటికి వెళ్లిపోదామని—కొంతసేపయాక మొగుడితో యిక మాటలే ఆడవని—కొంతసేపు విసుక్కుంటూ, పరుపుమీద పడుకుంటూ లేస్తూ, కూర్చోలేక నిల్చోలేక, బాధపడుతూ వుంటే, పనిమనిషి వచ్చి "ఏం అమ్మగారు—అలాగున్నారు?"

ప్రమీల తీక్ష్ణంగా చూసింది. "ఈ జాకెట్టు లేని అడిబిడున్న—దానిమీదా ఆయనికి మోహం.? మళ్ళీ ఆ మొరటుమనిషి మోటుగా ప్రశ్నించింది. ప్రమీల వినలేక "ఛా" అని గసిరింది. ఫోతావా లేదా అన్న యజమానురాలివేపు వింతగా చూస్తూనే కదలలేక కదిలింది. తలుపు వేసి పరుపుమీదపడి "యింత మోసం చేస్తారనుకోలేదు — ఆయన్ని యింక యెప్పుడూ, యేవిషయంలోనూ నమ్మకూడదు."!—

తను తెచ్చిన కేరియర్, అలా నిండుగా అక్కడే వుండటం సాయంత్రం వచ్చిన భర్త చూసి, అప్పట్లో యేం అనలేదుకాని, ఆరాత్రి హోటలు నుంచి తెచ్చిన కేరియర్, డైనింగు టేబిలుమీద పెట్టి భార్యను రమ్మన్నాడు. ఆమె మాటాడలేదు.

"తిండిమానితే ఆలోచించే అవకాశం వుండ" దన్న భర్తకు గట్టి జవాబు యివ్వాలనుకొన్నా మాట్లాడటం యిష్టంలేక ఊరుకుంది. ఆయన భోజనం చేస్తున్నా తొంగి చూడలేదు. పడుకునేసమయానికి అన్నాడు. "ఇంకా అర్థం చేసుకోలేదా?"

కొరకొర ఒకసారి చూసి అక్కడనుంచి లేచి వెళ్ళిపోయింది. ఆమెకు వినిపించేటట్లు అన్నాడు. "నేనే అబద్ధం చెప్పంటే?....

ఈప్రశ్న వేశాక రాత్రి వేసుకున్న పరుపుమీద మళ్ళీ మేనువాల్చి నిద్రపోయాడు. ఒంటిగంట రాత్రికి ఒకసారి తెలివివచ్చేసరికి చూశాడు. ప్రమీల ప్రక్కగదిలో అలానే ఒంటిగా సోఫామీద కూర్చుంది. దగ్గరగా టేబిల్ మీద లైటు వెలుగుతోంది. ఆమె ఏదో ఆలోచించుకున్నట్లున్నా భర్త దగ్గరగా రావటం గుర్తుపట్టక పోలేదు. కిటికీ తలుపు తీశాడు. 'రా' అని చెయ్యి పట్టుకున్నాడు. ఆమె చెయ్యి చిరాకుగా విడిపించుకుంది. కాస్సేపు యెదురుగా టేబిల్ కు ఆనుకొని నిల్చున్నాడు. ఎదరగా కిటికీగుండా వీధిలైటు వెలుగులో యెవరో నిల్చున్నట్లనిపించింది. ఎవరు? లెక్చరర్ ప్రసాదరావా? కిటికీ దగ్గరకువెళ్లి చూశాడు—ఆయనకాదు—రెండో ఆట సినిమాకు వెళ్లిన యెదురింటాయన — వాళ్ళయింటి తలుపు తడుతున్నాడు.—

ఇంతలోనే ప్రమీల ప్రక్కగదిలోకివెళ్ళి, పరుపుమీద బోర్లగా పడుకుంది. వెళ్ళి ప్రక్కన కూర్చున్నాడు. ఆమె మరి కాస్త దూరంగా జరిగిపోయింది. చాలాసేపటివరకు మౌనంగావున్న భర్త ఆమెవీపుమీద చెయ్యివేశాడు. ప్రమీల ఏడుస్తూనే ఆపుకోడానికి ప్రయత్నిస్తోంది. ఆమె యేడుపు పూర్తిగా ఆగేవరకు ఊరుకుని, "ఇంకా నన్ను అర్థం చేసుకోలేదా?" అన్నాడు.

"చేసుకున్నాను. పూర్తిగా! ఉత్త నీతిలేని..." ఆమె గొంతుక పట్టేసింది.

వెంకటేశ్వరరావు అక్కడనుంచి లేచి తన మంచంమీదికి వెళ్ళిపోయాడు. ప్రయత్నించినా నిద్దరపట్టలేదు. ఏదో మాటాడాలని అనుకున్నా, మాటాడక లేచి, టేబిల్ మీద లైటు వెలిగించి, కొంతసేపు యేదో రాసుకున్నాడు. రాసుకొన్నది పైకి చదవటం మొదలుపెట్టాడు. "నాకు ఒకనితో పరిచయం వుంది. తల్లి తండ్రి, నా అన్న వాళ్ళు లేక

కష్టపడి, నలుగురి దయాదాక్షిణ్యాలకు పాత్రుడై పెద్దవాడయ్యాడు. ఒక కంపెనీలో గుమాస్తాగా చేరి, స్వయంకృషివల్ల కొద్దికాలంలో అసిస్టెంటు మేనేజర్ అయ్యాడు. డబ్బుగురించి బాధపడ్డాడు గాబట్టి డబ్బు విలువ ఆయనకు తెలుసు. కష్టాలు అనుభవించిన మనసు—తను సుఖపడేటప్పుడైనా, యెదుటివాళ్ళ కష్టాలు వూహించని దేమీ కాదు, తను అనుభవిస్తున్నట్లు బాధపడుతుంది. ఇంకా కొద్ది నెలల్లో తను మేనేజరవుతాడు. ఇప్పటికింకా తను ఒక ఆర్థిక అంతస్థులో వుండలేదు. మానేజరయాకే పెళ్లి చేసుకొంటే ఆర్థికంగా చిక్కు పడకుండా వుంటాడు. ఈ బ్రహ్మచారి వెంట కొందరు ఆడవాళ్ళు పడ్డారు. నిగ్రహం చూపించాడు. మరే వుద్దేశంతో కాదు. వచ్చే భార్యదగ్గర తను నేరస్థుడుగా ఉండకూడదని,—ఒక నాడు—అతను గడిపిన పదివేల రోజుల్లో ఒక రోజు అది.—తన జీవితంలో జరిగిపోయిన గాథల్లో ఒక గాథ.—తెల్లారి కళ్ళు విప్పేసరికి రోజూ వచ్చే పనిమనిషి ముసలమ్మ కాదు—మనుమరాలు వచ్చింది. కలలోనైనా ఆమెను తాకుతా ననుకోలేదు.—కానీ ఆమె యిదివరకు చాలాసార్లు చూసిన చూపుగురించి, ఆలోచించాడు. ఆ శాపగ్రస్థ మనసును అర్థంచేసుకొన్నాడు. దరించే అవకాశం లేదుకానీ, సానుభూతి చూపించకుండా వుండలేకపోయాడు! ఆ జాకెట్టు లేని మొరటుమనిషి—ఇది వూహిస్తూంటే—అదేమిటో ఆ నిముషం—ఆమె ఒక దేవతాస్త్రీలా కనిపించింది!—నరాలు వుబ్బి తబ్బిబ్బయాయ్.—అంతే తరవాత చాలా విచారించినా, మళ్ళీ యెందుకో మనసు తృప్తిచేసుకొన్నాడు! ఈ సంఘటనే ఆ కొద్దిరోజుల్లో పెళ్ళి ప్రయత్నాలు చేయించింది."

చదివాక మళ్లీ యింకోకసారి, మెల్లగా ఆగి ఆగి చదివి, "ఆయనగూర్చి చెపుతూ నాగురించి చెప్పుకున్నా ననిపిస్తోంది" అన్నాడు.

నిశ్శబ్దం. ఆలస్యంగా నిద్రపోయినా, మామూలుగానే తెలివి వచ్చింది. ఆఫీసుకు వెళ్ళేవరకు ఆమెలో యేమైనా మార్పు వచ్చిందేమో అని చూశాడు. నీతిని పరిపూర్ణంగా గౌరవించే భార్యలో మార్పు లేకపోవటంతో, ఆమె కూర్చున్న గదిలోనే యెదురుగా వున్న టేబిల్ దగ్గర కూర్చుని కాగితం కలం తీశాడు.

వ్రాసిన కాగితంమీద వెయిట్ పెట్టి వెళ్లిపోయాడు. వెళ్ళాక యేం వ్రాశారో చూద్దామనుకున్నా, ఒళ్లుమండి చూడలేదు. ఇంతలో భర్త కేరియర్ మోసుకువచ్చి, మామూలుగానే గొంతుక మారకుండా, భోజనం చేసితీరాలి అని చెప్పి, ఆఫీసుకు వెళ్ళిపోయాడు. భోజనం చేసింది. ఇది ఆమెలో మార్పుసూచించటం కాదు. ఆకలి వేస్తోంది. ఈ భోజనం చేసేముందు, వూళ్ళో వున్న కన్నవారింటికి వెళ్ళిపోదామని అనుకున్నా, తను యింతగా అలంకరించిన యిల్లా—యీ సోఫాలు—యీ అద్దంలా వున్న నేల—యీ ఫొటోలు—యీ జోళ్ళు—తను కదిలిన మరుక్షణంలో అన్నీ చిందరవందరైపోతాయ్! ఇంత అందగాడు—గడ్డం పెంచుతాడు—ఇప్పుడో—ఆమె బలవంతం చేస్తే—సూటు వెయ్యటం—నెక్ టై కట్టటం—అలాటివి—తను లేకపోతే, ఆఫీసుకు బనియన్‌తోనైనా వెళ్ళిపోతాడు!—

చాలాసేపు ఆలోచించే భోజనం చేసింది. భోజనం చేసేటప్పుడు "ఊ! పెద్ద మేనేజరట! హోటలునుంచి వడితోద్దుమీద.. సిగ్గులేదూ? కేరియర్ మోసుకొని..." భోజనం చేస్తున్నంతసేపూ అసహ్యించుకొంటూనే వుంది. తరువాత చాలాసేపు తర్కించుకుని యేం వ్రాశారో అని తొంగిచూసింది! "ఇంతసేపు వ్రాసింది యింతే—అంతా నటన! నాకంటే హెచ్చు చదువుకోలేదు! తెలివితేటలతో నన్ను మోసపుచ్చుదా మనుకుంటున్నారేమో?"

మళ్ళీ ఒకసారి ఉత్తరంవేపు చూచి ప్రతి అక్షరం చదివింది!

ప్రియమైన—

కొంద రాడవాళ్లు బలే తమాషాగా వుంటారు!

ఏం? మొగాళ్లో? ఆడవాళ్ళైనా తమాషాగా వుండేది? కనిపిస్తోందగా? భర్త వచ్చేవరకూ, జరిగింది నెమరు వేసుకొని, జరగబోయేది వూహించుకొంది.—వెయ్యివిధాలుగా ఆలోచించింది .....

భర్తవచ్చాడు. నీ వుత్తరం చూసే అవసరం నాకులేదని, ఆమె అనుకున్నట్లు, అతనికి తెలియాలని, ఆయన రాకముందే, ఆ గదిలోంచి వెళ్ళిపోయింది. వెంకటేశ్వరరావు వచ్చిరావటంతో, ఉత్తరంవేపుచూసి, తను అనుకున్నట్లుగా, భార్య వ్రాయకపోవటంతో, కలం తీశాడు. బట్టలుమార్చి బాత్ రూమ్‌కి వెళ్ళాడు. ప్రమీల ఆతురతగా మళ్ళీ యేం వ్రాశారో అని వచ్చిచూసింది. వ్రాసిన ఒక వాక్యం ఆయన కొట్టేశారు! నిజంగా.. తన ఆలోచన అన్నిటిమీద క్రాస్ మార్కులు పడ్డాయ్!...

గదిలో కాలు పెట్టిన భర్త, "పనిమనిషివున్నా కాఫీ యెదురుగావచ్చేది" అన్నాడు. భార్యకు దీనితో,

ఒళ్లు మండిపోయింది. అంతలో వూరుకోక, చిరునవ్వుతో భార్య యెదురుగావెళ్లి, "మంచివాళ్ళను కొన్ని ప్రతీవాళ్ళలోనూ, వాళ్ళకు కనిపించని చెడుగు వుండి తీరుతుంది. ఆ చెడుగు తెలుసుకొని, సరిదిద్దుకోకపోతే, వాళ్ళ మంచితనాన్ని ఆ చెడుగు వేగంగా కబళిస్తుంది!" — టేబిల్ మీద పుస్తకంవిప్పి చదువుకున్నట్లుగా, యీమాటలు జార్చాడు! ప్రమీలకు తెలుసు, యిది భర్తకూర్పని — ఆమెకంటే తను తెలివైనవాడినని నిరూపించాలనే తన వుబలాటం! తనకంటె ఆమె హెచ్చు చదువుకుంది. — ఆమె పుట్టి పెరిగింది పెద్దయింట్లో — ఆమె విసుక్కున్నా చూసి ఆనందించినవాళ్లు కాలేజీలోనే కాదు — బయట యెందరుండేవారు! —

భర్త వుబలాటానికి మనసులోనే అసహ్యించుకొంది. వెంకటేశ్వరరావు, ఆరాత్రి పుస్తకం పట్టుకుని కూర్చున్నాడు. ఉండిఉండి తలెత్తి ప్రక్కగదివేపు చూస్తున్నాడు! రాత్రి పదైంది. వెన్నెలరాత్రేమో, వీధిలైట్లు ఆర్పేశారు. వస్తున్న మలయమారుతం తనవేకో దలింపచేసింది. మెల్లగా లేచాడు. తన శరీరం పట్టుతప్పి, ఆమె దరిచేరుస్తున్నట్లని పించింది. కాని మళ్ళీ మనోనిగ్రహం తెమ్ముకొని ప్రయత్నంలో కూర్చున్నా — "ప్రమీ!" అని పిలవకుండా వుండలేకపోయాడు. జవాబు లేకపోవటంతో మనసు చివుక్కుమన్నా, తమాయించుకొని లేచాడు. ఆ గదిలోకివెళ్లి, ఆమె ప్రక్కనకూర్చుని, "ఇంకా యెంత కాలం యీ కలహం!" అన్నాడు.

జవాబులేదు —

"కన్నవారింట్లో నేవుంటే, నాకింతగా బాధ వుండేదిగాదు!"

ఈమాటలు అన్నాక తన అనిశ్చలత స్ఫురించి, అక్కడనుంచి లేచిపోయాడు. ఆగది విడిచిపెట్టి మళ్ళీ మొదటిస్థలంలో కూర్చుని భార్య వస్తుందేమోనని చూశాడు. —

పండ్రెండుగంటలయింది — రాలేదు! ఆగదిలో అప్పుడు దీపం ఆరింది. ఈగదిలోనూ దీపం ఆర్పేశాడు. తెల్లారిలేచాక యెర్రగావున్నకళ్ళను మరింత యెరుపుచేద్దామనుకున్నా, ఒక అరగంట పోయాక, తను పహాసాన్ని వీడి, పొరపాటు చేస్తున్నానని బాధపడ్డాడు.

మళ్ళీ భార్యను మామూలుగా పలుకరించాడు — కాఫీ తెచ్చాడు. కేరియర్ తెచ్చి భోజనం చెయ్యమన్నాడు. ఆఫీసుకు వెళ్లేముందు ఉత్తరంకూడా వ్రాసేను! ఆమె చదివింది! —

ప్రియమైన —

నాకు చాలా అందమైన భార్య వుంది. నాకు యీ విషయంలో గర్వంలేదు. — కాలేజీ చదువు — కావలిసినంత ప్రపంచజ్ఞానం, అన్నీ వుంటున్నా, యీమె నిజం చెప్పిన భర్త నిజాయితీని, అర్థం చేసుకుంటుం దనుకున్నాను కాని యీమెతో నాకున్న సంవత్సరం పరిచయంలోనూ, ఒక విషయం నిర్ధారణగా తేలిపోయింది. ఏ అనుభూతినైనా అర్థం చేసుకుని అనుభవించ లేదు..."

చదువుతూ చప్పున ఆపి "అతి తెలివి!!" అని వికటంగా నవ్వుకుంటూ మళ్ళీ దృష్టిపోనిచ్చింది.

"నా గడచిపోయిన గాథననుసరించి, యింత రాద్ధాంతం చేస్తోంది! ఆమె గడచిపోయిన గాథ నాకు తెలియ దనుకుంటుందేమో?

ఇంక చదవలేదు. చదవటానికి యింకేమీ లేదు. నిప్పు నిమిష నిమిషానికి రాజుకపోతోంది. భర్త యింటికి వచ్చేసరికి మంటలు మీదికొచ్చాయి!

"ఏం తెలుసు? నీలా నే నేను నీతిలేకుండా, యెవరితోనూ పోలేదే? ఎందుకిలా రాశారు?"

భర్త హఠాత్తుగా అడ్డి "పోయేవని యెవరన్నా" రన్నాడు.

"ఎవరా? ఏం రాశారో చూడండి!"

"నే నేం అబద్ధం రాయలేదే?"

"నిజమా? మీకిదంతా నిజమా?" అంటూ అరుస్తూనే ఆ వుత్తరాన్ని ముక్కలు ముక్కలుచేసి నేల నేసికొట్టింది. అక్కడనుంచి, చఱ్ఱున కదిలి పరుపు మీదపడి వెక్కి వెక్కి యేడుస్తోంది.

వెంకటేశ్వరరావు, మండే మంటలో ఆజ్యం పొయ్యదల్చుకోలేదు. మౌన జలంతో మంట నార్పుతున్నాడు. ఆ రాత్రి ఇద్దరూ భోజనం చెయ్యలేదు. ఆయన చిరిగిన వుత్తరాన్ని మళ్ళీ ఒక కాగితంమీద అంటించి జీవం పోశాడు. ఆ వుత్తరాన్నే ఆరాత్రి పొడిగించాడు!

"అవును. ఉత్తరం చించేయటం సులభం — మళ్ళీ అతికటం కష్టం — అతికినా దాని అసలు రూపుపోయింది! త్వరపడి ఒక నిమిషంలో చూపించిన పౌరుషం, వల్లవచ్చిన, ఫలితాలు జీవితంమీద, యిలాంటి ప్రభావాన్నే చూపిస్తాయి!

కాని ప్రపంచంలో అందరూ అల్పులైవుండరు. మానవులలో కొందరు ఉన్నత దృక్పథంతో వున్నారు కాబట్టే, యిలా చిరిగిన జీవితాలను అతుకుతూ, యీ ప్రపంచాన్ని నడిపిస్తున్నారు. వాళ్ల మెదడు, అందరి మెదడులా, ఆ పుణుకలో నే యిమిడి వున్నా, అది ప్రపంచమంత విశాలంగా వుంటుంది. ఆ విశాలతలో, అవినీతికీ వాటి బంధువర్గానికీ, కూడా ఆశ్రయం దొరికి, వాటంతటికి అవే, మారిపోటానికి అవకాశం యిస్తుంది.

ఆ విశాలతే, యింత చదువుకున్న నా భార్యకు లేదని విచారిస్తుంటాను! ఆమె వచ్చిన యీ యేడాదిలో, యెదుటివాళ్ల ఒక తప్పుని విడిచిపెట్టకుండా, భూతద్దంలో పెట్టి చూచింది. ప్రపంచం భ్రష్టులైపోతున్నట్లు అరిచింది—బాధపడ్డది—ఈ లోకంలో యే మానవుడు యే కాలంలోనూ, పరిపూర్ణుడు కాలేడు. మంచి చెడ్డల కలయికే మానవుడు. వ్యక్తిలో చెడ్డనే తీసుకొని అట్టహాసం చెయ్యటం, సంస్కారం గల వాళ్ళ లక్షణం కాదు. దిగజారిన మానవుల తప్పులను యెత్తి గగ్గోలు చెయ్యటం కంటె, వాళ్ల బాధలకు సానుభూతి చూపించి, వాళ్ల తప్పులను మన్నించాలి. ఇలా చెయ్యటానికి మనిషి ప్రేమమయుడుగా వుండాలి!

నా భార్యకు, నాకంటె హెచ్చు చదువుకున్నాననే గర్వం వుంది. ఆమెకంటే నేను గొప్పవాడినని నిరూపించాలని, నేను ప్రయత్నిస్తుంటాననీ, ఆమెకు అనుమానం వుందని, నాకు తెలుసు! నాకా ప్రయత్నం లేదు! కాని చదువుకున్నంత మాత్రాన, సంస్కారం అబ్బిపోదు. మనసు వికసించిన వాళ్ల సహవాసంవల్ల మనిషికి, అసలైన సంస్కారం అబ్బుతుంది. నా కటువంటివాళ్ల సహవాసం అబ్బిందంటే గొప్ప చెప్పుకోవటం కాదు!

ఇప్పుడు యింతకీ జరిగిందేమిటి? నా గడిచిపోయిన గాథను వివరించాను. నేను అబద్ధం ఆడితే నా భార్య మనసులో యిదివరలా "అందమైన ఉత్తముడు నా మొగుడు" అనే భావనగా వెలిగిపోతాను. నేను అబద్ధం ఆడి దూదిలా యెగిరిపోతాను. నిజం చెప్పాను. నా నిజాయితీలో వైరాగ్యమంతు ఆలోచించినట్లు లేదు. ఆ గడిచిపోయిన గాథనుంచి నేను నీతిని నేర్చుకున్నాను. వెంటనే పెళ్లి చేసుకొన్నాను. లెక్చరరు ప్రసాదరావు ప్రేమగాథ యీమధ్యే నాకు తెలిసింది. ఆయన యీనాటికీ యీమె ముఖమైనా చూడాలనే ప్రయత్నంతో, యీ వీధివెంట రాత్రనక పగలనక తిరుగుతుంటాడు. ఆయనతో పరిచయం చేసుకున్నాను. సంస్కారం గల పెద్దమనిషి! ఆయన చేసినది ఒకే ఒక తప్పు—అందాన్ని చూశాడేగాని ఆత్మని చూడలేదు. ఒక హృదయంలేని బొమ్మను ఆరాధించాడు—యిదివరకు యీయనగురించి నాభార్యతో యెన్ని సార్లో చెప్పాను—కాని ఒక్కసారైనా ఒక సానుభూతి వాక్యం పలకలేదు!

ఈ గడిచిపోయిన ఆమె గాథనుంచి ఆమె నేర్చుకున్నది యేమీ లేదు. మానవులమనసులో రేగిన కల్లోలాన్ని అర్థంచేసుకొంటే కన్నీరు కార్చకపోయినా, అథవా ఒక సానుభూతివాక్యమైనా పలుకుతాం! ప్రసాదరావు ఆరాటాన్ని—ఈనాటివరకు బ్రహ్మచారిగా — బహుశా జీవితంలో అలా వుండిపోతాడేమో—? ఆ మనసుయొక్క మహా సంక్షోభాన్ని కొద్దిగనైనా వూహిస్తే—ఆమె ఆయనను ధిత్తిలా చూపమని కాదు — అయ్యో పాపం—ఇంత బాధ పడుతున్నాడే—యిదివరలా అరవకుండా..."క్షమించండి — మీ బాధ అర్థం చేసుకొన్నాను. కాని యీజన్మలో సానుభూతి తప్పించి యింకేమీ చెయ్యలేనని" చెప్పగలిగేది. — ఆ గాథనుంచి యీమె యేమీ నేర్చుకోలేదు. — నేర్చుకొనే వుంటే యీ నాలుగురోజుల్లో జరిగిన గాథను యింత పెద్ద కలహం చెయ్యకుండా యిట్టే పరిష్కారం చేసివుండును. పనిమనిషి యీమెలా అందకత్తె కాకపోవచ్చు—కాని తనలాంటి ఆడది. ప్రమీలనుచూస్తే నే మగవాళ్లు పిచ్చెత్తుతారు — అంచేత ఆమెకు మగవాళ్లగురించి ఆలోచనబాధ లేదు — కానీ ఆమెకు — మగవాడి తలపే రొంత హాయినిస్తుంది! అందులో ఒక అందగాడు అతని తొలివలపు తనమీద కురిపించాడంటే - ఆమె హృదయంలో శాశ్వతకాలం వెలిగే దీపం, ఆక్షణం వెలిగింపబడ్డది! అది తెలుసుకొని ఆమె ప్రతి

నంతకాలం సంతోషిస్తుంది! ఈమాత్రం బాధపడుతున్న తోడిస్త్రీమీద సానుభూతి నాభార్యకు లేక పోయింది—

గడచిపోయినగాథలనుంచి నేర్చుకోని, మనిషి తన భవిష్యత్తును నిర్మించుకోకపోతే, మనిషికి పతనం తప్పదు—అలానే జరిగిన చరిత్రను మరచిన దేశం, —ప్రపంచం—పతనం కాక తప్పదు—! సంఘజీవులైన మానవులు చావుని జయించలేరు — అంచేత వారు చనిపోయేటప్పుడు యేదో ఒకశక్తికి, యీ భూమిమీద గడిపిన యింతకాలంలో చేసిన మంచిచెడ్డలు విన్నవించవలసి వుంటుంది. — ఆశక్తినే దేవుడందాం! ఆదేవుడు నా భార్యను చనిపోయేటప్పుడు "నువ్వు బతికినంతకాలం యేంచేశావ్" అని అడిగితే నా భార్యకు చెప్పటానికి "నాయిల్లు, నామొగుడూ, నాపిల్లలు,—నాసోఫాలు—నా జార్జెట్ చీరలూ—నా నెక్ లేసులూ" అంతా "నేను... నేను..." అని తప్పించి ఒకరికొక మేలు చేశాను, ఒకరి బాధలను పంచుకున్నాను" అని చెప్పగలదా?


ఈవేళనే నేనొక జబ్బుపడి, లేక ఏదో మహమ్మారికి లోనై అసహ్యంగా తయారైతే, ప్రసాదరావుగతే నాకూ పడ్తుందని నాకు తెలుసు! నేను కాంక్షించింది నా భార్యదగ్గర లేదు—! నీ—"

ఉత్తరం పూర్తిచేసేసరికి రాత్రి రెండుగంటలయింది. ఉత్తరం మొదట్లో "ప్రియమైన" తరవాత "ప్రమీ" అని చేర్చాడు.

ఆ మరుసటిరోజు మౌనం దాల్చాడు. ఆ ఉత్తరం ఆఫీసుకు వెళ్ళాక ప్రమీల చదివింది—మళ్ళీ మళ్ళీ చదివింది. రెండు రోజులైనా వెంకటేశ్వరరావు మౌనంగానే వున్నాడు. ఆమెకు ఆ ఉత్తరం కంఠస్థమైంది!

ఆమె పరిస్థితిలో మార్పు లేనట్టే వుంది.— భర్తను అర్థంచేసుకున్నట్లు అగుపించలేదు. ఏడుపూ లేదు—నవ్వూ లేదు—అలాంటి చిహ్నాలేమీ లేవు. ఉత్తరం రాసిన మూడో రాత్రి పదకొండుగంటలయింది.—వెంకటేశ్వరరావు పుస్తకం మూసి పక్కగదిలోకి వెళ్ళాడు. ప్రమీల మెలకువతోనే వుంది. గడచిన మూడు రాత్రులనుంచి ఆమె నిద్దర సరిగాపోలేదు—భర్త ఆమెదగ్గరగా వస్తాడని అనుకోలేదు—వచ్చాడు. అతను తాకగానే ఆమె శరీరమంతా ఒక్కసారి వణికింది. ఎత్తిన ముఖానికి భర్త చిరునగవు అవుపించటంతో, కళ్ళల్లో నీళ్లు గిర్రున తిరిగాయ్. ప్రక్కన కూర్చుని దగ్గరగా ఆమెను చేర్చుకుంటూంటే, పెల్లుబికిన దుఃఖంతో భర్త భుజంమీద వాలి, వెక్కి వెక్కి యేడ్చింది!

అతని హృదయం మాట్లాడటం విన్నది. ఇప్పుడు ఆమె కౌగిలిలో వున్నది అతని భౌతిక శరీరమే కాదు—మహత్తరమైన మరి యింకేదో!


మరల ఎండాకాలము వచ్చింది!
... ఒళ్లంతా చాల జిగటగాను, మలినముతోను యున్నట్లు ఉందా?
ప్రతిదినము మీరు మలినము లోని క్రిములనుండి అంటు రోగమును పొందే ప్రమాద మున్నది
లైఫ్‌బాయ్‌తో ఈ క్రిములను కడిగివేసి మిమ్ములను మీరు ప్రతిదినము కాపాడుకొనండి
లైఫ్‌బాయ్‌యొక్క "రక్షక నురగ" మీ ఆరోగ్యమును కాపాడును
లైఫ్‌బాయ్ సబ్బు
ప్రతిదిన మలినములోని క్రిముల నుండి మిమ్ములను కాపాడును
LIFEBUOY SOAP
LIFEBUOY SOAP

* నేటిసాహిత్యము *

అపభ్రంశప్రయోగములు

శ్రీ కురుగంటి సీతారామయ్య

నేటి సాహిత్యమనగా దాని ఎల్లలేవి? ఇవతలఎల్ల తెలముగా చే యున్నది. అది ఈదినము వెనుకటి ఎల్లయేది? గడచిన అర్ధశతాబ్ది అందునా? వీలులేదు. దాదాపు 1940 సంవత్సరమువరకు సాహిత్య మొక మార్గమున నడచినది. తరువాత అది మార్గము కాదనియు, యావత్ప్రజానీకమునకు సులభముగా తెలిపి, దేశాభ్యుదయమునకు తోడ్పడుదు, ప్రజలయొక్క కష్టనిష్ఠురములను చిత్రించుకవితయే కావలయునను అభిప్రాయము బలవత్తరమైనది. దీనినే అభ్యుదయ సాహిత్యమనిరి. అప్పటినుంచి యిప్పటివరకా మార్గము ప్రచారములో నున్నది. సాహిత్యశిరోమణి వాగ్భైరవ శివరామకృష్ణయ్యగారు తత్సాహిత్య స్వరూపమును నిర్ణయించిరి. తరువాత ఆ నిర్వచనము నెవ్వరును కాదనలేరు. దానిని అనువదించుట ప్రస్తుతము. "అభ్యుదయ రచన" అను గ్రంథమున వారి ట్లనినారు.

"పద్యలక్షణాన్ని గాని, కావ్యలక్షణాన్ని గాని, రసపుష్టిని గాని, విసర్జించి యథేచ్ఛగా కావ్యరచన కొనసాగించమని నా ఆశయం కాదు. లక్షణాలూ, నియమాలూ, పూర్వకాలాన్నించీ మనదేశంలో వున్నవే! కాని భాషలోనూ, భావాల్లోనూ, రచనా పద్ధతిలోనూ, మాత్రమే నూతనపంథా — అభ్యుదయ పంథాను అనుసరించమని నా విన్నపము. "నిరక్షరాస్యులైన సామాన్య ప్రజలకుకూడా సాకల్యంగా తెలియజేయాలంటే సంస్కృతభూయిష్ఠమైన కవిత్వం, సమాసాలు మొదలైన పాండిత్యప్రకర్షను వ్యక్తపరిచేవిధానం పనికిరాదు. సులభంగా పామరజనులకు సహితము అర్థమయ్యేభాషలో వ్రాయబడి ఉండాలి. అంటే సరళభాషలో చిన్న పదాలలో అధికమైన భావమిమిడ్చి, సామాన్య ప్రజా ఉద్యమానికి, సామాన్య ప్రజాభివృద్ధికి, అవసరమయ్యే కవిత్వాన్నే కవితల్లజులంతా వ్రాయాలి. సర్వ జనులకు తెలిసే వ్యావహారికభాషలో సమాస రహితమైన శైలియు, గానానికనుకూలమైన గేయాల్లో, ప్రజలకు కర్తవ్యజ్ఞానం విప్లవవేదనం బోధించే పద్ధతిలో కవిత్వముండాలె. దీనినే అభ్యుదయ రచన అనండి." ఇక్కడికి అభ్యుదయకవిరచనయొక్క నిర్వచనమైనది. ఇట్టిది నేటి సాహిత్యము. ఇంతకంటె మంచి నిర్వచన మింతవరకు వెలువడలేదని నా ఆశయము. వ్యావహారి కాంగ్రెసుమహాభారత కర్తకూడ యీవిధముగా అన్నారు.

"మార్క్సు చెప్పిన మేరకి సంపదమాత్రమే కాదు మన విజ్ఞానం, వాఙ్మయం, కూడా బహుళ జనప్రాప్తం కావాలె. అది వ్యావహారిక భాషవల్లనే సాధ్యపడుతుంది." కాబట్టి రెండు పై అనువాదముల వలన నేటి సాహిత్యములో వాడబడుచున్న వ్యావహారికభాష మనకు ప్రస్తుతము పరీక్ష్యము. ఈ భాషలో నున్న అపభ్రంశ ప్రయోగములు ప్రస్తుత చర్చనీయాంశము.

ఈ సాహిత్యభావవస్తువులతో మనకు నిమిత్తము లేదు. అపభ్రంశమనగా "అపశబ్దము" అనగా లాక్షణికులనిన చ్యుతసంస్కారము, అనగా వ్యాకరణదూష్యమైన ప్రయోగము. ఈ సందర్భమున యిరువురు రచయితల అభిప్రాయముల ననువదించుట అవసరము. ఏలన విషయము వ్యాకరణమునకు సంబంధించినది. వారిరువురును వ్యాకరణముపై తమ అభిప్రాయమును తెలిపిరి. "మస్తిష్కంలో లెబొరేటరీ" అను గీతమున

"నా వేదనలో జనియించిన ఊహింపులు
తొడగడానికి వ్యాకరణసూత్రపు
రెడీ మేడ్ దుస్తులు లేక
దిసమొలల్తో ఉరుకుతున్నాయి లోకానపడి—
దండించనా!"—అనినాడు కవి.

సరస్వతీభక్తుల్లారా అనే గీతంలో:

కైతకు లక్షణాలున్నాయి కోటాక్కటి;
వీనిలో వ్యాకరణంకూడా ఒక్కటి;
మీకు దాని మాత్రాలే సర్వస్వం;
గొంతుకు పోసుకుని ప్రేలాడే సతతం,
చేస్తారు ఆక్రందన; అంటారు కవిత్వం;
కైతకు వ్యాకరణమే పరమావధి కాదు
అసలే కాదన్నాడు దాశరథి.

ఈ దాశరథి ఇంటికి వెనుక, అ ఇ ఉణ్ లతో ఋలుక్కలతో కట్టిన వైయాకరణసమాధి ఉన్నదట. (మస్తిష్కంలో లెబొరేటరీ)

మా రచనలో వ్యాకరణం మాత్రమే లేదు;
మీ రచనంతా వ్యాకరణం; మరేమీ కాదు.

పై రెండు వచనపద్యాలలో మొదటిదానిలో రచనా చమత్కృతి అయినను కలదు. రెండవ దానిలో తిట్లు, ఆక్రందన తప్ప మరేమియు లేదు. అది నాకక్కరలేదు. ఇప్పుడు వ్యాకరణమే మనకు ప్రస్తుతము. ఇద్దరిలో మొదటికవి తన ఊహలు వ్యాకరణంలో యిమిడ్చినవాడు. రెండవకవి కైతకు వ్యాకరణము పరమావధి కాదని దాశరథిగారితో ఏకీభవించినాడు. కాబట్టి వీరు బుద్ధిపూర్వకంగా వ్యాకరణ ముల్లంఘించి, ఆ ఉల్లంఘించుటను గొప్పగా చెప్పుకొనినారు. నేటి అభ్యుదయ కవులలో మేటిలైన వారి చిత్తవృత్తి యిది. ఇతరుల మాట లిక చెప్పనేల? కావున ఈ విషయముపై ప్రసంగించుట గొంగడిలో తినుచు వెంట్రుకలు లెక్కించుటవంటిది. కాని విమర్శకుడు లెక్కచేయక విమర్శించుట విధి.

వీరికి వ్యావహారిక భాష ఉపాదేయము. ఈ వ్యావహారిక భాషావాదమునకు కీ. శే. గిడుగు వారు తండ్రి. ఆయన శిష్టవ్యవహారము నందరిచేత ఒప్పించినారు. ఈ తరమునకు వెనుకటి నవ్యకవులు కూడ వ్యావహారికభాష నంగీకరించినారు. నేనుకూడ దాని నంగీకరించి గ్రంథములను వ్రాసినాను. రానురాను వ్యావహారిక భాషాప్రయోగము చేయు కవులు తద్విధమునకు తండ్రియైన శ్రీ గిడుగువారికే మనస్తాపము కల్గించినారు. శ్రీ మల్లాదివారి మాటలు వినండి. "ఆధునికులు పెక్కండ్రు వ్రాసిన చిన్న చిన్న గ్రంథములు చదివి పంతులుగారు ఒకటి రెండు సందర్భములలో, ఇంత తెగబడి వ్రాయవలెనని నా ఉద్దేశ్యము కాదు. అయితే యిప్పుడెవరిని నిర్బంధించగలము. ఇది సంధికాలము. అని నాతో (అనగా మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారితో) చెప్పియున్నారు." అప్పుడే యిట్లున్న యిప్పుడున్న పరిస్థితులను చూచి పంతులుగారెంత విలపించి యుందురో! ప్రకృతమునకు వత్తును.

ఇప్పుడీ అపభ్రంశ ప్రయోగములు రెండు భాగములుగా నున్నవి ఒకటి సంస్కృతమునందలివి. రెండవ తెలుగునందలివి. వ్యావహారికముగా మార్చినపుడు గద్యచ్ఛాయమైన తెనుగులోని పదములను మార్చుట రచయితల యిష్టముకాని సంస్కృత పదములను మార్చుటకు రచయితల కేమి యధికారము కలదు? కాబట్టి తత్సమముల నటుంచి తద్భవముల కున్నవాని రూపములున్నట్లు వాడుట రచయితల విధి. తెలిసి బుద్ధిపూర్వకముగ కొంత, కొంత భాషాజ్ఞాన శూన్యత వలనను ఇది కల్గుచున్నది. కొన్ని ఉదాహరణములు

"అలిశ్యం" అని ఒక రచయిత వాడినాడు. "అలసస్య భావః ఆలస్యం" అని వ్యుత్పత్తి. 'ఇత్వ' ముఖ్యముగా చూపనుం కూడదు మొదటిది 'అ' కారముకాని 'ఇ' కారము కాదు. "పరీక్ష"కు "పరిక్ష" అని వాడుచున్నారు. 'ఉషోబాల' అను గీతములో రచయిత "...స్థి" అని వ్రాసినాడు. "ష" "స"గా చెప్పడం మారునో యితనికి తెలియలేదు. ఇతను వేదభాషను సంస్కరించినాడు. "హే ఉషో, హే ఉషో" యని యనేకమార్లు వాడినాడు. సకారాంత నపుంసకలింగ శబ్దమునకు సంబోధన యెట్లుండునో యితనికి తెలియదు. ఉదాహరణమున్న 'ఓ ఉషస్సా' అని వ్రాయవచ్చునే. "కంఠీరవంగునా"ను బుద్ధి "కంఠీరవంతుని"గా చేసినాడు. "కంఠీరవంతిం యజేశజం" అనిశ్రుతి. ఈ రచయితయే "కృషియింప" అని వ్రాసినాడు. "అవల" అను గీతములో రచయిత "ప్రత్యహా పరివర్తనలే" అన్నాడు. 'అహన్' శబ్ద రూపమితనికి తెలియదు. "నటరాట్టు" అను గీతములో కర్త "అట్టహాస్యము" అని వాడి శివుని హాస్య మాడించినాడు. "బతుకు కేటుకు" అనుదానిలో "రక్తపాయి శార్దూలం" అని నాడు రచయిత. "నయా జమానా"లో "ప్రేమాభిన్న విశ్వహాల స్ఫుటిత స్వేద రుధిరవారి వియత్తల సువిశాలాక్షి అర్ధనిమ్నాదియ వీక్షణలై" అనినాడు కవి. ఇది ఆయన వ్యావహారికము. ఇది పాఠకులకే వదులుచున్నాను. ఈ గీతములో యిట్టి భాషారత్నము లనేకము లున్నవి. "సముద్ర ఘోష"లో "మూర గగనారామసంచర వారివాహము" అని కవి వ్రాసినాడు.

"సంచరించుచున్న మేఘము" అనుట యెట్లు తెలుపవలెనో యితనికి తెలియదు. "నాన్యః పంథా"

అను గీతములో "జనతాగతి" అని యున్నది. "ద్విగు సమాసము" చేసి వ్రాసినుకొందును కవి "పికోలింగం" అను గీతములో "మానవమాత్రుడు" అని వాడు రచయిత. "మాత్రుడు" అని కాబోలు కవిహృదయము. స్త్రీపుంలింగ వ్యత్యయముగా మాత్రమే కొన్ని చూపినాను. ఇట్టివి పరిష్కార్యముగా నున్నవి. మనకు సాధువని నిశ్చయముగా తెలియని శబ్దమును గాని, అర్థము నిశ్చయముగా తెలియని శబ్దమును గాని వాడుట మంచిది గాదు. ఆ శబ్దమును గూఢముగా వాడుట చేత ఉద్దేశితభావము రాకపోవుటయే గాక, శ్రుతికటుత్వము కూడ ఏర్పడును. సంస్కృత శబ్దముల గతి యిది. మిశ్రమసమాసములను గూర్చి రెండుమాటలను చెప్పుదును. ఇవి మన కలవాటైన వెనుకటివానివలె నే వీనిని గూడ సహింపగలమని యొక వాదము "తోగాద్యము" మనకు బదులు కూడ "తోపద్యము" మని యెందులకు వాడకూడదని యొక మిత్రుడు నన్ను ప్రశ్నించి నాడు. "బహుమంచి" మొదలగునవి వాడుకలో నున్నవి. కాని తప్పువాడుకను మన మెందుకు గ్రహింపవలెను? ఈ క్రింద కొన్ని యట్టిసమాసములను చూడుడు.

"శరత్ వెన్నెల" "విగతం తరణమ్రత వైతరణి" అనుగీతమున; శక్తికయే ఆహోరాయము. "పెగపిండాలు" "మృతిసందేశము" అనుగీతమున.

"అగ్నిపిండాలు" అనవచ్చునే.

"విషకత్తెర"—"హిరోషిమా" అను గీతములో

"తేమ బరువు" "నవభవనం" అను గీతములో.

ఇవియు మచ్చునకు చూపినాను. ఇట్టివి పరశ్శతము లున్నవి. ద్వంద్వసమాస విషయమున "తల్లి తండ్రులు" (విశ్వగీతి) గమనింపవలసిన ప్రయోగము. ఇక తెనుగునకు వత్తును. తెనుగుభాషలోని అపభ్రంశ ప్రయోగముల నీ క్రిందివిధముగా వర్గీకరణము చేయవచ్చును. అవ్యాప్తి అతివ్యాప్తి దోషములున్నను మొత్తముపై నీవర్గీకరణము సరిపోవునని నా ఆశయము.

(1) నామవిభక్తిప్రత్యయములు (2) క్రియా విభక్తిప్రత్యయములు (3) శబ్దస్వరూపములు (4) క్రొవడి (5) అవ్యయములు (6) సర్వనామములు (7) వ్యతిరేకార్థకములు (8) దుస్సంధులు (9) అసహజములు. వీనిలో కొన్ని యుదాహరణల నిత్తును. ప్రథమావిభక్తిప్రత్యయము "ము" వీరికి కంటకము. అట్టివానినన్నిటిని "ం" తో సంతమొందించుట వీరి పరిపాటి. "దేశం, మధురం, భీభత్సం, లోకం, సముద్భావం, కరం" ఇట్టివి కోట్లు. విస్ఫుటమైనను చూడుడు. ఇట్టివి అధమము 10 లైనను కన్పట్టును. "ము" ప్రత్యయమును చేర్చిన సామాన్య ప్రజలకు తెలియదనియో లేక తప్పనియో వీరి యభిప్రాయము.

ఉచ్చారణసౌలభ్యమని అపభ్రంశమును వాడుట తగునా? మరియు మనది యాజంతభాష. ఇచ్చట నొక ప్రశ్న వచ్చును. వ్యాకరణము నుల్లంఘించి యుచ్చారణవద్దకు పోవుదమా? లేక యుచ్చారణను వ్యాకరణమువద్దకు కొంపోవుదమా? ఒకవేళ "కవి" చెప్పినట్లు తమ భావములకే వ్యాకరణ మడ్డు వచ్చిన యెడల మరియొకమాట. ఎచ్చటను అట్టి యడ్డు రాదనియే చెప్పవచ్చును. వ్యాకరణ దుష్టసమాసములు విపరీతార్థముల నియ్యవా? అప్పుడు ఉద్దేశిత భావ మెట్లు వ్యక్తమైనది? ఇక ద్వితీయావిభక్తి. "ఉపనిగాంచి" అనివారు ఉషోబాలకర్త. అకారముతర్వాత ఉత్వమున కున్న సహజత్వము "ఇత్వమునకు లేదు." రచయితను ఉచ్చారణమున తన "యాసప్రయత్నమును" దర్పణమున చూచుకొనుమని మనవి. "మానవుష్టి" "జీవుష్టి" అని వాడుట పరిపాటి అయిపోయినది. "ష్టి" లో లాఘవమున్నదో "ని" లో లాఘవమున్నదో రచయితలను ప్రశ్నించుచున్నాను. వ్యావహారికాంధ్రమహాభారతకర్త యీ ద్వితీయారూపముల నసంఖ్యాకములుగా వాడినాడు. "ధామ్యని" అని వాడిన కొంపమునిగినదా? షష్ఠీవిభక్తి వచ్చిన నప్పుడు మిక్కిలి విచారము కల్గును. "నీపకై" (ఇన్ ఖిలాబ్ అనేగీతంలో); "పేదివాళ్కై" (ఒక్కటి ఓ చెలికూలో); "అకుంగకుక్కై" (కిరణకలంలో); "ఈ తరకై" (వ్యావహారికాంధ్రమహాభారతము); "రాజుకై" (దానిలోనే); "భీష్మద్రోణులకై" "కర్ణదుర్యోధనులకై" (దానిలోనే). ఇట్టివి లెక్కకు మిక్కిలిగా నున్నవి... పై వానిలో "భీష్మద్రోణులకై; "కర్ణదుర్యోధనులకై" అను ప్రయోగములవంటివి విచిత్రములు. 'కై' షష్ఠి వ్రాయుటకై వెనుకటి వర్ణమును ఇత్వాంతమును చేసినాడు రచయిత. దీనిని అపభ్రంశాపభ్రంశ మనవచ్చును. బుద్ధిపూర్వకముగా ఒక తప్పునకు రెండు తప్పులను చేయుట తగదు. "లకు" అని వ్రాసిన "బహుళ జనప్రాప్తము" కాదా? సప్తమీవిభక్తిగతికూడ యిట్లేయున్నది. "మంటల్లో" ("బగావు బంకిలో" రచయిత.) "మంటలలో" అనిన కొంపమునుగునా? బహువచనమున "ండ్లు" కు మారుగా "ళ్లు" ఉపయోగించుచున్నారు. "కళ్లు" మొదలైనవి. "నీళ్లు"కు బదులుగా "నీరు" సులభము కాదా? క్రియా విభక్తిప్రత్యయములనుకూడ స్పృశింతును. వర్తమాన కాలమున "తోంది" "స్తుంది" "స్తోంది" "తూంది"

మొదలైనవి వాడుచున్నారు. ఒకటే వివిధరూపములను వాడుట కద్దు. "స్తున్నది" "తున్నది" అని వాడుట సులభము కాదా? మరియు ఏదియో యొక్క రూపము నందరును వాడుట లాఘవము కదా? శబ్దస్వరూపముల పాడుచేయుటను దూషింతును.

"దెయ్యాల" (మస్తిష్కంలో లేబొరేటరీ); "ఉన్నాది" (దానిలోనే); "ఆవాళ" (వ్యా. మహాభారతము); "పెందలేడే" (గోదావరి పొంగింది); "అలకిండు" (పాముపాట); "అవక" (చెణుకులు); "కుమ్మరవాము" (నీవూ నేనూ కలిసి); "కాస్తా" (తొమ్మిదితో కుమ్మా); "బైర్దేరారు" (వ్యా. ఆం. మహాభారతము); "బయల్దేరితే" (దానిలోనే గమనించదగినది). ఈ విధముగా లెక్కలేదు. దయ్యము, ఉన్నది, ఆవేళ, పెందలకడ, అలకించు, కాక, కుమ్మర ఆవము, కొంచెము లేక కాస్త, బయలుదేరి, మొదలైనవి బహుళజన ప్రాపములు కావా? వీరి భావముల నిముడ్చుకొనలేవా? దుష్ప్రయోగములే వీరి భావములకు తెలవా? వ్యాకరణమును మాత్రమే వలదని యివి యుపయుక్తములా? ఇక క్రొవడి యున్నచోట పెట్టకుండుట. "పక్కలో, రాస్తే, మాయలేని, బతికెమే, తాగే, కుంకేసింది; కిందికి" మొదలైనవి అసంఖ్యాకములు. మరల నీ శబ్దములే కొన్ని స్థలములలో క్రొవడితో నుపయోగింపబడినవి. "వినకండా, తినకండా, లేకండా, తెలీని" మొదలైన వ్యతిరేకార్థములు, "మాడపోయ్, నమ్మకొవ్, పెత్తనదార్" మొదలైన అర్ధాక్షరరూపములు, "ఘుమాకి" "స్త్రీ, లా, లాగా, లాను, మొదలైన అవ్యయములు". వినిపిస్తూవున్నవి, ఘోషిస్తున్నవి, కళ్ళముందు ఎప్పుడు, లేములు ఎక్కడివి, మొదలైన అసహజ విసంధులు, "కోటాక్కటి, దింపడెనా" మొదలైన దుస్సంధులు, ఇవీ అవీ యేమి, యిట్టి యపభ్రంశములు లెక్కింపరానివి యున్నవి. ధూర్జటి మొదలైన మహాకవులు కొందరు వాడినా రిట్టి ప్రయోగములను. కాని యది సాకుగా బుద్ధిపూర్వకముగా వెల్లచోట్ల నపభ్రంశములను వ్రాయుట తగదు. అపభ్రంశములను వ్రాసివారె గాని సామాన్యజనులకు సులభగ్రాహ్యమగునట్లు వ్రాసినారా? కొన్ని గేయము లపస్వరాదులకే కష్టమును కలుగజేయును. వ్యావహారికమని దుష్ప్రయోగములను చేయుట పాడిగాదు. మాండలికము లన్నియు భాషలోనికి రావలసినదే! కాని వాటి నన్నిటిని సార్వజనీకములుగా చేయుట యత్నింపబడగినది. వ్యాకరణ సూత్రముల ప్రయోగముల ప్రకారము మా భావము లిముడక దిసమొలలతో తిరుగుచున్న వనుట సాహసము. అతిశయోక్తి. వ్యాకరణము తప్పు అన్నియు మా రచనలో ఉన్నవనుట దుస్సాహసము. ఉదాత్తభావమును దుర్భాషలో చెప్పుట రాజును గాడిదమీద ఊరేగించుట వంటిది. సంస్కృతాంగ్లములు రాని ప్రజానీకమున కివి యుద్దేశించిన ట్లగపడవు. ఈ గీతములకూడ తమ తృప్తికివి మిత్రుల మన్ననలకును, విద్యార్థుల చప్పట్లకును వ్రాసినట్లు కనబడును. 'ఇది వ్యావహారికం *With vengeance* గా ఉంది', అనినా డొక మిత్రుడు. దానివలన సాధించిన ప్రయోజనము కానరాదు. తుద కొక అనువాదముతో దీనిని ముగింతును:

"The care of the language, is at all times a sacred trust and the most important privilege of the members of a society. Every man of Education should make it object of his unceasing concern to preserve his language, pure and simple, to speak it so far as in his power in all its beauty and perfection. A nation whose language becomes rude and barbarous, must be on the brink of barbarism in regard to everything else. A nation which allows her language to ruin is parting with the best half of her intellectual independence and testifies her willingness to cease to exist."

* అస్థిపంజరం *

శ్రీ మంథా వెంకటరమణారావు

: రంగం 1 :

డాక్టర్ రామారావు ఇల్లు; డ్రాయింగు రూము; గది నాలుగు మూలలా నాలుగు సోఫాలు—సోఫాలకి తెల్లటిగుడ్డలు పైన; మధ్యని గుండ్రటి టేబిలు—దాని మీద తెల్లటిగుడ్డ; ప్రతి సోఫాదగ్గర చిన్న 'స్టూలు', మీదని తెల్లగుడ్డ—'ఆష్ ట్రే'; గది కింకే అలంకారం లేదు—కిటికీలకి తెల్లటి కర్టెన్లు - కర్టెన్లు ప్రక్కకి లాగివున్నాయి. గోడలకి ఏ పటాలూ లేవు - గదిలో చెప్పుకోదగ్గ వస్తువు లింకేమీ లేవు. కాని-ఒక్కటి—గది కుడిమూలను ఆరడుగుల ఎత్తున ఒక క్రకేసు. కేస్సురంగు నలుపు; ముందు అద్దపు తలుపు. తలుపుగుండా కానవస్తూ ఒక మానవుడి అస్థిపంజరం.

తెర లేచేసరికి గదిలో మెవ్వరూ లేరు.

[డాక్టర్ వెంకటాచలం ప్రవేశం; వయస్సు దాదాపు ముప్పై ఉండొచ్చు. బూడిదరంగు 'సూటు'—ఎర్ర 'నెక్ టై'—వెనుక నింకా కొంత మంది ఉన్నట్టు గోల వినిపిస్తూ ఉంటుంది]

వెంకటాచలం: (ప్రవేశిస్తూనే ఉలిక్కిపడి వెనుక కొక అడుగు వేసి) బాప్రే!!

[ప్రవేశం: డాక్టర్ సుధాకర్—వయస్సు 30 సం॥; డాక్టర్ కృష్ణమూర్తి—వయస్సు 32 సం॥; డాక్టర్ రామలింగం—వయస్సు 50 సం॥]

ముగ్గురూ: { మైగాడ్!
ఓ!
ఇదేమిటి!

(ముగ్గురూ వెనక్కి తగ్గి, తిరిగి సర్దుకొని గదిలో ప్రవేశిస్తారు)

రామలింగం: అస్థిపంజరం!

వెంక: (సర్దుకొని మామూలుగా) ఔను—అస్థిపంజరం—

సుధాకర్: ఇదెందు కిక్కడుంది?

కృష్ణ: అది రామారావు నే అడగండి—

రామలింగం: నాకు చాలా వింతగా వుంది. డ్రాయింగ్ రూమ్‌లో వెక్కిరిస్తున్నట్టు ఇదేమిటి? (నవ్వుతాడు)

వెంక: డ్రాయింగ్ రూమే కాదు—పోనీ హాస్పిటల్‌లో నన్నా దీని అవసరం ఏముందీ అని?

సుధాకర్: ఇలా కాలుపెట్టగానే గుండెమీద ఒక్క వేటు వేసినట్టయింది.

కృష్ణ: ఏమిటి డాక్టర్! భయమే? (పకపక నవ్వుతాడు)

సుధా: అస్థిపంజరం చూసి భయమేమిటి? ఇప్పటి కప్పుడే డజను 'పోస్ట్ మార్టమ్' లన్నా చేసి ఉంటాను సర్వీసులో ప్రవేశించేక—కాని, అనుకోకుండా, ఉండరానిచోట ఒక వికారమైన వస్తువు ఉండడం నిజంగా ఒక షాకులాటిదే—

(నలుగురూ వెళ్లి సోఫాలలో కూర్చుంటారు)

వెంక: ఇంతకీ రామలింగంగారే ధైర్యవంతులు! ...అయినా ఒక అడుగు వెనక్కి వేసినా దాన్ని చూసి ఒక చిరునవ్వు పారేశారు—

రా. లిం: నే నెందు కన్న మాట అనకపోవాలి? నే నే పరీక్షలూ ప్యాస్ కాలేదు! నాజన్మకి ఒక్క చే పరీక్ష పాసయేను. అది కాంపౌండర్ పరీక్ష. అదీ మూడో సారి వెళ్ళి, చెయ్యవల్సిన బందోబస్తులన్నీ చేశాక మరీను...

కృష్ణ: మీ రన్నట్టు గవర్నమెంటులో కొన్నాళ్లు పని చేసేరనుకుంటాను?

రా. లిం: ఏదో అలా టెక్కే— బోర్డు సర్వీసు — కొండల్లోకి తోసేసేరు...ఆ పరీక్ష కోసమని అందులో అలా పడిగాపులు పడిఉండడం అయింది.

కృష్ణ: కాంపౌండరీ పాస్ అవకుండా నే ఉద్యోగం దొరికిందీ మీకు?

రా. లిం: ప్యాస్ అయితే ఆ కొండలు, అందులో బోర్డునౌకరీ ఏంకర్మ? కొంత అనుభవం ఉండేది ఒక ప్రయివేటు డాక్టర్ క్రింద— వాళ్ళకి ఎవడో ఒకమనిషి కాంపౌండరన్న పేరుతో ఆ కొండల్లోకి వస్తే చాలన్నట్టుగా ఉండేవారు...అదే అదృష్టం అనుకోండి— నాలుగేళ్ళయాక అనుభవం ఉంది, పరీక్షకి వెళ్ళొచ్చన్నారు. అన్నేళ్ళ అనుభవం ఉన్నా మూడుసార్లు వెళ్ళేకాని నెగ్గలేదు ... అలా అని చేతకాక కాదు! ఈ పరీక్షలూ, చెత్తా, నాకు పడవ్...

వెంక: మీరు కొన్నాళ్లు మన రామారావు తండ్రిగారిదగ్గర పని చేసేరుకదూ?

రా. లిం: అయ్యో! అదే గొప్ప అనుభవం! మళ్లా పని చేసింది నాలుగేళ్లే. పరీక్ష ఎలాగో గట్టెక్కాక ఆ కొండల్లో నౌఖరీ కొక దండం పెట్టి ఇక్కడికొచ్చి చేరేను......ఆయన నిజంగా దేవుడే అనుకోండి. ఎంతదయ... ఎంత దైవభక్తి!! పూజలో కూర్చుంటే ఉదయం రెండుగంటలు, సాయంత్రం రెండుగంటలు...అలా ఆ భగవంతుడిలో లీనం అయిపోయేవారు...

సుధా: ఇంతకీ ఏదో చెప్పబోయేరు...

రా. లిం: అదే వస్తున్నా ... ఆ నాలుగేళ్ళూ అయిపోయేక శుభ్రంగా ప్రాక్టీసు పెట్టేశాను... అది నిజంగా తెగించేసనుకోండి! చెప్పేదేమంటే ... నేను ఏమీ అపరేషన్లు చెయ్యలేదు, పోస్టుమార్టమ్‌లు అంతకన్నా చెయ్యలేదు ... మీరా అస్థిపంజరాన్ని చూసి వెనక్కి తగ్గేరంటే నాకు నిజంగా నవ్వొస్తోంది...

వెంక: మీరేమన్నా అనుభవజ్ఞులు.. ఇక మా మాటంటారా......నిన్న కాక మొన్న కళ్లు విప్పుతున్నాం!

రా. లిం: (నవ్వుతూ) ఏమిటో ఈ ముసలాడ్ని చూస్తే మీకు నవ్వులాటగా వుంటుంది!...అనుభవం అంటారా...నిజమే......నేను చూసినన్ని రకాల కేసులు...మీ కింకో ఐదేళ్ళో, పదేళ్ళో పట్టొచ్చు... ఒక కేసు...నాకు బాగా జ్ఞాపకం...ఆ కొండల్లో...

సుధా: ఇంతకీ మన్నందర్నీ కెదిగికొడదాముని పెట్టినట్టుంది ఈ డాక్టరీవన్నీ డ్రాయింగు రూములో...

కృష్ణ: ఇంతకీ రామారావ్ ఏడీ?...అందర్నీ 'టీ'కి రమ్మని, పోయి ఎక్కడ దాగున్నాడు......ఏదన్నా కేసంటూ పోయడా?......ఏం మనిషో! ఇప్పటికీ నాకు బోధపడలేదతని ధోరణి...

[నౌకరు ప్రవేశం]

నౌకరు: బాబుగారు బట్టలేసుకుంటున్నారు... ఐదునిముషాల్లో వచ్చేస్తామని చెప్పమన్నారు...

(నౌకరు వెళ్తాడు)

కృష్ణ: సరే... ఐదు కాదు ఇరవైనిముషాలన్నా ఉండాలి...వచ్చేక మరి పోగలమా? కొత్తఇంట్లో నే దిగనీండి...మరేమన్నా కానీండి...'టీ' ఇస్తున్నారు అది ముఖ్యం మనకి!

వెంక: నేనుమాత్రం మరో అరగంటకన్న ఎక్కువ ఉండలేను...

కృష్ణ: ఏం ప్రాక్టీసే?

వెంక: నువ్వు నిజంగా అదృష్టవంతుడివి— చెప్పకో ఒదూ? రోజల్లా తీరిక...వచ్చిన అయిదు గురో, ఆరుగురో 'పేషెంట్లు' ఒగంట పని...

కృష్ణ: అదృష్టం! చాలా గొప్ప అదృష్టం... నలుగురు పిల్లలు... పెళ్ళాం... ఒక ముసలితండ్రి... కాంపౌండరొకడు... ఒక నౌకరు...వీళ్ళు కాక చాకలాడు...మంగలాడు ... వీళ్ళంతానూ...వీళ్ళందర్నీ పోషించాలి ... అవతల 'కామర్స్'కి దెబ్బలేకుండా చూసుకోవాలి.. అంటే మార్కెట్ పడిపోకుండా చూడాలి... పరిశ్రమలను ప్రోత్సహించాలి...

వెంక: ఏమిటేదంతా? చాలా పెద్దమాట లుపయోగిస్తున్నావే!

కృష్ణ: కాదూమరి? పెళ్ళానికొక ఫేస్ పౌడర్ డబ్బా — తలలకి నూనె — నాకు టూత్ పేస్టు — బూటుకి పాలిష్ — మరి బట్టలవాడు, బట్టలు కొనక పోతే ఊరుకుంటాడా? నెలకి ఒక జరినా తియ్యాలా? సినిమా కొక నాలుగుసార్లు అనమ

వెళ్లకపోతే ఆ కళలని మరెలా పోషించడం? ఇవన్నీ వచ్చే రెండుమందులలోనూ సరిపెట్టాలి.

రాము: (ఆశ్చర్యపోయి) రెండుమందులేనా?!!

వెంక: (నమ్మలేక) ఏం డాక్టర్ రెండుమందులేనా ప్రాక్టీసు!!!

సుధాకర్ ... నే నమ్మను!!

కృష్ణ: ఊరక నే కూర్చోవడం అదృష్టం అని నువ్వే అన్నావ్ చలం.

వెంక: ఉత్తినే అన్నా కాని ఇంత తక్కువా? మాదగ్గర దాస్తున్నావేమో; ఎంత తక్కువైనా ఐదు వందలకి తగ్గ దనుకున్నా ... అందులో ఈ మలేరియా జాగాలో....

కృష్ణ: చెప్పేది విను ... నీకూ నాకూ డబ్బు అర్జనలో ఎంతభేదం ఉందో, అర్జించేవిధానంలో కూడా అంతభేదం ఉంది ... విశ్రాంతి అంటే నాకు మొదటినుంచీ ఇష్టం...

వెంక: నాకుమాత్రం ఇష్టంలేదూ? సాయంత్రం నాలుగునుంచీ, రాత్రి, మధ్యాహ్నం ఇవంతా విశ్రాంతికాదూ? ఈ సమయంలో పీకలమీదికేసు వచ్చినా కదల్తమే!

కృష్ణ: అనుకో! అదే నాకిష్టంలేదు. ఒక కేసు పట్టేక రాత్రికాదు, పగలుకాదు నేను లక్ష్యం చెయ్యను... కాని నేను విశ్రాంతిప్రియుణ్ణి—కనీసం పగలు ఆరుగంటల 'రెస్టు,' రాత్రి 'స్లీప్ రెస్టు' ఉండాలన్నమాట, ఇవి ఉంటే చాలు...అందుకే సీరియస్ కేసులు మొదటికే నేను పట్టను...అలాటి కేసులు నా దగ్గరికి రావు కూడా...పైగా నా పేషెంట్లంతా తెలివైనవాళ్లు...చాలా తెలివైనవాళ్లు...

సుధా: ఏమిటో ఆ సర్టిఫికేటు!

వెంక: మెదడుగురించి డాక్టర్ సర్టిఫికేటు... డబ్బు పుచ్చుకోకుండా పారేస్తున్నావ్...ఇలా నే రావల్సిన డబ్బురాదు...(నవ్వుతాడు)

కృష్ణ: తెలివైన వాళ్లెగా అంటారా? నన్ను చూస్తే వాళ్లకా తెలివి వస్తుందేమో మరి! పోనీ అలా ఎందుకనాలి...ఇప్పుడు మీరు...జ్వరం వచ్చిందంటే డైఫారెటిక్ మిక్స్చర్లో, క్వైనైన్ మిక్స్చర్లో, ఆల్కలైన్ మిక్స్చర్లో ఇస్తారు...మీరు ఒద్దనేవరకూ పేషెంటు పుచ్చుకోవాలి... డోసుకి బేడా పరకా ముక్కుపిండి పుచ్చుకుంటారు...

వెంక: హోయి! హోయి! నువ్వు డాక్టర్ వైతే అయ్యేవ్ కాని మనుష్యుల్ని మాత్రం నిందచెయ్యకు!

కృష్ణ: మిమ్మల్నేమీ అనలేకోయి తండ్రీ! అలా విరుచుకుపడకు...మీకైతే బేడా పరకే కాని, నేను నూపెరాలు పుచ్చుకుంటాను డోసుకి...

సుధా: అయితే మరింకేం? తిరుగే లేదు.

కృష్ణ: అదే చెప్పబోతున్నాను. పెద్ద పెద్ద సంస్థలు — మే ఎండ్ బేకర్, బెంగాల్ ఫార్మ్యుటిక్స్, గ్లాక్సో లేబొరేటొరీస్, ఇవన్నీ అందరి కోసం అమోఘమైన మందులు చేసిఉంచుతే మన మిక్స్చర్లెందుకు? కొంచెం జలుబు, చిన్న తలనొప్పి అయితే ఎనాసిన్...జ్వరం ఒస్తే వజ్రంలాటి మందు లున్నాయి...అన్నీ మాత్రలు...ఎటాబ్రిన్...కాక పోతే క్వినాక్రిన్ వేసుకో...డిసెంట్రీ అయితే సల్ఫాగ్వానిడైన్...ల్యాక్టొరిప్సాక్, ఎంటెక్వైన్... కాంప్రిస్మ్ క్వినాల్ ఏకో ఒకటి కొనుక్కొని మింగీ...ఇంకా క్రానిక్ అయితే 'ఎమెటిన్' తెమ్మనో, ఇంజక్షన్లు పొడిచేస్తాను... గాస్ట్రిక్ నొప్పి అయితే అల్కుడ్రాక్స్ ఉంది, పెరూ పెప్సిన్ ఉంది...టైఫాయిడ్ అయితే క్లోరోమిసిటిన్ కొనేసి వేసేసుకోవటం...ఇంక బలంలేదూ అంటే విటమిన్లో రాసిస్తే బజారుకివెళ్ళి కొనుక్కోడమే తరవాయి...ఇంత సదుపాయం ఉంటూఉంటే నేను మిక్స్చర్లు కలపడం ఎప్పుడు? ఎలా? చిన్న స్లిప్పు తీసి మందు పేరు రాసి ఇచ్చేస్తాను...

రా. లిం: కృష్ణమూర్తిగారూ! మీరుత్త అమాయకుల్లా ఉన్నారు...నాది పాతికేళ్ళ అనుభవం... మీకు చెప్తున్నాను వినండి!

కృష్ణ: నేను చెప్పేది వినండి మొదట...ఒకటి రెండుసార్లు నాదగ్గర కొచ్చిన పేషెంటు మూడో సారి మరి రాడు...

వెంక: ఏం? అదంతా నీ ప్రావీణ్యతే! (నవ్వుతాడు) అంత హాసెల గొట్టేస్తావన్నమాట!

కృష్ణ: హాసెలు కాదు. వాళ్లంతా తెలివైన వాళ్ళని చెప్పేనుగా... ఇప్పుడు నీకే గాస్ట్రిక్ కంప్లైంటు ఉందనుకో... నాదగ్గరి కొచ్చేవ్... 'అల్కుడ్రాక్స్' అని రాసిఇస్తాను...మళ్లా ఇంకో సారి వస్తావ్ ఆ నొప్పికే...అదే రెండుమూడు సీసాలు వాడండి అని అంటాను...వాడతావ్..తగ్గిపోతుంది.. మళ్లా ఆరునెలల తరవాత, నీ అపథ్యంవల్ల అదే రకం నొప్పివస్తే నా దగ్గరకు నువ్వెందుకు రావటం? బజారుకి వెళ్తావ్...దక్కా క్రిందటివారి వాడిన మందు కొనేసుకుంటావ్...తెగిపోయింది. నీ జబ్బు నీకు

తెల్సు...దానికుందు నీకు తెల్సు...సరిపోయిందా? అలా!

సుధా: ఇలా అయితే ప్రాక్టీసు జరిగినట్టే! మిక్చర్లు కొనకపోయినా, 'కన్సల్టింగ్'కన్నా ఫీజు పుచ్చుకుంటున్నారా?

కృష్ణ: అది ఈ ప్రాంతంలో నేను ప్రవేశపెట్టాలి కొత్తగా...అదే అయితే ఉన్న పేరూ, ఈ పాటి ప్రాక్టీసు కూడా ఉండవు!

రా. లిం: నాది పాతికేళ్ళ అనుభవం! ఇందాక చెప్పేను...ఇప్పుడు చెప్తున్నాను...వినండి! మనలో మన మాట కొబట్టి ముక్కుకి సూటిగా ఉన్నదున్నట్టు చెప్తున్నాను ... ఇది మీ కొక వింతగా సలహా కింద వస్తుంది...... ఇంద్రజాలికుడూ, డాక్టరూ ఒకే తరగతిలోకొస్తారు ...ఇంద్రజాలికుణ్ణి చూసి మనం ఎంత ఆశ్చర్యపడతాం! కలలో కూడా నమ్మలేని గమ్మత్తులన్నీ చెయ్యగలడు. మనిషిని నరకడం, నాలిక కోసెయ్యడం... నీటిలో నిప్పు పుట్టించడం...ఇలాటివన్నీ...మన కంటికి కనిపించేది నమ్ముతాం...అది మానవ సహజం. ఏం? కాదంటారా...అయితే ఈ ఇంద్రజాలికుడు... నీటిలో నిప్పు పుట్టిస్తానంటాడు...పుట్టిస్తాడు...... వాడు అనడం—మనం చూడడం జరుగుతాయి... నిప్పెలా పుట్టిందో వాడు చెప్పడు...మనకి తెలీదు.. అదే తెలుస్తే దానికి విలువ లేదు! అలానే మన వృత్తి కూడా. ఇలా అంటున్నానని ఏమీ అనుకోకండి... ఎవరికన్నా ఆక్షేపణ ఉంటే చెప్పండి...నా సలహా మానేస్తాను...

కృష్ణ: మనం అంతా ఇక్కడున్న వాళ్ళం డాక్టర్లమేగా...కానీండి...

రా. లిం: ఇప్పుడు బాగా కడుపునొప్పితో ఒక మనిషే ఒచ్చే డనుకోండి. అతనికి కావల్సిం దేమిటి? ఆ నొప్పి పోవడం. నేనంటాను...మీ నొప్పి పోతుంది...ఇది మింగండి—అని. అతను మింగుతాడు...నొప్పి పోతుంది...కాని మనం ఇచ్చింది బూడిదో, మందో కూడా అతని కక్కర్లేదు...అదీ ఇంద్రజాలం...మీ రెంత పుచ్చుకుంటారో నేనూ అంతే పుచ్చుకుంటాను...మీ మందు లెంత పని చేస్తాయో, నా మందులూ అంతే పనిచేస్తాయి... ఫలితం. మీకన్నా నాకొచ్చే ఆదాయం ఎక్కువ!

కృష్ణ: ఏదో మీ మందు లంటున్నారు... మీరు మందులు ఇంట్లో కాని తయారుచేస్తారా ఏం?

వెంక: ఏవన్నా స్పెషల్ మందులు వాడతారా?

సుధా: ఏదో మాకూ చెప్పకూడదూ...... మేం కూడా...

రా. లిం: చెప్పేసేక మీ కెవ్వరికీ నా విధానం నచ్చదు. సరే...వినండి...... నేను మూడు రకాల మందుల్తో వైద్యం చేస్తాను...హోమియోపతీ, ఎలోపతీ, డీసెన్ మందులు...

ముగ్గురూ: (ఆశ్చర్యంగా) ఏమిటీ!!

రాము: అంతలా ఆశ్చర్యపడకండి...ఈ డీసెన్ మందులు అమోఘంగా పనిచేస్తున్నాయి. దవక— నా ప్రాక్టీసు చాలామట్టుకు అదే. ఉత్త గుండలు... తేనెతో కాని, పాలతో కాని కలిపి ...బస్. అయిపోయింది! నేనూ డోసుకి రేడా పరకా పుచ్చుకుంటాను...ఇంకా లాంగరూ అంటే అప్పుడు మన క్వైనైనా అవీ ఎలాగా ఉన్నాయి...నాకు నెలకు ఎంత ప్రాక్టీసుందో మీరు ఊహించేరా?

వెంక: మీరు చెప్పే విధానైతే మీకు అయిదు వందలకి తగ్గదు...

సుధా: మీరంతగా ఏదో వింతగా ఆ ప్రశ్న రూమీద విసిరేరు కాబట్టి ఆరు వందలకి తగ్గదు, ఎర్చదు...

కృష్ణ: మీదగ్గరి కొచ్చిన పేషెంట్లంతా మేకల మందయి ఉంటారు. బుర్రలు ఉపయోగించకుండా ...మీరే గమ్మత్తులు చేస్తున్నారో కూడా వాళ్ళ కక్కర్లేదు...డబ్బున్న వాళ్ళంతా అలాటి పేషెంట్లే ...చదువూ సంస్కారం లేనివాళ్లూ అలాటి వాళ్ళే... ఎటుకొచ్చీ, డబ్బు లేని, కాస్త చదువుకొని ఉన్న వాడే తెలివైనవాడు...వచ్చేసారి ఈ ఖర్చు లేకుండా చేసుకుందామన్న ఆలోచనమీద ఉంటాడు...... తక్కినవాళ్లంతా మేకలమంద...

వెంక: వోయి డాక్టర్!

సుధా: డాక్టర్! ఆయన్ని!...

రా. లిం: ఫరవా లేదు—కానీయండి...

కృష్ణ: అందుకు మీ ప్రాక్టీసు వెయ్యి రూపాయిలు ఏవరేజ్ ని వేసేసేను...ఏమంటారు?

వెంక: వెయ్యి రూపాయలా!

సుధా: మీ ప్రాక్టీసా...ఇంపాసిబిల్!

రా. లిం: సరిగ్గా చెప్పేరు కృష్ణారావుగారూ! సరే మీ అందరికీ ఆశ్చర్యంగా ఉంటుంది. నేనూ

మీలాగే విశ్రాంతిప్రియుణ్ణే! మనం అంతా సాయంత్రం సెషన్స్‌కి పోతాం కదా... నాలుగునుంచి అది—నా నిద్ర కుంభకర్ణుడి నిద్ర...రాత్రి నిద్ర పోనే పేషెంటొచ్చి తలుపు టింకొట్టినంత పని చేసినా, ఇంటిమీద రాళ్లు రువ్వినా తెలిసి రాదు... తక్కువవాళ్ళకి తెలివొచ్చినా లేపకూడదని నా ఆర్డర్లు...ఇంక ఉదయం ఎనిమిదికి వెళ్తాను హాస్పిటల్‌కి...పదకొండునుంచి రెండు వరకూ విశ్రాంతి ...ఏళ్ళను మాపినా ఈమధ్యనే...ఎలా ఉందంటారు?

సుధా: మీమాటలు నేను నమ్మాలనుకుంటాను.. కాని నాకు నిజంగా చాలా ఆశ్చర్యం వేసింది... నాకు గవర్నమెంటువారు మూడువందలు పారేస్తారు. పూర్తిగా దానిమీదనే బతికలేం కద!...ఇది సర్వీసులో ఉన్న అందరం చేస్తున్నదే.... లేకపోతే ఇద్దరు పిల్లల చదువు...ఇద్దరూ మెడిసినే చదువుతూంటె... ఇంట్లో ఖర్చు ఇంతంత ఎలా తెస్తున్నాను... ఎంత కష్టపడ్డా అది రెండువందలకి మించదు... పై ప్రాక్టీసు...గవర్నమెంటు నౌకర్లంతా మెడికల్ సర్టిఫికెట్‌కి నా దగ్గరికే రావాలనుకొండి...ఎన్ని చూసుకున్నా...

రా. లిం: నేనూ కాంపౌండర్ గా పనిచేసేను కాబట్టి, మీ రింకోలా అనుకోకపోతే...మందులకి మీకింత ఖర్చు ఉండదనుకుంటాను....కొన్ని కొన్ని ఇంజక్షన్లు...ముఖ్యమైన పౌడర్లు ఇవ్వన్నీ వాళ్లే...

సుధా: (కొంచెం ముఖం చిన్నదిచేసుకొని చికాకుగా) ఆఁ...ఆ రోజులు పోయేయి...వాళ్ళ్యా ఏమీ ముఖ్యమైన మందులు సప్లయి చెయ్యటంలేదు..

రా. లిం: అదికాకుండా రైట్ బిల్సులో బాగా నొక్కొచ్చు...అది అందరికీ తెల్సిందే... ఇంకోలా అనుకోకండి!

వెంక: మీ రహస్యాల్లా ఉన్నారండోయి రామలింగంగారూ!

రా. లిం: ఏమన్నా మీకన్న అనుభవం ఉందంటారా లేదంటారా? లేకపోతే కాంపౌండరుగా పని చేసి ఈస్థితి కెలా ఒచ్చేను...

సుధా: ఆఁ...అంతా అనుకోడమే...అంతా కలుపుకొని మూడువందలకి మించదు మరెందుకు దాచాలి...

వెంక: నా రెంతయినా ఎనిమిది అంకెకి ఎదగదు...ఐదుకి తగ్గదు...పైకి నాది డాబుజాస్తి... ఉన్న డబ్బంతా ఊడ్చి ఆమేడ కట్టించి, ఊరుకోక ఆ కారుకి తగలేసేను...దాని ఫలితం... ఇన్‌కమ్ టాక్సు పీక మొయ్యాల్స పడిపోయింది..చచ్చినట్టు, నోరు మూసుకు కట్టేసేనుమరి..లోగుట్టు ఎవరికీ తెలీదు...ఈ మన్యాని డోసు మూడజాలు చేద్దామా అని తటపటాయించేను...కాని భయం...ఉన్నదానికే మోసం వస్తుందేమోనని ... యుద్ధంలో జెర్లో క్వైనైన్ దొరకనప్పుడు డోసు ఖరీదు ఎక్కువచేసేం ... ఇప్పుడు అదే ఉంటోందంటే అందుకే సంతోషించాలేము! కాని రామలింగంగారూ ... మీకేం కర్మండీ? అద్దె కొంప ... డొక్కు కారు ... దానికిబ్బంబట్టి చెప్పేయొచ్చు మైలుదూరంలో మీరున్నారనగానే ... మీ ప్రియమైనకూడా ఎప్పుడూ నల్లగుండు భాయిలా ఉంటారు!

రా. లిం: (నవ్వుతూ) నాయుండదనకండామాట! మా ప్రియమైనాయుండనండి! ఇంక నా కారుసంగతా... కొత్తదికొని లాభం ఏమిటి? మీరు కారుకొని, ఇల్లు కట్టి ఏం బాగుపడ్డారు? ఇన్కమ్‌టాక్సు! అదికాక నాదంతా ప్రయివేటు ప్రాక్టీసవ్వడంకు చాలా ప్రయివేటుగా అయిపోతుంది ... అలా ఉండనివ్వకూ...నాకు అప్పుడప్పుడు కొత్తకారు కొనాలనే ఉంటుంది...కొంటామనుకూడాను... నేను తల్చుకుంటే నిమిషంలో పని ... కాస్త సాయంత్రం సెషన్సు, మధ్యాహ్నం నిద్ర తగ్గించి పనిలో కూర్చుంటే, మీరు ఊమిస్తే,—మీ ప్రాక్టీసు కొంత నా చేతికింద కొచ్చేయడానికి ఆటంకం ఉండదేమో!

వెంక: నా పేషెంట్లు నాకు నికరం. ఇంకెవరి దగ్గరికీ వెళ్లరు ... అంతగా అయితే డోసు ఖరీదు తగ్గించేస్తాను...

రా. లి. తగ్గింపుకి మీకన్న నా కెక్కువ అవకాశంఉంది...నా మందులు మొదటికే బైరాగి చిటికెల్లాటివి...చవక!

కృష్ణ: కొంచెం ఆగండి ... మీలో మీకంత ఘర్షణవద్దు ... (నవ్వుతూ) నేను తలచుకుంటే మీ అందరి ప్రాక్టీసూ పడగొట్టగలను ... ఒక్క రామానిది తప్పించి.

రా: లిం. మాఅందరి ప్రాక్టీసూనా? అసంభవం

కృష్ణ: ఈఊళ్ళో అందరికీ తెల్సు... నేను కేసు మొదటికి పట్టుగోనని... పట్టుకుంటే రాత్రి పగలు అనకుండా పనిచేస్తానని... కాని అలా పనిచెయ్యడం నా కిష్టంలేదు ... నేనే దాని కిష్టపడితే మీ దగ్గరి కెవడొస్తాడు?

వెంక ఎందుకీ పొల్లుమాటలన్నీ...ఆ సంగతి మరెత్తకండి. ఇప్పుడు రామలింగంగారికి విశ్రాంతి అక్కర్లేదా—కాలంకూడా మళ్ళింది...నీ కక్కర్లేదా...అసలే నీకు గుండె జబ్బు!

కృష్ణ: (బాధగానూ, విచారంగానూ ముఖం పెట్టి) ఔను! గుండె జబ్బు!

రా. లిం. మీకు గుండె జబ్బా!

సుధా: ఏమిటి డాక్టర్! ఆశ్చర్యం!

వెంక: ఔను పాపం—కృష్ణమూర్తికి గుండె జబ్బే. రామారావు ట్రీట్ చేస్తున్నాడు...

రామ: } నిజంగా?
సుధా: }

కృష్ణ: (చిన్న గొంతులో) ఔను! నిజమే!

వెం: ఇప్పుడు చేసిన పనికన్న ఎక్కువ పని చేసినా, అనవసరంగా ఉద్రేకపడ్డా ఒక సంవత్సరం కన్న బ్రతకలేడన్నాడు. పాపం...

సుధా: నమ్మండి! నా కిప్పటివరకూ తెలీదు! అసలు మీ వంక చూస్తేనే నా కనుమానం వేసేది...

రామ: అయ్యయ్యో! ఎంతపని! నే నప్పుడే అనుమాన పడ్డాను కొంచం ఇలాటిదే ఏదో అయ్యుండాలని.. అడగడానికి కొంత జంకేననే చెప్పాలి... ఒక సంవత్సరంకూడా చాలా జాగర్తగానే ఉండాలయితే...

కృష్ణ: మీ కందరికీ దయఉంది...నిజమే... జాలిపడగలరు...ఈమాత్రం విశ్రాంతి ఉంటే నాలు గేళ్ళవరకూ బాధలేదన్నాడు రామం!

రామ: అయితే ఇంకేం? రామారావుగారు ఇందులో స్పెషలిస్టు...ఆయనమాటకి తిరుగులేదు...

వెం: అయితే ఇంకేమోయి! ఏ బెంగాలేకుండా హాయిగా ఉండు.

సుధా: మరింక బాధలేదు...నాలుగేళ్లమాట...

కృష్ణ: ఔను—నాలుగేళ్లమాట — బాగానే ఉంది. ఒక ప్రశ్న వేస్తాను చెప్పండి. నేను పోయేక నా పెళ్ళాం, పిల్లలూ ఒక్క దమ్మిడీ కూడా లేకుండా ఉండిపోతారు. నేను చిల్లిగవ్వకూడా నిల వెయ్యలేదు...కారణం, ఇప్పుడు చేస్తున్న పనికన్న ఎక్కువపని చెయ్యడానికి అవకాశంలేక – ఈ గుండె జబ్బువల్ల; మీరంతా ఎంతో కొంత నిలవేసే ఉంటారు...రామారావు తప్పకుండా ఒప్పుకుంటాడు...మీరంతా చందా ఎత్తి నా సంసారం నిలబెట్టాలి నేను పోయేక—

వెంక: చందా ఎత్తా? అవేం మాటలు కృష్ణమూర్తీ!

రా. లిం: అవేం మాటలూ!

సుధా: హారిబుల్! ఏం మాటలు!

కృష్ణ: చెప్పేది వినండి—చందా ఇస్తే చాలు! నాకేం చిన్నతనం లేదు—పరిస్థితి అలా వచ్చింది మీరంతా రెండేసి నెలలమీద మీ ప్రాక్టీసులో చ్చే డబ్బు, నా సంసారానికిస్తే అంతకన్న నేను కోరుకొనే దింకొకటి లేదు. ఆ డబ్బుతో నా పిల్లలు పెద్దవాళ్లై ఏదో ఉపాధి సంపాదించుకొనేందుకు సరిపోతుంది. ఏం?

రా. లిం: (మెల్లిగా) నా రెండు నెలల ప్రాక్టీసు.. అంటే రెండు వేలు!

వెంక: నిజమే కాని...నాలుగేళ్ళ మాట కదా!

సుధా: ఈమధ్యని ఏమన్నా కూడెయ్యడానికి అవకాశం ఉంటుందిలెండి!

కృష్ణ: నేను నాలుగేళ్లు బ్రతికాలంటే లేదు. ఇప్పుడే నేను నిర్ణయించుకోవాలి ఏమంటారు? ఒప్పుకుంటే ఇప్పుడు మీ రంత నెలకి ఆర్జిస్తున్నారో, రెండు నెలలది, రేపే నా భార్యపేర బ్యాంక్ లో వేస్తే నాకింక ఏ చింతా ఉండదు!

రామ: కాని కృష్ణమూర్తిగారూ...

వెంక: నువ్వేదో తొరికే ఎక్సయిటయిపోకు... ఒంటికి మంచిదికాదు...ఆ ఆలోచనే మానెయ్.

కృష్ణ: (నిట్టూర్చి) సరే—మీ అభిప్రాయం బోధపడ్డాది....అయితే నేనింక ఇవాళినించీ రాత్రీ పగలు పని చేస్తాను...మీ ప్రాక్టీసు చాలామట్టుకు నా కొస్తుంది. నాకు తెలుసు. ఒక్క సంవత్సరమే బతకాలి మరి. నెలకి రెండు వేలు చొప్పున సంవత్సరంపాటు—సగం ఖర్చులకి పోయినా...ఓ ఫరవాలేదు. నా పెళ్ళాం పిల్లలికీ పూచీ ఉండదు! తరువాత ఇంక నిశ్చింతగా కళ్లు మూసెయ్యొచ్చు!

[రామారావు ప్రవేశం—వయస్సు 30 సం॥ కాని మనిషి పాతికేళ్లకన్నా ఎక్కువ ఉన్నట్టు కనిపించడు. చామనచాయ - బలమైన శరీరం - చురుకైన కళ్లు ముఖాన్ని ఆకర్షణీయంగా చేశాయి— సూది ముక్కు—ఒంటిమీద ఇప్పుడున్న బట్టలు తెల్లటివి.—]

రామారావు: (ప్రవేశిస్తూనే) నమస్తే! అందరికీ. ఆలస్యం అయింది క్షమించాలి...

అంతా లేచి: కంగ్రాచులేషన్స్!

వెంక: కొత్త ఇంట్లో దిగినందుకు...

రా. లిం: కొత్త హాస్పిటలు—కొత్త ఇల్లు... అంతకన్న ఇంకేం అదృష్టం కావాలి!

రామారావు: (సంతోషంతో) నాకు చాలా సంతోషంగావుంది—మాట తీసెయ్యకుండా అంతా వచ్చినందుకు. పని వదిలేసి మరీని...

వెంక: మరేమీ ఫరవాలేదు...పన్లకేవిటి ఎప్పుడూ వుండేవే—

రా. లిం: ఒకగంటమాత్రానికి ఏముంది బెంగ... ఏ కేసన్నా ఆపాటిసేపు వేచివుండగలదు...

సుధా: నాకివాళ మధ్యాహ్నం సెలవ్. తీరుబాటే.

కృష్ణ: నాకిప్పటివరకూ తీరుబాటే కాని మరింక లేదు. నువ్వు నన్ను క్షమించాలి రామం! నేనింకొక పది నిముషాలకన్న ఎక్కువ ఉండలేను.

రామారావు: (కృష్ణమూర్తి ప్రక్కన కూర్చుంటూ) అంటే? నాకేం అర్థం కావటంలేదు.

వెంక: ఊరకనే ఎక్సైటయిపోతున్నాడు మనిషి ఇందాకట్నించీ! నువ్వన్నా చెప్పూ బాబూ!

రా. లిం: ఊరకనే అలా బెంగ పెట్టుకుని ఆరోగ్యంపాడుచేసుకోకండి కృష్ణమూర్తిగారూ!

రామారావు: ఏమిటిదంతా కృష్ణమూర్తీ! బెంగ దేనికి? నీకుండేసరించేనా? నీకు నాలుగేళ్లవరకూ ఫరవాలేదోయి, ఈమాత్రం విశ్రాంతివుంటే!

కృష్ణ: లాభంలేదు రామం. అంతా దయ చూపెట్టేవాళ్లేకాని...నిజానికి...

రామా: ఇప్పుడేమొచ్చింది?

కృష్ణ: ఈమాత్రం విశ్రాంతి తీసుకుంటే నాకు నెలకి రెండువందలకన్న ఎక్కువ రాదు ... అది ఖర్చవగా ఇక్కడా, అక్కడా అప్పుకూడా అవుతోంది. నాలుగేళ్ళతరవాత నేనుపోయాక నా పెళ్లాం పిల్లలగతి?

రామారావు: మేంవంతా ఏమయేమంటావ్?

కృష్ణ: అదే నేనూ అన్నాను. మీరంతా ఉన్నారు ... నాకిప్పుడు మాటలవల్ల లాభం లేదు. రేపు మీరంతా రెండువేలకి మీకందరికీ ఒచ్చేడబ్బు నాభార్యపేర బ్యాంక్‌లో వేస్తే నాకు నిశ్చింతగా ఉంటుంది...అదే ఇందాక అన్నాను. కాని దయ, మాటలతో ఆగిపోయింది.

రామారావు: తప్పకుండా కృష్ణమూర్తీ! అంతా సాయంచేస్తాం ..నీకా బెంగ వద్దు.

వెంక: కాని రామారావ్ ఊరకనే అతనలా ఎక్సైటయిపోతూ ఉంటే నువ్వు మరింతప్రోత్సాహం చెయ్యకు. నేను చెప్తున్నాను కృష్ణమూర్తి పదేళ్లు బ్రతుకుతాడు!

రా. లిం: సరిగా చెప్పేరు చలంగారూ! నే నింకో ఐదేళ్లెక్కువ వేస్తాను. పదిహేనేళ్ళవరకూ మీకు బాధలేదు కృష్ణమూర్తిగారూ! ఇంకా మీరు కుర్రాళ్లు. ఏగుండెజబ్బు మిమ్మల్నడ్డుతుందండీ?

సుధా: నేనైతే మీకు గ్యారంటీ రాసిస్తాను. ధైర్యంగా ఉండండి! అంతేచాలు.

రామారావు: (మెల్లిగా) మనాసంగతి ఎత్తకు. అంతా వెళ్ళిపోయాక మాట్లాడుకుందాం. (పైకి గట్టిగా) నేనూ పొరపాటుపడితే పడుండొచ్చు. ఫరవాలేదోయి గుండెజబ్బుతో తొంభయేళ్లుబతికినవాళ్లున్నారు. ఏ నిమిషమైనా అనుకుంటూ-మనాసంగతే మరిచిపో-

(నౌకరు ప్రవేశం, ట్రేతో; ట్రేలో ప్లేట్లు—వాటిలో కేకుముక్కలు, బిస్కట్లు—ఎవరి ప్లేటు వాళ్లకందించి వెళ్లిపోతాడు)

వెంక: ఇంకా కొన్ని ఇళ్లు కట్టించాలని నా కోరిక...

(తింటాడు)

రా. లిం: రామారావుగారి ఆయుష్షుకోరుతూ! డాక్టరుకోరే దదే! నేనుకోరే దదే ప్రతిఒక్కడికీ—కాని ఆరోగ్యంమాటమాత్రం ఎత్తను...అందరూ ఆరోగ్యంగా ఉంటే మరి మనం ఎందుకు?

(తింటాడు)

సుధా: (వేదాంతిలా) మనం అనుకున్నంత మాత్రాన ఏదీ అయిపోదు!

(తింటాడు)

కృష్ణ: అన్నివిధాలా నీ అభివృద్ధిని కోరుతూ.

(తింటాడు—నౌకరు మరొక ట్రేతో ప్రవేశిస్తాడు—ట్రేలో 'టీ' కప్పులు—అందరికీ 'టీ' అందించి వెళ్తాడు)

రా. లిం: గది ప్రవేశించగానే మీ అస్థిపంజరాన్ని చూసి ఒక్క అడుగు వెనక్కి వేసేం.

రామారావు: నా అస్థిపంజరమా!!

రా. లిం: అంటే...అదుగో ఆ కేస్ లోది...

(కేస్ వేపు చూపిస్తాడు)

సుధా: డాక్టర్! మీరు మమ్మల్నందర్నీ బెదర గొడదామని పెట్టినట్టుంది గదిలో...అసలు దీని అవసరం మీకేముంది?

రామారావు: కొత్తఇంటికి అదొక వస్తువు లాటిది. హాస్పిటల్ కీ దానికీ సంబంధం లేదు. వారం రోజులై వచ్చింది...ఐదుకంపలయింది ఇంటికొచ్చే సరికి...

వెంక: అయిపోయిందిలే! ఎందుకయ్యా అంత ఖర్చు అనవసరంగా? కొత్తఇంటికి ఇంకా పియానో తెప్పించుకుంటే బాగుండును! వాయించటం రాకపోయినా గదినిండుగా ఉండును.

రా. లిం: వెక్కిరిస్తున్నట్టు అది ఎదురుగా ఉంటే రామారావుగారూ! ఇక్కణ్ణుంచి పారిపోవాలని ఉంది!

సుధా: నే నొక మాట చెప్తాను రామారావుగారూ! మన వృత్తే, నన్ను క్షమిస్తే, అసహ్యమైనది.

రా. లిం: డాక్టర్! మన వృత్తిమీదే మీరు నింద వేస్తున్నారు అనవసరంగా!

వెంక: చెప్పనీండి రామలింగంగారూ! చెప్పనీండి. అత డన్నంతమాత్రాన నష్టం లేదు.

సుధా: నేను నిందించటం లేదు. మనం డ్యూటీలో ఉన్నప్పుడు చెయ్యవల్సిన పనులు మనస్సుకి సంతోషం, ఆనందం కలిగే పనులు చెయ్యటం— మనిషి దేన్ని అసహ్యించుకుంటాడో, ఏది అక్కర్లేదని అహోరాత్రాలూ కోరుకుంటాడో, పాటుపడతాడో ఆ వ్యాధి—ప్రతి నిమిషం దానిలోనే వుండాలి మనం. అది మన కుండెకపోయినా దానిలో మునిగి తేలతాం. మనిషి ఆనందానికి అడ్డొచ్చిన ఆ అసహ్యకరమైన కశ్మలాన్ని పోగొట్టడానికి ప్రయత్నిస్తాం. దానితోనే మనుష్యులు మనదగ్గరికొస్తారు. మన బ్రతుకంతా, ఈ వృత్తి చేస్తున్నంతకాలం అంతే. ఒక పోస్ట్‌మార్టమ్ చేస్తే నాకు రెండు రోజులవరకూ తిండి సయించదు. ఎంత అలవాటైనా మనస్సుకి ఆ పరిశ్రమ, ఆ బరువు చాలదూ? ఇంక మన విశ్రాంతి సమయం హాయిగా, సంతోషంగా, తేలిగ్గా గడపాలని ఎంతో కోరుకుంటాం. అలాటి సమయం గడిపే ప్రదేశం డ్రాయింగ్ రూమ్ ఒకటే—కాని ఈ అస్థిపంజరం ఎదురుగా ఉంటే తిరిగి మనిషి, శరీరం, ఎముకలు, వ్యాధులు గుండెలో బోరబడతాయి. సంతోషం కాస్తా చచ్చి ఊరుకుంటుంది...అదీ నే నన్నేది.

వెంక: బాగా చెప్పేవ్ సుధాకర్! అయినా ఎందుకయ్యా ఈ ఎముకలగూడు, ఎదురుగా?

రామారావు: (నవ్వి) మిమ్మల్నింతగా బాధ పెడుతోందా అది?

సుధా: మాకాలాలు మనిషి బాధపడతాడో లేదో కాని, మానవ యంత్రం పనివాళ్లం మనం. అది ఆ మరలనే జ్ఞాపకానికి తెస్తుంది, మరుద్దా మనుకుంటే చికాకుగా ఉంటుంది, మరేం లేదు కాని.

రామారావు: అది నాకు ఆత్మబలాన్నిస్తుంది!

రా. లిం: అది పోతుందేమో అని, నేను భయపడుతున్నాను, దాన్ని చూస్తూఉంటే.

వెంక: ఏమి అనిపించినా అనిపించకపోయినా దాని అవసరం ఇక్కడ లేదు.

రామారావు: నన్ను మీరంతా క్షమిస్తానంటే ఒక్క మాట అంటాను.

వెంక: తప్పకుండా చెప్పవోయి! అందులో నీ కొత్త స్వంత ఇంట్లో!

రామారావు: మీకు మీ వృత్తిమీద ఉండవల్సినంత అభిమానం, శ్రద్ధా లేవేమో! ఇది కూడా ఒక కళ లాటిది...ఆ కళమీద ఆసక్తిలేదేమో.

రా. లిం: మైగాడ్! ఏమిటలా కొట్టి పారేస్తున్నారు రామారావ్ గారూ? నన్నొదిలేయండి ఫరవాలేదు—కాని వారంతా మీ అంతటివారే.

సుధా: మీ రెలా చెప్పగలరు!

రామా: ఎలా చెప్పగలనా? నాకూ అందులో శ్రద్ధలేదు కాబట్టే నాకూ దానిమీద అభిమానం లేదు కాబట్టే...నాకూ అదంటే ఉత్సాహం లేదు.

కృష్ణ: ఎందుకు లేదు రామం? వీళ్లందరికన్నా నీకు శ్రద్ధఉంది. అందులో ఆసక్తి తప్పకుండా ఉంది. తిండి, నిద్ర లేకుండా మేం ఎవరమన్నా పనిచేస్తున్నామా? రాత్రి ఒంటిగంటకి ఈ డాక్టర్లెవరన్నా కదిలేరేమో అడుగు? రాత్రిళ్లు, పగలూ రోగుల దగ్గర వీళ్లెవరన్నా కూర్చున్నారేమో అడుగు? నా సంగతి వదిలీ—నేను అలాటి కేసులు పట్టేపట్టను... నీ దగ్గరికి పంపించేస్తాను.

రామా: నువ్వలా ఆవేశపడకు కృష్ణమూర్తీ!

వెంక: ఏమోయి! నువ్వెక్కువ కాలం బతకాలని మేం కోరినందుకు కోపంలా ఉంది?

సుధా: అలా ఊరికే ఆవేశపడకండి! మీ కావల్సిన సాయం మేం చెయ్యమన్నామా?

కృష్ణ: (సుధాకర్ వేపు కసిగా చూసి ముఖం దించుకుంటాడు.)

రా. లిం: తప్పకుండా కృష్ణమూర్తిగారూ! శపించే శపే కాను కాని... ఈ నాలుగేళ్ళలోనూ ఎప్పుడైనా తప్పకుండా సాయం చేస్తాను.

రామా: ప్రతి డాక్టర్‌కీ సుధాకర్ అన్నట్టే ఉంటుంది. అతను చెప్పినట్టు వికారమైన దానిదగ్గర కైనా ఎవరికి వెళ్ళాలని ఉంటుంది చెప్పండి? కాని అది మనోబలంమీద ఆధారపడి ఉంటుంది. ఆసక్తి, ఆ వికారాన్ని పోగొడుతుంది. అందులో శ్రద్ధ కలుగ జేస్తుంది. నాకు మనోబలం తక్కువ... అందమైనవి, సంతోషాన్ని, ఆనందాన్ని ఇచ్చే వస్తువులకోసం నే నొకప్పుడు ప్రాకులాడేను. కాని నాకవి అంద కుండా పోయేయి. అందుకే ఈ వృత్తి. కాని ఆ అందమైనవాటివేపు అప్పుడప్పుడు మనస్సుపోతుంది. అదే నా మనోదౌర్బల్యం. సంసారం చేస్తూ జీవితంలో అన్నివిధాలా ఆనందం అనుభవిస్తూ ఈవృత్తికి పూర్తి శక్తిని వినియోగించినవాళ్లున్నారు. ఇందులో పరిశోధనలు చేసిన గొప్పవారంతా అందం అంటే ఏమిటో తెలియనివారు కారు. కాని నా కాశక్తి లేదు. అందుక నే ఈ అస్థిపంజరం—ప్రతినిమిషం ఇది నా కర్తవ్యాన్ని గుర్తుకు తెస్తుంది. రోగాల్ని, మనుష్యుడి బాధని జ్ఞాపకానికి తెస్తుంది. ఆ వికారమైనవాటిని గుర్తుకు తెస్తుంది. పోయినబలాన్ని నామనస్సుకి తిరిగి ఇస్తుంది.

సుధా: మీరు కేవలం డబ్బుగురించి ఈ వృత్తిని అవలంబించనట్టు మాట్లాడుతున్నారు. మేంకూడా కొంతవరకు అంతే అనుకోండి. కాని మీకు మా అందరి కన్నా ప్రాక్టీసెక్కువే అనుకుంటాను.

రామారావు: కేవలం డబ్బుగురించే కాదు. నా కిందులో మొదటినుంచీ ఆసక్తి ఉంది. కాని డబ్బు లేకుండా ఏదీ లాభం లేదు. పదిహేనువందలు నా ఏవరేజి. మీరంతా పుచ్చుకోనేటట్టు పుచ్చుకుంటే నాకు మూడువేలవరకూ వస్తాయి.

రా. లిం: ఏం? మీరు తక్కువ పుచ్చుకుంటారా?

రామారావు: కొంచం—అదొక్కటే కాదు. డబ్బున్నవాళ్లంతా ఇచ్చేస్తారు. కొంతమంది మందు ఖరీదే ఇస్తారు. కొందరు రెండుమూడు వాయిదాలుగా ఇస్తారు. కొందరు ఇవ్వనేలేరు. అలాఅని ఇంకో సారి వచ్చినప్పుడు డబ్బు ఇచ్చాక రండి అందా మనుకుంటూ అనలేను. అస్థిపంజరం జ్ఞాపకాని కొస్తుంది. చిన్న వేదాంతంలా మనస్సులో బయ లేర్తుంది. రోగం! దానికి డబ్బుతో సంబంధం లేదు. ప్రతివాళ్లకీ వస్తుంది. డబ్బున్నవాడికీ లేనివాడికీని... దానికి స్నేహితుడూ శత్రువూ అని లేదు. ఒకప్పు డనిపిస్తుంది. ఈ మనిషి రోగంతో నాదగ్గరికొచ్చేడు. ఇతను నాకు డబ్బివ్వాలి. అప్పుడు అస్థిపంజరం జ్ఞాపకానికొస్తుంది. ఒక మానవశరీరం నీదగ్గరికొచ్చింది. రక్తం, మాంసం, ఎముకలతో కూడుకున్న ఒక శరీరం. అది రోగంతో బాధపడుతోంది. పాడవుతోంది. నువ్వు దానిని మరామత్తు చెయ్యగలవ్. అది నీకర్తవ్యం — ఆశాస్త్రంలో నే శ్రద్ధ ఉంటే, అదెందుకు తెల్సుకున్నావో ఆపని నెరవేర్చు అనిపిస్తుంది... కేవలం డబ్బు పుచ్చుకోకుండా చేద్దాం అంటే లాభం లేదు—

వెంక: అందుకే నీకు పేషెంట్లెక్కువౌతున్నారు. ఎందుకో అనుకోనేవాణ్ని. డబ్బు పుచ్చుకోవడం పూర్తిగా మానేస్తే, ఊరంతా నీ దగ్గరికే వస్తారు. మేం అంతా మకాం ఎత్తేయవచ్చు!

రామారావు: అలాటిదేమీ లేదు. నాకూ డబ్బు కావాలి. కాని నాకొక కోరికుంది. అదింత వేగం కాదు—కాని, నేననుకున్న డబ్బు జతపడ్డాక—అది ముసలితనంలోనే కావొచ్చు—నాడబ్బు, మరి కొన్ని చందాలు వసూలుచేసి ఒక సేనిటోరియమ్ కట్టించాలని ఉంది, బీదవాళ్ళకి అందుబాటులో ఉండేలా—చాలాకాలం పడుతుంది. నే నొక్కణ్ణీ ఇప్పటికే ఉన్న పేషెంట్లతో నెగ్గుకురావడం కష్టంగా ఉంది... తగ్గించుకోవాలనిపిస్తోంది. మీరు భయపడనక్కర్లేదు—

రా. లిం: ఆమాత్రం ధైర్యం ఇస్తే చాలు—మీలాంటి పెద్దభావాలూ, ఉదారస్వభావం మాకూ ఉన్నాయ్ కాని మాకు పెళ్లాం, పిల్లలు, సంసారం, పిల్లల చదువులు అన్నీ చుట్టుకున్నాయి—మీ కెవ్వరూ లేరు—మీరు పెళ్ళిచేసుకోరనికూడా విన్నాం. మీరు మీ ఆదర్శాలు అమలులో పెట్టినా సబబుంది.

(మౌనం)

కృష్ణ: (ప్రసంగం మార్చి) ఏమండీ సుధాకర్! విశ్వనాథంగారు మీకు తెల్సునా?

సుధా: విశ్వనాథంగారు?

కృష్ణ: ఔను—మరిచిపోయినట్టుంది మీరు—ఆయనపేరు తెలియనివాళ్లీ ప్రాంతంలో ఉండరను

కుంటాను—డబ్బున్న రోజులలో ఆ యన అడిగిన వారికి లేదనకుండా ఇచ్చి అఖరుకు ఫకీరయ్యేరు—

సుధా: ఔనౌను! విశ్వనాథంగారు—రెండేళ్ల క్రింద...

కృష్ణ: మీ గవర్నమెంటు హాస్పిటల్‌లో పోయేరు...

సుధా: (చికాకుగా) ఆయనసంగతి ఇప్పు డెందుకు?

కృష్ణ: ఆయనొక్కసారి తలుచుకుంటే పుణ్యమే గాని పాపం కాదుగదా!

రామారావు: పాపం ఆయన పోయినప్పుడు నే నిక్కడ లేను—కలరా వచ్చిపోయేఁట— నేనూ తప్పకుండా సహాయపడి ఉందును పీకలైవంతమట్టుకు —చాలా బాధపడ్డా రాఖ్రరోజులలో—

కృష్ణ: రాము అప్పుడే ఉంటే ఆయన తప్ప కుండా బ్రతికిఉండు నేమో అనిపిస్తుంది!

సుధా: చెయ్యవల్సిందంతా చేసేం. రామారావు గారున్నా అంతకన్న మరేం చేసివుండలేక పోయేవా రేమో!

రామా: అంతే అంతే! పాపం...ఆయన్ని తల్చుకుంటే—

కృష్ణ: ఆయన పోయేక పుకార్లు చాలా చాలా పుట్టేయి లెండి.

రామా: నేనూ విన్నా నేవో! అవన్నీ వట్టివి కృష్ణమూర్తి! సుధాకర్ పాపం చెయ్యవల్సిందంతా చేసేరు - అంతకన్న...

కృష్ణ: విశ్వనాథంగారిని ఈ హాస్పిటల్‌లో పడేసేరంటే, పూర్వం విశ్వనాథంగారు కారుకదూ? డబ్బున్న రోజులలో మనిషి కారు...

సుధా: మీ రనదల్చుకున్న దేదో నూటిగా అనండి!

కృష్ణ: పుకార్లు సుమండీ! ఎంతమట్టుకు నిజమో మరి మీకే తెలియాలి. మీరు ఆయనవిషయంలో తీసుకోవల్సినంత శ్రద్ధ తీసుకోలేదని...

రామా: కృష్ణమూర్తి! అవేమ్మాటలు!

వెంక: నేనూ ఏవో విన్నానుకాని అవి వట్టి మాటలు—

సుధా: వాటి కెంత విలువవున్నా కృష్ణమూర్తి గారు మాత్రం నమ్మినట్టుంది...

కృష్ణ: మనంకూడా మనుష్యులమే చూడండి— కోరిక, అసూయ, లోభిత్వం ఇవి ముఖ్యంగా మనిషి కుండవల్సిన గుణాలు—పోతాయా? వాటికి చేటి కన్నా, డాక్టరే కానీండి, లొంగేడంటే అంత ఆశ్చర్యపడాల్సిన సంగతి కాదు.

సుధా: అంటే? నే నశ్రద్ధ చేసేనంటారా?

కృష్ణ: నే నను పుకార్లు చెప్తున్నాను. రోగం కాస్త దారిలోకి వచ్చి, రాత్రి పదకొండింటికో మళ్ళా తిరగేసిందన్నారు—అప్పుడు మీ ఇంటికి వెళ్ళి, తలుపు విరక్కొట్టేనంత పనిచేసినా లేవ లేదని అంటారు...అంతలా నిద్రపోయే మనుష్యు లుంటారా అనిపిస్తుంది—

రాము: నే నలా నిద్రపోతానండోయి — ఇందాక చెప్పేనుకదూ—కుంభకర్ణుడి నిద్ర—

సుధా: ఏదన్నా పుకారు పుడితే మనుష్యులు చాలా సులభంగా అది నమ్మేస్తారు...కాని నిజం తెల్సుకు నేందుకు ప్రయత్నించరు...

కృష్ణ: నిజం ఏమిటో!

సుధా: నే నింట్లో లేను—మరొక కేసుమీద వెళ్లేను...

కృష్ణ: అదీ నేను విన్నాలెండి. ప్రయివేటు ప్రాక్టీసా?

సుధా: కృష్ణమూర్తి! మీరు అనవసరంగా అపార్థం చేసుకుంటున్నారు—అప్పుడు మీరంతా ఏమయ్యేరు?

కృష్ణ: నాకప్పుడు గుండెనొప్పి వచ్చింది. లేక పోతే నేనే...కాకపోయినా ఒక కేసు మీ దగ్గర కొచ్చినప్పుడు పూర్తి బాధ్యత మీదే నేమో!

సుధా: ఆ బాధ్యత నెరవేర్చలేదంటారా?

కృష్ణ: ఏమోమరి—ఉన్న నిజం ఏమిటంటే మీరు రాత్రి రెండుకి వెళ్లేరని...అప్పటి కప్పుడే ఆయన అఖరి ఘడియలలో ఉన్నాడని.

సుధా: నేను రెండుకి వెళ్లడం నిజమే! కాని అప్పటివరకు ఇంకొక కేసు చూడాల్సొచ్చింది... తిరుగుముఖం పట్టిందనుకున్నది, తిరగేస్తుందని ఎవ రనుకోగలరు?

కృష్ణ: పోనీ ఆ కేస్‌లోనన్నా సక్సెసయ్యేరా?

సుధా: ఔను—అయ్యేను.

కృష్ణ: పడిన కష్టం వృధాపోదంటారు. ఫలితం లేకుండా పోయిఉండదు!

సుధా: కృష్ణమూర్తిగారూ! మీరు అనవసరంగా నామీద ఒక నింద మోపుతున్నారు! మీకు మర్యాద కాదు.

రామా: కృష్ణమూర్తీ! నీకు పిచ్చి కాని ఎత్తిందా!? ఊరుకో!

వెంక: నాకు టైమయింది, టెన్నిస్‌కి—పద సుధాకర్! ఉత్తినే వెర్రివాడిలా ఎక్సైటయిపోతూ ఉంటాడు! ఆ మాటలు పట్టించుకోకు...

రా. లిం: (లేస్తూ) అలా ఉద్రేకపడితే గుండెకి మంచిది కాదు కృష్ణమూర్తిగారూ! అలా అయితే ఒక్క సంవత్సరం కూడా నా కనుమానమే! మీకు సహాయం విషయం రేపే కాకపోయినా ఆలోచిద్దాం లెండి!

సుధా: మీరు నాకు 'ఎపోలొజీ' ఇచ్చుకోవాలి కృష్ణమూర్తిగారూ!

రామా: దాని కంతగా పట్టించుకోకండి సుధాకర్! మనం అంతా స్నేహితులం—ఒకే వృత్తివాళ్లం!

సుధా: (లేస్తూ) ఆ రకంగా అయితే... మీరు చెప్తున్నారు కాబట్టి నేనంతగా పట్టించుకోను... కాని అది మనస్సు కెంతో బాధకలిగిస్తుంది!

(అంతా లేచి నిల్చుంటారు)

కృష్ణ: ఏమిటి డాక్టర్ గారూ? ఎపోలొజీ అన్నారు? నిమిషాలమీద అంతా రుజూ చెయ్యగలను—మీరు ఎవరిని 'ట్రీట్' చేసిందీ, ఎంత పుచ్చుకున్నదీ...నలుగురి సాక్ష్యం చాలదూ?

రామారావు: కృష్ణమూర్తీ! నీ కివాళ...

వెంక: పద సుధాకర్! అతనితో మన కేమిటి...

కృష్ణ: ఇంక మీ ఎవ్వరి సాయం నా కక్కర్లేదు... మీ అందరి దయకీ చాలా సంతోషం... ఒక్క సంవత్సరమే చాలు... నాలుగేళ్లింటికి వెనక బ్రతుకు—ఈ ఏడాదిలోనూ నా సంసారానికి నేనుపోయేక ఏబాధా వాళ్లకుండకుండా చెయ్యగలను...

రా. లిం: అంత ఆవేశం వద్దు డాక్టర్! మంచిది కాదు గుండెకి!...పదండి....పద సుధాకర్....మళ్లా కలుసుకుందాం రామారావుగారూ...(అస్థిపంజరాన్ని చూసి ధైర్యంగా, ఖులాసా ఆ? (పకపక నవ్వుతాడు)

వెంక: మళ్లా కలుద్దామోయి రామం. పద సుధాకర్... టెన్నిస్‌కి టయిమయింది!

(ముగ్గురూ వెళ్ళిపోతారు)

రామారావు: అలా ఎందుకు ప్రవర్తించేవ్ కృష్ణమూర్తీ...అతను ఎంతగా నొచ్చుకుని ఉంటాడు!

కృష్ణ: నే నన్నదాన్లో అబద్ధం ఏమీ లేదు... ఎపోలొజీ కావాలిట!...ఎపోలొజీ...!

రామారావు: నువ్విలా ఆయన్ననటం నా కిష్టంలేదు సుమా!

కృష్ణ: (నాడీ చూసుకొని) నా కిక టైము లేదు. నే పోతాను. ఇవాళనుంచీ ఒక నిమిషమున్నా విశ్రాంతికీ, అవకాశంలేదు...పూర్వంలా కాదు... ఒక సంవత్సరమే టైమ్ ఇచ్చేవ్ మరి నువ్వు!

రామారావు: నాలుగు సంవత్సరాలు!

కృష్ణ: విశ్రాంతి తీసుకుంటేగా.

రామారావు: విశ్రాంతి తీసుకో.

కృష్ణ: నా పెళ్లాంపిల్లలమాట—తెలిసి నువ్వెందుకలా అంటావ్? ఒక దమ్మిడీకూడా నేను నిలవ చెయ్యలేదు. నేను కళ్లుమూస్తే వాళ్లంతా కట్టుబట్టలతో నిలబడిపోవల్సిందే...

రామా: మేమంతా ఎక్కడికి పోతూవుంటావ్? మరో పదేళ్లు బ్రతుకుతావని ఎందుకనుకోరాదు? గుండె జబ్బుతో, చెప్పేనుకదూ ముసలితనం చూసినవాళ్లున్నారు...

కృష్ణ: నాకు బతకడానికి ధైర్యంలేదు. నాలుగేళ్ళు నా కనుమానమే ... నొప్పొచ్చిన ప్రతిసారీ కొన్నేళ్లు తరిగిపోతున్నట్టుంటుంది!

రామా: మేం అంతా ఉన్నాం నీకు భయం ఎందుకు?

కృష్ణ: చూసేవ్ కదూ మనస్నేహితులధోరణి... డబ్బుసాయం వచ్చేసరికి నాకింకో పదేళ్లు ఆయుర్దాయం ఇచ్చేరు! లాభంలేదు రామం! రాత్రీ పగలు కష్టపడి పిల్చిందరి ప్రాక్టీసూ పనిగొడతాను .. నా కర్తవ్యం పెళ్లాం పిల్లలకి...

రామా...ఇలా రా...కూర్చో...

(ఇద్దరూ కూర్చుంటారు)

నువ్వూ నేనూ చిన్నప్పట్నించీ స్నేహితులం... ఆరోజులు జ్ఞాపకమున్నాయా? చిన్నప్పటి రోజులు?

(మౌనం)

కృష్ణ: (జ్ఞాపకం తెచ్చుకుంటున్నట్టు) ఔను. సముద్రపొడ్డున ఇసుకతో గూళ్లుకట్టి ఆడుకొనే వాళ్లం...

రామా: ...క్లాసులో నువ్వు మొదటివాడవుగా ఉండేవాడివి ... నీతో నాకు తిరగడానికి ఎంతో గర్వంగా ఉండేది!

కృష్ణ: నువ్వు చాలా పొట్టిగా ఉండేవాడివి. కాని అందరిలోకన్న నీతో తిరగడంఅంటే నాకేదో సర్దాగా ఉండేది...

రామం: సినిమాలకీ, హోటల్ తిళ్లకీ నువ్వే డబ్బు తెచ్చేవాడివి. ఇద్దరం ఇష్టమొచ్చినట్టు ఖర్చు పెట్టేవాళ్లం. మా నాన్నగారు ఒక దమ్మిడీకూడా ఇచ్చేవారుకారు ఇలాంటి ఖర్చుకి...

కృష్ణ: ముఖం ముడుచుకుంటే చాలు అమ్మ కావల్సినన్ని డబ్బులిచ్చేది ... నేనంటే ఎంత ముద్దుగా చూసేది...

రామం: మెడిసిన్‌లోకూడా నువ్వే ఫస్టు. నేను నీతరవాతే...

కృష్ణ: అలా అనకు—నీకున్న పట్టుదల—అందులో శ్రద్ధ నాకు లేవు.

రామం: గుండెజబ్బు నీ కడ్డొచ్చింది...లేకపోతే నువ్వూ...

కృష్ణ: ఈ వృత్తిలో అంతగా ముందుకు రాలేకపోయానని కాని, నాకు గుండెజబ్బుందని కాని నాకెప్పుడూ విచారంలేదు. బ్రతుకులో ఎంత ఆనందం అనుభవించాలో అది అనుభవించేను. కాని ఇప్పుడు ఒక్కటే విచారం. ఎవరివల్ల అంత ఆనందం, సుఖం పొందేనో వాళ్ళకి ఏమీ లేకుండా చేసిపోతానేమో అని...

రామం: నువ్వు ఆ విచారం పెట్టుకోకు. (ఊరుకొని) నేను సాయంచేస్తాను—సరా? రేపే నీ ఆవిడపేర, ఆరువేలు బ్యాంక్‌లో వేసుకో—నా దగ్గర తీసుకో డబ్బు.

కృష్ణ: (నమ్మలేక) ఏమిటి రామం?

రామం: అంతలా ఆశ్చర్యపోకు...

కృష్ణ: నిజంగానా?!

రామం: నీకన్నా నాకు దగ్గరస్నేహితు లెవరున్నారు? నువ్వు మనస్సు స్థిమితపరచుకో! సరా?

కృష్ణ: నేను నమ్మలేకుండా ఉన్నాను రామం!

రామం: నాలో నీకు నమ్మకంలేదా?

కృష్ణ: ఎందుకు లేదు?

రామం: మా తండ్రి వదిలిన డబ్బు, నే నార్జించిన డబ్బు ఏం చెయ్యమంటావ్..., సెనిటోరియమ్ కట్టాలనిఉంది...అయినా ఈమాత్రం తగ్గినందువల్ల దానికి నష్టంలేదు...

కృష్ణ: నువ్వు నీ పెళ్లిసంగతి మరి ఆలోచించదలచుకోలేదా?

రామం: పెళ్లిచేసుకుంటే ఈ వృత్తి మానెయ్యాలి...

కృష్ణ: ఎందుకు?

రామం: ఈపని అలాటిది—పెళ్ళి, ఈ వృత్తీ రెండూ పడవు- పెళ్ళి చేసుకొని లాభం ఏముంది? పెళ్ళానికి సుఖం ఉండదు...నాకూ అందులో సంతోషం ఉండదు...నా సంగతి సరే—రాత్రి పగలు అనకుండా పేషెంటపట్ల శ్రద్ధ తీసుకోవాలి. పెళ్ళాంమాట మరిచిపోవాలి... ఆ సంతోషమే కావాలంటే ఈ వృత్తిని అశ్రద్ధచెయ్యాలి...ఏదో ఒకటే ఉండుకోవాలి...అందుకే అనుకున్నాను... కొన్నాళ్లీ ఈ వృత్తిచేసి మానేసేక పెళ్లిచేసుకుందామని...

కృష్ణ: ఇప్పుడు నీకేమయింది! మానేయి ఈ పని. డబ్బుకేం బాగాలేదుగా? ఎందుకు పెళ్ళిచేసుకోకూడదు?

రామం: నాకా ఉద్దేశం మరి లేదు—ఇందాక చెప్పేను కదూ. అందం, సంతోషం నా దగ్గరికి రాలేవు.

కృష్ణ: పాతసంగతులు మరిచిపోవాలి రామం. మళ్ళా కొత్తగా మొదలెట్టు.

రామం: మరిచిపోయేను. కాని మరికొత్తగా మొదలెట్టలేను—

కృష్ణ: ఎలాఅయింది అదంతా? విశ్వనాథం గారికి నీ ఉద్దేశం తెలీదూ?

రామం: తొందరలేదనుకున్నాను.-కమలకూడా అలానే అంది. డాక్టర్ చదువు పూర్తిఅయేవరకు బాగాలేదనుకున్నాను—ఇందులో నాకు మొదట్నుంచీ శ్రద్ధఉండేది. చిన్నప్పట్నుంచీ డాక్టర్ అవుదామని ఉండేది. వీలుంటే రెండుమూడేళ్లు ప్రాక్టీస్ చేసి మానేసేక, కాదూ అంటే ప్రాక్టీస్ చెయ్యకుండానే పెళ్ళిచేసుకుందా మనుకున్నాను.

కృష్ణ: మరేలా?

రామం: ఇంటరకూడా కమలకీ చదవాలనే ఉండేది—అప్పటికే వాళ్ల పరిస్థితి బాగులేదుట—నాకిదంతా తెలీదు—మద్రాసు వెళ్ళిపోయేక ఆరేళ్లవరకు మరి ఇంటిసుఖం చూడలేదు. ఇక్కడి స్థితే తెల్సిందికాదు. కమలన్నా రాసిందికాదు. తిరిగి వచ్చేసరికి కమలపెళ్లిఅయిపోయింది—

కృష్ణ: కమల ఎలా ఒప్పుకుందో నా కాశ్చర్యమే.

రామా: తిరిగివచ్చేక మరి ఆ ఇంటికి వెళ్ళలేదు—కమల ఇప్పుడు ఏ ఊళ్లో కూడా తెలీదు... బాగా డబ్బున్న వాళ్ల సంబంధమేమో—అయివుండాలి.—వాళ్ళు చాలా సాయం చేసేరని అంటారు. అదంతా ఆలోచించే కమల ఒప్పుకొని ఉంటుంది.

కృష్ణ: నీకు తెలిస్తే నువ్వాపాటి సాయం చెయ్యలేకపోదువా?

రామా: నేను సాయం చెయ్యడం ఆమె కిష్టం లేకపోతేనో? తన స్థితి తెలియజెయ్యడం ఇష్టంలేక అయ్యుంటుంది. లేదా మా నాన్నగారు బతికుండే వారిప్పటికి... ఇలాటి సాయానికి ఆయన ఇష్టపడరని ఊరుకుందో ఏమిటో! ఏదీ నాకు సరిగ్గా తెలియకుండాపోయింది. ఒక్క ముక్కన్నా ఎవ్వరన్నా అప్పుడు తెలియజేసి ఉంటే కమలని దక్కించుకుందును!

కృష్ణ: అయిపోయినదానిగురించి మరింక విచారిస్తే ఏం లాభముంది? నీ మనస్సు మార్చుకునేందుకు ప్రయత్నం చెయ్యి.

రామా: అది లాభంలేని పని.

[మౌనం]

కృష్ణ: చెప్పకేం—నువ్వంటే నాకొంచెం అసూయగా కూడా ఉండేది కమల విషయంలో, ఆ రోజుల్లో.

రామా: మరింక ఆ అసూయ నీకక్కర్లేదు. (నవ్వుతాడు)

కృష్ణ: కాని, ఇది గమ్మత్తుగా లేదూ? మా ఆవిడకీ కమలకీ ఎంతదగ్గరి పోలికో! ఇద్దరూ కవలపిల్లలా అనిపిస్తుంది. నేను ఆ సంబంధానికి ఇష్టపడింది అందుకే. కట్నం గిట్నం ఏమీ లేకుండా పెళ్ళిచేసుకున్నాను.

రామా: మొదటిసారిగా మీ ఆవిడ్ని చూసినప్పుడు నేను ఉలిక్కిపడ్డాను. నమ్మలేకపోయేను—కమల ఇక్కడి కెలా వచ్చిందా అని...

కృష్ణ: నేనంటే దానికి ప్రాణం. (ఆ మాట అన్నందుకు సిగ్గుపడుతూ) అంటే, ఈ గుండెజబ్బుందని బెంగపెట్టుకుంది. నువ్విలా ధైర్యం కూడా ఇచ్చేవని చెప్తే నాకన్న అదే ముందు దారి తీస్తుందేమో అనిపిస్తుంది.

రామా: ఆ పనిమాత్రం చెయ్యబోకు. ఏమీ ఫరవాలేదన్నానని ఆవిడతో చెప్పు. నువ్వైనా మరి మనస్సులో ఏ ఆలోచనా ఉంచుకోకు. నిశ్చింతగా ఉండు. విశ్రాంతి తీసుకో అంతే... ఈ ఆరు వేలూ రేపు బదిలీ చేయిస్తాను.

కృష్ణ: తొందర్లేదు రామం—నీ మాటుంటే అదే చాలు.

రామా: మాట ఒక్కటే లాభంలేదు. ఇలా అయితే నీకు పూర్తిగా ధైర్యం ఉంటుంది—

[నౌకరు ప్రవేశం]

నౌకరు: తమని కల్సుకొనేందుకెవరో వచ్చేరు.

రామా: పేరు చెప్పలేదా?

నౌకరు: లేదు. తమని అర్జంటుగా చూడాలిట!

రామా: సరే—రమ్మను.

నౌకరు: చిత్తం.

[నౌకరు నిష్క్రమణం]

రామా: ఏదో కేసయి ఉంటుంది.

కృష్ణ: నీకు మరి సెలవంటూ ఏనాడూ ఉండదేమో!

రామా: ఉన్నా ఏంచెయ్యాలి?

కృష్ణ: సరే నేను వెళ్తున్నాను. రేపుసాయంత్రం నువ్వు మాఇంటికి 'టీ' కి తప్పకుండా రావాలి. క్రిందటివారం పనితొందర్లో రాలేకపోయేవ్. నువ్వు సరదాగా మాటాడతావని మా ఆవిడ అంటుంది.

రామా: తప్పకుండా వస్తాను. కాని ఒక్క మాట. ఈ జబ్బుసంగతి తెలియనివ్వకు ఇప్పుడప్పుడే...

కృష్ణ: ఏం?

రామా: తొందరలేదు మాటూ? ఈ జాగ్రత్త అదీ చూస్తే ఆవిడకి అనుమానం వెయ్యవచ్చు. నీవిషయంలో మాత్రం ఏ బెంగా ఆవిడ కుండకూడదు.

కృష్ణ: అలాగే కానీ... రేపుసాయంత్రం మరిచిపోకు. వెళ్తాను...

[కృష్ణమూర్తి గదిని వదుల్తాడు. రామారావు చేతులు వెనక్కి కట్టుకొని గదిలో పచారుచేస్తూ చేస్తూ అస్థిపంజరంముందు ఆగుతాడు — ఇంతలో ఏభైఏళ్ళ ఒకవ్యక్తి ప్రవేశం. మనిషి దృఢకాయుడు. పైకి దువ్విన క్రాపు. జుత్తు చాలాభాగం నెరసింది. కనుగుడ్లు, ఏనిమిషం పైకి తోసుకొస్తాయో అన్నట్టున్నాయి. చూపులలో నిశ్చయం, పట్టుదల, కొంత క్రూరత్వం ఇమిడి ఉన్నాయి. నొక్కినట్టున్న ముక్కు, దళసరి పెదవులు, మెలికలు తిరిగిన, పెద్ద

మీసాలు, మనిషి కట్టుకున్నది ఒక తెల్లటి లుంగీ, తెల్లటిలాల్చీ; ఒంటిమీద భుజంమీద టర్కీ తువ్వాలు ఎర్రఅంచులది. చేతికి లేబిలు కైంపీసును జ్ఞాపకం తెస్తూ వాచీ—)

వ్యక్తి: అస్థిపంజరాన్ని చూసి ఒక్క అడుగు వెనక్కి వేసి, సర్దుకొని బొంగురుగొంతుతో) రామారావుగారు మీరేనా?

రామా: (అటు తిరిగి వ్యక్తిని పరిశీలించిచూసి) బోర్డుచూసే ఉంటారు.

వ్యక్తి: చూసేన్లెండి—ఇంట్లో మీ రొక్కరే ఉంటారని ఎక్కడా లేదుగా...ఎందరెందరో ఉంటారు—అందులో రామారా వెవరో—క్షమించాలి, రామారావుగా రెవరో?

[సోఫా వేపు వెళ్తాడు కూర్చొనేందుకు]

రామా: కూర్చోండి—

వ్యక్తి: (కూర్చుంటూ) అదే అనుకుంటున్నాను—సరే... నేను మీకు కొంచం మోటుగా తోపించొచ్చు క్షమించాలి...

రామా: (కూర్చుంటూ) మీ రే పనిమీద వచ్చేరో తెల్సుకోవచ్చా?

వ్యక్తి: దాని కభ్యంతరం ఏముంది? అందుకే నేను రావడం. అయినా ఇది కొంచం రహస్యం లెండి.

రామా: నే నొక్కణ్ణే ఉన్నా నిక్కడ, ఫరవా లేదు.

వ్యక్తి: అలా అనకండి — మనిషికి మామూలు సంగతు లొకలాగ, రహస్యం ఒకలాగ చెప్పాలి... మనిషిలోపల, మనిషి, రాక్షసి ఇద్దరూ ఉంటారు రహస్యాలన్నీ రాక్షసి వినాలని నా ఉద్దేశం.

రామా: (చిరునవ్వుతో) మనిషిమీద మీ కెందుకు నమ్మకం లేదు?

వ్యక్తి: నాకు లేదు—రాక్షసి, అది విన్నసంగతి మరింకొకరికి తెలియనివ్వదు—తెలియకుండా చేస్తుంది పనులు—రహస్యాలన్నీ, రాక్షసి చెయ్యవల్సిన పనులే—

రామా: సరే—అదేమిటో చెప్పండి...

వ్యక్తి: నా పేరడగలేదు మీరు!

రామా: అడుగులేనే కాని మీరు చెప్పరా?

వ్యక్తి: అడక్కుండా చెప్తే, పొగుడు కుంటున్నా ననుకుంటారేమో అని.

రామా: సరే—మీ పేరు?

వ్యక్తి: మీకు తెల్సేఉంటుంది (నొక్కుతూ) సర్దార్ వెంకటప్రసాదశర్మ.

రామా: క్షమించాలి. నే నెప్పుడూ మీ పేరు వినలేదు.

సర్దార్: నన్ను తెల్సిన చాలామంది సర్దార్ అని పిలుస్తారు. మరికొందరు రౌడీ వెంకన్న అని అంటారు. అలా పిల్చేవాళ్లు మా గ్రామం వాళ్లు కారు లెండి. గిట్టనివాళ్లు పిలుస్తారలా.

రామా: (జ్ఞాపకం తెచ్చుకుంటున్నట్టు) సర్దా...ర్!

సర్దార్: తెలీకపోతే జ్ఞాపకం రాదులెండి. సర్దారన్న బిరుదు మా వూరివాళ్ళిచ్చేరు నాకు— (మీసాలు మెలివేస్తాడు)

రామా: అలాగా! మీ దేవూళ్లో...

సర్దార్: ఇక్కడికి పదిమైళ్ళదారి లెండి...పాటుదారి...విష్ణుపురం.

రామా: విష్ణుపురం, చిన్నప్పటినించీ వినడమే కాని ఎప్పుడూ వెళ్లలేదు. అక్కడున్న భూములన్నీ కొత్తపట్నం మొఖాసాదారువి కదూ?

సర్దార్: (పళ్ళుబిగించి) ఔను...

రామా: ఆయన పేరు మరిచిపోయేను—

సర్దార్: ఏం? ఆయన మీ కెరుకా?

రామా: ఎప్పుడో చిన్నప్పుడు...నాకు సరిగా జ్ఞాపకం లేదు...

సర్దార్: మీ తండ్రిగారిదగ్గరి కెప్పుడన్నా వచ్చిఉంటారు...

రామా: ఔనౌను...అదే చెప్తున్నాను...

సర్దార్: వర్షాకాలం...సాయంత్రం వేళ...

రామా: (జ్ఞాపకం తెచ్చుకుంటున్నట్టు) వర్షాకాలం....ఔను! వర్షం పడుతూఉంది...ఒక గుర్రబ్బగ్గీ వచ్చి ఆగింది...

సర్దార్: తరవాతేమిటయిందో జ్ఞాపకం ఉందా?

రామా: నేనప్పుడు ఏం జరిగిందీ చూడలేదు — వీధి గుమ్మంలో ఉండిపోయేను, గుర్రబ్బగ్గీని చూస్తూ- ఒక అరగంటయాక ఆయన తిరిగివచ్చేరు...ఆయన కోపంగా ఉన్నట్టు జ్ఞాపకం.

సర్దార్: ఎందుకో మీకు తెల్సునా?

రామా: తరవాత తెల్సింది. కొన్నాళ్ల తరవాత అతని భార్యకి చాలా సుస్తీగా ఉండేదట...అందుకని ఆయన మా నాన్నగారికోసమని వచ్చేరు.

సర్దార్ : మీ తండ్రిగారు వెళ్ళిఉండరు...

రామా: ఆయన పూజాసమయం అది. పూజ అయిపోయాక ఎంత రాత్రయినా, ఎంత దూరమైనా ఆయనకు వెళ్లేందుకు అభ్యంతరం ఉండేదికాదు... కాని ఉదయం రెండుగంటలు, సాయంత్రం రెండు గంటలు పూజ...ఆయన కదొక పట్టు... పూజలో కూర్చుంటే పీక పోయినా లేచేవారుకాదు...

సర్దార్: (ఆలోచనగా) పూజ!

రామా: ఒక్కొక్కరి కొక్కొక్క నమ్మకం—మనిషయాక—ఆయన రాకపోయేసరికి మొఖాసాదారుగారు కోపంతో వెళ్లిపోయేరు. ఇంకొక డాక్టర్ ఎవరో వెళ్లేరని విన్నాను...కాని ఆయన భార్య పోయింది—ఈయన వెళ్లకపోవడంవల్లనే అది జరిగిందని అతనంటాడు... నేనూ వినడమే...మా నాన్నగారిమీద ఆయన పగపట్టిఉండేవారని... ఆయనిప్పుడు లేరు. ఏ పగకైనా—

సర్దార్: మీ తండ్రిగారు లేకపోయినా మీ మీద పగ ఉండవచ్చు వాయనకి...

రామా: పగ, మనిషికీ మనిషికీ విరోధం అంటే నాకు నవ్వొస్తుంది...నా వృత్తిలో నాకు స్నేహితుడు, శత్రువు అని లేడు—ఉండకూడదు. ఈ వృత్తికి మనస్సు అలా దిట్టం చేసుకోవాలి...

సర్దా: ఆయనొచ్చి ఇప్పుడు మిమ్మల్ని పిలిస్తే వెళ్తారా?

రామా: నా వృత్తికి సంబంధించిన పనిమీద అయితే తప్పకుండా వెళ్తాను...వెళ్ళాలి...అది నా కర్తవ్యం...

సర్దా: అయితే మీరు ఏదన్నా కేసుమీద వెళ్లవలసివస్తే, కర్తవ్యం కనక వెళ్తారా...లేదా ఆ మనిషి పడే బాధని చూసి దయ కలిగి వెళ్తారా? మీ విషయంలో నే నిది అడుగుతున్నాను......మీ గురించి విన్నాను కాబట్టి—ఎప్పుడైనా ఎక్కడికన్నా, ఎవరైనా రోగంతో బాధపడుతూ, కబురు వస్తే వెళ్తారని విన్నా కాబట్టి.

రామా: అది నామట్టుకు నాకే తెలీదు...తెల్సుకోవడానికి ప్రయత్నించలేదు కూడా. ఈ వృత్తిలో నా కొకవిధమైన ఆసక్తి ఉంది—అందుకే ఇది ఎంచుకున్నాను. దయ, అన్నది నా కెప్పుడూ కలగలేదేమో అనుకుంటాను...కేవలం మరలా ఒక పని చేసుకపోయేదేమో......మర నడవడానికి 'పెట్రోలు' వాళ్ళు డబ్బురూపేణా ఇస్తారు...అంతే...

సర్దా: అలా నే మీ రంటారా?

రామా: దయ అన్నదే ఎప్పుడన్నా కలిగి పనులు నాచేత చేయిస్తే, నేనిలా ఉండకపోయే వాడినేమో. దయ అన్నది మనస్సుకి, ఆత్మకి సంబంధించినది. దయ, జాలి మనస్సులో ఉంచుకొని రోగిని చికిత్స చేస్తే ఫలితం సరిగ్గా ఉండదేమో...ఆత్మీయమైన జాలి కలుగుతుంది......అలా కలగడంవల్ల లాభం ఏమీ ఉండదు...ఆ అనుభూతి కలిగితే ఆ రోగాన్ని చూస్తే నాకే భయం వేసును....ఆ భయం ఎప్పుడైనే నాలో పుడుతుందో రోగాన్ని నా అదుపులో పెట్టుకోలేను.

సర్దా: అంటే?

రామా: ఒక పెద్ద హాస్పిటల్‌లో ఒక సర్జన్ సంగతి చెప్తాను వినండి. ఆయన పెద్ద స్పెషలిస్టు—తన కుమార్తెకే ఆపరేషన్ కండక్ట్ చెయ్యాల్సొచ్చింది. ఆపరేట్ చేసి గర్భంలోంచి శిశువుని తీసెయ్యాలి...అతనితోటి సర్జన్ అతన్ని ఆ పనికి పూనుకోవద్దన్నాడు. తను కండక్ట్ చేస్తానన్నాడు. కాని ఈయన ఒప్పుకోలేదు. ఏ ఫీలింగూ లేకుండా ఉండగలనన్న ధైర్యం ఆయనకుండేది.... కాని ఆపరేషన్ నడుస్తున్నప్పుడు... సగంలో...ఆ అమ్మాయికి తెలివి వచ్చేస్తుందేమో అని అనుమానం తట్టేం దతనికి. ఆతురత, భయం రెండూ వెంటనే కలిగిఉంటాయి. వెంటనే క్లోరోఫారంతీసి మరొకసారి, కొద్దిగా ఎక్కువ కాలం ఇచ్చేడు...దానితో ఆవిడ ప్రాణాలు పోయేయి... ఆ పెర్సనల్ ఫీలింగుంటే లాభంలేదు...జాలి పుట్టినప్పుడు అది ఒస్తుంది...

సర్దార్: మీరు పట్టిన కేసులలో మీరు చాలా వాటిలో నెగ్గుకొస్తున్నారనుకుంటాను...

రామా: ఎందు కడుగుతున్నారు...

సర్దార్: నా పనికీ దానికీ సంబంధం ఉంది కాబట్టి.

రామా: దేనికన్నా హామీ ఇవ్వలేం చూడండీ... నాకు సాధ్యమైనంతవరకు చేస్తాను...ఫలితం నేను చెప్పలేను...

సర్దార్: ...నే నడిగిన ప్రశ్నకి చెప్పండి...

రామా: (వింతగా చూసి) ఏం? అంత ఖండిస్తున్నారు?

సర్దార్: నాగొంతు అలానే ఉంటుందిలెండి...

రామా: మీగొంతులో మార్పు కనిపిస్తోంది...

సర్దార్: నేను చెప్పవల్సిన రహస్యం ఇంక చెప్పొచ్చు కాబట్టి.

రామా: నాలో రాక్షసుణ్ణి సంబోధిస్తున్నా రనుకోవాలా?

సర్దార్: ఎలా అనుకున్నా బాధలేదు. మీరనుకున్నా లేకపోయినా వాడు వినక మానడు. వాడు దాన్ని దాచుకుంటాడు...

రామా: సరే...అదేమిటో చెప్పండి...

సర్దార్: ముందు నా ప్రశ్నకి జవాబివ్వండి.

రామా: నూటికి తొంభై కేసులు నెగ్గుకొస్తున్నాను...

సర్దార్: నూటికీ తొంభైకీ పదేకదూ భేదం?

రామా: అది మీరు నన్నడగక్కర్లేదు.

సర్దార్: పది. అట్టే పెద్దభేదం కాదు...(గొంతు సవరించుకొని) సరే వినండి... కొత్తపట్నంలో కలరా ఉంది...

రామా: కలరా ఆ? ఉంటే ఉండొచ్చు. ఇది దాని ఋతువే మరి...ఆరోగ్యశాఖవాళ్లేమీ జాగ్రత్త తీసుకోలేదూ?

సర్దార్: ఊళ్ళో అందరిగురించీ నేను రాలేదు. వాళ్లెమైతే నాకేం...

రామా: మీకు సంబంధించినవారి కెవరి కన్నా...

సర్దార్: అది చెప్పేముందు నా సంగతి కొంచం చెప్పుకోవాలి...కొత్తపట్నం మొఖాసాదారని ఇప్పు డెవరినంటున్నారో ఆయన ఏమీకాదు...

రామా: ఆయన మొఖాసాదారు కారూ?

సర్దార్: ఆయన కొడుకు మొఖాసాదారు... తండ్రి కేవలం పార్వతీశమే.

రామా: ఔనౌను...పార్వతీశం...ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది పేరు...ఏం? పార్వతీశంగారు కారూ మొఖాసాదారు?

సర్దార్: కాదు...

రామా: ఏం? ఎలా?

సర్దార్...అదే చెప్పబోయేది...పార్వతీశం తమ్ముణ్ణే నేను...

రామా: నిజంగా!

సర్దార్: అబద్ధం అయితే బాగుణ్ణు...తగువే ఉండకపోను...

రామా: ఇప్పుడొచ్చిన తగువేమిటి?

సర్దార్...తగువేమీ లేదు. ఈ ఆస్థి పార్వతీశం ఆర్జించింది కాదు...మా తండ్రి ఆర్జించింది...మా తండ్రికి మేం ఇద్దరమే కొడుకులం...మా తాతనించి మా తండ్రికి వచ్చినది చాలా తక్కువ...కొంచం భూములు...వాటిలో నే నాకు సగం వాటా వచ్చింది...మాకు పెళ్లికాకముందునుంచీ మా తండ్రి, ముందటి మనుమడికి ఆస్థంతా రాసేస్తానని అంటూ ఉండే వాడు...మేం ఇద్దరం పెళ్ళిచేసుకున్నాం...మా అన్న అదృష్టం బాగుంది...కొడుకు పుట్టేడు...నాకుమాత్రం పుట్టింది ఒకకూతురు...మా తండ్రి స్వార్జితం ఆస్థి...ఎలా వడితే అలా రాసుకోవచ్చు...అనుకున్నంతా చేసి చచ్చేడు మా తండ్రి...ఆ మనుమడికి అంత ఆస్తీ వెళ్లింది...అంటే మా అన్నకి వెళ్లినట్టే లెఖ్ఖ...అది, నా దురదృష్టం అనుకోవాలో ఏమో నాకు తెలీదు...

రామా: అతని అదృష్టం అనుకోండి...

సర్దార్: ఆ వీలులో చిన్న కిటుకుంది...ఒక వేళ ఆ మనుమడు ఏ కారణంవల్లయినా పిల్లలు లేకుండాపోవటం తటస్థిస్తే, కొంతభాగం, అది చాలా తక్కువలెండి, ఆ మనుమడి భార్యకి పోను మిగిలిన దంతా మా ఇద్దరిమధ్యా పంపకం జరగాలి...

రామా: ఇప్పుడు మీ కింకేం లాభం...

సర్దార్: ఇప్పుడు అదృష్టం నావేపు తిరిగింది..

రామా: ఎలా ?

సర్దార్ : ఇక్కడే ఉంది నే చెప్పబోయే రహస్యం...మా తండ్రిపోయేక అట్టేకాలం నే నా ఇంట్లో ఉండలేదు...మా అన్నకి నాకూ పడలేదు...

రామా: అది ఊహించుకోవచ్చు...

సర్దార్: దేనికన్నా న్యాయం ఉంటుంది చూడండి. ఆ కుర్రాడికి క్షయ...

రామా: క్షయా ? అతని వయస్సెంత ఉంటుంది...

సర్దార్: ఇరవైతొమ్మిది సంవత్సరాలే లెండి..

రామా: ఊఁ.

సర్దార్: సరే వినండి... నేను చాలా మోటు మనిషిని. నన్ను రౌడీ అని పిలవటంలో అర్థం లేక పోలేదు. తల్చుకుంటే ఏదన్నా చెయ్యగలనను కోండి...బుద్ధి పుట్టినంతవరకే...

రామా: (వింతగా చూసి) అదంతా ఇప్పు డెందుకు? కలరా సంగతేదో చెప్పబోయేరు...

సర్దార్: అదికూడా అవసరం కనక నే...ఇంకో గంటలో మీ కర్పుపు మీ ఇంటికొస్తాడు...

రామా: శత్రువా !!

సర్దార్: అంటే మీ తండ్రిమీద పగపట్టిన పార్వతీశం, మొఖాసాదారు తండ్రి...

రామా: పార్వతీశంగారా? నా శత్రువా?

సర్దార్: తండ్రిమీది కోపం, కొడుకుమీద కూడా ఉండకపోదు...

రామా: కాని నేనలాటిది పట్టించుకోను... ఇందాక మీకు చెప్పేను...(ఊరుకొని) నా శత్రువు అవకపోతే మీ శత్రువు అవరాదూ?

సర్దార్: ఎందుకవకూడదూ? తప్పకుండా అవొచ్చు—అవండి...

రామా: (చిరాకుగా) నాకా అవసరంలేదు... మీరే అవండి...సరే...అయన వస్తే...

సర్దార్: (మీసం దువ్వుతూ, అలవాటు ప్రకారం) వచ్చి మిమ్మల్ని పిలుస్తాడు కొత్త పట్నం...

రామా: దేనికి?

సర్దార్: మీ తండ్రి కాలంలో భార్యకి సుస్తీ చేసింది...ఇప్పుడు కొడుక్కి...

రామా: అతని కొడుకా? మీ రన్న దయవల్ల కాని...

సర్దార్: కాదు. కలరా.

రామా: కలరా!!

సర్దార్: ఔను. ఊళ్ళో అక్కడక్కడుంది... వాటితో నాకు సంబంధం లేదు. కాని ఇది...(ఊరుకొని) ఇవాళే ఉదయం ఆరంభమయింది...ఆ సంగతి తెలిసి నేనా ఊరు వెళ్ళేను. ఆ ఇంటికి వెళ్ళలేదనుకోండి.

రామా: ఇవాళ ఉదయం...కలరా! ఆలోచించండి...ఎంత ప్రమాదమో......ఇప్పుడొస్తున్నారాయన డాక్టర్ కోసం...

సర్దార్: చాలాసేపు ఏదో అజీర్తి అనుకున్నట్టుంది...

రామా: నా కొకందుకు చాలా విచారంగా ఉంటుంది...ఈ పేషెంట్లని చూస్తూ ఉంటే... రోగం ఏదివున్నా బాగా ముదిరితేనే కాని బైటపడరు. అప్పుడు బాగుచెయ్యాలి...అటువంటి సందర్భంలో నెగ్గుకురావడం ఎంత కష్టం!

సర్దార్: మిమ్మల్ని డాక్టర్ గా ఎంచుకోడానికి తటపటాయిస్తున్నాడుదయంనించీ...మీరు తప్ప ఇంకెవరూ సరైన డాక్టరీ ఊళ్ళో...మీ తండ్రిమీద కోపం ..ఈ రెండింటి మధ్యా సందిగ్ధంలో పడ్డాడని విన్నాను...ఇష్టం లేకపోయినా తప్పదు...మీదగ్గరికే నిశ్చయంగా వస్తాడని నా నమ్మకం...

రామా: నేనే అని ఎందుకు? అటువంటివాళ్ళ కోసం ఈ ఊళ్ళో ఏ డాక్టరన్నా కష్టపడతాడు...

సర్దార్: వీళ్ళ పస అందరికీ తెల్సు...అతగాడు మీదగ్గరికి రావడం తప్పదు... నేనొక ప్రశ్న వేస్తాను చెప్పండి...

రామా: వెయ్యండి...

సర్దార్: ఇంత ఆఖరిదశలో, మీ రీ ఏడు మైళ్ళు వెళ్ళడంలో లాభం ఏముంది?

రామా: (విమర్శగా చూసి) లాభం ఉన్నా లేకపోయినా ప్రయత్నం చెయ్యడంలో ఏం నష్టం లేదనుకుంటాను...

సర్దార్: ప్రయత్నిస్తే ఏమన్నా ఆశ ఉందంటారా?

రామా: ఉండొచ్చు...

సర్దార్: మీరు వెళ్లడంలో నష్టంకూడా ఉండొచ్చునేమో...

రామా: మీ రలా అనుకుంటున్నారా? నామట్టుకేం నష్టం కనుపించలేదు...

సర్దార్: నష్టం ఉందంటాను...

రామా: (చిరాకుగా) మీకా?

సర్దార్: (కొంచెం తృళ్ళిపడి) మీకుకూడా...

రామా: (ఆశ్చర్యంగా) ఎలానో సెలవిస్తారా?

సర్దార్: (ఆలోచనగా లేచి) మీరు వెళ్లడం ఖాయం. మీ మాటలనిబట్టి తెలుస్తోంది ... కాని మీరే నెగ్గినట్టయితే మీకు నష్టం...

రామా: (లేచి) మీరు నన్ను...

సర్దార్: బెదిరించలేదు...మీకొక మంచి అవకాశం ఇస్తున్నాను...అది పోకుండా చూసుకోండి....

రామా: అదేమిటో! ఎందుకంతదయ నామీద?

సర్దార్: స్వలాభంఉంది కాబట్టి...(ఊరుకొని) మీరే ఇందులో నెగ్గుకు రాలేకపోతే,..అంటే నా మోటుమాటలో చెప్పాలంటే .... మీ పేషెంటు బ్రతక్కపోతే....

రామా: మీకు వంతొస్తుందికదూ వీలుప్రకారం?

సర్దార్: నిజం చెప్పేరు ... చూసేరా ఎంత లాభం ఉందో!

రామా: మీకు...

సర్దార్: మీకుకూడా...

రామా: ఒక్క అపజయంతప్ప నాకింకేదీ ఉండదు...

సర్దార్: పోయే పదింట్లో ఇదొకటవుతుంది... పదీ మీ రెలానూ మార్జిన్ ఇచ్చేసేరు... తొంభైకీ, నూటికీ అట్టే భేదం లేదని ఇందాక అన్నానుకదూ? మీ పేరుకేం దెబ్బరాదు.

రామా: అదే అయితే, మరి అలా అనుకొనే తృప్తిపడాలి.

సర్దార్: ఈసారి అలా కాదులెండి...పది మందిలోనూ ఇతనొక్కడైతే నాకు లక్ష రూపాయిల లాభం. అంతకు తక్కువలేదు.

రామా: (అనుమానంగా చూస్తూ) అదే అనుకున్నాను.

సర్దా: అందులోది మీకు పదివేలు.

రామా: పది వేలు!! నాకు!! (తేరుకొని) మీ మాటల్ని బట్టి అదే ఏదో అనుకున్నాన్లెండి...

సర్దా: కాని మీ రొకటాలోచించాలి... ఈ పదివేలూ నే నూరకనే ఇస్తున్నట్టు లెక్ఖే—అంటే చాలా తక్కువ సాయానికి వదులుకుంటున్నాను.

రామా: మొదట్నించీ మీ అభిప్రాయం నాకు తెలుస్తూనే ఉందిలెండి.

సర్దార్: మీరు పట్టిన వంద కేసులకీ, తొంభై వాటిలో మీ రెలా నెగ్గుకొస్తున్నారో...మీ రెలా హామీ ఇచ్చేరో...అలానే ఈ కేసులో తొంభై పాళ్లు నాకు నిబ్బరం...మీరు కాదు, బ్రహ్మ దిగి వచ్చినా సరే మీ పదిలోనూ ఇతనొకడౌతాడని.... మిగిలిన పది పాళ్లూ కూడా బకాయిఉండడం నా కిష్టం లేదు. ఇలాటి అవకాశం మరి రాదు కనక... ఆ పది పాళ్లు కూడా పూర్తిచెయ్యడానికి మీకు పది వేలు.

రామా: (ఆవేశం అణుచుకుంటూ) ఊఁ.

సర్దార్: కొంచెం అశ్రద్ధ—అది చాలు. నూటికి నూరుపాళ్లు నాకు నిబ్బరం...డబ్బు మీరు తిరిగి ఇంటికి వెళ్ళేటప్పుడు మీకు నే నిస్తాను రెండో కంటివాడికి తెలీకుండా. మీకు అపనమ్మకం అక్కర్లేదు. డబ్బు సిద్ధంగా ఉంది...నా దొకటే మాట—

రామా: అతను నా తొంభైలోనూ ఒకడైతే?

సర్దార్: అలా అవదు. తొంభై పాళ్లు నాకు నిబ్బరం. ఆ పదిపాళ్ళలోనూ అయితే అందుకు మీరు బాధ్యులు...

రామా: అలానే అనుకోండి...

సర్దార్: అలా కాదు. జరగదు. అందుకే మీలోని రాక్షసుడికి రహస్యం చెప్పేను. అతనలా చెయ్యడు...

రామా: నాలో అలాటి రాక్షసు డెవ్వడూ లేడు. ఉన్నా నాలోని మనిషిని జయించలేడు.

సర్దార్: పది వేలు ఆటంబాంబులాటిది వాడికి. (నవ్వుతాడు)

రామా: అది వాడికి అందకుండా చేస్తే?

సర్దార్: అందుకు మీరు ప్రయత్నం చెయ్యరనుకుంటాను...ఎలానూ వాడి చెవికి వెళ్ళింది కదా వార్త. అది కొంచెం నిబ్బరం. ఆలోచించండి. ఇందులో ఎవ్వరూ అనుమానించవల్సిన విషయం ఏమీ ఉండదు.

రామా: సరే—మీరు చెప్పవల్సిన విషయం అయిపోయింది కదూ? మీరు ఒక దమ్మిడీకూడా ఖర్చుపెట్టడం నా కిష్టం లేదు ..

సర్దార్: (కొంచెం సంతోషంతో) అంటే?

రామా: పదివేలు! చూడండి...అంత డబ్బు మీరు నష్టపోవడం నా కిష్టంలేదు...నా గురించి.

సర్దార్: ఏమీ పుచ్చుకోకుండా సాయపడతా నంటారా? రామారావుగారూ! అలా నా కిష్టంలేదు ...ఇంకా సంతోషం అయితే పోతేపోయింది మరో అయిదు వేలు మీ కిస్తాను...

రామా: ఎందుకు? ఏమీ వద్దు.

సర్దార్: నిజంగా!

రామా: నిజంగానే. తొంభైపాళ్లు నిబ్బరంతో మీరు గెలవరని నే నెలా చెప్పగలను? నాకుండేది? అందులోనూ ఉదయం మొదలైన కలరా...తొంభై కాదు—తొంభైతొమ్మిదిపాళ్లు మీరు నిబ్బరంతో ఉండొచ్చు...

సర్దార్: (సంతోషంతో) నిజంగా! ఏదీ... మీ చెయ్యి ఇలా ఇవ్వండి...

రామా: కాని ఆ మిగిలిన ఒక్క పాలూ నేను నాలో ఉన్నశక్తి, జ్ఞానం అంతా వినియోగించి ప్రయత్నిస్తాను...మీ తొంభైతొమ్మిదిపాళ్ళ నిబ్బరాన్ని నాశనం చెయ్యడానికి...

సర్దార్: (ఆశ్చర్యపోయి, నమ్మలేక) ఏమిటీ! ఏమిటీ!

రామా: నేను డాక్టర్ని—ఒక రోగాన్ని పోగొట్టడానికి చెయ్యవల్సిందంతా నేను చెయ్యాలి ...చేస్తాను—

సర్దార్: ఆలోచించే మీ రంటున్నారా ఈ మాట?

రామా: ఆలోచించడమనే అన్న ప్రశ్న లేదు... ఇలాటివి నే నాలోచించను...ఆ శక్తి నాకు లేదు...

సర్దార్: సరే. అయితే మీకు కలిగే నష్టం ఆలోచించేరా?

రామా: మీ ప్రకారం పదివేలు—

సర్దార్: అదేకాదు—మీరు తిరిగి ఇంటికి రాలేరు...

రామా: (కొద్దిసేపు ఊరుకొని) డబ్బివ్వకైతే చూపించేరో బెదిరింపుకూడా ఉంటుందని నాకు తెలుసు...

సర్దార్: ఇది ఉత్త బెదిరింపు కాదు. జరుగుతుంది. నా సంగతి మీకింకా తెలీదు...

రామా: సర్దార్ గారూ!..మీ ధైర్యం ఏపాటో నాకు తెల్సు-మీ రేపాటి అపకారం చెయ్యగలరో నాకు తెల్సు—

సర్దార్: చెయ్యలేననుకుంటున్నారు. ఏమిటి మీ ధైర్యం?

రామా: నేను మీతో చెప్పను—కాని మీ ధైర్యం తెలుసు—మీరింక వెళ్ళండి—

సర్దార్: అయితే కాసుకోండి—మీరింకా వయస్సులో చిన్నవారు—పెళ్ళికూడా కాలేదు—

రామా: అది మంచిదేకదూ కాచుకోడానికి— ఎవ్వరూ ఏడిచేవారుకూడా లేరు—

సర్దార్: ప్రాణం అంటే అంత చులకనగా చూస్తారా? సరే - నేను వెళ్తున్నాను—మీగురించి విచారంగా ఉంది ..పోలీసుల్ని తెస్తారేమో - అదేం లాభం లేదు - ఎక్కడా ఋజువులేకుండా అంతా అయిపోతుంది - నా సంగతి మీకింకా తెలీదు...

రామా: సరే తెల్సుకుంటాను - వెళ్ళండి!

సర్దార్: ఆలోచించి మనస్సు మార్చుకున్నట్టయితే - అంటే నే ననుకున్నదే అయితే మీకు బాధ లేదు—

రామా: నేను ఆలోచించేను—

సర్దార్: వెళ్తున్నాను- కాని ఇది తెల్సుకోండి- అతను బ్రతుకితే మీరు తిరిగిరారు - అతను పోయినా అది మీ ఇష్టానికి వ్యతిరేకంగా జరిగినట్టే లెక్క - అప్పుడు మీకు కలిగే నష్టం ఒక్క పదివేలే—

రామా: మళ్ళా నన్ను ఆశపెట్టి లొంగతీద్దాం అనుకుంటున్నారు - లాభం లేదు - వెళ్ళండి—

[సర్దార్ ఇంకా నిల్చుంటాడు]

నే నాలోచించటం లేదు!

సర్దార్: (కోపంగా) అయితే కాసుకోండి!!

[గది వదుల్తాడు సర్దార్ - రామారావు వెళ్ళి అస్థిపంజరం ముందు నిల్చుంటాడు దానివి చూస్తూ - అలా దానిముందు రెండుమూడు నిమిషాలు నిల్చుంటాడు - అతి వేగో ఆవేశం పొందుతున్నట్టు అతని ముఖం శేఖరిందుతుంది ఆఖరికి ఒక నిట్టూర్పువదిలి, వెళ్ళి సోఫాలో కూర్చుంటాడు, ఆలోచిస్తూ].

[తెర]

[సశేషము]

❋ పెద్దన: మనుచరిత్ర ❋

శ్రీ నిడుదవోలు వేంకటరావు

అల్లసానివారి కీర్తి కృష్ణరాయలవారి కీర్తితో అల్లిక జిగిబిగియైనది.

విజయనగర రాస్థానమున కృష్ణరాయల కాలమున వెలసిన కృతులలో రాయలు స్వయముగా వర్ణించి యంకితముగొన్న దొక్క మనుచరిత్ర మాత్రమే.

మనుచరిత్రతోపాటు హరికథాసారమను, వేరొక కృతిని లాక్షణికు లుదాహరించినారు—పాతిపు వెంకటరమణకవి లక్షణశిరోమణి[1] యను లక్షణగ్రంథములో పెద్దన సత్యావధూపరిణయములోనిదని యీ క్రిందిపద్యము నుదాహరించి యున్నాడు:

కనువిందై యభిషిక్తుఁడైన విభు నా
జ్ఞం గొల్వులో సీత యి
చ్చిన ముక్తామణిహార మెవ్వడు ధరిం
చెన్ మేరు కూటంబుఁ జు
ట్టిన మిన్నేఅనఁగా మెడంబెడగుఁ బు
ట్టింపంగ నయ్యాంజనే
యు నజేయున్ కరుణావిధేయు నిరపా
యుం గొల్తు వాంఛారతిన్.

'ప్రపంచ దర్పణము' అను సంస్కృత సంకలన గ్రంథమున 'అల్లసాని పెద్దనార్యేణ విరచిత సత్యావధూపరిణయే' అని యుదాహృతమైనది. ఇది రాయలవారి సంస్కృత కృతులలో నొకటిగదా. వారి సంస్కృత సకల కథాసార సంగ్రహము ననుసరించి యొలకూచి రామభద్రకవి సకల కథాసార సంగ్రహము తెనుగున రచించెను. అట్లే పెద్దనయు సత్యావధూప్రీణనము ననుసరించి యీ కృతిని రచించి యుండవచ్చును. రాయలవారిది ప్రీణనము పెద్దనది పరిణయము. సత్యావధూ ప్రీణనమునకు తెనుగు పారిజాతాపహరణమున్నది గదా. రాయలవారు రచించిన కృతులకు ఆస్థాన కవులు రచించిన కృతులకు గల నాంతరంగిక సంబంధ మింకను పరిశోధింపదగియున్నది.

మనుచరిత్రప్రశంస, ప్రశస్తి చాటువులలో కూడ కెక్కినది. వెలుగోటివారి చాటువులలో క్రీ. శ. 1600 ప్రాంతముల విలసిల్లిన మహారాజుకు యాదమనాయని గూర్చి చెప్పిన చాటువులు గలవు. వానిలో నొకదానియం దిట్లు గలదు:

సీ. ధర నేలు నీ ప్రభుత్వము యయాతి చరిత్ర
వరకీర్తి రాజశేఖర చరిత్ర
వెలయు నీ శౌర్యంబు విక్రమార్క చరిత్ర
ఘనమైన నీతి యా మనుచరిత్ర
రూఢి నీ హరిభక్తి రుక్మాంగద చరిత్ర
పొనగు నీ విలయంబు వసుచరిత్ర
నిత్యంబు నీ బుద్ధి సత్యధర్మ చరిత్ర
చెలగు నీ రూపంబు నలచరిత్ర

గీ. ఇన్ని చరితలు నీయందె యున్నవిపుడు
వసుధ నీ భాగ్యమెన్న నెవ్వారితరము
పద్మనాయక వంశాబ్ధి భవ్యసోమ
రంగ ఘన యాచధీర విక్రమవిహార.

పై కృతులన్నియు తెనుగు ప్రబంధములే—సత్యధర్మచరిత్ర అనగా హరిశ్చంద్ర చరిత్ర—ఇందు పేర్కొనబడినవన్నియు క్రీ. శ. 1600 ప్రాంతమునకు ముందుగా రచితములు.

మనుచరిత్ర రచనమువలన పెద్దన కవిత్రయము వారితో నుద్దియైనాడని వస్నెలకంటి వేంకటపతి యిట్లు చెప్పినాడు—

---

1. ఈ గ్రంథ మముద్రితము—ఇది యొక విపులమైన లక్షణగ్రంథము. క్రీ. శ. 17 వ శతాబ్దినాటిది; మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమున, ఆంధ్ర సాహిత్య పరిషత్తులో దీని ప్రతులు గలవు.

ఇద్దరు జోడు నన్నకవి
యెఱ్ఱన, తిక్కన సోమయాజి దా
నుద్దగువారికిన్, ముగురి
కొక్కఁడె దీటగు నల్లసాని మా
పెద్దన, వారితోడు తమ
పేరు వహించిన శ్రీ కణాదమున్
బెద్దన సోమయాజి నిముఁ
బెద్దనఁబోలుఁ గవిత్వసంపదన్.

మనుచరిత్ర, వసుచరిత్ర, రాఘవ పాండవీయము, శృంగారనైషధము, ఆముక్తమాల్యద అను నాంధ్ర పంచకావ్యములలో మొదటిది మనుచరిత్ర. ఒకించుక భాషా పాండిత్యమున్న చదివి యానందింప దగినది. వసుచరిత్ర చదివి యానందించుటకు భాషా పాండిత్యమే గాక శాస్త్రీయసంప్రదాయ పరిజ్ఞానము చాలగా నవసరము. మనువు గట్టె పడినగదా వసువుపై భ్రాంతి. మనువు వసువు గట్టె పడినవెనుక, రామా! కృష్ణా! యని రాఘవ పాండవీయమును బఠించి, కలి విధ్వంసకమగు నైషధ దివ్యదమృతమును సేవించి యాముక్తమాల్యము ధరించుటకు నాంధ్ర సాహిత్య స్నాతకుఁడర్హుడగును—ఆంధ్ర సాహిత్య సౌధమునకు మొదటి సోపానము మనుచరిత్ర.

మనుచరిత్రకు తొలుత టీక లేదు—ఆవశ్యకతయు లేదు. భాషోద్ధారకులు బ్రౌనుదొరవారు 1832 లో ఆస్థానమల్లినాథుడైన అప్పయపంతుల వారిచే టీకాతాత్పర్యము వ్రాయించినారు. ఈ టీకతో నిది క్రీ. శ. 1851 లో ముద్రితమైనది. మనుచరిత్ర మొదటిముద్రణ భాగ్యమందినది యీ వత్సరమునందే. పాండిత్యము వ్యుత్పత్తి, శబ్దార్థపరిజ్ఞానము వలనగాని కలుగదు. బ్రౌనుదొరవారీ మనుచరిత్రకు 1839 లో నొక శబ్దసూచినికూడ వ్రాయించినారు. కాని పాశ్చాత్యవిమర్శనపద్ధతుల పరిపాటియే ప్రధానముగా నున్న నేడు, ఆ శబ్దసూచి మొగమైన జూచువారు లేరు. ఈ తరువాతి ముద్రణములందైననది చేర్చబడలేదు.

సాహిత్య విమర్శనకు శబ్దార్థపరిజ్ఞానము సునిశిత పరిశీలనము, అత్యంతావశ్యకములు. దానికి సాధుపాఠ సంస్కరణముతో కూడిన గ్రంథ మాధారము. ఈ యభిప్రాయముతోనే, కీర్తిశేషులు ప్రభాకర శాస్త్రిగారు బహుళ ప్రామాణ్యముగల మనుచరిత్రమున పెక్కు ప్రశస్త పాఠములను వెల్లడించినారు. ఆనందముద్రణాలయమువారి ప్రతిలో వీనిని గావచ్చును. మఱియు నీ పరిశోధనల మూలమున వెలుగబడిన నూతనవిషయములను తత్పరిశీలకులగు శ్రీయుత బులుసు వేంకట రమణయ్యగారందు వెలకొల్పినారు. అయినను కవిచరిత్రయందును వ్యాఖ్యానమునందును చేర్పదగిన యంశములు కొన్నింటిని తెలుపుచున్నాను.

పెద్దన మాలికా కవిత్వరచన :

ప్రబంధరచనకు మార్గదర్శకులు కాకపోయినను పెద్దనగారు మాలికా కవిత్వరచనకు మార్గదర్శకులు.

"పూతమెఱుంగులున్ పసరు
పూప బెడంగులు...సారెసారెకున్"

కుఱంగలింపగా ముప్పది చరణములుగల యుత్పలమాలికను రాయలవారి యాస్థానములో, అష్టదిగ్గజముల సమక్షమున నీ రచనకు పెద్దనగారు శ్రీకారము చుట్టినారు. నాలుగు పాదముల పరిమితిగల సమవృత్తములు చంపకోత్పలములు, శార్దూల మత్తేభములు మొదలగు వృత్తములు, ఆ పరిమితిని మించరాదని లాక్షణిక మతము.

అట్లు మీరి వృత్తరచన యసంఖ్యాకముగా సాగించినవదిమాత్రాచ్ఛందస్సంఘటితములైన, ద్విపద, రగడ మున్నగువానివలె, ఏకధారగానుండి చదువరులకు విసువు గలిగించి, కావ్యోపయోగికములు కాజాలవు. ఈ యుద్దేశముచేతనే అనంతుడు ఛందోదర్పణమున ఇట్టి వృత్తములలో నొక్క పాదము మాత్రమే హెచ్చుగా వాడవచ్చుననియు చెప్పి, దానికి 'పంచపాది' అని పేరు పెట్టినాడు. అది యుత్పలమాలయే.

పెద్దనగా రా నియమమును వీడి, సంస్కృతాంధ్ర సమపదప్రాశముగా నీ మాలికను రచించినారు. దీనికి సింహావలోకనోత్పలమాలిక అని పేరు. అనగా చివర పదములు సారెసారెకున్ అను వానితో మొదలిడిన, సారెసారెకున్, పూతమెఱుంగులున్ పసరు పూప బెడంగులు జూపునట్టి నాకైతలు, అను సమన్వయము కుదురుచున్నది. నూతనముగా నిట్టి పథకమును త్రొక్కినందుకు, రాయలవారు పెద్దనకు కవిగండపెండేరము నొసంగుట సమంజసమే.

ఆ సభలోనే పెద్దన వెనుక భట్టుమూర్తియు మఱియొక మాలికను చెప్పియున్నాడు. ఇదియు నుత్పలమాలయే.

పెద్దనగారి వెనుక నీ మాలికాకవిత్వరచన వ్యాప్తమైనది. మహాలాక్షణికుఁడగు గణపవరపు వేంకటకవి 'పెద్దశిగిరి విజయము'1 అను పేర, నాలుగు మాలికలను రచియించియున్నారు. తూర్పుమాలిక, దక్షిణపుమాలిక, పడమటి మాలిక, ఉత్తరమాలిక అని వాని పేళ్లు. ఏకోజీరాజు తంజాపురముపై క్రీ. శ. 1674 లో దండెత్తివచ్చి, పెద్దశిగిరిచే పరాజితుఁడైన వృత్తాంతమిందు వర్ణితమైనది. ఇందు 414 ఉత్పలమాలికా చరణములు గలవు. ఈతఁడే 'ఆంధ్రకౌముది'2 అను పేర నేయి చరణములుఁగల సీసమాలిక రచియించియున్నాఁడు. అదియు ముద్రితమైనది.

దక్షిణాంధ్ర వాఙ్మయమున నీ మాలికారచన ప్రవేశపెట్టినది విజయరాఘవనాయకుడు. ప్రహ్లాదచరిత్ర యక్షగానమున మొదట నొక సీసమాలికలో నాతడు రచించిన గ్రంథములను చెప్పియున్నాడు.

పుదుక్కోటలో నుదురుపాటి వెంకనకవి అతని మనుమడు సాంబశివకవి, 'తోండమాన్ వంశావళి'3 అను పేర సీసమాలికలను రచియించియున్నారు. అవి రెండును కలిసి 500 చరణము లున్నవి. ఇవి రెండును ముద్రితములు.

ప్రాచ్యలిఖిత పుస్తకశాలలో 'వికచోత్పలమాల' అనునొక యుత్పలమాలికారచన గలదు. అది యంతయు 'రా'కార ప్రాసము.

శ్రీ రమణీమణీ కుచకు
శేశయ కోశల సత్పటీర కా
శ్మీర నిశా కురంగమద
మిశ్రిత కుంకుమసాంద్ర చంద్రసీ
హారపయోఘుమంఘుమ ఘు
మాయితవక్షు, సుధాబ్ధికుందమం
దారతుషార పారద సు
ధాకరహారశతార తారడిం
డీరశరద్బలాహకప
టీరసితాంబుజ తారహారగో
క్షీరసురాపగావిమల
కీర్తివళక్షు, విదూరకంసచాణూర...

అని మొదలిడి యించుమించుగ 1930 చరణములలో

“............మౌని
శేఖరుఁడైన ప్రచేతసాత్మజుం
డారసిమార్చినట్టి యతి
హానము సంకుచితంబుగాఁగఁ దా
నేరిచినట్లు శ్రీహరిని
నెమ్మనమందుఁ దలంచి మ్రొక్కి మం
దారమరందగుంభిత సు
ధామయశబ్దవిచిత్రచాటు వా
గ్ధోరణివీఁగ వత్సముని
గోత్రలలాముఁడు గొడ్లవర్తి వి
స్తారకులాబ్ధిపూర్ణ హిమ
ధాముఁడు........................
....
వేంకనమంత్రి చంద్రుఁ డిం
పార రచించినట్టివిక
చోత్పలమాల....

ఈ గొడ్లవర్తి వెంకనమంత్రి కవిచరిత్రమున కేవలు కపరిచితుఁడు.

కడచినశతాబ్దిలో సుద్దండకవిపండితుఁడు శిష్టు కృష్ణమూర్తిశాస్త్రి పెద్దనగారొక్కటి సంస్కృతాంధ్రములలోనె చెప్పగా, నట్టిమాలికలను రెండింటిని చెప్పిరి. ఒకమాలికలో విశేషమేమనగా నందు సగము తెలుగు సంస్కృతపదములు, సగము అరబ్బీ ఫారసీ మొదలగు నన్యదేశ్యములు.

మాలికాకవిత్వమునకు పితామహుఁడనదగిన మహావ్యక్తి మండపాక పార్వతీశ్వరశాస్త్రిగారు. వీరు 1883.1897 ప్రాంతముల విలసిల్లిరి. అసమాన ధారాధోరణితో రసము చిప్పిలు నట్లుగా నే వృత్తిములో

---

1. ఈ గ్రంథమంతయు పూర్తిగా ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారము బులెటన్ 5 వ సంపుటము. 2 సంచికలో 47 - 63 పుటలలో ముద్రితమైనది.

2. ఆంధ్రసాహిత్య పరిషత్తు-కాకినాడ.

3. ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక - 2 సంపుటము 6 సంపుటము.

శెట్టిప్రాసతోనైన మాలికలు రచించు సామర్థ్యము గలవారు. వీరి మాలికారచనలు కొన్ని గ్రంథరూపమున నున్నవి.

త్రిపదేంద్ర గురుచరిత్ర—ఇది బిందుపూర్వక దకారప్రాసముతో చెప్పబడిన 500 చరణములు గల యుత్పలమాల.

ఉపవ్యాస విలాసభూషణము—ద్విత్వవకార ప్రాసముతో చెప్పబడిన 240 చరణములు గల యుత్పలమాల.

ఇంకను 'కుదురుగఁ దాచికీవ' అను పాదముతో మొదలిడి, అయిదక్షరముల ప్రాసతో నొక మాలికను, 'ప్రిన్సుఫ్ వేల్సు' అను పదములతో ప్రారంభించి మఱియొక మాలికను, మఱియు నెన్నెన్నో అద్భుతరచనములను గావించినారు.

పెద్దన ప్రారంభించిన మాలికాకవిత్వరచన విశేషవ్యాప్తిలోనికి దెచ్చినవారగుటచేత, వీరికి 'అభినవాంధ్ర కవితా పితామహ' అను బిరుదము లభ్యమై సార్థకత చెందినది. వీరి రచనములు పూర్వము నెల్లూరిలో వెలసిల్లిన అముద్రితగ్రంథ చింతామణి పత్రికలో ప్రకటితములైనవి.

కీర్తిశేషులు, వసురాయకవి, భోగరాజు నారాయణమూర్తి శెట్టి లక్ష్మీనరసింహము, ఉమర్ ఆలీషా మున్నగు వర్తమాన కవిశేఖరులు మాలికారచనమున నెన్నిక గన్నవారు. ఇంకను మఱికొందరు గలరు. వారిని పేర్కొనుట కిట తావులేదు.

ఖండకావ్యరచన లఖండముగా సాగుచున్న యీ కాలమున మాలికారచన మూలబడినదన్న యాశ్చర్యమేమున్నది.

మనుచరిత్రయందు ప్రయుక్తములైన కొన్ని పదములను వాని యర్థవిశేషములను కొంతపరిశీలింతము.

1. హింగుళా:

"కేదారేశు భజించితిన్ శిరము నన్ గీలించితిన్ హింగుళా పాదాంభోరుహముల్."

1-71

హింగుళా క్షేత్రము ఏబది రెండు శక్తిపీఠములలో నొకటి. ఇది బెలూచిస్థానములో నున్నది. దీనిని గూర్చి నందలాలు డేగారి ప్రాచీన హైందవభూగోళ నిఘంటువునం దిట్లున్నది.

Hingula - Hinglaj situated at the range of mountains in Baluchistan called by the name of Hingula about a day's journey from the sea coast. The Aghor or Hingula river passes by its side. It is one of the 52 Pithas or places celebrated as the spots on which the disserved limbs of Sati are scattered. (Page 28. Geographical Dictionary of Ancient & Medival India—Nandalal Dey.)

ప్రాచీన హైందవ భూగోళమును వ్రాసిన కన్నింగహామ్ గారు దీని యునికి నిట్లు తెలిపియున్నారు.

Hingulaj—Hingula Devi one of the 52 Pitha Stanas sacrad to the devotees of Godess Kali nine, days journey from Patha by Karanjee and about nine miles from the sea-shore. (Cunningham's ancient Geography of India. Page 696)

2. ఇనుప కచ్చడము:

"ఇనుప కచ్చడల్ గట్టుకొను ముని ప్రముచ్చులెల్ల తామరస నేత్రలిండ్ల బందాలుగారె"

2-73

మనుచరిత్ర వ్యాఖ్యానములలో గాని నిఘంటువులలో గాని దీని యర్థవివరణములు లేవు. ఈ 'ఇనుప కచ్చడము' అను ప్రయోగము పెద్దనకన్న ముందు జక్కన విక్రమార్క చరిత్రలో వాడియున్నాడు.

'జమిలి మొలత్రాట నినుపకచ్చడము మర్చి' 2 92.

పెద్దన వెనుక తెనాలి రామకృష్ణ కవి పాండురంగ మాహాత్మ్యములో (4-278) 'విషయాంకురము గిల్లి చేయుని వారికి నినుపకచ్చడమున కెంతవువ్వ' అని వాడియున్నాడు.

బ్రౌనుదొరవారు మనుచరిత్ర ప్రయోగమునకు: 'గోచీ'—ఇనుపకచ్చడాలు కట్టినవాడు; *He was rigorously Chaste—Manu* 1182 అని వ్రాసి

యున్నారు. శబ్దరత్నాకరమున నీ ప్రయోగమున కట్లే 'కౌపీనము' అని వ్రాయబడినది. సూర్యరాయాంధ్ర నిఘంటువున నిట్లే కౌపీనము - గోచి - అని కచ్చడము శబ్దమునొద్ద వ్రాయబడియున్నది. 2 సం. 28 పుట.

కాని పై ప్రయోగములన్నింటియందును, నిది ఇనుపకచ్చడము అని అజాది పదములలో చేర్చబడక, కచ్చడము శబ్దమున చూపబడి యున్నది.

పై విక్రమార్క చరిత్ర ప్రయోగమువలన నిది సర్వసాధారణముగా ధరించు కౌపీనమును గాక దానికి సంబంధించిన మఱియొక వస్తువునుకూడ మనకు స్ఫురింపజేయుచున్నది. ఒకడు 'గోచి పెట్టుకున్నాడు' అనగా "మొలత్రాటితో గోచీ పెట్టుకొన్నాడు" అని చెప్ప నగత్యము లేదు. మొలత్రాడు గోచీ రెండును అవినాభావసంబంధము గలవి. కాబట్టి 'మొలత్రాట నినుపకచ్చడ మమర్చినవాడనగా' నిచట గోచీ గాక వేఱొక వస్తువునుగూడ ధరించినవాడని యర్థము చేయక తప్పదు. అది యినుములో చేయబడినదని యినుప అను విశేషణము తెలుపుచున్నది. అది మొలత్రాటితో నమర్పబడియుండుటచేత మొలచుట్టు తిరిగివచ్చు స్వరూపముగలదై యుండవలెను. అది యినుముతో చేసిన నొకవిధమగు సన్నబద్దె.

యోగాభ్యాసకాలమున, యోగులు ఆసన స్థైర్యముకొఱకు ఒక యినుపబద్దెను మొలత్రాటచేర్చి ధరించెదరు. ఉయ్యాలికాసనమున నిట్టి బద్దె యొకటి యున్నట్లుగా ఆమంచర్ల గోపాలరావుగారి వ్యాసమున (భారతిసం. 26. సం 4 పుట) 277లో కానవగును.

ఇనుపకచ్చడమునకు పర్యాయపదము ఇనుపమొల. ప్రౌఢకవి మల్లన రుక్మాంగద చరిత్రలో నీ ప్రయోగము కలదు.

అరపైకంబును జేయని
హరివాసరమునకునై నిజాత్మజు దునుమన్
గరవాలు చేతఁ బూనిన
కరణి, యినుపమొలకు మేడ గాల్చుట జుమ్మీ.

(5-143)

ఇది ప్రత్యేకముగా నా యినుపబద్దెలను తయారు చేయుచుండెడివారని తెలుపుచున్నది. ఇనుమును నిప్పుతో కాల్చినగాని పాగదు-ఇనుపబద్దె చేయుటకు తగుమాత్రము నిప్పున్న చాలును. కాని విశేషముగా నవసరము లేదు. పై ప్రయోగములో నా విషయమే చెప్పబడినది—ఏమాత్రమును విలువలేని హరివాసరముకొఱకు (ఇవి మోహిని మాటలు) కన్న కుమారుని జంపుటకై కత్తి యెత్తుట, యినుపకచ్చడము చేయుటకు నొక పెద్దమేడ కాల్చునంతటి నిప్పు నుపయోగించుట వంటిది—అని దాని తాత్పర్యము.

వరాహగిరి యిచ్చట సరిగానే చెప్పినది—జితేంద్రియత్వమునకై, యోగసాధన చేయుటకు నినుపకచ్చడముచే బంధనము గావించుకొను మునులు తామరసనేత్ర లిండ్లలో బంధితు లగుచునే యున్నారు."

కాగా ఇనుపకచ్చడమనగా యోగులు ధరించెడి యినుపబద్దెయని పెద్దనగారిచ్చట నొక యపూర్వమైన యోగ సంప్రదాయ విషయమును తెలిపిరనియు గ్రహింపనగును.

3 నక్కకొమ్ము:

"ఒక్క యెఱుకుఁ దేఁడు నక్కకొమ్మును
నిత్తి గోరజంబు జున్ను చాలపవ్వ కాను
కిచ్చి—" (4-14.)

సూర్యరాయాంధ్రనిఘంటువున 4 సంపు. పుట 510 లో నక్క + కొమ్ము. ఒకవిధమైన వనమూలిక యని వ్రాయబడి పై యుదాహరణమే చూపబడి యున్నది. ఈ సంపుటి ప్రకటనకుముందే - శ్రీ. శే. కళాప్రపూర్ణ చిలుకూరి నారాయణరావుగారు. త్రిలిఙ్గ రజతోత్సవసంపుటమున మనుచరిత్ర యను వ్యాసమున నీశబ్దమునుగూర్చి చర్చించియున్నారు. వారు దీనిని పసుపుకొమ్ము మొదలగువానిజాతిలోనిదని భావించియున్నారు. నక్కకొమ్ము—అనగా పులిగోరు అని అర్థము. ఇచ్చట నక్క అనగా జంబుకము అను నర్థము కాదు. నక్క అనగా పులి లేక చిఱుతపులి అని అర్థము. ఈ అర్థములో నీపద మిప్పటికిని రాయల

సీమలో వాడుకలోనున్నట్టు తెలియుచున్నది. చిఱుతపులికి చాలుటంపవు. పులిని జూచి నక్క వాత పెట్టుకున్నది అన్న సామెతలో నక్క, అనగా మామూలు నక్క కాదు - చిఱుతపులి యనియే అర్థము. ఏక జాతిలో చేరినవే కాన స్పర్థచేత చిఱుతపులి చాలుకోటకు ప్రయత్నించినది. తెలుగులో నక్కతోక కసవు అనుదానికి సంస్కృత నామము సింహపుచ్ఛి. పులి, సింహము మొదలైనవి యొకే జాతిలోని జంతువులుగదా. కొమ్మ ఆకారమునుబట్టి 'గోరు' అను అర్థమును సమంజసమే యగుచున్నది.

4. లాలాటికము:...

పాటన సేయుమిం గురులు పైఁబడి శీర్ణ
పటీరపంక లాలాటికమై—3-53

ఇచ్చట లలాటిక శబ్దమునకు బదులు లాలాటిక శబ్దము ప్రయుక్తమైనది. లాలాటిక శబ్దము పుంలింగము, ప్రభువుయొక్క అభిప్రాయమును తెలుసుకొనువాడు, కార్యమునందు జేర్పు చాలనివాడు అని దీని యర్థములు. పెద్దన యీ శబ్దము లలాటము అను నర్థమున వాడినాడు.

5. గ్రహయాళు:

'అద్రిగ్రహయాళు భల్లుకము'—4.38

సంస్కృతమున - గృహయాళు శబ్దమే గాని గ్రహయాళు శబ్దము లేదు.

"స్పృహయాళుః, గృహయాళుః, పతయాళుః" అని కౌముదిలో గలదు.

పై పద్యమున 'గృహయాళు' అనినచో పూర్వాపరము గుదురు కొజాలదు—

పెద్దన యీ శబ్దము శ్రీనాథునినుండి గ్రహించినాడు.

"ఆమోదగ్రహయాళువుల్ బొలసె
దాక్షారామ మధ్యంబునన్."

—భీమఖండము.(5.91)

మనుచరిత్ర వ్యాఖ్యానమున నూతనముగా నిట్టి విశేషాలు చూపి పెద్దనగారి ప్రతిభ పెంపొందింప జేయవలసియున్నది.

కలగూరగంప

విజయవిలాస వ్యాఖ్య

శ్రీ గర్భం అప్పారావు

చేమకూర వేంకటకవి ప్రణీతంబయిన 'విజయవిలాసము'నకు బహుప్రచారముకలదు. కాని దానికి సరియైన వ్యాఖ్యానమెవరు రచింపలేదు. ఒక వ్యాసములో కీ॥ శే॥ చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు దీనిని ఆంధ్రపంచకావ్యములలో • చేర్చని వసుచరిత్రాది ప్రబంధములు వాల్గింటికి వ్యాఖ్యానములు గలవు కాని విజయవిలాస ప్రాశస్త్యమును వివరించెడి వ్యాఖ్యానము లేకపోవుట శోచనీయమని వ్రాసిరి. నిజమే. శ్రీనాథరాగారి కాలములో జూలూరు అప్పయ్య పండితులు దీనికిని సారంగధరచరిత్రకును టీకలు వ్రాసినట్టున్నది. శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు తమ సారంగధరచరిత్ర వ్యాఖ్యానమున 'పూర్వటీక' నొకదానిని పేర్కొనిరి. అదియే జూలూరి వారిది కావచ్చును. వేదము వేంకటరాయశాస్త్రిగారు ఒక లఘుటీకను వ్రాసిరి. దానిలోని లోపములను అప్పుడపుడు శ్రీ తాపీ ధర్మారావుగారు తెలుపుచుండిరి. శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు సారంగధర టీకలోని లోపములను పూర్తిగా విమర్శించిరి: నిజముగా వ్యాఖ్యాత చక్రవర్తియగు శాస్త్రిగారి టీకలో చాలా లోపములున్నవి. ఇందుకు కారణము శాస్త్రిగారు దానిని స్వంతముగా వ్రాయక తాము విన్నదియు కన్నదియు వ్రాయించి యేకో సవరించి నట్టి దయుండవచ్చును.

ఇటీవల శ్రీ బులుసు వెంకటరమణయ్యగారిచే రచింపబడిన 'విజయవిలాస వ్యాఖ్యానము' ఒకటి చూచితిని. ఇది వేంకటరాయశాస్త్రిగారి లఘుటీకకు కొంత పైమెట్టు-అనగా వేంకటరాయశాస్త్రి గారిటీకను కొన్నిచోటులననుకరించి కొంతవిపులము చేయబడినది. ఇదికాక 1906 సంవత్సరములో ప్రచురింపబడిన టీకనొకదానిని పేర్కొన్నారు. కొన్ని పద్యములు వ్యాఖ్యానించుటలో అది మాతృకగా నుండవచ్చును. ఏమన పద్యములలో నున్న పదములు టీకలో మారియున్నవి. ఏది యెట్లున్నను వేంకటరాయశాస్త్రిగారి లఘుటీకలోని పొరపాటు లిందుకూడ నున్నవి. కవి భావములు, చమత్కృతులు, ధ్వనులు చాలా పద్యములలో వివరింపబడలేదు. వివరింపబడిన వానిలో కొన్ని వేంకటరాయ శాస్త్రిగారి లఘుటీకలోని లోపములే గ్రహింపబడినవి. కొన్నిపట్టుల అన్వయక్రమము తప్పినది.

ఈ వ్యాఖ్యానము నొక రొక దినపత్రికలో ప్రశంసించుచు ఒక పద్యములోని పాఠభేదము నెట్లు వీరు సవరించి వ్యాఖ్యానించిరో తెలిపిరి.

ఆ పద్యమిది. పీఠిక—14 వ పద్యము.

గెలిచిన గెల్పు లర్థితతి
కీగి దినమిచ్చిన యీవులన్ వహుల్
తలచిన విక్రమార్కు-లొక
లక్షయుఁ గర్ణులు కోటియుఁగదా
కలిగిన నీడువత్తురనఁ
గాఁదగు సాహసదాన సద్గుణం
బులు ధరయందుఁ బుట్టఁగనె
పుట్టిన వచ్యుత భూమి జానికిన్.

ఇందు నాలవపాదమున 'పుట్టఁగనె పుట్టిన యచ్యుత భూమిజానికిన్' అనియున్న సరియైన పాఠమును సవరించి 'పుట్టగనె పుట్టిన వచ్యుత భూమి జానికిన్' అనివ్రాసి సమర్థించిరి.

సమర్థన—సద్గుణంబులు ధరయందు బుట్టగనె 'పుట్టిన యచ్యుత భూమిజానికిన్' అనుటలో వాక్యము ముగియుటకాదని అన్వయము కుదురదని పుట్టినవి అని చెప్పినచో సమాపక క్రియ కలుగునని యట్లు సవరించి పదార్థమిట్లు చెప్పిరి.

అర్థితతికిన్ = యాచకుల సమూహమునకు; ఈవులన్ వహుల్ = త్యాగములందలి విధములు-వివిధములగు దానములు; ఈడువత్తురు = పోటీయగుదురు, సాహసం.. బులు = (విక్రమార్కునిఁబోలు) సాహసము; (కర్ణునిబోలు) దానమునను గొప్పగుణములు; పుట్టగనె పుట్టినవి = పుట్టుకతోడనె వచ్చినవి. అలం. క్రమము—

ఇది సరియైన అన్వయముకాదు. మరియు మొదటిపాదమున 'ఈవులఁగొ వహుల్' అను పాఠము

విడిచి 'ఈవులన్ వహుల్' అని సవరించి— 'త్యాగములందలి నిధములు—వివిధములగు దానములు' అని అర్థము చెప్పిరి—'త్యాగములందలి విధిధములు— 'వివిధములగు దానములు' ఒకే అర్థమీయవు—

కావున 'ఈవులన్ వహుల్' అను పాఠము సరియైన పాఠము. అపుడు పద్యార్థమీ క్రింద పొందుపఱుపబడినది.

ధరయందు బుట్టగనే=(అచ్యుతరాజు) భూమియందు పుట్టగానే, సాహసదాన సద్గుణంబులు = సాహసము దానముగల గుణములు—పుట్టేని = కల్గిన, అచ్యుత భూమి జానికిన్ = అచ్యుత ప్రభువునకు— గెలిచిన గెల్పులున్ = తాను పొందిన విజయములు— (అర్థితతికి) దినమిచ్చిన యీవులున్ = ప్రతిదినము తాను చేసిన దానములును; వహుల్ తలచినన్ = (విజయదానముల) లెక్కను తెలుపు పుస్తకములు పరిశీలించినచో విక్రమార్క లోకలక్షయు = జయముల లెక్కకు ఒక లక్ష విక్రమార్కులు; కర్ణులు కోటి గలున్ = (దానమందు) కోటికర్ణులు, కలిగినన్= ఉండినచో,—ఈ దుండర్తురన గాదగున్ = సరిపోవుదురని చెప్పవచ్చును.

తాత్పర్యము—జన్మతోనే సాహసదాన గుణములు కలిగిన అచ్యుత రాజునకు—అతడు గెల్చిన గెలుపులు, దినమిచ్చిన దానములను లెక్క తెలుపు పుస్తకములు చూచినచో సాహసమున లక్షమంది విక్రమార్కులు, దానమున కోటికర్ణులు ఉన్నట్లయిన సరిపోవచ్చును—అనగా పుట్టువుతోనే సాహసౌదార్యములు గల అచ్యుతరాజునకు—లక్షమంది విక్రమార్కులు కోటిమంది కర్ణులు ఉంటే, ఈడువత్తురని చెప్పవచ్చునని భావము.

'ఈ దుండత్తురనగా దగు' అనుదానిలో 'తగు' అనునది తద్ధర్మార్థ కవి శేషణముగా గ్రహించుటవలన కలిగిన దీపవరణ—తగున్ = తగును అని సమాపక క్రియగా చెప్పవలెను. వహి = (*account book*) జమా ఖర్చులు తెలుపు పుస్తకము—ఇపుడు దినవహీవారు (*day - book keepers*) తంత్రవహీవారు గృహనామములు వారి రాజకీయోద్యోగములబట్టి వచ్చినవి—హంసవింశతిలో 'దినవహి లెక్క వ్రాలసగ' అని యీ యర్థమునిచ్చు ప్రయోగముకలదు (చూ—1-142 హంస—) ఇట్లే అన్వయ క్రమము పొరబట్టబడిన పద్యములు కొన్ని గలవు—ఇంకొక్కటి మచ్చునకు చూపెదను.

వలివలీలసంచు వలివలి గావించు
నించుమించులౌను నించుమించు
లేమనగవుఁ జూపు లేమనవచ్చు? బాపు!
జగమెఱుంగు దాని జగమెఱుంగు ॥

ఆ 1—పద్య 36.

శ్రీ ఖులాసు వెంకటరమణయ్యగారు వ్రాసిన అర్థము:—

లేమ...జూపులు = సుభద్రయొక్క నవ్వుతో గూడిన చూపులు; వలివ...సంచున్=పద్మముల నివాసముయొక్క పొందికను. (కొంటినని కొందఱు) వలివలి గావించున్= బాగుగా వలిపి వేయును, ఇంచుమించున్=ఇంపైన మెఱుపును; ఇంచుమించులౌ - ఆనున్= ఎక్కువ తక్కువలాడును - తిరస్కరించును. ఏమి అనన్ అగున్=ఇక నేమని చెప్పవచ్చును? బాపు!= బాపురే—ఆశ్చర్యము; దాని జగమెఱుంగున్ = ఆ సుభద్రయొక్క లోకోత్తర విలాసమును; జగము, ఎఱుంగున్ = లోకమంతయు బాగుగా గ్రహించును. అలం. ఉపమ, యమకం—

తా॥ చిఱునవ్వు నొలికించు నా సుభద్ర మోములు తామరపువ్వుల కాంతిని మెఱుపు కాంతిని తిరస్కరించియుండును. అట్టి కాంతి లోకమునం దెచ్చటను లేదను సంగతి లోకమునకు బాగుగా దెలియును—అలం. ఉపమ-యమకము.

ఇందు కవి భావవిశదీకరణ చేసినది. అర్థము క్రిందను తాత్పర్యము క్రిందను రెండు మార్లు అలంకారములు పేర్కొన్నారు—కవి 3 వ ఆశ్వా—18 వ పద్యమున సుభద్రయొక్క స్వభావాలంకరణను వర్ణించుచు

'దక్కదనముల ప్రోనైన చంద్రముఖికి
విచ్చలపురూపు లెస్సైన నింపునింపు'

అని సుభద్రకు ప్రయత్నమున తెచ్చిపెట్టికొన్న అలంకారములకంటె (విచ్చలపురూపు) స్వభావసిద్ధమైన రూపము లెస్సైన నింపునింపును అని అలంకారముల గురించి తన యభిప్రాయము తెలిపెను. కావ్యాలంకార సంగ్రహమున 'ధ్వని యలంకరణను...... కావ్యేందిరకున్' అనునట్లు అలంకారముల మెఱుగుల చూడక ధ్వని ప్రధానముగా అప్రయత్నపూర్వకముగా చమత్కృతులతో పద్యములు రచించెను. కావున వానిని గ్రంథమునందలి పద్యములలోని ధ్వనులు చమత్కృతులు విశదము చేయుటయే కావలెను కాని అలంకారముల పేర్లు అవసరము లేదు. అట్టివి పూర్వ వ్యాఖ్యాతలు వసుచరిత్రాది ప్రబంధములకు తగిన వ్యాఖ్యలు వ్రాసి అందు అలంకారములు కూడ చివరను చేర్చుచుండిరి. అట్టి వ్యాఖ్యాన మీ గ్రంథము కోరదు.

ఇక ప్రస్తుతపద్యార్థమునకు మరలుదము—

పైపద్యము టీకలోను తాత్పర్యములోను చిఱునవ్వు లొలికించు సుభద్రమోములు తామరపువ్వుల మెఱుపుకాంతిని తిరస్కరించియుండును. అని స్పష్టపఱచిరి. మోములు తామరపువ్వుల వికాసమును ధిక్కరించుట కవులు పెక్కురు చెప్పిరి. కాని మెఱుపుకాంతిని తిరస్కరించుట లేదేమో. మిఱుమిట్లు గొల్పు మెఱుపును ధిక్కరించుట సరసముగా లేదు. కావున పద్యార్థ మది కాదు.

అన్వయమిది— లేనగవుఁజూపులు, నలినలీల సంచున్. (పద్మవిలాసముతీరును) నలినలి కావించును- నగవు వెన్నెలను స్ఫురింపజేయును గాన, నగవను వెన్నెలపద్మవికాసమును నలినలి గావించును. అందుచే నగవుఁ జూపులు నలినలి గావించుననుట—

జగమెఱుంగు దాని జగమెఱుంగు, ఇంచు మించును ఇంచుమించులాడించును. అనగా జగమెఱిగిన (ప్రతీతిగల) ఆమెయొక్క గొప్ప శరీరకాంతి, మెఱుపును ఇంచుమించులాడించును. ఇచట 'జగమెఱుంగు' అను దానిని తద్ధర్మార్థకవిశేషముగా గ్రహింపవలెను గాని, వ్యాఖ్యాత సమాపకక్రియగా గ్రహించెను. అందుచే పై మూడుపాదములకు దీనికి భావసంబంధము లేనేలేదు. శ్రీ బులుసు వేంకటరమణయ్య గారు వెనుకటి వ్యాఖ్యానములకు మెఱుగు పెట్టిరి కాని సంతృప్తికరముగ మెఱుగు కాదు. అయినను వారిసేవ ప్రశంసనీయమే.

పై రీతిగా కొన్ని పద్యముల అర్థము సరిపడ లేదు. కొన్ని చమత్కృతులు విశదీకరింపబడక విడువబడినవి.

గ్రంథ విమర్శనము

: కవిత :

సంకలనము: శ్రీమతి అబ్బూరి ఛాయాదేవి. ప్రాప్తిస్థానం: A. 10 481, హిమాయత్ నగర్, హైదరాబాదు. వెల రూ 1-8-0.

ఈ పత్రిక సంవత్సరానికి మూడుసార్లు వెలువడుతుంది. సాహిత్యరంగంలో కావ్యరూపాలకు ప్రధానమైన స్థానం వుంది. ఏ పారవశ్యతంలోనైనా కవితా సంప్రదాయాన్ని అనుసరించే మిగతా సాహిత్యరంగమంతా రూపొందుతూ వుంటుంది. అట్టి కావ్యరూపాలను, ప్రత్యేకంగా ప్రకటించే పత్రిక మనకు యింతవరకు రాలేదు. అట్టి కొరత తీర్చటానికి వీరు ఉద్యమించారు. ఇందుకు అభినందనీయులు!

ఈ కారణంగానే వీరు చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతటి బాధ్యతాయుతమైనదో కూడా ఊహించవచ్చు.

వీరి ఉద్యమస్వరూపాన్ని సమగ్రంగా అవగతం చేసుకోవటానికి, ఇందులో సంపాదకీయం లాంటిదేదీ లేదు. కాని 'సందేశ' రూపంలో టి. యస్. ఇలియట్ వాక్యాలను కొన్నిటినీ, 'వ్యవస్థయాంత్రిక' అనే శీర్షికతో ఆస్కార్ వైల్డు, 'పిక్చర్ ఆఫ్ డోరియన్ గ్రే' అనే రచనకు ప్రవేశికగా వ్రాసిన వాక్యాలనూ అనువాదం చేసి పత్రిక తొలిపుటలలో ప్రకటించారు. వీటినుంచి వీరి ఉద్యమస్వరూపమెట్టిదో ఊహించటానికి కొంత అవకాశం కలుగుతోంది. ఇలియట్ సందేశంలో ఎలాంటి ఉత్తమకవి అయినా సర్వదా ఉత్తమకావ్యాలే రచించి వుండలేడనీ, సాధనదశలు వుంటాయని వ్యక్తీకరింపబడి వుంది. కాని సాధనదశలో ఉత్పత్తి అయ్యే ప్రతి సామాన్య రచనను అచ్చువేసి, మహత్తరమైన రచన క్రింద చలామణీ చెయ్యాలని ఇలియట్ అభిప్రాయమై వుండదని మనం గమనించవలసి వుంటుంది.

'The artist is the creator of beautiful things'—ఆస్కార్ వైల్డు ఆ 'ప్రవేశిక'ను పై వాక్యంతో ప్రారంభించి చిత్ర విచిత్రాలైన అనేక భావాలను వెల్లడించుకుంటూ వచ్చి,

'There is no such thing as moral or immoral book. Books are well written or badly written. That is all.' అనే దగ్గరకు తేలాడు.

ఈ వాక్యాలను వీరు ఇలా అనువదించారు:

'రామణీయకాన్ని సృష్టిస్తాడు కళాస్రష్ట... నీతికరం, అవినీతికరం అంటూ గ్రంథాలు లేవు; బాగా వ్రాసిన పుస్తకాలూ, బాగా వ్రాయని పుస్తకాలూ, అంతే' —

ఈ వాక్యాలు మనకు శిరోధార్యాలు కావలసి వుంటే, సాహిత్యరంగం ఉదాత్తమైన ప్రయోజనాన్ని దేన్నీ కలుగజేయలేకపోతుంది.

ఆస్కారు వైల్డ్ అనే ఈ మహాశయుడే మానవ జీవితమంటే యేమిటో అర్థమైన పరిణతిదశలో సెలవిచ్చిన ఈ క్రిందివాక్యాన్ని ఈ ఉద్యమ నిర్వాహకులు చిత్తగించివుంటే బాగుండేది.

'The value of art is not beauty, but right action.'

'కళయొక్క విలువను నిర్ణయించాలిసింది రామణీయకతనుబట్టి కాదు, ఋజుమార్గవర్తననుబట్టి' అన్నాడు. ఈ వాక్యం పై వాక్యాలను రెంటినీ ఛిన్నాభిన్నం చేసి పారేస్తోంది.

ఆస్కార్ వైల్డు జీవితాన్ని సంగ్రహంగానైనా తెలుసుకున్నవారెవరూ ఆయన తొలినాళ్ల ప్రవచనాలను వేటినీ శిరోధార్యాలుగా గ్రహించరు.

ఒక కవి ఒక అభిప్రాయాన్ని వెల్లడించాడంటే ఆ కవి ఆ అభిప్రాయాన్ని, ఏ అనుభవంతో, ఏ సందర్భంలో, ఎందుకు వ్యక్తపరిచాడు, అని ఆలోచించకుండా, గాలిలో ఎగురుతూ వుండే ప్రతి అభిప్రాయాన్ని దొరకపుచ్చుకుని ఆ ప్రకారం మనం ఊరేగటం మొదలుపెడితే కుక్కతోకపట్టి గోదావరి యీదటమవుతుంది.

ముఖ్యంగా ఆస్కార్ వైల్డులాంటి జీవితచరిత్రగల రచయితల విషయంలో ఈ జాగ్రత్త చాలా అవసరం.

అన్నిటినీ తలదన్ని ఆస్కార్ వైల్డు ప్రవచించిందీ, వీరు శిరోధార్యంగా సేకరించిందీ, మరో వాక్యం:

'All art is quite useless.'

'యావత్కళా
నిష్ప్రయోజనకరం.'

'కటిక నిష్ప్రయోజనకరం' అనివుండవలసిందిగాని, ఎందుకో దయదలిచి, ఆ ముక్కను వదిలేశారు. ఇదంతా కటిక నిష్ప్రయోజనకరం అంటే, దాన్నంతా అచ్చేసి జనం నెత్తిన రుద్దడమెలా వీలౌతుంది అని కొంచెం వెనకాడారో యేమో! 'క్వైట్ యూస్‌లెస్' అన్న ఆస్కార్ వైల్డు కూడా యీలాగే ఏమాత్రం ఔచిత్యాన్నీ పాటించకుండా సంపుటాలకొరబడి రచనలుచేసి జనంమీద పారేశాడు. ఇంతమాత్రాన, ఆయన సర్దాగా అన్న ఈ మాటనుబట్టుకుని, మనం ఆయన సాహిత్యసేవనంతా కొట్టిపారెయ్యటానికి కూడా సంసిద్ధులుగా లేము. 'హాపీ ప్రిన్స్' అనే కథను వ్రాసిన మహామహుడు 'యావత్తు కళా కటికనిష్ప్రయోజనకరం' అని హృదయపూర్వకంగా అన్నాడని మనం మాత్రం ఎలా విశ్వసించుతాం? కాని ఈ సంకలనం చేసిన వారు మాత్రం, ఈ వాక్యాలను ఆ దృష్టితో గ్రహించినట్టు, ఈ సంపుటిలో ప్రచురించిన రచనలనుబట్టి మనం అనుమానించవలసి వస్తున్నది.

ఆస్కారువైల్డు ప్రత్యేకం ఆ రచనలో వ్యక్తం చేసిన భావాలే తాడూ బొంగరం లేనివి; వాటికితోడు వీరి అనువాదంతో మరింత అయోమయస్థితి యేర్పడుతోంది. మచ్చుకు:

'All art is at once surface and symbol those who go beneath the surface do so at their peril; Those who read the symbol do so at their peril.'

దీనికి వీరిచ్చిన అనువాదం:

'యావత్కళా సువ్యక్తం, సంకేతం. సువ్యక్తాన్ని శోధించేవారు స్వవినాశనానికి. సంకేతాన్ని చదివేవారు స్వవినాశనానికి.'

పై ఇంగ్లీషుమాతృక ఎదట లేకపోతే, తలపగులగొట్టుకున్నా ఈ తెలుగు వాక్యాలు అవగతం కావు.

ఈ రెండు రచనలకూ అనంతరం ఈ సంపుటిలో వున్న మూడవ రచన శ్రీ అబ్బూరి రామకృష్ణరావుగారిది. ఈ రచన మొత్తం 12 పేజీలు. రామకృష్ణరావుగారి పూర్వరచనలకూ దీనికీ యెక్కడా పోలిక లేదు. కావ్యగుణం యేకోశానా లేని వచన వ్యాసం. గేయంలా కనిపించేలాగు అచ్చువేశారు. ఈ వ్యాసంలో రామకృష్ణరావుగారు, వర్తమానాంధ్ర సాహిత్య రంగంలోని అన్నిరకాల కవులనూ, పద్ధతి బాగులేదని మందలించారు. కాని వారు ఆశించుతున్న పద్ధతి యేరీటో చెలవిచ్చారుకారు. ఇందులో కొంత భాగం శ్రీరంగం శ్రీనివాసరావుగారిని మందలించటం. ఇందుకు ఇలాంటి కావ్యరచనకు పూనుకునేకంటే రామకృష్ణరావుగారు, శ్రీనివాసరావుగారి పేర ఒక కార్డుముక్క వ్రాసి పోస్టులో వేయించివుంటే బాగుండేది.

ఇందులో మరోచోట తాము లోగడ చేసిన రచనలను ఆధునికులలో కొందరు అనుకరించుతూ 'పిల్లికూనలకు మల్లే వీధి వీధి విహరిస్తున్నారు' అని నేరారోపణ చేశారు. ఇది చాలా అన్యాయం. నేటి ఆధునికులలో నిజానికి, ఎవరికివారే ఒక మహాకవి. ఏ వాక్యమైనా తేలికగా అచ్చయిపోతుంది. ఒకరిని అనుకరించాలిసినంత అవసరం యెవరికి మాత్రం యేముంది? ఈ భాగంలోనే రామకృష్ణరావుగారు:

'తెలుగుదారి వెలిగించే
వెలుగుదారి తెలిగించే'

అని, ఒక పదబంధాన్ని గారడీ చేసినట్టు మనమీదికి విసిరేశారు. ఈ రకంమాటల గారడీలు ఈ సంపుటంనిండా పుష్కలంగా వున్నయ్

రామకృష్ణరావుగారి రచన అనంతరం, శ్రీరంగం శ్రీనివాసరావుగారి 'వృషభం' ఇది రోడ్డుకు అడ్డంగా పడుకుందిట.

'ఎవరు పొమ్మనగలరీ ఎద్దుని
ఎలా మేస్తోందో చూడు
ఏయ్‌ఏయ్ మోటారుకారూ
ఏమిటి నీతొందర
భాయ్‌భాయ్ సైకిలిస్టు
భద్రంసుమీ ఎద్దు నిన్ను తప్పుకోదు
యంత్రవిరోధి అహింసావాది శాఖాహారి
మద్యనిషేధ ప్రజ్ఞాశాలి
నగరం నడివీధిలో
నాగరికతాగమనాన్ని నిరోధిస్తూ
ఇలా ఎంతసేపైనా సరే
ఈయెద్దు నిలబడగలదు.

ఎద్దుకు లేకపోతే బుద్ధి
మనిషికైనా వుండవద్దా—'

ఇది శ్రీనివాసరావుగారి కవనం; ఇవి వీరి భావాలు; 'మద్యపానం నాగరికతకు చిహ్నం. మద్య

పానం కూడా చేసేవాడు నాగరికతను నిరోధిస్తూ అడ్డం నిల్చున్న బుద్ధిలేనిఎద్దు'—

శ్రీనివాసరావుగారి కవనం, అభిప్రాయాలూ ఎలాంటివైనా మద్యపానమే నాగరికతకు చిహ్నమైతే — అలాంటి నాగరికత తక్షణం నశించటం అవసరం.

ఇందులో 'శాఖాహారి' అనే ప్రయోగం ఒకటి వుంది. ఇది అచ్చుతప్పో లేక రచయిత ఇందులో యేమైనా శ్లేషించారో మనకు తెలియదు.

మిగతా రచనలలో కుందుర్తివారి 'ఈ తరం' ఒకటి వుంది. ఈ తరం వ్రాసినట్టే పాడితే వచనం. బిళ్ళలు లేకుండా మన పేర టపాలో వేస్తే 'బేరింగు' దండుగ.

'ఆరుద్ర' గారి 'గుమస్తా ప్రేమగీతం' ఒకటి వుంది. ఈ 'గుమాస్తా' గాని ఈ 'ప్రేమ' గాని యీ దేశం బాపతు గాదు. టి. యస్. ఇలియట్ దేశానిది. భాష కూడా అదే. 'ఆరుద్ర' ఇక తెలుగులో వ్రాయటం మానేసి ఆంగ్లభాషలో రచించటానికి పూనుకోవటం ఉత్తమం.

'టాక్సీ వెయిటింగ్ ఛార్జీలు పెరుగుతున్నాయ్, ఛేస్ట్రీటులో నై తొందరగా ప్రేమ మాటలు ముగించేద్దామా? ప్రేమ ఎక్స్‌ప్రెస్ చెయ్యటానికి ఐడియల్ వెదర్ డార్లింగ్; సంజవేళ సముద్రతీరాన పల్లీలు కొనటం ఎందుకు, ఐస్ క్రీం పార్లర్ లో టీబ్ మల్బా ఇప్పించనా హనీ: కొత్తవార మూడు మూరల పన్నా జాజులదండ కొనిపెట్టనా ఈవనింగ్ బజారులో హ్యాట్ పెట్టు కొని ప్రశంటు చేస్తా; టెక్నికలర్ హాలీవుడ్ త్రీ-డీ మేటనీకి వెళ్దామా స్వీట్! వచ్చే సండే వాడు సింప్లీ మార్వెలస్ సినిమా వుందిలే'—

ఈబాపతు ఇంగ్లీషు భాష తెలుగువర్ణక్రమంలో ఇముడ్చటం కష్టం. రచయిత కష్టపడి యిరికించినా చదివేవాళ్ళని వేధించటం. అందుకే యేకంగా ఇంగ్లీషు వ్రాసెయ్యమనటం—అదికవనమైనా కాకపోయినా.

శ్రీ బెల్లంకొండ రామదాసుగారి 'విష్ణుక్రమణం' అనే రచన అర్థంపర్థంలేని నిరాశావాద ధోరణిలో యీ సంపుటిలోని యితర రచనల కేమాత్రం తీసిపోకపోయినా, రచనలో కావ్యగుణం కొంతవుంది.

'నాకు లోకం లేదు
నాకు శోకం లేదు
నాకు బాధలు లేవు
ఏకో దల్లనైంది
నాలో నేడు'—

ఈరకం వాక్యాలు చదువుతుంటే పట్టి పుణ్యానికి మనకు వికారమేస్తుంది. ఇలాంటి నిస్పృహను జాతికి కలిగించటం ప్రమాదకరం. జాతి నీళ్లుగారి ఎందుకూ కొరగాకుండా నశించుతుంది.

స్వతంత్ర రచనలమాట అటుంచి, పాశ్చాత్య రచయితల రచనలలోనుంచి, వీరి ధోరణికి అనుగుణంగా వుండే కొన్ని రచనలను సేకరించి అనువాదం చేసి వేశారు. వీరిలో డిలన్ థామస్, డి. హెచ్. లారెన్స్, రాంబో, టి. ఇ. హ్యూమ్ మొదలైనవారి రచనలున్నాయ్.

ఈ రచనలనుగురించి ఒకమాట చెప్పవలసి వుంది. మానవకళ్యాణానికి యుద్ధతంత్రమే పరమ సాధనంగా, పాశ్చాత్య నాగరికత యింతకాలం నడిచింది. గత రెండు ప్రపంచయుద్ధాల అనుభవంతో ఆ పద్ధతి నిరిష్ప్రయోజనకరమని తేలిపోయింది. మరొక పంథా యేదీ తోచని అయోమయావస్థ యేర్పడ్డది. పైపెచ్చు యీ రెండు యుద్ధాలతోనూ యూరపియన్ దేశాలన్నీ సర్వనాశనమై దరిద్ర్యాల్బణాది యీతిబాధలతో దిక్కుతోచకుండావున్నాయ్. ప్రజలలో వ్యాపించిన ఈ మానసిక నిరాశనే అక్కడి కవులుకూడా వ్యక్తం చేస్తున్నారు—అధోగతికి దిగజారిపోతున్న నిరాశావాదం: ఈ రకం రచనలను సేకరించి అనువాదం చేసి మన ప్రజలలో ప్రచారానికి తేవటానికి పూనుకోవటం అనవసరమైన పనేగాక, అనర్థదాయకం. మనది పారతంత్ర్యపు మృత్యువునుంచి పునర్జీవించి అనంతమైన ఆత్మవిశ్వాసంతో పురోగమించుతున్న జాతి; సాహిత్యం ఈ ఆత్మవిశ్వాసానికి బలం చేకూర్చేదిగా వుండాలిగాని, దాన్ని నశింపజేసేదిగా వుండకూడదు. మన మార్గమేదో మనకు వెలుగుబాటగా కనుపించుతోంది. జాతిలో వున్న బలాన్ని కూడదీసుకుని మనం ముందుకు సాగాలి.

శ్రీమతి ఛాయాదేవిగారు ఈ విషయాన్ని గుర్తించి, ముమ్ముందు తగిన విధంగా ఈ పత్రికా నిర్వహణను సాగించగలరని ఆశించుతాము.

మనదీ ఒకజాతి; మనకూ ఒక సాహిత్య సంప్రదాయం వుంది. పాశ్చాత్య రచయితలలోనుంచి ఏ రచనను తెచ్చుకున్నా దాన్ని మనం జీర్ణంచేసుకుని, మన పంథాలోకి మనకు బలతేజాలు కలిగేలాగు మలచుకోవాలిగాని, ముక్కు కోసుకుపోయేదిగా వుంచరాదు. నవ్యాంధ్ర సాహిత్యరంగంలో అర్ధశతాబ్దిగా జరిగిన కృషికి ఈ సంపుటి పరిణామమంటే, నవ్వు బాట్లపనిగా వుంటుంది.

మన జాతి యేమిటి మన సాహిత్య మేమిటి మన బల మేమిటి; మన ప్రజ లేమిటి మనకున్న సౌకర్యాసౌకర్యా లేమిటి వీటిని పట్టుకుని మనం ఎలా ముందుకు పోగలం? అన్న దృష్టి ఈ దశలో చాలా అవసరం.

అంతేగాని యెప్పుడో యెవరో అన్నారని, 'యూనివర్సిటీ నిష్ప్రయోజనకరం' అంటే మా ప్రయత్నం వట్టి నిష్ప్రయోజనకరమని యితరులు అనవలసి వస్తుంది.

ఈ సంపుటిని ఆదినుంచి తుదివరకూ ఓపికపట్టి యెవరైనా చదవగలిగితే ఆ వ్యక్తికి అర్థంలేని యేదో బెంగపట్టుకుని, వారందాకా వదలదు. వచ్చే సంపుటికైనా పాఠకులకు ఇలాంటి బాధ కలిగించకుండా వుంటారని విశ్వసించుచున్నాం.

బాలభాగవతము

[ప్రథమ సంపుటము]

పద్య కావ్యము: రచన: కాజ రాధాకృష్ణ శాస్త్రి; ప్రాప్తిస్థానం: సరస్వతీ బుక్ డిపో, విజయవాడ. మూల్యము రు 0-12-0.

ఈ ప్రథమ సంపుటిలో కృష్ణజననం మొదలు బృందావనానికి వచ్చేవరకూ గల కథ వుంది. సరళమైన గ్రాంథికంలో బాలబాలికలకు తేలికగా అర్థమయ్యేలాగు రాధాకృష్ణశాస్త్రిగారు యీ పద్య రచనను నిర్వహించారు. ఆటవెలదులూ, గీతాలూ, కందాలూ, ముచ్చటగా రచించారు. రసనిర్వహణలో తొలినాటి రచయితల చాకచక్యాన్ని సాధించుకున్నారు. మచ్చుకు:

"నన్ను గన్నవాడు, నాతండ్రి నాకంటె
వెలుగు, నల్లనయ్య వెలసెవంట
ఇచట పేటలో నుండ: నే నాతనిం జేర
నురికివచ్చి తిరుగుచుంటినమ్మ!"

: జోగిరాజుగారి రచనలు :

శ్రీ గోటేటి జోగిరాజుగారు వ్యవసాయ శాస్త్రంలో పండితులు: లోగడ వ్యవసాయ శాస్త్రానికి సంబంధించిన అనేక గ్రంథాలు రచించి ఆంధ్ర ప్రజల మన్ననలందుకున్నారు. ఇప్పుడు మరి మూడు గ్రంథాలను ఆంధ్రప్రజలకు అందజేస్తున్నారు:

(1) కాయధాన్యములు: కంది, పెసర, సెనగ, వగైరా కాయధాన్యములను గురించి విపులంగా ఈ గ్రంథంలో వివరించారు. సచిత్రం; రు. 1-8-0.

(2) పశువుల గ్రాసములు, పచ్చి యెరువులు, పంటచెరుకు వగైరాలు: సచిత్రం 3-8-0.

(3) తృణధాన్యములు: వరి, మొక్కజొన్న మొదలైనవి. సచిత్రం: వెల 4-0-0.

ఈ గ్రంథములు మూడూ రైతాంగానికి చాలా ఉపయోగకరమైనవి. ఈ గ్రంథాలకు తప్పకుండా ఆంధ్రప్రజల ఆదరణ వుంటుంది. ప్రాప్తిస్థానం: ఆంధ్ర గ్రంథాలయ ట్రస్టు, పసుమటలంక.

: విరులసరులు :

ఖండకావ్య సంపుటి; రచన: శ్రీమతి చుండూరి రమాదేవి: ప్రాప్తిస్థానము: వెంకటరామా అండ్ కో, విజయవాడ; వెల 0-12-0.

: పరిణామం :

నాటిక; రచన: శ్రీ చిల్లర భావనారాయణ; ప్రచురణ నవ్యకళాసమితి, సికింద్రాబాదు.

: ప్రతాపసింహము :

రాణా ప్రతాప్ చరిత్ర: గ్రాంథిక వచనము; రచన: కొత్త సత్యనారాయణ చౌదరి; ప్రచురణ: విజయా పబ్లిషింగ్ కంపెనీ - గుంటూరు. వెల 1-2-0.

: శ్రీ తత్వానందస్వామి :

శ్రీ తత్వానందస్వామివారి స్మారక సంపుటి; ప్రచురణ శ్రీ తత్వానంద శిల్పాశ్రమము మంగళగిరి: అమూల్యం.

అంజలి :

తెలుగు తల్లికి అంజలి: గేయాలూ, గీతాలూ: రచన: గోపశ్రీ; ప్రాప్తిస్థానం: యస్. గోపాల్ రెడ్డి; సామిరెడ్డిపల్లె; పులికల్లు పోస్టు; చిత్తూరు జిల్లా; అమూల్యం.

కమలనాథ్

నవల; రచన: పోతుల సుబ్బారావు; ప్రకాశకులు: మాదిరెడ్డి జగన్నాథ రావు అండుకో; కాకినాడ వెల 0-12-0.

Printed & published by S. Sambhu Prasad at the Andhra Patrika Press,
No. 7. Thambu Chetty Street, Madras. Editor: S. Sambhu Prasad.